మార్చి- 2008

వెల: రు 10/-

అరుణతార

తెలుగు సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి 27 * సంచిక 12 * విజయవాడ



విధ్వంసకర యుద్ధ బాధితురాలు
- విషాద భరిత మహిళ

KLVA101M1 43

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

2008
మార్చి
271

సంపాదకుడు
సి.ప్రసాద్

మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307,
దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు,
కడప జిల్లా - 516 360.

సంపాదకవర్గం
పాణి
కృష్ణాబాయి
వి.చెంచయ్య
మోహన్
షరీఫ్

రచనలు పంపవలసిన చిరునామా :
టి. కృష్ణాబాయి
9-19-3
CBM కాంపౌండ్
విశాఖపట్నం - 530 003.

కవర్ డిజైన్ : **జుగాష్ విలి**

సంపాదక లేఖ

పాఠకులు, రచయితలు మన్నించాలి

అరుణతార ఆర్నెల్లు ఆలస్యంగా మీ చేతిలో పెడుతున్నాం. అనివార్య కారణాలు అడ్డంబడ్డాయి. నెలనెలా అరుణతార తేవాలనుకున్నా ఏవో యిబ్బందులు తప్పడం లేదు. ఒక్కోసారి యిట్లా మరీ ఆలస్యమైపోతున్నది. ఈ స్థితిని అధిగమించవలసి ఉన్నది. వచ్చే సంచికలు వెనువెంటనే వీలైనన్ని ఎక్కువ పేజీలతో, విలువైన రచనలతో అందిస్తాం

ఇది ప్రత్యేక ఆర్థిక మండలాల మీద ప్రత్యేక సంచిక

అడిగిన వెంటనే రచనలు పంపించిన మిత్రులకు ధన్యవాదాలు. ఆలస్యంగా అచ్చువేసినందుకు మరోసారి క్షమాపణలు

సెజ్‌ల గురించి సాకల్యంగా కాకపోయినా వీలైనంత విశ్లేషణ ఈ సంచికలో ఉన్నది. రచయితలు ఈ వ్యాసాలు రాసిన తర్వాత రాష్ట్రంలో ప్రత్యేక ఆర్థిక మండలాలు పెరిగిపోయాయి. అనేక విధ్వంస పరిణామాలు జరిగిపోయాయి. సెజ్‌ల అమలును, వాటి విపరిణామాలను తెలుగు మేథోరంగం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నది, వివరిస్తున్నది. కానీ సెజ్‌లకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలే యింకా నిర్మాణాత్మకం కాలేదు. దానికి దోహదపడే ఆలోచనాశక్తిని అందివ్వడమే బుద్ధిజీవుల నిరంతర బాధ్యత

ఈ సంచిక రాష్ట్రంలో సెజ్‌ల అమలు తీరును, భూ దురాక్రమణలను, నిర్వాసిత సమస్యను రాజకీయ ఆర్థిక పునాది నుండి వివరించింది. ప్రత్యేక ఆర్థిక మండలాల వల్ల తలెత్తే వినాశనాన్ని మానవహక్కుల, సాంస్కృతిక కోణాల్లో విశ్లేషించింది. కథలు - కవిత్వం వగైరా కూడా సెజ్‌ల యితివృత్తంగా రాసినవే అచ్చేస్తున్నాం. సెజ్‌ల గురించి సామాజిక రాజకీయ విశ్లేషణల వలెనే సాహిత్య ప్రక్రియల్లోనూ బలంగా చిత్రించవలసి ఉన్నది. యిప్పుడిప్పుడే ఆ ప్రయత్నం మొదలైంది. క్షేత్ర పరిశీలనల్లో, సామాజిక ఆర్థిక విశ్లేషణల్లో వెల్లడి అవుతున్న సెజ్ దుష్పరిణామాలను సాహిత్యం, కళలు జీవితానుభవంలో నుండి చిత్రిస్తాయి కాబట్టి మరిన్ని కొత్త కోణాలు దర్శనమవుతాయి. తెలుగు కల్పనా రంగానికి ఉన్న స్వభావంవల్ల తప్పక అలాంటి సాహిత్య రచన పుంజుకుంటుంది

యిది ప్రత్యేక సంచిక కావడం వల్ల యితర శీర్షికలేవీ లేవు

వచ్చే సంచిక వీలైనంత తొందర్లో అన్ని శీర్షికలతో మీ ముందుకు వస్తుంది.

ఈ సంచికవెల	:	10 రూ.
సంవత్సర చందా	:	100 రూ.
జీవితచందా	:	1000 రూ.

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి. డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.

ఈ సంచికలో...

వ్యాసం

పేజి 3-31

సెజ్‌లు : సామ్రాజ్యవాద నయావలసవాద భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు :
- రత్నమాల

భూమండలీకరణలో చెరబడ్డ భూదేవర
-ఘంటా చక్రపాణి

సామ్రాజ్యవాదమే సెజ్‌ల రాజకీయ ఆర్థిక శాస్త్రం :
- జి.ఎన్.సాయిబాబ

'భూ నిర్వాసితుల పక్షాన ఐక్య ఉద్యమం అవసరం'
- డా.బాలగోపాల్

సెజ్‌ల ఆర్థిక వ్యవస్థ - పరిణామాలు, పరిష్కారాలు :
-ప్రొ.కోదండరామ్

సెజ్ అభివృద్ధికైతే కావచ్చు మానవాభివృద్ధికేమాత్రం కాదు
- ప్రొ. బుర్ర రాములు

కవిత్వం

పేజి 32-35

గీతాంజలి కవిత ఒకటి

అసుర కవితలు నాలుగు

సుహాసిని పాట

కథలు

పేజి 36-46

ఆఖరి వడ్ల గింజలు - డా.భారతి (గీతాంజలి)

తూర్పు బండి - ప్రశాంత్

కఫన్ - ఉజ్వల్

పాటా - మాటా

పేజి 47,48

సెజ్ : భూపాల్

ఇంకా ... స్వీకారం

సెజ్‌లు :

సామ్రాజ్యవాద నయా వలసవాద భూస్వామ్య వ్యతిరేకపోరాటాలు

❖ రత్నమాల

ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (స్పెషల్ ఎకానామిక్ జోన్స్, క్లుప్తంగా సెజ్‌లు) ప్రహరీ గోడ పునాదుల్లో దేశప్రజల జీవనాధారాలు, దేశ ఆర్థిక రాజకీయ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సజీవ సమాధి అవుతున్నాయి. ఇందుకు పూనుకున్న పాలకులను చరిత్ర క్షమించదు. మనదేశ స్వాతంత్ర్యం సార్వభౌమత్వాలకు సామ్రాజ్యవాదం సిద్ధం చేసిన సంకెళ్ళే ఈ సెజ్‌లు. వీటిని ఎక్కడికక్కడ ఏ స్థాయిలో వీలైతే ఆ స్థాయిలో నందిగ్రాంలో వలె అడ్డు కొనకపోతే, గోవాలోవలె తిప్పికొట్టక పోతే, బీహార్ లో వలె తిరస్కరించకపోతే మన దేశంలో విస్తరిస్తున్న సామ్రాజ్యవాదుల పారిశ్రామిక వాడలు దేశ సార్వభౌమత్వానికీ, స్వాతంత్ర్యానికీ పెనుముప్పుగా పరిణమిస్తుంది. ఇప్పటికే దేశ ఆర్థిక రాజకీయ వ్యవస్థపై పెరిగిన సామ్రాజ్యవాదుల పట్టును సెజ్‌లు మరింత బలోపేతం చేస్తాయి. పరాధీన భారతదేశంలో సామ్రాజ్యవాద నయాభూస్వామ్య సామ్రాజ్యాలుగా విస్తరించే ప్రమాదం సెజ్‌ల్లో పొంచి ఉంది. ఇప్పటికి ఏర్పడిన సెజ్‌లను, సెజ్‌ల కోసం ప్రత్యేకంగా పార్లమెంటు చేసిన చట్టాన్ని అర్థం చేసుకుంటే భారత దేశాన్ని నయావలసగా, సామ్రాజ్యవాద పారిశ్రామిక వాడలుగా చేసుకోవడానికి వేస్తున్న పునాది రాళ్ల గురించి తెలుస్తుంది.

సెజ్‌లు ఎందుకోసం :

అంతర్జాతీయ బహుళజాతి గుత్త మార్కెట్ పోటీలో సంపన్న దేశాలు అతి చౌకగా సరుకులు ఉత్పత్తి చేసే ఎగుమతికే ఈ సెజ్‌లు. ఈ సామ్రాజ్యవాద బహుళజాతి గుత్త సంస్థల లేదా స్వదేశ దళారీ వ్యాపార సంస్థల పారిశ్రామిక వాడల ప్రధాన కేంద్రాలే ఈ సెజ్‌లు. తమ దేశాలను కాలుష్యరహిత ప్రాంతాలుగా ఉంచుకోవడానికి కాలుష్య కారక ఉత్పత్తి కేంద్రాలయిన రసాయన పరిశ్రమలు, చెప్పుల పరిశ్రమలు, యురేనియం వంటి ప్రమాదకర ఖనిజాల త్రవ్వకాలకు మన దేశంలో సెజ్‌ల పేరుతో కాలుష్య పూరిత పారిశ్రామిక వాడలు నెలకొల్పుతున్నారు. వ్యాపారం సాకు చూపించి బ్రిటిష్ వలస పాలకులు భారత దేశంలో ఆనాటి రాజుల నుంచి కొన్ని ఓడరేవులు కొన్ని వ్యాపార కేంద్రాలను అడుక్కుని ఆ తర్వాత మొత్తం దేశాన్ని 200 సంవత్సరాలు పరిపాలించిన విధంగానే సెజ్‌ల పేరుతో ఈనాటి నయా వలసవాదులైన సామ్రాజ్యవాదులు భారతదేశంలోని కొన్ని కీలక ప్రాంతాల్లో సెజ్‌ల పేరుతో భారత భూభాగాన్ని స్వంతం చేసుకుంటున్నారు. ఒక్కసారి సెజ్ ప్రాకారం నిర్మాణం అయ్యాక సెజ్ ప్రాంగణం లోపలి భూభాగం భారతదేశ చట్టాలకు, భారత దేశ పరిపాలనకు అతీతం అవుతుంది. సెజ్ ప్రాంతంలో నేరవిచారణ కోసమయినా సరే పాలక యంత్రాంగం కూడా ముందుగా సెజ్ ప్రత్యేక కమిషనర్ అనుమతి పొందవలసి ఉంటుంది. పారిశ్రామిక వివాదాల చట్టం, కనీస వేతనాల చట్టం ఉద్యోగ భద్రత హామీ మొదలై కార్మిక చట్టాలేవీ సెజ్‌ల ప్రాంతంలో వర్తించవు.

భారత దేశంలో కార్మిక సంఘాలున్నప్పటికి కార్మిక వర్గదృక్పథమే లేదు :

సెజ్‌లలో నెలకొల్పిన కంపెనీలకు పరిశ్రమలకు భారతదేశ చట్టాలు వేటినుంచైనా పూర్తిగా గానీ పాక్షికంగా గానీ ఒక నోటిఫికేషన్ ఆదేశం ద్వారా ప్రభుత్వం మినహాయించవచ్చునని సెజ్ చట్టంలోని సెక్షన్ 49(1) స్పష్టంగా పేర్కొన్నది. ఆ తర్వాత సెక్షన్ 49 (2) క్రింద సెజ్‌లోని ఏ సంస్థకు మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ఆదేశం జారీ చేసిన తర్వాత దాన్ని ఎట్టి పరిస్థితి ద్వారా గాని ఆదేశం ద్వారా గాని ఉపసంహరించడానికి లేదా వెనక్కు తీసుకొవాడానికి వీలులేదని సెక్షన్ 49(2) స్పష్టంచేస్తుంది. ఒకవేళ వెనక్కి తీసుకోవాలంటే మొత్తంగా సెజ్ చట్టాన్నే తిరిగి సవరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్రాలు ఇప్పటికే సెజ్‌లకు అనేక కార్మిక ఛట్టాలనుంచి మినహాయింపులు ఇచ్చాయి. మన రాష్ట్ర ప్రభుత్వం సెజ్‌లలో నెలకొల్పిన పరిశ్రమల్లో, కంపెనీల్లో ఏకంగా పనిగంటల పరిమితి నిబంధనలను తొలగించింది. అదనపు పనిగంటల వేతనం (ఓవర్ టైం) చెల్లించిన పక్షంలో కార్మికులతో ఎన్ని గంటలైనా పనిచేయించుకోవచ్చు. (కాని సక్రమంగా అదనపు పనిగంటలకు అదనపు వేతనం చెల్లించడం ఆచరణలో ఉండదు) కనీస వేతనాలు చెల్లించాలని ఉన్నా కంపెనీలో పని చేస్తున్న వారి నియామక తదితర వివరాలు తెలియజేసే వివరాల పుస్తకాలు (రిజిష్టర్లు), నమోదు పుస్తకాలు (రికార్డులు) యాజమాన్యం తప్పనిసరిగా నిర్వహించాలనే నిబంధన లేకపోవడం వల్ల కనీసవేతనాల అమలు, పని గంటల పాటింపు, ఉద్యోగ భద్రత మొదలైన కార్మిక హక్కులు చట్టబద్ధమైన కార్మిక హక్కులు హామీలు అమలు కావడానికి అవకాశం లేదు. ఇక కార్మిక సంఘాలకు సంబంధించి కూడా - కార్మిక సంఘ హక్కుల చట్టం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం సెజ్‌లకు ఇచ్చిన మినహాయింపుల వల్ల కార్మికశాఖ ఉనికి ప్రశ్నార్థకమైపోతున్నది. వందలసంవత్సరాలుగా అంతర్జాతీయంగాను, మనదేశంలో కార్మికవర్గం బలితర్పణం చేసి పోరాడి సాధించుకున్న సంఘటితమయ్యే హక్కు, సంఘాలు పెట్టుకునే హక్కు కనీస పనిగంటలు, కనీస ఉద్యోగ ఉపాధి, వేతన హక్కులను సెజ్ చట్టం కాలరాస్తున్నది. భూములు కోల్పోతున్న రైతాంగంతో పాటు కార్మిక సంఘాలు కూడా సెజ్‌లకు, సెజ్ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాల్సి వుంది. కాని చికాగో కార్మికులు 8 పనిగంటల పోరాటాని కంటే ముందే 8 పనిగంటల కోసం సమ్మె చేసిన చరిత్ర కల్గిన భారత కార్మిక వర్గం ఈనాడు భారత కార్మిక వర్గ కనీస హక్కులను కాలరాస్తున్న సెజ్ చట్టాన్ని వ్యతిరేకించలేని స్థితిలో ఉండడానికి జాతీయ స్థాయి కార్మిక సంఘాల కార్మిక వర్గేతర దృక్పథమే కారణం (మేడే నిర్వహణకు స్ఫూర్తి దాయకమైన 1886 చికాగో కార్మికోద్యమానికి 24 సంవత్సరాల ముందే 1862 లో భారత రైల్వే కార్మికులు 8 గంటల పని దినాన్ని డిమాండ్ చేస్తూ సమ్మెచేశారు). ఇప్పుడు భారత పార్లమెంటు చేసిన చట్టం 8 గంటల పనిగంటల నిబంధనను తుంగలో తొక్కిన జాతీయ కార్మిక సంఘాలు ప్రశ్నించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నాయి. ఎందుకంటే జాతీయ స్థాయి ప్రధాన స్రవంతి కార్మిక సంఘాలు (ఏ. ఐ. టి. యుసి, ఏ. ఎన్. టి. యుసి, టి. ఎన్. టి. యుసి, బి. ఎమ్. ఎస్, సి. ఐ. టియు, మొదలైన కార్మిక సంఘాలు) దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో పాలకులుగా అధికారం ఉన్న పాలక పార్లమెంటరీ పార్టీలకు అనుబంధ సంఘాలే. సి.పి.ఐ,

సి.పి.ఎమ్, మొదలైన వామ పక్షాలతో సహా భారతీయ జనతాపార్టీ, తెలుగు దేశం మొదలైన పార్టీలన్నీ పార్లమెంట్‌లో సెజ్‌ల చట్టాన్ని వ్యతిరేకించకుండా (నామమాత్రం సవరణలు సూచించి) ఆమోదించిన వారే. అంటే సామ్రాజ్య వాద ప్రయోజనాలకు ఊడిగం చేస్తూ కార్మిక వర్గ పక్షాన లేని వారే. కనుక ఆ పార్టీలకు అనుబంధంగా ఉన్న జాతీయ కార్మిక సంఘాలకు సహజంగానే ఇదే వైఖరి ఉంటుంది. సి.ఐ.టి.యు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి కాళీ ఘోష్ సెజ్‌లో ప్రత్యేక కార్మిక చట్టాలుండటాన్ని వ్యతిరేకిస్తున్నాం అంటూనే ఒక వేళ సెజ్‌లలో పరిశ్రమలు కార్మికుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తే మేం వారికి సహకరిస్తాం అంటూ రెండు నాలుకల ధోరణి ప్రదర్శించాడు. సి.ఐ.టియు, మార్క్సిస్టు పార్టీ అనుబంధ కార్మిక సంఘం. మార్క్సిస్టు పార్టీ సెజ్‌ల విషయంలో అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరి దేశ ప్రజలకు తెలిసిందే. తాము ఏలుబడిలో ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నందిగ్రాంలో సెజ్‌ను వ్యతిరేకిస్తున్న ప్రజలపై కాల్పులు జరిపించి ప్రజల ప్రాణాలు తీసిన మార్క్సిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ విశాఖ పట్నంలో సెజ్‌లకు వ్యతిరేకంగా ధర్నాలు చేయడం ప్రజలను మభ్యపరచే ధోరణి తప్ప సెజ్‌ల పట్ల నిజమైన వ్యతిరేకతకాదని తేటతెల్లంగా అర్థం అవుతుంది. ఇదే విధంగా భారతీయ జనతా పార్టీ తెలుగుదేశం పార్టీలు కూడా పార్లమెంటులో సెజ్ చట్టాని ఆమోదించడమే గాక తాము ఏలుబడిలో వున్నప్పుడు ఆయా రాష్ట్రాల్లో సెజ్‌లకు అనుమతించి తాము పాలనలో లేని చోట సెజ్ వ్యతిరేక పోరాటాల్లో పాల్గొనడాన్ని అర్థం చేసుకోవలసి వుంటుంది.

సెజ్‌లు అంటే సామ్రాజ్యవాద ఆధునిక పారిశ్రామిక భూస్వామ్యాలే :

దుక్కి దున్ని సాగుచేయని భూస్వాముల గుప్పెట్లో భూమి కేంద్రీకరణే భూస్వామ్యం. వలసవాద పాలన నుంచే ఎప్పటి దాకా దేశంలో భూమి లేని రైతాంగం భూస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. దేశంలో మొట్టమొదటి సారిగా తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా భూసంస్కరణలు అమల్లోకి వచ్చాయి. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం తెలంగాణలో మూడు వేల గ్రామాలను విముక్తంచేసి మూడు లక్షల ఎకరాలను (వంద ఎకరాలు భూగరిష్టపరిమితిగా పాటించి అంతకు మించి ఉన్న భూస్వాముల భూములను) నిరుపేద భూమిలేని రైతాంగానికి పంచింది. సాయుధ పోరాట విరమణ అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి బూర్గుల రామకృష్ణా రావు ప్రభుత్వం భూగరిష్ట పరిమితి 200 ఎకరాలకు నిర్ణయిస్తూ చట్టం తెచ్చింది. అప్పటికే పోరాట ప్రాంతంలో భూగరిష్ట పరిమితి 100 ఎకరాలు నిర్ణయించి మిగులు భూములను పంచిన అప్పటి ఉమ్మడి కమ్యునిస్టులు (ఇంకా సి.పి.ఐ, సి.పి.ఎమ్ గా విడిపోకముందు) ఈ రెండు వందల ఎకరాల భూగరిష్ట పరిమితి చట్టం చేసినందుకు బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వాన్ని అత్యంత అద్భుతమైనదిగా కీర్తించింది కూడా. స్వదేశీ పాలనకు ముందు నుంచే దేశంలో అనేక జమిందారీ ప్రాంతాల్లో సాగిన భూస్వామ్య జమిందారీ వ్యతిరేక పోరాటాల ఫలితంగా 1948 మద్రాసు ఎస్టేట్ల రద్దు చట్టం (దీని ప్రభావం కోస్తాంధ్రపై కూడా ఉంది. ఎందుకంటే అప్పటి ఈ కోస్తాంధ్ర మద్రాసు రాష్టంలో భాగం) వచ్చింది. 1949 లో తెలంగాణ జాగిర్దారీ రద్దు చట్టం, 1950లో హైదరాబాదు కౌల్దారీ చట్టం, 1956 ఆంధ్రప్రాంత కౌల్దారీచట్టం అమల్లోకి వచ్చాయి. మన దేశంలో మొదటి దశ భూసంస్కరణ చట్టం 1961 లో వచ్చింది. ఈ చట్టాన్ని తెస్తున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో చర్చల సందర్భంలో రాష్టంలో ఈ చట్టం అమలు వల్ల మొత్తం 30 లక్షల ఎకరాల భూమి మిగులు భూమిగా ప్రభుత్వం ప్రకటించింది. పంచపాండవులంటే మంచం కోళ్ళలా అంటూ మూడువేళ్ళు చూపించి నోటితో రెండు అన్నట్లుగా శాసన సభలో 30 లక్షల ఎకరాలను మిగులు భూమి ఆ తర్వాత 73 వేల ఎకరాలే అని చివరికి పంచింది కేవలం 54709 ఎకరాలు మాత్రమే.

ఇక రెండవ దశలో భూసంస్కరణలు 1967 లో ప్రారంభమై దాదాపు 70వ దశకం ఆరంభ సంవత్సరాల వరకు సాగిన శ్రీకాకుళ గిరిజన సాయుధ రైతాంగ పోరాటం, గోదావరి లోయ పోరాటంల ఫలితంగా ప్రభుత్వం 1973 లో రెండవ దశ భూసంస్కరణలు చేయక తప్పలేదు. 1973 లో రాష్ట్ర శాసన సభ ఆమోదించిన భూసంస్కరణ చట్టం రాష్ట్రపతి సంతకం తదితర కార్యక్రమాల తర్వాత 1975 జనవరి 1వ తేది నుండి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం చేసే సందర్భంగా శాసనసభలో చర్చలో రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల మిగులు భూమి తేలుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత 16.63 లక్షల ఎకరాలేనని చివరికి 1978 లో 12 లక్షల ఎకరాలేనని చివరికి 8 లక్షల ఎకరాల మిగులు భూమికి పరిమితం చేసారు. తోటలు తదితర మినహాయింపుల కింద భూమి యాజమాన్య కేంద్రీకరణకు అవకాశం ఉన్నప్పటికీ కొంత మేరకు దళితులకు, పేదలకు భూపంపిణి ఫలితంగా భూ వికేంద్రకరణ జరిగింది. ఇక పట్టణ భూగరిష్ట పరిమితి చట్టం అమలు చరిత్ర ఇంతకంటే అధ్వాన్నంగా ఉందన్న విషయం వేరే చెప్పక్కరలేదు. ఇట్లా ప్రజా పోరాటాల వల్ల దేశంలో ఓమేరకైనా భూవికేంద్రీకరణ ఫలితంగా భూస్వామ్యం చేతిలో ఉన్న వేలాదిఎకరాలు కోల్పోయినా కూడా బినామీ పేర్లలో కొందరు తోటలు తదితరాల మినహాయింపు వంటి చట్టంలోని లొసుగులను ఉపయోగించుకొని కొందరు వేలాది ఎకరాల భూస్వాములుగానే ఉన్నారు. అయినా ఎంతో కొంత బీడు భూములు, పడావు భూములు, రాళ్లురప్పల భూములు, నీటివసతి లేని భూములు పొందిన దళిత రైతులు, పేద రైతులు ఈ రెండు ఎకరాల, మూడు ఎకరాల భూములను గత 30, 40 సంవత్సరాలుగా చెమటోడ్చి సాగుకు అనువుగా చేసి పంటలు పండించి పదిమందికి ఉపాధి కల్పించడంతో పాటు తామూ జీవిస్తున్నారు.

ఇప్పుడు ప్రభుత్వం ఈ భూములను, వీటితో పాటు వంశపారంపర్యంగా వందల సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న వేలాది మంది రైతుల భూములు, కొన్ని చోట్ల గ్రామలతో సహా "సెజ్‌లు" గుటకాయస్వాహ చేస్తున్నాయి. ఇది రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పాలన నుంచి మొదలై రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం మరింత దౌర్జన్యంగా కొనసాగిస్తున్నది. దేశంలో గత జనతా పార్టీ ఐక్య సంఘటన కమ్యూనిస్టు ఐక్యసంఘటనతో కూడిన కాంగ్రెస్ ఐ ప్రభుత్వం కొనసాగిస్తుంది. సెజ్‌ల కోసం దేశంలో ప్రజల రక్తం ఏరులై పారిస్తున్న పాలకుల పైశాచికత్వమే యిది. నందిగ్రాం ఒక రాక్షస ఉదహరణ. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కి చేరువున ఉన్న మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం బాలానగర్ మండలంలో పోలేపల్లి, గండ్ల గడ్డ తండా, ముదిరెడ్డిపల్లి గ్రామలకు చెందిన పన్నెండు వేల ఎకరాల వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకున్న రెండు సంవత్సరాల క్రమంలో పాలకుల పైశాచికత్వాని కి 44 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. 2006 నుంచి పోరాడుతున్న కాకినాడ సెజ్ వ్యతిరేక పోరాట ప్రజలను ప్రభుత్వం జైళ్లలో పెట్టడంతో సహా అనేకవిధాల నిర్బంధ కాండను అమలు చేస్తున్నది. పాడేరు మండలం అరకులోయ తదితర ప్రాంతాల్లో బాక్సైట్ తవ్వకాలకు భూములను జిందాలకు అప్పగించడాన్ని వ్యతిరేకించిన గిరిజనులను అణచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు చివరికి వాకపల్లి గిరిజన స్త్రీలపై పోలీసులు లైంగిక బలాత్కార సంఘటన రాష్ట్రప్రజలకు తెలుసు. ఇదే విధంగా కోస్టల్ ఇండస్ట్రీయల్ కారిడార్ పేరిట శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకు సముద్ర తీరం నుంచి జాతీయ రహదారి వరకు ఉండే భూములు తీరప్రాంతం పొడుగునా సెజ్‌లకు కట్టబెడుతుంది. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములు జీడిమామిడి, కొబ్బరి, అరటి, మామిడి, నిమ్మ మొదలైన పండ్ల తోటలను; కాగిత పరిశ్రమకు ముడిసరుకులను ఉత్పత్తిచేసే తోటలను ప్రభుత్వం సెజ్‌లకు

అప్పగిస్తున్నది. వరి, పప్పుధాన్యాలు పండే వ్యవసాయ భూములను మొత్తంగానే సెజ్‌లు కబళించడం వల్ల దేశంలో ముఖ్యంగా అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర ఆహార కొరత ఏర్పడబోతుంది. ఇప్పటికే కిలో 25రూపాయలు అయిన బియ్యం ధర వందలకు చేరుకుంటుందేమో. అంటే ఇక మీదట ప్రపంచ ప్రఖ్యాతి చెందిన నెల్లూరు, కాకినాడ బియ్యం దొరకవు. వరి ధాన్యం పండే పొలాల్లో ఇప్పుడు నెలకొల్పిన సెజ్‌ల్లోని చెప్పుల పరిశ్రమ వల్ల అక్కడ భూములు కోల్పోయి, అతిచవకగా అందుబాటులో ఉండే కార్మికులకు అరకొర వేతనాలు చెల్లించి అదనపు పనిగంటలు పనిచేయించుకోవడం వల్ల అతి చవగ్గా ఉత్పత్తి చేసిన చెప్పుల్ని కారు చవగ్గా విదేశాలకు పంపుతారు. దాని విలువకు సమానమైన, అమెరికావాడు సముద్రం పాలుచేయబోయే గోధుమల్ని అధిక రేటుకు దిగుమతి చేసుకుని ఆ ప్రాంత కార్మికులకు రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తారన్నమాట. ఇది మన పాలకుల "ఇంటోళ్లను ఈడ్చికొట్టి, బయటోళ్ళకు బంతి భోజనం పెట్టే" వ్యవహారం. రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఎప్పుడూ ఒక మాట అంటూంటారు. చంద్రబాబు నాయుడు వ్యవసాయం దండగ అన్నారు, నేను వ్యవసాయం పండుగ అంటున్నాను, నిజమే వ్యవసాయ భూమిని సెజ్‌లకు అమ్ముకుంటున్న రాజశేఖరరెడ్డి ప్రభుత్వం కారు చవగ్గా కాజేసి అనేక రెట్లు అధిక ధరకు సెజ్ పరిశ్రమలకు సెజ్ డెవలపర్లకు వేల లక్షల ఎకరాలు అప్పనంగా యిచ్చేసి భారత దేశంలో సామ్రాజ్యవాద పారిశ్రామిక స్వతంత్ర వాడలైన సెజ్‌లకు పండగే పండగ. కాని భూములు కోల్పోయిన రైతులకు, గ్రామాలకు గ్రామలే కోల్పోయిన ప్రజలకు, సెజ్‌లలో పనిచేసే కార్మికులకు మాత్రం ఇక పస్తులే పస్తులు. అందుకని వ్యవసాయ భూముల్ని, తోటలను కోల్పోతున్న రైతులు, మత్స్యసంపదను కోల్పోతున్న మత్స్యకారులు, గ్రామాలు [illegible] పేద ప్రజలే కాక మొత్తంగా యావత్ ప్రజానీకం సెజ్‌ల పేరుతో నేల కోల్పోతున్నారు. ఈ ఆధునిక సామ్రాజ్యవాద పారిశ్రామిక భూస్వామ్యాలని దేశం నుంచి పూర్తిగా తుడిచిపెట్టాలి.

ప్రత్యేక ఆర్థిక మండళ్ళ చట్టం సెజ్‌ల డెవలపర్లకు, సెజ్‌ల్లో పరిశ్రమలకు అయిదు నుంచి పదిసంవత్సరాల వరకు ఆదాయం పన్ను, అమ్మకం పన్ను, ఎగుమతి దిగుమతులు పన్నుల నుంచి మినహాయింపునిస్తున్నది. సెజ్‌ల ప్రాథమికావసరాల (నీటి సరఫరా, విద్యుత్ సరఫరా మొదలైనవి) కల్పన కోసం ప్రభుత్వ ఖజానానుంచి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్న ప్రభుత్వం సర్వీసు టాక్సునుంచి కూడా సెజ్‌లకు మినహాయింపు నిస్తున్నది. సెజ్‌లకి ఇస్తున్న రాయితీలు ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందని స్వయంగా ఆర్థికమంత్రి ఒకసారి పత్రికా ముఖంగా అన్న విషయాన్ని బట్టి ప్రభుత్వం సెజ్‌ల్లో ఎంతగా ప్రజాధనాన్ని దోచిపెడుతున్నదో అర్థం చేసుకోవచ్చు. గతసంవత్సరం సెజ్‌ల విషయంలో వాణిజ్య పన్నుల మంత్రిత్వ శాఖకి ఆర్థిక మంత్రిత్వ శాఖకి, పారిశ్రామిక మంత్రిత్వ శాఖకు మధ్య జరిగిన రసవత్తర వైరుధ్యభరిత చర్చ ప్రత్యేక ఆర్థిక మండళ్ళ వల్ల ప్రభుత్వం ఖజానాపై పడుతున్న లోటును బయట పెట్టింది.

ది స్పెషల్ ఎకనామిక్ జోన్స్ యాక్ట్ 2005 (ప్రత్యేక ఆర్థిక మండళ్ళ చట్టం 2005) గా పేర్కొన్న ఈ చట్టం 10-02-2006న చేసిన సవరణలతో కలిపి 2006 ఆగస్టు 10వ తేదీన అమల్లోకి వచ్చింది. ఈ చట్టంలోని 6వ చాప్టరు ప్రత్యేక ఆర్థిక మండళ్ళ ప్రత్యేక రాయితీల క్రింద 26 సెజ్‌ల డెవలపర్లకు, ఎంటర్‌ప్రైన్యుయర్స్ (పారిశ్రామిక యాజమాన్యాన్ని) మినహాయింపులు, రాయితీలు ఎ. బి. 1962 కస్టమ్ యాక్ట్ 1975 కస్టమ్స్ టారిఫ్ యాక్టు లేదా మరేయితర పన్నుల చట్టాలు విధించే పన్నుల నుంచి కొంతకాలం (అయిదునుంచి పదిసంవత్సరాలు) మినహాయింపు (దీని క్రింద తాత్కాలికంగా విధించే పన్నుల నుంచి కూడా మినహాయింపు) సి. డి. 1944 సెంట్రల్ ఎక్సైజ్ యాక్టు 1985 (86) సెంట్రల్ టారిఫ్ యాక్టు (తాత్కాలికంగా దీని క్రింద విధించే పన్నులు) నుంచి విధించే పన్నుల నుంచి మినహాయింపు (అయిదు నుంచి పదిసంవత్సరాల వరకు). 1994 ఫైనాన్స్ యాక్టులోని అయిదవ చాప్టరు క్రింద డెవలపర్‌కు ప్రభుత్వం అందించే ప్రాథమిక అవసరాల సేవలు (విద్యుత్తు, నీటి సరఫరా) కు విధించే సర్వీసు టాక్సునుంచి నిర్దేశిత కాలం వరకు మినహాయింపు ఉంటుంది. 2004 ఆర్థిక చట్టం సెక్షన్ 98 క్రింద దేశవాసులు కాని వారి వ్యాపార లావాదేవీలపై వ్యాపార లావాదేవీ భద్రతాపన్ను నుంచి మినహాయింపు.

ఇట్లా యింకా అనేక పన్నుల రాయితీలు యివడబ్బ సొమ్మని సెజ్‌ల డెవలపర్లకు, సెజ్‌ల పారిశ్రామిక యజమానులకు ప్రభుత్వం అప్పనంగా ధార బోస్తున్నాదో తెలిస్తే ఇది ఖచ్చితంగా దేశ ప్రజల శ్రమను కొల్లగొట్టి బహుళ జాతి గుత్త సంస్థలకు కట్టబెట్టడం మాత్రమే అని తెలుస్తుంది.

అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో సెజ్‌లు అధికం :

రాష్ట్రంలో మొత్తం 70 ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (సెజ్‌లు) ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే 46 సెజ్‌లు నోటిఫై అయ్యాయని మరో 24 ప్రాథమిక అనుమతులు పొందాయని డిసెంబర్ 15వ తేదీన రాష్ట్రముఖ్యమంత్రి ప్రకటించాడు. దేశంలో మొత్తం నోటిఫై అయిన సెజ్‌లు 195 కాగా, తమిళనాడు 37, మహారాష్ట్రలో 24 సెజ్‌లు నోటిఫై కాగా ఆంధ్రప్రదేశ్‌లో డిసెంబర్ 15 నాటికి 46 నోటిఫై కాగా ఇపుడు మరికొన్ని కలిసి 53 సెజ్‌లు నోటిఫై అయినాయి. గతంలో ప్రకటించిన 70 సెజ్‌లకు అదనంగా ఈ నెలలో మరో 18 సెజ్‌లను ప్రభుత్వం ప్రకటించింది. అన్నీ కలిపి రాష్ట్రంలో ప్రతిపాదిత సెజ్‌లు 88. ఇట్లా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రజల నుండి భూములు గుంజుకుని పరిశ్రమలకు అప్పగించడంలో మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కోసం కేంద్రం ఏటా విడుదల చేస్తున్న 20 కోట్ల రూపాయలను రాష్ట్రప్రభుత్వం సెజ్‌ల ప్రాథమిక అవసరాల కల్పనకు దారి మళ్ళించింది. మరో 120 కోట్ల రూపాయలను కోరడానికి రంగం సిద్ధం చేసింది. సెజ్‌లలో రాష్ట్రం మొత్తం మీద 25,000 మందికి ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి అంటున్నారు. ఇప్పటికే నెల్లూరు జిల్లా తడ సెజ్‌లో ఉత్పత్తి ప్రారంభమైన అపాచీ చెప్పుల కంపెనీలో 4,000 మంది పనిచేస్తున్నారని మరో 10,000 మందికి పనులు దొరకుతాయని ప్రకటించారు. ముఖ్యమంత్రి ఈ విషయం ప్రకటించే నాటికి అపాచీలో నికరంగా పని దొరికింది 700మందికి మాత్రమే. 10,000 మందికి ఉద్యోగం అన్నదానిలో కూడా ఇంతే నిజం ఉంటుంది. ఇక ఇక్కడ వేతనాలు, పనిగంటల పరిస్థితి దేశంలోని కనీస వేతన చట్టం, కనీస పనిగంటల నిబంధనలు ఏవీ అమలు కావడం లేదు. దీనిని బట్టి ముఖ్యమంత్రి ప్రకటించిన 25 లక్షల ఉద్యోగాల పరిస్థితి చూస్తే - కూడా హుళక్కేనని అర్థం చేసుకోవచ్చును. 1894 నాటి భూసేకరణ (వలస పాలకుల కాలం నాటి చట్టం) చట్టం ప్రకారం ప్రజా ప్రయోజనాల కోసం అంటే ప్రజావసరాల కోసం రోడ్లు వేయటానికి, రైలు మార్గం నిర్మించటానికి, ఆస్పత్రులు కట్టడానికి, విద్యా సంస్థల కోసం ఆస్తి సొంతదారులకు అప్పుడు వున్న మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి. ఆ తరువాతనే భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చును. సెజ్‌లు ఉమ్మడి ప్రయోజనాల క్రిందకి రావు కనుక సెజ్‌ల ప్రయోజనార్థం (ప్రజల ప్రయోజనాల కోసం వలస పాలకులు తెచ్చిన పాత చట్టాన్ని మార్చడం కాదు)1894 నాటి భూ సేకరణ చట్టానికి మార్పులు తెస్తూ మోసపూరిత పద్ధతిలో 2007 కొత్త భూసేకరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. కొత్తగా చేసిన ఈ భూసేకరణ, జాతీయ పునరావాస చట్టం ప్రకారం త్వరలో జాతీయ పునరావాస కమీషన్ ఏర్పాటు చేస్తామని చెప్పింది. కంపెనీలో షేర్ల రూపంలో 20% పరిహారం ఉంటుంది. భూవివాదాల పరిష్కార సంస్థను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పింది. వికలాంగులకు, నిరాశ్రయులకు, వితంతువులకు (భర్తలు

వదిలేసిన స్త్రీలు, అవివాహితులు) ప్రత్యేక సహాయం అందజేసే నిబంధనలు ఈ చట్టంలో ఉన్నాయని కేంద్ర సమాచార శాఖా మంత్రి ప్రకటించారు. ఇవన్నీ ఎంత అబద్ధమో అపాచీ కంపెనీకి వెళ్ళిన జడ్చెర్ల, బాలానగర్ మండలాల్లో పోలేపల్లి, గుండ్లగడ్డ తండా ముదిరెడ్డి పల్లె (12వేల ఎకరాలలో నిర్మాణమవుతున్న ఫార్మా సెజ్) వెళ్ళి చూస్తే తెలుస్తుంది. భూములు కోల్పోవడం వల్ల నిరాశ్రయులై గుండె పగిలి చనిపోయిన వారి కుటుంబాలకు భూములు ఇవ్వాలని పోరాడి జైలుపాలై పోలీసుల చేతిలో దెబ్బలు తిన్నా కంపెనీలు గాని, ప్రభుత్వం గాని కనీసం కర్మకాండ ఖర్చులు కూడా సహాయం చేయలేదు. పడావు భూములు, బీడు భూములు తప్ప సారవంతమైన భూములు, పంట భూములు, తోటలు ఇతర ఉత్పాదక భూములను తీసుకోవడానికి వీలులేదు. కాని కాకినాడ సెజ్ కాజేస్తున్న 12,500 ఎకరాల భూములు సుసంపన్న సరుగుడు, జీడి మామిడి తోటలను రైతులను బెదిరించి మభ్య పెట్టి, మీరు ఇవ్వకపోయిన కోర్టులో డబ్బు కట్టి అతి చౌకగా స్వాధీనం చేసుకుంటామని లేదా మీ అంతట మీరే అమ్మితే ఎకరాకు 3 లక్షలు ఇస్తామని మోసగించి అమ్మకపు పత్రాలలో అవన్నీ బీడు భూములు అని రాసుకొని స్వాధీనం చేసుకున్నారు. ఇక మహబూబ్ నగర్ ఫార్మా సెజ్‌లో అసైన్డ్ భూములు ప్రభుత్వానికి తిరిగి తీసుకునే హక్కు వుందని చెప్పి ఎకరానికి 18 వేలు లెక్క, గట్టి అప్పుల బకాయిలంటూ కొంత జమ చేసుకొని కొందరికి ఎకరానికి రెండు వేలు, కొందరికి అది కూడా ఇవ్వక పోవడంతో రైతులు గుండె పగిలి రెండు సంవత్సరాలలో 44 మంది చనిపోయారు. ఈ విధంగా సెజ్‌లు ప్రజల పాలిటి సమాధు లవుతున్నాయి. భూములు కోల్పోయిన రైతులకు కుటుంబంలో ఒక్కరికి పని ఇస్తామని చెప్పిన మాటలు నమ్మి రోజు సెజ్ గేట్ల దగ్గర అడ్డాకూలీల్లా ఎదురుచూసే వందల మందిలో కొందరికి పని దొరుకుతుంది. కొందరికి దొరకదు. అది కూడా హైటెక్ పని దినాలు కదా. వారానికి అయిదు రోజులు మాత్రమే పని, రెండు రోజులు సెలవు. ఈ పని కూడా సెజ్ ప్రహరీ గోడ నిర్మాణం, రోడ్లు వేయడం, స్తంభాలెత్తి పాతడం వంటి నిర్మాణ పనులు మాత్రమే. ఈ పనులకు రోజు 75 రూపాయల నుండి 100 రూ, 120 రూ, 130 రూ చొప్పున తేడాలతో ఇస్తున్నా ఈ పని కూడా పరిశ్రమ పూర్తయ్యాక వుండదు. పరిశ్రమ పూర్తయినాక అందులో పని దొరకడానికి నైపుణ్యం అవసరం అవుతుంది. ఉపాధి కోల్పోయిన రైతు కుటుంబాలకు, వృత్తి పని వారికి పని ఉండదు. అందుకని ప్రభుత్వం, సెజ్‌ల యాజమాన్యం నమ్మబలుకుతున్నట్లు భూములు కోల్పోయిన వారందరికి ఉద్యోగాలు దొరుకుతున్నాయి అనేది పూర్తిగా అబద్ధం.

సెజ్‌లు భారత దేశంలో స్వతంత్ర భూఖండాలు :

భారత భూభాగంలో సెజ్‌లు స్వతంత్ర ప్రాంతాలు. వీటిలో భారత దేశ చట్టాలకు, పాలనాయంత్రానికి ప్రవేశ అనుమతి ఉండదు. సెజ్‌ల ప్రత్యేక చట్టం సెజ్ పాలన అధికార కార్యాలయం మాత్రమే అక్కడి వ్యవహారాలపై అధికారం ఉంటుంది. చివరికి సాధారణ క్రిమినల్ నేరాల విచారణ కోసమైనా సరే పోలీసులు సెజ్ కమీషనర్ అనుమతి లేకుండా సెజ్ ప్రాంతంలో అడుగు పెట్టరాదు. నేర విచారణ చేయడానికి అధికారం ఉండదు. ఇది దేశంలో పరతంత్ర పాలనను దొడ్డి దారిన ప్రవేశపెట్టే కుతంత్రం. భూములు కోల్పోయిన, ఇతరత్రా (ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడల్ వల్ల) ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు వ్యవసాయ కూలీలు వ్యవసాయాధారిత వృత్తులవారు మొత్తంగా దేశంలో అశేష ప్రజానీకం జీవనాధారం, జీవనఉపాధి కోల్పోయారు. రెండు రెక్కల కష్టం మాత్రం మిగిలి పని కోసం పరిశ్రమల ముందు పడిగాపులు పడుతూ యాజమాన్యానికి అతి తక్కువ వేతనాలకు అదనపు పని వారిగా (మార్క్స్ మాటల్లో రిజర్వు లేబర్ ఫోర్స్) పరిశ్రమలకు అందుబాటులో ఉండే స్థితి కూడా ఈ సెజ్‌లు రూపొందే క్రమంలో నిగూఢమై వుంది. ఇట్లా చూస్తే సెజ్‌ల వల్ల దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం ముంచుకొచ్చే ముప్పు ముందు ముందు పొంచి వుంది.

ప్రతిఘటిస్తున్న ప్రజలపై నిర్బంధం :

ప్రతిఘటిస్తున్న ప్రజలపై ప్రభుత్వాలు - అది కాంగ్రెస్, కమ్యూనిస్టు లేదా మరొకరు అనే తేడా లేకుండా (పార్లమెంటులో సెజ్‌ల చట్టాన్ని అన్ని పార్టీలు ఏకగ్రీవంగా కనీస వ్యతిరేకత లేకుండా మూడు రోజుల్లో ఆమోదించాయి. రాష్ట్రపతి కూడా వెంటనే ఆమోదించి నాలుగు రోజుల్లో - చట్టమై వచ్చి దయ్యమై పటిందన్నట్లు చట్టమై వచ్చింది) ప్రజలపై అమలు చేస్తున్న నెత్తుటి నిర్బంధ కాండకు నందిగ్రాం, కళింగనగర్ (ఒరిస్సా) లను మించిన ఉదాహరణలు లేవు. మన రాష్ట్రంలో కూడా వాకపల్లి నిర్బంధం, కాకినాడ రైతులను జైలులో పెట్టడం, జడ్చర్ల బాలానగర్ సెజ్‌ల భూములు ఇవ్వమన్న రైతులపై పోలీసు దాడులు ఇవన్నీ ప్రత్యక్ష ఉదహరణలు.

గోవాలో ప్రజల పోరాటాలకు తల వొంచిన ప్రభుత్వం సెజ్‌లను తిరస్కరించింది. అయితే గోవా ప్రభుత్వానికి టూరిజం ప్రధాన ఆదాయం కావడం అక్కడ సెజ్ ప్రాంతంలో పట్టణ గ్రామీణ ఉమ్మడి పట్టాలు (వ్యక్తి గత ఆస్తి పట్టా కాదు) కావడం ఇంకా అనేక కారణాలు ప్రజల ప్రతిఘటనతో కలిసి సెజ్‌లను తిప్పికొట్టడానికి దారి తీసింది. నందిగ్రాం ప్రజానీకం ప్రాణాలు వొడ్డి పోరాడి సలీం గ్రూప్ ఆఫ్ సెజ్ కంపెనీ రసాయన పరిశ్రమను విజయవంతంగా తిప్పికొట్టింది. సైన్యం మద్దతుతో తిరిగి గ్రామాలలోకి ప్రవేశించిన సి.పి.ఎమ్ కార్యకర్తలు ప్రజలపై కాల్పులు జరిపి స్త్రీలపై లైంగిక బలాత్కారానికి పాల్పడి, కోర్టు కేసులను ఎదుర్కొంటున్న నిందితులు గ్రామంలో యధేచ్ఛగా తిరుగుతూ సెజ్‌లను వ్యతిరేకించిన ప్రజలను చంపడం, కొట్టడం మొదలయిన దౌర్జన్యాలకు పాల్పడుతున్న వార్తలు పత్రికల్లో వస్తూనే వున్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సింగూర్‌లో ప్రస్తుతం నిర్మాణంలో వున్న టాటా కార్ల పరిశ్రమకు భూములు ఇవ్వం అంటూ ఉద్యమించిన ప్రజల్లో క్రియాశీల కార్యకర్త తామని మాలిక్ (17 సంవత్సరాల బాలిక) పై కార్ల పరిశ్రమ గార్డులు పోలీసు అవుట్ పోస్టు పక్కనే లైంగిక బలాత్కారం చేసి, పెట్రోల్ పోసి సజీవదహనం చేసిన బూడిద రాసి పైన టాటా కార్ల పరిశ్రమ నిర్మిస్తున్నదంటే సెజ్‌లు ప్రజల సమాధులు కాక మరేమిటి అని ప్రజలు ప్రభుత్వాలను నిలదీస్తూ దేశవ్యాప్తంగా మహారాష్ట్ర ఒరిస్సా, బెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పోరాటాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ నిర్మాణ వ్యతిరేకంగా కోస్తా ఆంధ్ర 9 జిల్లాల ప్రజల ఐక్య సంఘటన (ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటి) ఏర్పడి ప్రస్తుతం ఈ 9 జిల్లాలలో ప్రజా చైతన్య యాత్ర చేస్తున్నది. కాకినాడ సెజ్ వ్యతిరేక రైతాంగ ప్రజా పోరాట కమిటి, కాకినాడ సెజ్ వ్యతిరేక యువజన సమాఖ్య, కాకినాడ సెజ్ వ్యతిరేక మహిళా సంఘం వారు పోరాటంతోసహా సెజ్‌ల నిర్మాణాలను ధ్వంసం చేయడం వంటి అనేక రూపాల్లో ప్రతిఘటనా పోరాటాలు చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల, బాలానగర్ మండలాల్లో ఫార్మా సెజ్ వ్యతిరేక ఐక్య కార్యాచరణ కమిటి ఆధ్వర్యంలో ప్రజలు పోరాడుతున్నారు.

ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించిన నెల్లూరులోని తడ వద్ద వున్న అపాచీ కంపెనీలో పని పద్ధతులకు వ్యతిరేకంగా స్త్రీలపై అకృత్యాలకు వ్యతిరేకంగా కార్మికులు సంఘటితమౌతున్నారు.

జిందాల్ కంపెనీకి వ్యతిరేకంగా పాడేరు గిరిజనులు, చత్తీస్‌ఘడ్ గిరిజనులు (అటవీ ఖనిజ సంపద దోపిడీని ప్రతిఘటిస్తూ) పోరాటాలు చేస్తున్నారు. ఈ క్రమంలో దేశంలో సెజ్‌ల వ్యతిరేక పోరాటాలన్నీ సంఘటితమై సెజ్ చట్టానికి, సెజ్‌లకు వ్యతిరేకంగా భారతదేశంలో సామ్రాజ్యవాద నయావలస, ఆధునిక పారిశ్రామిక భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి ఆరంభ సూచిక. *

వ్యాసం

❖ ప్రొ. ఘంటా చక్రపాణి

భూమండలీకరణలో చెరబడ్డ భూదేవర!

గ్లోబలైజేషన్‌కు సరైన తెలుగుపదం ఏమిటో ప్రాచీన హోదా కోరుకుంటోన్న మన పండిత పరమేశ్వర శాస్త్రులెవరూ ఇంకా ప్రవచించినట్టు లేరు. ఇప్పటికే మనరు సకలజ్ఞాన విజ్ఞాన ప్రదాతలైన పత్రికలు 'ప్రపంచీకరణ' అనే ప్రచురిస్తున్నాయి (అలా అనకపోతే పత్రికా స్వేచ్ఛకు భంగం అనుకుని). మనమూ అలాగే అంటున్నాం. నిజానికి మనంవాడే మాటలకు, వాటి సామాజిక మూలాలతో, ప్రభావాలతో, రాజకీయార్థశాస్త్రాలతో సంబంధం లేకుండా పత్రికలు ఏది అనువదిస్తే, ఎలా వాదిస్తే అలాగే వాడేస్తుంటాం,. చాలా కాలం దాకా 'లిబరలైజేషన్' విధానాలు ఎంతో క్రూరమైనవీ, దుర్మార్గమైనవీ అయినప్పటికీ మన తెలుగు పండితులు మాత్రం 'ఉదారవాద విధానాలు' అని అనువదించిపెట్టారు. అవి ప్రజల పట్ల ఎంతో కఠినమైనవీ, కర్కశమైనవీ అయినప్పటికీ ఇప్పటికీ మనం 'సరళీకరణ విధానాలు' అని సరిపెట్టుకుంటున్నాం. నేను భాషా శాస్త్రం చదువుకోలేదు. కానీ ఈ పదాలు విన్నప్పుడల్లా గుండె తరుక్కుపోతుంది. ఇవాళ ప్రపంచం మొత్తాన్ని దంపుకోతకు గురిచేస్తోన్న దుర్మార్గాన్ని ఎంతో సరళంగా, సౌమ్యంగా 'ప్రపంచీకరణ' అని పిలుచుకునే 'ఉదారవాద' భావ దారిద్ర్య ధోరణి బహుశా ఒక్క మన తెలుగు భాషలోనే వుందేమో!

నిజానికి కొందరు (హిందీలో) వాడుతున్న 'భూ మండలీకరణ' అనేది ఇవాల్టి 'గ్లోబలైజేషన్' కు సరిగ్గా సరిపోతుంది. గ్లోబు - అంటే భూగోళం కాబట్టి గ్లోబలైజేషన్ 'భూ మండలీకరణ' అవుతుందని కాదుగానీ ఇవాల్టి 'గ్లోబలైజేషన్' లక్ష్యాలు - లక్షణాలు చూస్తున్నప్పుడు దాని రాజకీయార్థిక పరిణామాలు, పర్యవసానాలు గమనిస్తున్నప్పుడు అదే పరమార్థమని తోస్తోంది. ఆర్థిక పరిభాషలో అది సంపదకు, మార్కెట్‌కు, ఉత్పత్తికి సంబంధించి అయినప్పటికీ, వస్తువులు సేవల వినియోగమే పరమావధిగా చెపుతున్నప్పటికీ అది విశ్వవ్యాప్తంగా ఖండాలు, దేశాలు, ప్రాంతాలు సరిహద్దుల్ని సమూలంగా చెరిపేసి, రాజ్యాలను వ్యవస్థలను వాటి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను, సార్వభౌమాధికారాన్ని సర్వనాశనం చేస్తున్న తీరు గమనిస్తుంటే 'భూ మండలీకరణ' నిజమేననిపిస్తుంది. చరిత్ర, సంస్కృతి, జాతి, తెగ భాష, ప్రాంతీయ వైవిధ్యాలు, నాగరికతల ఆధారంగా వూర్లు, వాడలు, పల్లెలు, కులాలు, మతాలు, విశ్వాసాలు, వృత్తులు, వ్యాపకాలు, జీవితాలు, దేశాలు, ఖండాలు, పునాదులుగా ఏర్పడ్డ వివిధ అస్తిత్వాలను అణచివేస్తూ ఈ విధ్వంస ప్రక్రియను 'గ్లోబల్ విలేజ్' అని సంబోధించడం చూస్తూంటే, ఇప్పుడు ప్రపంచం ఒక 'ప్రత్యేక ఆర్థిక మండలం'గా మారిపోవడం చూస్తుంటే ఇదంతా 'భూ మండలీకరణ'గానే కనిపిస్తోంది.

భూమి - ఆర్థిక మండలం!

భూమి మీద చర్చ మనిషి పుట్టినప్పటి నుంచీ వుంది. మనిషి జీవన్మరణాలు సమస్తం భూమి చుట్టూనే తిరుగుతూ వస్తున్నాయి. చరిత్రలో విజ్ఞానం, వికాసం, విధ్వంసం, విప్లవం ఏదైనాసరే భూమి కోసమే జరిగాయి. భూమి మీదే జరుగుతున్నాయి. భూమి అంటే వుట్టి నేల మాత్రమే కాదు. ఆ నేలలోంచి, మట్టిలోంచి పుట్టిన సమస్త జ్ఞానం. సమిష్టి జీవనం, కళలు, సంస్కృతి. అదొక్క భూగోళశాస్త్రంలోనే అర్థమయ్యేది కాదు. సకల శాస్త్రాలు సమ్మిళిత జ్ఞాన రాశి. మానవాళికి అదే జీవధాతువు. అల్లం రాజయ్య సృష్టించిన రాగి మీసాల సాంబయ్య విప్పిచెప్పినట్టు "కూడ బెట్టినా కూలగొట్టినా భూదేవరే!"

ఇవాళ మళ్ళీ ప్రపంచం దృష్టంతా భూమి మీదే పడింది. ప్రపంచ మార్కెట్లో ఇవాళ భూమి ప్రధానమైన వస్తువుగా చెలామణి అవుతాంది. అమెరికా నుంచి చైనా వరకు చర్చంతా భూమిపైనే! రియల్ ఎస్టేట్ పేరుతో సాగుతున్న 'భూవ్యాపారం' ఇవాళ ఆర్థిక వ్యవస్థకు ప్రాణవాయువుగా మారిపోయింది. ఏటేటా విస్తరిస్తోన్న మార్కెట్ వ్యవస్థలో ఇప్పుడు నలభైశాతం వాటా భూమిదే అయిపోయింది. భూమి, భూమి మీద సాగుతున్న వ్యాపారం, ఇవాళ 'భూమండలీకరణ' వైపు పెట్టుబడిని పురమాయిస్తోంది. మనిషి విజ్ఞాన ఆవిష్కరణలో భాగంగా అన్నీ సృష్టించగలిగాడు. ప్రకృతిలో దేన్నయినా కృత్రిమంగా తయారు చేయగలిగాడు. మనిషిలాంటి మరో మనిషి మరమనిషి మొదలు గాలి, నీరు, నిప్పు అన్నీ సృష్టించగలిగాడు. ఒక్క భూమి తప్ప! అందుకే భూమి అంత అపురూపమైపోయింది. దానికి ప్రతి సృష్టి చేసేంత జ్ఞానం భూమిమీద బతికి బట్టకట్టిన వాడెవడికీ లేదు. కాబట్టే అనాదిగా భూమిని ఆక్రమించుకోవడం, దోచుకోవడం జరుగుతూ వస్తోంది. భూమితో పాటు ఆ భూమి మీద బతుకుతున్న మనుషుల్నీ, సంపదనీ ఆక్రమించుకుని రాజ్యాలు ఏర్పడ్డాయి. రాజులు ఏర్పడ్డారు. దొరలు ఏర్పడ్డారు. పర్యవసానంగా పోరాటాలు, తిరుగుబాట్లు, ఉద్యమాలు, విప్లవాలు, విధ్వంసాలు, ఉత్సవాలు, విషాదాలు, ఒప్పందాలు ఇలా చరిత్రంతా మానవాళి నెత్తుటితో తడిసి ముద్దయ్యింది.

భూమి మీద మనుషులుంటే భూమిని సొంతం చేసుకోవడం కష్టం. కాబట్టి తరిమేయడం ఒక్కటే మార్గమనుకొని భూమి పుత్రుల్ని తరిమేసి, అడవుల్లో, కొండల్లో బందీలను చేసి గ్రామాలు, నగరాలు, దేశాలు నిర్మించుకొన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, ఆసియా ఖండాలన్నీ ఇలా భూముల్ని ఖండఖండాలుగా చేసుకొని పంచుకున్నవే. ఆదివాసులను చీల్చి, చెండాడి తరిమేసి ఆక్రమించుకున్నవే. ప్రజలను, రాజులను, రాజ్యాలను దేశాలను లొంగదీసుకుని శతాబ్దాల పాటు వలసవాదులు ఈ భూమండలాన్ని పాలించారు. సామ్రాజ్యాలను విస్తరించుకున్నారు. దేశాలను పంచుకున్నారు. భూమిని తమదిగా చేసుకొని, సంపదను పెంచుకొన్నారు. ఆధిపత్యం కోసం ప్రపంచ యుద్ధాలతో ప్రజా జీవితాన్ని అస్తవ్యస్తం చేశారు.

ఇప్పుడు కాలం మారింది. లోకం మారింది. అట్లాగే దోపిడీరూపం మారింది. మునుపటిలా దురాక్రమణలు, దండయాత్రలు చేసుకుని, నెత్తుటేర్లు పారించే పనిలేకుండా ప్రపంచాన్ని శాసించే అస్త్రంగా ఆర్థిక వ్యవస్థను వాడుకుని, ప్రపంచ బ్యాంకును వాడుకుని, అంతర్జాతీయంగా ఐఎంఎఫ్‌ను వాడుకుని దేశాలు సరిహద్దులు చెరిపేసి తమ మార్గాన్ని సరళతరం చేసుకోనేందుకే లాటిన్ అమెరికా మొదలు ఆసియా దేశాల దాకా 'సరళీకరణ' విధానాలు విధిగా అమలు చేయించడంతో ఈ 'భూ మండలీకరణ' కు అంకురార్పణ జరిగింది.

ప్రధాన ఆర్థిక రంగాల నుంచి ఆయా ప్రభుత్వాలను విరమింపజేయడం మార్కెట్ ఆర్థిక వ్యవస్థను ప్రవేశపెట్టించి పెట్టుబడులు విస్తరించడం, స్థానిక పెట్టుబడిదార్లతో మిలాఖత్ అయి ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థల్ని కబళించడం, ప్రభుత్వాలను తమ చేతిలో తోలుబొమ్మల్ని చేసి ఆడించడం మొదటి దశలో పూర్తయ్యింది. ఇదంతా తెరచాటుగానే జరిగిపోయింది. ఇప్పుడు మన దేశానికి ప్రధాన మంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్‌కు తన జీవితంలో ఈ మార్కెట్ శక్తుల జీతగాడిగా ప్రపంచబ్యాంక్‌కు చాలాకాలం పనిచేసిన చరిత్రవుంది. ఆ కొలువులోంచి నేరుగా సంస్కరణలకు తలుపులు తెరిచిన పి.వి. నరసింహారావు హయంలో ఆర్థిక మంత్రిగా చేరి ప్రపంచబ్యాంకు ఎజెండాను తుచతప్పకుండా అమలు చేసిన ఘనతావుంది.

ఆర్థిక సంస్కరణలు సమర్థవంతంగా అమలు చేసిన మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రి కావడం అప్పటికే సంస్కరణల రెండోదశ సిద్ధంకావడం కాకతాళీయంగా జరిగింది కాదు. ఆయన ప్రధాన మంత్రి కావడం అనేది

మొత్తం ప్రపంచ మార్కెట్‌కు చారిత్రక అవసరంగా మారిపోయింది. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రికాగానే అప్పటికే సిద్ధంగావున్న ప్రత్యేక ఆర్థిక మండలాల విధానాన్ని (సెజ్ పాలసీ - 2000) చట్టబద్ధం చేశాడు. 2005లో రూపొందిన ఈ చట్టం 2006 ఫిబ్రవరి నుంచి అమలవుతుంది. ఇది దేశంలోని లక్షలాది ఎకరాల భూమిని పెట్టుబడిదార్లకు విదేశీ కంపెనీలకు, వ్యాపారవేత్తలకు ఫలహారంగా పంచి పెట్టటానికి పనికొచ్చింది. మరో వైపు కోట్లాది మంది ప్రజల జీవితాలను కొల్లగొట్టి పల్లెలను అల్లకల్లోలం చేస్తోంది. ఇట్లా ప్రభుత్వమే స్వయంగా ఇప్పటికి దాదాపు నాలుగు వందల కంపెనీలకు దేశాన్ని నిట్టనిలువునా దోచుకునేందుకు లైసెన్సులిచ్చింది. ప్రభుత్వాలు మనిషికి భుక్తినిచ్చిన భూదేవరను ఇప్పుడు చెరపట్టాయి. అంగడిలో సరుకును చేసేసాయి. వీధుల్లో వేలం వేస్తున్నాయి. అట్లా వచ్చిన సొమ్ముతో సర్కారు నడుస్తోంది. ఒకప్పుడు పేదలకు భూములు పంచుతామని, సంస్కరణలు చేపడతామని చెప్పిన ప్రభుత్వాలే ఇవాళ భూములు రైతుల నుంచి, పేదల నుంచి, ఆదివాసుల నుంచి, గంగపుత్రుల నుంచి నివాస ప్రాంత భూములను లాగేసుకుని పెద్ద పెద్ద కంపెనీలకు కట్టబెడుతున్నాయి. ఒకప్పుడు మాతృభూమిని విదేశీశక్తుల నుంచి, వలస పాలన నుంచి విముక్త చేయాలని నినదించిన పార్టీలే తమ ప్రభుత్వాల ద్వారా భూమిని, వూర్లని, పల్లెల్నీ అట్లా మొత్తంగా ఈ దేశాన్ని విదేశీ శక్తులకు, సంస్థలకు, పెట్టుబడికి తాకట్టు పెడుతున్నాయి. ప్రత్యేక ఆర్థిక మండలాలు (సెజ్‌లు) మళ్లీ దేశంలో ఒక కొత్త సామ్రాజ్యవాదానికి, కొత్త రకం వలస పాలనకు దారితీస్తున్నాయి. ఈ నయా సామ్రాజ్యవాదం ఇవాళ దేశంలో కొత్త భూస్వామ్య వ్యవస్థను, కొత్త సంస్థానాలను, కొత్త సామంతులను, కొత్త వ్యాపార వర్తక సామ్రాజ్యలను తయారుచేస్తోంది.

ఏమిటీ ప్రత్యేకత ? !

ప్రత్యేక ఆర్థిక మండలమని ప్రచారమౌతోన్న ఈ సెజ్‌ల ప్రత్యేకత దోపిడి సర్వసత్తాక ప్రజాస్వామ్య రిపబ్లిక్ అనుకున్న ఈ దేశంలో పెట్టుబడిదారులకు ఈ చట్టం పెట్టనికోట ! ఈ చట్టం వివిధ కంపెనీలకు దేశంలో ఎక్కడైనా తమ సామ్రాజ్యాన్ని స్వతంత్ర సంస్థానాలనూ ఏర్పాటు చేసుకుని పాలించుకునే స్వేచ్ఛనిస్తున్నది. ఎందుకు 'స్వతంత్ర' మంటున్నామంటే అక్కడ మన ప్రభుత్వం, మన రాజ్యాంగం, మన సార్వభౌమాధికారం, మన శాసనం, మన చట్టం పని చేయవు. మన పాలన వుండదు. ఇలా మనదేశంలోనే అనేక స్వతంత్ర రాజ్యాలు అవతరిస్తున్నాయి. ఇప్పటికే ఇలాంటి 450 కొత్త రాజ్యాలకు అనుమతి లభించింది. అందులో సగానికిపైగా ఆవిర్భవించాయి. లక్షలాది ఎకరాల భూమి, లక్షల కోట్ల రూపాయల విలువ చేసే రాబడి, కోటాను కోట్ల వనరులు, సహజ సంపద ఈ ప్రైవేట్ వ్యక్తులు, విదేశీ శక్తులకు ప్రభుత్వమే పంచిపెట్టింది. ప్రజలను భూమి నుంచి, పని నుంచి జీవనాధారం నుంచి తరిమేసి కంచెలు కట్టి మరీ నూతన సంస్థానాలను ఆవిష్కరిస్తోంది. ఇట్లా 'కనీసం' 500 సెజ్‌లు ఏర్పాటు చేసి లక్షన్నర ఎకరాలను విదేశీ పెట్టుబడికి ప్రత్యక్షంగా తాకట్టు పెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అంటే 'ఈస్టిండియా కంపెనీ' లాంటివి ఐదు వందల కంపెనీలు ఇప్పుడు దేశంలో ఏర్పాటవుతున్నాయి. ఒక్క కంపెనీ సృష్టించిన సామ్రాజ్యవాద విధ్వంసాన్ని రెండు వందల ఏళ్లు అనుభవించి ఇప్పటికే కోలుకోలేని మనకు ఈ కంపెనీలతో తరతరాలకూ సరిపడా దాస్యం రాబోతుంది. సెజ్‌ల పేరుతో ఏర్పాటవుతున్న ఈ ఎస్టేట్ల పట్ల కేవలం భూమి వనరులే కాదు. అనూహ్యమైన రీతిలో ఆర్థిక నష్టం రాబోతోందన్న హెచ్చరికలు ప్రభుత్వం లోపలి నుంచే వస్తున్నా అవి పాలకుల చెవికి సోకడం లేదు.

సెజ్ నిబంధనల ప్రకారం ఈ కంపెనీలు పదేళ్ళపాటు అందిన మేరకు దోపిడీకి పాల్పడే అవకాశం ఏర్పడింది. పన్నులు, సుంకాలు, డ్యూటీలు లేకుండా ఇక్కడి వనరులను వస్తువులుగా మార్చి విదేశీ విపణికి తరలించుకొని అమ్ముకోవచ్చు. చట్టాలు, శాసనాలు, నీతినియమాల ప్రమేయం లేకుండా మానవ వనరులు శ్రమశక్తిని దోచేసుకుని సొమ్ము చేసుకోవచ్చు. సెజ్‌లకు కస్టమ్స్ డ్యూటీల నుంచి, ఇన్‌కంటాక్స్ నుంచి, సర్వీసు టాక్స్ నుంచి, సేల్స్ టాక్స్ నుంచి మినహాయింపు వుంటుంది. వర్తక వాణిజ్యానికి వర్తించే అన్ని రకాల పన్నుల నుంచి, చట్టాల నుంచి మినహాయింపు వుంటుంది. వనరుల నుంచి, ఉత్పత్తి నుంచి, వర్తక వాణిజ్యాల నుంచి కంపెనీలు వందల వేల కోట్లు గడిస్తాయి. ఈ సంపదకై ఎలాంటి పన్నులుండవు. దీని వల్ల (కేవలం పన్నుల మినహాయింపు వల్ల) ప్రభుత్వానికి 2010 నాటికే దేశానికి కనీసం 1,60,000 కోట్ల రూపాయల నష్టం వాటిల్లబోతుందని ఆర్థిక శాఖ అంచనా ! సామాన్య ప్రజల కనీస అవసరాలైన కిరోసిన్, డీజిల్, పెట్రోల్, గ్యాస్‌లపై వందల కోట్ల రూపాయలు పన్నులు వేసి వసూలు చేస్తోన్న ప్రభుత్వం ఈ పెట్టుబడిదార్ల కోసం మాత్రం లక్షల కోట్లు వదులుకొంటుంది. నిజానికి ఈ పన్నులు వసూలు చేస్తే కనీసం పదేళ్ళపాటు అంతర్జాతీయ రేట్లతో సంబంధం లేకుండా దేశంలో ప్రజలందరికీ నిత్యావసర వస్తువులు సగం ధరకే ఇవ్వవచ్చు. దేశంలోని ఆరు కోట్ల మంది నిరుపేదలకు కనీసం 5 సంవత్సరాల పాటు ఉపాధి కల్పించవచ్చు.

ప్రభుత్వం మాత్రం ఇదంతా ప్రజలకోసమేనంటోంది. కొత్తగా కనీసం 30 లక్షల ఉద్యోగాలు వస్తాయంటోంది. దీనికోసం ఏటా పదిలక్షల టన్నుల తిండిగింజలు పండించే నాలుగులక్షల 50 వేల ఎకరాల భూమిని ధారాదత్తం చేస్తోంది. దీనివల్ల కనీసం లక్ష పదిహేను వేల కుటుంబాలు, ఆరులక్షల మంది ప్రజలు భూమికి, యాజమాన్యానికి దూరమై కూలీలుగా మారిపోతారు. ఈ భూముల్లో పనిచేస్తోన్న లక్ష కుటుంబాల కూలీలు (కనీసం ఐదు లక్షల మంది) పనికోల్పోతారు. భూమిని, భూమితో ముడిపడిన బతుకుని శాశ్వతంగా కోల్పోయి కనీసం పదిలక్షల మంది కాందిశీకులై పోతారు. భూమినీ భుక్తినీ కోల్పోయిన రైతులు, కూలీలు వలస పక్షులైపోతారు. ఈ నిర్వాసిత గ్రామీణులు కనీసం ఏటా 212 కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతారని ఇప్పటికే ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. ఇది కేవలం భూమి మీద ఆధారపడి అంటే ప్రత్యక్షంగా భూమిదున్ని పంటలు పండించే రైతులు - కూలీలకు కలిగే నష్టం. దీనిని మించి భూమి చుట్టూ అల్లుకుపోయి వ్యవసాయాన్ని నిలబెడుతోన్న పనిముట్లు, పరికరాలు తయారుచేసే వృత్తులు, చేతిపనులు, చాలా పనులు అన్నీ మూలన పడతాయి. భూమి లేని గ్రామాలు, రైతులేని పల్లెలు, పనులులేని పొలాలు, తిండిలేని జనాలు పూరు వల్లకాడు అయిపోతుంది.

ఇదంతా అభివృద్ధే కదా ! అనే వాళ్ళూ ఉన్నారు. వ్యవసాయంలో ఏముంది? అని అడిగే వాళ్ళు ఉన్నారు. భూముల ధరల పెరుగుదలతో పరవశులైపోతున్న వాళ్ళూ, పరిహారం కోసం పరుగులెత్తుతున్న వాళ్ళూ ఉన్నరు. వాళ్ళంతా పెద్ద రైతులు, భూస్వాములు, యాజమాన్యం రీత్యా 80 శాతం భూమి ఈ పది పదిహేను శాతం మంది చేతుల్లోనే వుంది. మిగిలిన 85 శాతం మంది దుక్కి దున్ని, భూమి బుక్కి, కొలుములు మదించి పొలాలు పండిస్తున్న వాళ్ళే. వాళ్ళకు సొంత భూమి లేదు. దొరల, భూస్వాముల పొలాల్లో పని చేసే ఈ పేదరైతులకు ఎలాంటి హక్కుల్లేవు. కాబట్టి పరిహారం రాదు. పైగా ఉన్న ఉపాధి ఊడిగి పోతున్నది. తరతరాలుగా, తాతల నుంచీ వస్తోన్న జీవిక ఆగిపోతున్న చేతివిద్య చేష్టలుడిగి పోతున్నది. వందల వేల సంవత్సరాలుగా నేర్చుకున్న విజ్ఞానం, వివేచన, సంస్కృతి, పద్ధతులు, వారసత్వం అవి నేర్పిన పనులు, సృష్టించిన పరికరాలు, వస్తు సంపద ఇలా పేదలు, దళితులు, వృత్తికారులు, వ్యవసాయ అనుబంధ కులాలు వాళ్ళ పనులు, వృత్తి నైపుణ్యం పనికిరానిదిగా తయారవుతోంది. ఇట్లా సెజ్‌లు ప్రజల సామాజిక, ఆర్థిక సాంస్కృతిక జీవనాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయి. ఉమ్మడి జీవనానికి వేదికలైన గ్రామసీమల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి.

సెజ్‌ల మూలంగా వేలాది గ్రామాల్లో ఈ విధ్వంసం ఇవాళ నిర్విఘ్నంగా సాగిపోతున్నది. భూములతో పాటు చెట్లు, గుట్టలు, చెరువులు, కుంటలు, వాగులు, వంకలు అన్నిటి చుట్టూ కంచెలు మొలుస్తున్నాయి. గాజులు వెలుస్తున్నాయి. పనిపాటలు లేని ఇంట్లో స్మశానంలోని సమాధుల్లా కళావిహీనమై

పోతున్నాయి. చెట్ల మీది పండ్లు ఫలాలు అమ్ముకునే బోయ, తెనుగు కులాలు, గుట్టలు చెలకల్లో గొడ్లు, గొర్రెలు మేపుకుని బతికే గొల్ల, కురుమ కులాలు చెరువుల్లో, కుంటల్లో చేపలు పట్టుకునే బెస్త పల్లెకార్లు, కర్షకులు, నేత పనివాళ్లు పల్లె పల్లెంతా పరాయిదైపోయిన వైనానికి మౌన ప్రేక్షకులై మిగిలిపోతున్నారు. ఇక మాల మాదిగల సంగతి చెప్పలేం. వ్యవసాయరంగ పరిణామంలో ఒక పనిముట్టుగా మారిపోయి, ప్రతిపనిలో ఇమిడిపోయి, ఆ భూమిలోనే ఇంకిపోయిన మాల మాదిగల బతుకు చిత్రాన్ని 'సెజ్‌లు' శాశ్వతంగా చెరిపేస్తున్నాయి. నిన్నటిదాకా ఈ కులాల చెమట చుక్కల వానలో తడిసి పులకించిన పుడమితల్లి ఇప్పుడు చెరబడ్డ సీతమ్మగా మారిపోయింది. ఇప్పుడు ఆ కంచెకు కాపలా కాసే 'సెక్యూరిటీ గార్డులు' గానో మూటలు మోసే హమాలీలాగానో పోగా మిగిలిన వాళ్ళు ఇప్పుడు వలస పక్షులై పట్టణాలకు పయనమవుతున్నారు.

మనకు పునరావాస విధానం లేదు. ప్రభుత్వాలు పరిహారం పేరుతో భూములు కోల్పోయిన వాళ్ళకు, యాజమానులకు ఎంతో కొంత నిధిలిస్తున్నాయి. కానీ తరతరాలుగా ఆ భూమినే నమ్ముకున్న వాళ్లకు, ఆ భూమిని తమ రెక్కల కష్టంతో ఒక విలువైన సంపదగా మలిచిన వాళ్ళకు, తమ శ్రమశక్తితో, వృత్తి నైపుణ్యతలో పల్లెలను ఇంత కాలం పసిడి సీమలుగా మలిచిన వాళ్ళకు ఏ పరిహారమూ లేదు. కనీసం చావు ఖర్చులైనా ఇచ్చే పరిస్థితి లేదు. పరిహారం కింద ఉద్యోగాలిస్తామని చెప్పడం పరిహాసంగా మారిపోయింది.

ఇట్లా గ్రామాలను ఖాళీ చేసి లూటీ చేస్తోన్న సెజ్‌లకు ప్రజలతో సంబంధం లేదు. వూరితో సంబంధం లేదు. సెజ్‌లకు, సెజ్‌ల ఉత్పత్తిని దేశ అవసరాలతో, డిమాండ్లతో సంబంధం లేదు. ఇవి నూటికి నూరు పాళ్ల ఆధునిక ప్రపంచపు అవసరాల కోసం, ప్రపంచ మార్కెట్లోకి ఎగుమతి కోసం, విదేశీ మారకద్రవ్యం కోసం ఉద్దేశించినవే. ఈ సెజ్‌లు ఏ రకంగా కూడా ప్రజలను ఉత్పత్తిలో భాగస్వాములను చేసి ఉపాధి కల్పించేవి కాదు. ముప్పయి లక్షల ఉద్యోగాల ఆశచూపినా ఇప్పటి వరకు కనీసం లక్ష ఉద్యోగాలైనా భర్తీ కాలేదు. అందులో స్థానిక ప్రజలకు ఎంత మాత్రం అవకాశాలు లేవు. ఎందుకంటే అలాంటి ఆధునిక పరిశ్రమల్లో పనిచేసే పరిజ్ఞానం, చదువు సాంకేతిక నైపుణ్యం వారికి లేవు. మన దేశంలో ఇప్పటి దాకా వస్తోన్న సెజ్‌లలో ఏది కూడా మానవ వనరులపై ఆధారపడింది కాదు. ఇవన్నీ సాంకేతికత, ఆప్టిక్ ఫైబర్ లైన్ల మీద ఆధారపడి పనిచేసేవి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో నడిచేవి. ఏ మాత్రం కర్షకులతో, కూలీలతో, శ్రమతో, చెమటతో మొత్తంగా ప్రజలతో ఎంతమాత్రమూ సంబంధం లేనివి. ఇప్పటి వరకు ఆమోదం పొందిన సెజ్‌లలో నూటికి 70 శాతం ఇలాంటివే. ప్రజలతో సంబంధం లేక, శ్రమశక్తి ప్రమేయం లేక దేశ అవసరాలతో నిమిత్తం లేక ఒకటి రెండు వేల మందికి పరిమితమై పనిచేసే సెజ్‌లకు వేల వేల ఎకరాల భూములెందుకు అన్నది ఇక్కడ ప్రధానమైన ప్రశ్న. 'సెజ్‌ల' పేరుతో పరిశ్రమల పేరుతో, ఐటి పేరుతో, అభివృద్ధి పేరుతో ఇప్పుడు సాగుతున్నదంతా భూమి భాగోతమే!

'సెజ్' చట్టం ప్రకారం కంపెనీలు తమకు కేటాయించిన భూమిలో 75 శాతం ఇతర (ఉత్పత్తితో) సంబంధంలేని అవసరాల కోసం వాడుకోవచ్చు. చట్టంలోని 5(2) వ క్లాజు అందుకు ఆయా పరిశ్రమలకు స్వేచ్ఛనిచ్చింది. ఇది కంపెనీలకు ప్రధానమైన ఆకర్షణగా మారిపోయింది. సెజ్‌పేరుతో భూములు సేకరించి, వూర్లు ఖాళీ చేయించి కొత్త సామ్రాజ్యాలను ఏర్పాటు చేసుకొంటున్న వాళ్ళు ఆ భూముల్లో పారిశ్రామిక ఉత్పత్తులు ప్రారంభించడం అటుంచి ప్రధానంగా దృష్టి అంతా రియల్ ఎస్టేట్ వ్యాపారం పైనే కేంద్రీకరిస్తున్నారు. విలాసమైంతమైన విల్లాలు నిర్మించి కోట్లాది రూపాయలకు అమ్ముకుంటున్నారు. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల పేరుతో తమ స్వతంత్ర నగరాలను నిర్మించుకుంటున్నారు. నిజానికి ఇప్పటి దాకా సెజ్‌లకు అనుమతి పొందిన కంపెనీలన్నీ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నవే! దేశంలోని ప్రధాన నగరాలకు దగ్గర్లోవున్న విలువైన భూములను కాజేయడం కోసం రియల్ ఎస్టేట్ కంపెనీలే స్వయంగా సెజ్‌ల నిర్మాణానికి పూనుకోవడం ఈ భూమండలీకరణకు పరాకాష్టగా చెప్పుకోవచ్చు. అడిగిన చోటల్లా వందలు, వేలు ఎకరాల భూములను ప్రభుత్వమే స్వయంగా సేకరించి ఈ కంపెనీలకు కట్టబెట్టి దళారీగిరీ చేయడం ఇప్పుడు మనం చూస్తున్నాం. ఈ దళారీగిరీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అగ్రభాగంలో వుంది. ఇప్పటికే అనుమతిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వారి కోసం 50 వేల ఎకరాలు సేకరించే పనిలో వుంది. చిత్తూరు, నెల్లూరు, కాకినాడ, విశాఖ, మహబూబ్‌నగర్ జిల్లాలో సగభాగం ఇప్పుడు ఈ సెజ్‌ల పడగనీడలో బిక్కు బిక్కుమంటున్నాయి. వేలాది ఎకరాల్లో వ్యవసాయం ఇప్పటికే కుప్పకూలి పోయింది. ఎక్కడికక్కడ పల్లెలు, పంట పొలాలు ధ్వంసమైపోయి కొత్త పారిశ్రామిక వాడలు వెలుస్తున్నాయి. ఇక హైదరాబాద్ సంగతి చెప్పనలవి కాదు. నిజాం 'పీడ' విరగడయిందనుకున్న వాళ్లకు అరవై ఏళ్ళు తిరక్క ముందే నయా నవాబులు అవతరించడం ఆందోళన కలిగించే విషయం. 'సర్ఫ్ ల ఖాస్' పేరుతో లక్షలాది ఎకరాల తన కబ్జాలో ఉంచుకున్న పాతనిజాములకు ఎంతో కొంత పేదప్రజలకు పంచే గుణం ఉండేది. కానీ ఈ నయానవాబులు మాత్రం నగరం చుట్టు పక్కల ఉన్న లక్షలాది ఎకరాలు మరెవరికీ దక్కనీయడం లేదు. నగరంలోని భూములు సరిపోక నగరం పరిధిలో అనూహ్యంగా విస్తరించి, భువనగిరి నుంచి జడ్చర్ల దాకా నగరాన్ని పెంచి మొత్తం హైదరాబాద్ నగరాన్నే ఇప్పుడొక మహాసెజ్‌గా మార్చేసిన వైనం చూస్తే దీని వెనుక భూమి కోసం సాగిన కుట్రలు - కుతంత్రాలు స్పష్టంగా అర్థమవుతాయి. తెలుగుదేశం పోయి కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే స్వర్ణాంధ్ర స్థానంలో హరితాంధ్ర వచ్చినట్టుగానే ప్రచారం జరిగింది. రైతువేషంతో ప్రజాప్రస్థానాలు చేసి, భూములు పంచుతాం, ప్రాజెక్టులు కడతాం అంటే జనం తమ కోసమే అనుకున్నారు. కానీ భూములు పంచడం 'తమ వాళ్ళ' కని, ప్రాజెక్టులు కమీషన్లకు, కాంట్రాక్టర్లకని అర్థం కావడానికి నాలుగేళ్ల కాలం పట్టింది. ఇదంతా పకడ్బందీగా జరిగిపోయింది. పథకం ప్రకారం సాగింది. ఈ తతంగానికి అడ్డుపడే అవకాశం ఉంటుందని వూహించి, శాంతి చర్చలతో వూరించి నక్సలైట్లను ఏరివేసే ప్రయత్నంతోనే ఇది మొదలయ్యింది.

నక్సలైట్లతో చర్చలు అంటే కొంతయినా ప్రజాస్వామ్య వాతావరణం ఉంటుందని, ప్రజలకు అణచివేత నుంచి, నిర్బంధం నుంచి నిలబడే స్వేచ్ఛ దొరుకుతుందనీ ఆశించాం. అలా అనుకునే చర్చలను స్వాగతించాం. చారిత్రక అవసరాన్ని గుర్తించిన పార్టీలు చర్చల్లో భాగస్వాములై ప్రజల మౌలిక సమస్యలు ముందుకు తెచ్చాయి. ప్రజలకు అత్యంత అవసరమైంది, మౌలికమైంది, ముఖ్యమైంది, అన్ని సమస్యలకు, పరిష్కారానికీ మూలమైందీ భూమి. అదే ఎజెండా అయ్యింది. ఎప్పుడైతే భూమి చర్చల వేదిక మీదికి వచ్చిందో ఆ క్షణమే ప్రభుత్వం చర్చలు రద్దుచేసింది. "భూమి గురించి వాళ్లకేం తెలుసు"! అన్న వెకిలి ప్రశ్నవేసి, చర్చలను నీరుగార్చి ప్రభుత్వం ఉద్యమాలపై ఉక్కుపాదం మోపింది. చర్చల సందర్భంగా నక్సలైట్లు భూమిని పేదలకు పంచాలన్న ప్రధాన డిమాండ్‌ను ప్రభుత్వం ముందుపెట్టారు. నగరం చుట్టు వేలాది ఎకరాల భూమిని కబ్జాచేసి వుంచుకున్న 43 కంపెనీల చిట్టా విప్పారు. ఆ భూముల్ని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలన్నారు. సమస్య అక్కడే మొదలయ్యింది. చర్చలు అక్కడితో ఆగిపోయాయి.

ఇప్పుడు ఆ 43 కంపెనీల్లో దాదాపు సగం ప్రత్యేక ఆర్థిక మండలాలుగా మారిపోయాయి. బోర్డులు మార్చివేసాయి. సరిహద్దులు విస్తరించుకుని భూమి చుట్టు పెద్ద పెద్ద ప్రహరీగోడలు కట్టుకుని తమ సామ్రాజ్యాలను పటిష్టపరుచుకున్నాయి. ఇప్పుడవి సంపూర్ణ స్వతంత్ర సంస్థానాలుగా మారిపోయాయి. నగరం చుట్టూ వున్న కొండలు అదృశ్యమై అంతకంటే ఎత్తయిన ఆకాశహర్మ్యాలు, హిల్‌కౌంటీలు, లాంకోహిల్స్, మెటాస్ హిల్స్, ఇందూ హిల్స్‌గా రూపాంతరం చెందాయి. వాటన్నింటినీ అనుసంధానం చేస్తూ 162 కిలోమీటర్ల మేర ఔటర్ రింగ్ రోడ్డు దానికి రెండు వైపులా వేలాది ఎకరాల భూములు ఆస్తులుగా మారిపోయాయి.

ఔటర్ రింగ్ రోడ్డుకు రెండువైపులా భూములన్నీ రైతుల చేతుల్లోంచి రాబందుల చేతికి చేరాయి. రంగారెడ్డి, నల్లగొండ, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలు కూడా ఆంధ్రా, రాయలసీమ భూస్వాముల ఖాతాలో చేరిపోయాయి. ఈ మొత్తం భూములను కలుపుతూ 'గ్రేటర్ హైదరాబాద్' పేరుతో ప్రత్యేక భూమండలం ఈ నేలమీద అవతరించింది. 2179 చదరపు కిలోమీటర్ల పాత వైశాల్యం స్థానంలో ఇప్పుడు మహానగరం 6852 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ఐదు తెలంగాణా జిల్లాల్లోని 54 మండలాలను, 23 అసెంబ్లీ నియోజక వర్గాలను, 3 పార్లమెంటు స్థానాలను కలుపుతూ ఏర్పడ్డ మెట్రో ఇప్పుడు తెలంగాణా నడిబొడ్డున ఒక వలస రాజ్యంగా వెలిగిపోతుంది. హైదరాబాద్ నగర పితామహుడు కులీకుతుబ్‌షా ఈ నగరానికి పునాది వేస్తూ ప్రజలు కూడా చెరువులోని చేపల్లా బతకాలని భగవంతుని ప్రార్థించాడట. ఇప్పుడు ఈ నగరంలో చెరువులు లేకుండా పోయాయి. చెలమలు లేకుండా పోయాయి. నగర ప్రజలు గట్టున పడ్డ చేపల్లా కొట్టుకుంటున్నారు. నగరం మీద జల్సాగా ఎగురుతున్న రాబందుల రెక్కల నీడలో బిక్కు బిక్కుమంటున్నారు.

ఇదే పరిస్థితి నెల్లూరులో సూళ్ళూరుపేట, తడ, చిత్తూరులో వరదయ్యపాలెం, మహబూబ్ నగర్లో జడ్చర్ల, కాకినాడ, విశాఖ పట్టణాలు మొదలగు సెజ్‌లు చుట్టు ముట్టిన పల్లెలన్నిటిలోనూ వుంది.

రాజ్యాంగం చిత్తుకాగితం !

భారత రాజ్యాంగం ప్రజల పాలిటి మాగ్నాకార్టా. ప్రజలకు కావలసిన అన్ని రకాల రక్షణలూ ఈ పవిత్ర గ్రంథంలో ఉన్నాయి. దేశంలో ఉన్న అసమానతలు, ఆర్థిక, సామాజిక అంతరాలు, ప్రజాస్వామ్యంలో ఉన్న లొసుగులు, లోపాలను గమనించిన రాజ్యాంగకర్తలు రాజ్యాంగంలోని వివిధ అధికరణల్లో పేదలకోసం అనేక ఆయుధాలు భద్ర పరిచారు. కానీ ప్రభుత్వం పాలకులు తమ అవసరాల కోసం దాన్ని రోజు రోజుకు నిర్వీర్యం చేస్తూ వస్తున్నారు. 'సెజ్' చట్టంలోని అనేక క్లాజులు రాజ్యాంగాన్ని, అందులో పొందుపరిచిన అనేక హక్కులను అపహాస్యం చేసేవిగా ఉన్నాయి. కేవలం రాజ్యాంగాన్నే కాదు. ప్రజలు పోరాడి సాధించుకున్న అనేక హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయి. కంపెనీ కూలీలు, కార్మికులు ప్రపంచవ్యాప్తంగా ప్రాణాలొడ్డి రూపొందించుకున్న చట్టాలు, శాసనాలను చెత్తబుట్టకు పరిమితం చేసేవిగా ఉన్నాయి.

మౌలికంగా సెజ్ చట్టం, దాన్ని వాడుతున్న తీరు ప్రజల జీవించే హక్కులు హరించి వేస్తున్నది. వాళ్లను తమ వృత్తి నుంచి, పనినుంచి, శ్రమ నుంచి, సంపద నుంచి, సమాజం నుంచి సమస్త జీవనావకాశాల నుంచి దూరం చేసేదిగా వుంది. ఇది రాజ్యాంగం ఇచ్చిన ప్రజల ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా వుంది. పారిశ్రామిక కార్మికులకు రక్షణ కవచాల్లాంటి ఎన్నో చట్టాలను సెజ్‌లు నిరర్థకం చేస్తున్నాయి. పారిశ్రామిక వివాదాల చట్టం, కాంట్రాక్టు కార్మికుల చట్టం, ఫ్యాక్టరీల చట్టం, కనీస వేతనాల చట్టం, ట్రేడ్ యూనియన్ చట్టం 'సెజ్' ల్లో పని చేయవు. ఎన్ని గంటలు పనిచేయాలి, ఎంతజీతం ఇవ్వాలి, ఎలాంటి వసతులుండాలి, ఎన్ని సెలవులుండాలి, ఎటువంటి భద్రత వుండాలి, కార్మికులను ఎలా కాపాడాలి, ఎప్పుడు రిటైర్‌మెంట్ వుండాలి, ఎంత పెన్షన్ వుండాలి ఇలా ఎన్నో పారిశ్రామిక కార్మికుల సమస్యలను ఈ చట్టాలు పరిష్కరిస్తూ వస్తున్నాయి. వాటిని అమలు చేసుకునే ఆవకాశం ట్రేడ్ యూనియన్ వల్ల వస్తున్నది. ఇవేవీ 'సెజ్' లలో పనికి రావు. ఏ ఉల్లంఘనకూ ఫిర్యాదు ఉండదు. పోలీసులు, ప్రభుత్వం సెజ్ అంతరంగిక విషయాల్లో, వివాదాల్లో వేలుపెట్టే అవకాశం లేదు. చివరికి కోర్టులు కూడా ప్రత్యక్షంగా జోక్యం చేసుకునే వీలు లేదు.

ఇకపోతే దళితులు, ఆదివాసీలు, గ్రామీణులు అక్కడి ప్రకృతి సంపద, సహజ వనరులు వాటి రక్షణ కోసం రాజ్యాంగం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు గతంలో అనేక చట్టాలు వచ్చాయి. పర్యావరణ పరిరక్షణ మొదలుకుని రిజర్వేషన్ల దాకా అనేక విధానాలు వాటి ఆధారంగా రూపొందాయి. స్థానిక సంస్థలు ఈ వనరుల మీద, వాటి నిర్వహణ మీద సంపూర్ణ అధికారం కలిగి వుండాలని రాజ్యాంగబద్ధమైన పంచాయితీ రాజ్ చట్టం నిర్దేశిస్తోంది. ఇవేవీ 'సెజ్' లకు వర్తించవు. వర్తించే వీలులేదని చట్టం స్పష్టంగా పేర్కొంది. ఒక రకంగా సెజ్‌లు ఎలాంటి జవాబుదారీతనం లేని, ఎలాంటి అడ్డూ అదుపు లేని, ఎలాంటి నిబద్ధత, నియంత్రణా లేని సర్వసత్తాక సామ్రాజ్యాలన్న మాట. ఈ సామ్రాజ్యాధిపదుల్లోంచే ఐదుగురు ప్రపంచ కోటీశ్వరులుగా ఎదిగిపోయారు. ఇటీవల ఫోర్డ్ బిలియనేర్లల్లో ముందు వరుసలో నిలిచిపోయారు. మరోవైపు రైతులు, కూలీలు, భూములు కోల్పోయిన బీదాబిక్కీ జనం ఎదిరించి ఎలా నిలబడాలో, ఎవరిపై పోరాటం చేయాలో తెలియక నినదించి, నినదించి నీరసించి పోతున్నారు. శక్తి కూడగట్టుకుని ముందుకురికిన వాళ్ళు నందీగ్రాం నుంచి ముదిగొండ దాకా నెత్తిరోడి మట్టిలో కలసి పోతూనే వున్నారు. కమ్యూనిస్టుల నుంచి కాషాయం వాళ్ళ దాకా జెండాలు వేరయినా అందరికీ ఎజెండా ఇప్పుడు భూమి. ఆ భూమి పేదలకు దక్కకుండా పెత్తందార్లకు ఎలా దఖలు చేయాలా అన్నదే వాళ్ళ ప్రయత్నమంతా. సెజ్ చట్టం ఈ అందరి సంకరశిశువు. బిజెపి (ఎన్‌డిఏ) రూపొందించిన విధానాన్ని కాంగ్రెస్ బిల్లుగా మారిస్తే యుపిఏలోని వామపక్షాలు దాన్ని ఏకగ్రీవంగా శాసనం చేశాయి. అది ఇప్పుడు ప్రజల పాలిట, పల్లెల పాలిట మరణ శాసనంగా మారిపోయింది. అది పాలకులకు తిరుగులేని ఆయుధమైపోయింది. కుల సంఘాలూ జనాన్ని ఓటు బ్యాంకులుగా మార్చివేసాయి. వాళ్ళ అవసరాలకు అరిచి గోల చేసే అల్లరి మూకలుగా తయారుచేశాయి. తమల్ని కలిపి ఉంచకపోతే కాల్చుకు చస్తానని ఒకరు తుపాకీ తీస్తే, విడదీయక పోతే ఎన్నికల్లో ఓడగొడతామని ఇంకోకరు ఎవరి ఆయుధాలు వాళ్ళు సవరించుకుని ప్రభుత్వం దగ్గర తమ తమ పలుకుబడి పెంచుకుంటున్నారు తప్ప దళితులకు, బడుగులకు ఒక్క అడుగు భూమి కావాలని అడిగిన వాడు లేడు.

గుండ్రంగా ఉందనుకున్న భూమిని ఎవడికి అందినంత వాడు నిట్ట నిలువునా చీల్చి, బల్ల పరుపుగా మార్చి, చాపచుట్టులా చుట్టి చంకన బెట్టుకుని వెళ్తోంటే మనందరం మౌన ప్రేక్షకులుగా మారిపోతున్నాం. రేపటి విధ్వంసానికి మనందరం మూగసాక్షులమై మిగిలిపోతున్నాం. పేదల గుండెల్లో, గూడెల్లో ఆరిపోయిన కొలిమిని మళ్ళీ అంటుబెట్టేందుకు మా వూరి నర్సింహుడు మళ్ళీ వస్తే బాగుండు !! *

రచయితలకు విజ్ఞప్తి

అరుణతారకు రచనలు పంపండి.

కథలు, కవిత్వం, పుస్తక సమీక్షలు, విమర్శా వ్యాసాలు, సామాజిక రాజకీయ సిద్ధాంత వ్యాసాలు, యితర భాషల్లోనుండి తెలుగు పాఠకులకు అవసరమైన అనువాదాలు పంపించండి.

అరుణతారలో అచ్చువుతున్న రచనలపై ఉత్తరాలు రాయండి. రచనలను మెచ్చుకునే ఉత్తరాలకంటే గుణదోషచర్చ చేయగల ఉత్తరాలు పత్రిక ప్రమాణాలు పెంచుతాయి. పాఠకుల విమర్శనాత్మక ఉత్తరాలు పత్రికా నిర్వహణకూ తోడ్పడతాయి.

మీ రచనలు అరుణతార సాహిత్య, సిద్ధాంత స్థాయిని పెంచుతాయని నమ్ముతూ -

- సంపాదకవర్గం

వ్యాసం

❖ జి.ఎన్. సాయిబాబ

సామ్రాజ్యవాదమే సెజ్‌ల రాజకీయ ఆర్థిక శాస్త్రం

ఉపోద్ఘాతం

భూమి, అభివృద్ధి, నిర్వాసీకరణ మరొక్కసారి ఇండియాలో చర్చనీయాంశ మయ్యాయి. విశేషమేమంటే పెట్టుబడిదారీ విధానంలో పారిశ్రామికాభివృద్ధిపై చర్చ. ప్రధానమంత్రి మన్‌మోహన్ సింగ్‌కు, ఆయన పాలసీ నిపుణులకు ఇండియాలాంటి దేశం 21వ శతాబ్దంలోకి పురోగమించాలంటే భూమి, వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన పునాదిగా వుండజాలవని హఠాత్తుగా జ్ఞానోదయమైంది. తరచుగా ప్రౌఢంగా, నెమ్మదిగా మాట్లాడే ప్రధానమంత్రి తమ ప్రభుత్వం దేశాన్ని విజయవంతంగా నడిపిస్తున్న మార్గదర్శనాన్ని వ్యతిరేకించేవారు అభివృద్ధికి వ్యతిరేకులు కాబట్టి జాతి వ్యతిరేకులు అనేంతదాకా వెళ్ళారు. ప్రపంచ బ్యాంకు, ఐ.ఎం.ఎఫ్ ఆదేశాల ప్రకారం రూపొందించిన వృద్ధి నమూనాను 'జాతీయ ప్రయోజన' నమూనాతో సమానం చేశారు. ఎల్.పి.జి. గా అందరికీ తెలిసిన సరళీకరణ, ప్రయివేటీకరణ, అంతర్జాతీయీకరణ విధానాలు, 'రెండవ తరపు సంస్కరణలు'గా చెప్పబడేవాటి భవిష్యత్తు పట్ల ముగ్ధులయ్యే మన్‌మోహన్ సింగ్ ఒంటరి వాడేం కాదు.

భారత ఆర్థిక వ్యవస్థ నిర్వహణను గ్రేడ్ చేయటానికి సదా సిద్ధంగా వుండే డా॥ అమర్త్యసేన్ లాంటి వాళ్ళు ఆయనతో గొంతు కలిపారు. టెలిగ్రాఫ్ పత్రికకు ఇచ్చిన తన ఇంటర్వ్యూ ఒకదానిలో తలవంపులు తెచ్చిన నందిగ్రామ్, సింగూరు ఘటనల నుండి సి.పి.ఎం. పాలిత పశ్చిమ బెంగాల్‌ను బయటపడవేసే ప్రయత్నంలో ఈ నోబుల్ బహుమతి గ్రహీత ఉపఖండంలో ప్రత్యేక ఆర్థిక మండలాల ద్వారా అమలు జరిగే పారిశ్రామికీకరణ ఇండియాకు అత్యంత అవసరమైందని బిగ్గరగా స్పష్టం చేశారు. దాంట్లో తప్పేంలేదు. ఈ అభివృద్ధి ప్యాకేజీ తప్పని సరిగా సారవంతమైన భూమిని వాడుకోవటం ద్వారా అమలు చేసేదిగా మాత్రమే వుంటుంది. మరోరకంగా ఉండదు. ప్రధానంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా 9 శాతం వృద్ధి లక్ష్యంగా కొనసాగుతున్న ఇండియా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అవసరాలను వ్యవసాయం మాత్రమే తీర్చగలిగే రోజులు గతించాయని సేన్ భావన. ఏకాభిప్రాయం సాధించటానికి సేన్ లాంటి వాళ్ళు ఉపయోగించే కళ మాత్రమే, తప్ప మరేమీ కాదు. ఒక సంఘటనగా చూస్తే, సింగూరు ప్రజలు తమ అభీష్టానికి వ్యతిరేకంగా భూమిని లాగుకోవటానికి వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న సమయం. దీనికి సంబంధించి 1947 తదనంతర ఇండియాలో పారిశ్రామిక ఆగమన సూచకంగా టాటాల గొప్పదనాన్ని ప్రజలకు 'ఎడ్యుకేట్' చేయటానికి, రతన్‌టాటా నిలువెత్తు చిత్రాన్ని, ఎర్రజెండాను పట్టుకొని సి.పి.ఎం. కార్యకర్తల మోటార్‌సైకిల్ గుంపులు ప్రయత్నించుతున్నప్పుడు ఇదంతా జరిగింది. నోబెల్ బహుమతి గ్రహీత, సి.పి.ఎం. లంపెన్ బ్రిగేడ్‌లు ఒకే పడవలో పయనిస్తూ, భిన్న పద్ధతుల్లో ఒకే సందేశాన్నిస్తున్నారు.

ఇదిప్పుడు అధికారికమే. గ్రామీణ ప్రాంతాల అసంఖ్యాక జన సందోహానికి వ్యవసాయం ప్రధాన ఉపాధిని అందించజాలదు. వాస్తవానికి ఎన్.ఎస్.ఎస్.ఒ. నిరపాయకర సర్వే రూపంలో మొదటి అధికార పూర్వక వార్నింగ్ ఇచ్చింది. దీన్ని ప్రభుత్వం ఆలాపిస్తున్నది. మీడియా ప్రచారం గురించి చెప్పాల్సిన పనిలేదు. అదేమిటంటే ఇండియాలో 40 శాతం రైతాంగం వ్యవసాయం వదిలివేయాలని కోరుకొంటున్నారనే ప్రచారం.

ఈ ప్రచార మెరుపుదాడిలో ఎల్.పి.జి. ప్రతిపాదకులు అతి జాగ్రత్తగా అభివృద్ధికి సంబంధించిన ప్రశ్ననే పట్టించుకోలేదు. విదేశీ పెట్టుబడి / సామ్రాజ్య వాదంపై ఆధారపడిన అభివృద్ధి నమూనా యొక్క శాఖోపశాఖలుగానున్న అంశాల ప్రశ్నను స్పష్టంగా ముందు పెట్టలేదు. దీనిలో దేశ విశాల ప్రజాశ్రేణుల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు.

అభివృద్ధిలో నిర్వాసీకరణ తప్పదనేదే వాదన. మిగతా వాదనలన్నీ ఈ ఆరంభంతో వాటివి తార్కిక పర్యవసానాలే. అసంఖ్యాక ప్రజానీకానికి రైతు వ్యవసాయం ద్వారా ఇంకే మాత్రం ఉపాధి కల్పించజాలరు. దీంతోబాటు విపరీతంగా పెరిగిన సేద్యం ఖర్చులు, ఉత్పత్తులకు తక్కువ మార్కెట్ రేట్ల / మద్దతు ధర కలగలసి రైతులు ఆదాయాలు తరగిపోతూ, వారు అదే ఉత్పాదక కార్యకలాపం (వ్యవసాయంలో) కొనసాగటానికి ఎటువంటి ప్రోత్సాహం లభించడం లేదు.

ఈ ఏకాభిప్రాయ సాధన మధ్యలోనే, కాశీపూర్, కళింగనగర్, నందిగ్రాం, రాయ్‌ఘడ్, జరిత్సింగ్‌పూర్, సింగూర్ మారణకాండ ప్రదేశాల నుంచి హింస, అణచివేతలకు సంబంధించిన వివరాలు పుంఖాలు, పుంఖాలుగా వస్తూ షాక్‌కు గురిచేస్తున్నాయి. ఇది రాస్తున్న సమయానికి, నందిగ్రాంలో అత్యంత నికృష్ట మారణకాండకు సి.పి.ఐ (మార్కిస్టు) దిగింది. సి.పి.ఐ. (మార్కిస్టు) గట్టి మద్దతుదారులు కూడా ఈ అత్యంత దుర్మార్గ నరమేధాన్ని, 2002 గుజరాత్ రాష్ట్రంలో గోద్రా ఘటన తదనంతర అల్లర్లతో పోలుస్తూ, షాక్‌కు గురవుతున్నారు. నందిగ్రాంలో జరిగిన ఘటనలన్నింటినీ వివరించటం ఈ వ్యాస పరిధిలో సాధ్యం కాదు. దానిని మరొక ప్రత్యేక వ్యాసంలో వివరిస్తాను.

అభివృద్ధి అంటేనే నిర్వాసీకరణ లేక అభివృద్ధికి నీడగా నిర్వాసీకరణ తప్పనిసరి ఉంటుందని. అభివృద్ధి గురించి ఆలోచించాలంటే నిర్వాసీకరణను అంగీకరించటం తప్పదా ? లేక నిర్వాసం ఏదోఒక రూపంలో లేకుండా అభివృద్ధి సాధ్యం కాదా ! ప్రజల మీద ఏదోఒక హింసారూపం తప్పదా ? 1947 తదనంతర ఇండియాలో అభివృద్ధి మార్గంకు నిర్వాసీకరణ నూతన లక్షణమా ? మనం నిర్వాసీకరణ, వినాశకరం, నిరాధారం, మరణం అనే నాలుగు అంశాలను పోరాడటంలో సీరియస్‌గా తీసుకుంటే ఈ సజీవ సమస్యలనుంచి పారిపోజాలం. దక్షిణాసియా సామాజిక పరిస్థితుల్లో ఇది తప్పదు. ఎల్.పి.జి విధానాలను అమలు చేయడానికి విదేశీ, స్వదేశీ పెట్టుబడులు ప్రధాన సాధనాలుగా ఉపయోగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇది మరింత అవసరం.

అభివృద్ధి రాజకీయాల అవగాహనా దిశగా

ఇండియా ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుత ఎల్.పి.జి. దశకు సంబంధించి నిర్దిష్టంగా అవగాహన చేసుకొని, దక్షిణాసియాలో దాని పర్యవసానాలను విశాల ప్రజారాశుల దృష్టి కోణంనుంచి అభివృద్ధికి సంబంధించిన దృక్పథాన్ని

ఏర్పరచుకోవాల్సిన అవసరం మనముందు కొచ్చింది. ఇండియా అవలంబిస్తున్న అభివృద్ధి వ్యూహంలోని రాజకీయ, ఆర్థిక హేతుబద్ధతనును గతి తార్కిక దృక్పథం వెలుగులో అభివృద్ధి ప్రశ్నపై ఉద్దేశపూర్వకంగా కప్పిన ఇంద్రజాల చిక్కుముడి విప్పాల్సిన అవసరముంది. ఇండియా అవలంభించబోయే అభివృద్ధి వ్యూహం భవిష్యత్తు గురించి చర్చించే ప్రయత్నమేదైనా గతం ఏం తెలియచేస్తుంది, గతంలో వేళ్ళూనుకున్న వర్తమానంను విశాల ప్రజల ప్రయోజన దృక్పథంలో సిద్ధాంతపరంగా చూడాలి. ప్రస్తుత పాలసీ చొరవలను అంటే ఎల్.పి.జి. రెండవతరం సంస్కరణలుగా చెప్పబడే వాటిని 1947 తదనంతర ఇండియాకు కొనసాగింపుగా చూడాలి. 1947 తదనంతర ఇండియా చరిత్రను, అభివృద్ధి స్వభావాన్ని సిద్ధాంతీకరించే ప్రయత్నమేదైనా, ఇండియన్ రాజ్యానికి దోహదం చేస్తూ, దాన్ని నిలబెడుతున్న ఇండియన్ ఉపఖండంలోని లోపలి, బయటి పెద్ద నిర్మాణ, క్యాజువల్ ఎలిమెంట్స్ నుంచి తప్పించుకోజాలమనే వాదన జరుగుతున్నది. సారాంశంలో, రాజ్య ప్రాబల్య వర్గ ప్రయోజనాలు వ్యక్తీకరించే ఆర్థిక నమూనా అమలుపరచటంలో ముందుకొచ్చే నిర్దిష్ట ప్రయోజనాలను వివరించడమే.

విమర్శనా దారిద్ర్యమా లేక దారిద్ర్య విమర్శనా దారిద్ర్యమా

అనేకమంది కార్యకర్తలు, విద్యావేత్తలు, సామాజిక వ్యాఖ్యాతలు ప్రస్తుతం అభివృద్ధి ఫలితంగా జరుగుతున్న నిర్వాసీకరణపై తమ విమర్శలో, అభివృద్ధి ప్రస్తుత దశే (ప్రారంభించిన రెండవతర ఎల్.పి.జి. సంస్కరణలు) నెహ్రూయుగ విజయాల నాశనానికి ప్రధాన కారణమంటున్నారు. బ్రిటన్ నుండి అధికార మార్పిడి జరిగిన తర్వాత మునుగు తొలగిన అభివృద్ధి రాజకీయాల వాస్తవ స్వభావ చీకటి కోణాన్ని చూడడంలో వైఫల్యం నుంచి ఈ ధోరణి వస్తుంది. ఈ భావన ప్రకారం నెహ్రూకాలంలో ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం మంచి ప్రయత్నమే. అయినప్పటికీ కొంత మంది ప్రజలు, కొన్ని కమ్యూనిటీలు అభివృద్ధి ఫలాల సర్క్యూట్‌లూప్‌కు ఇప్పటికీ బయటనే ఉన్న మాట వాస్తవం. ఈ ప్రజల దగ్గరకు అభివృద్ధి చేరలేదు లేక ఆ ప్రజలు అభివృద్ధిని స్వీకరించలేదు. ఆ విధంగా అభివృద్ధిని ఒక తటస్థ కేటగిరీగా చూశారు. అభివృద్ధికి తోడ్పడేది ఏ వర్గమైనా, ఏ రకమైనా రాజ్యమైనా ఫర్వాలేదు, అభివృద్ధి జరగటం అవసరం. ఈ వాదన ప్రకారం అభివృద్ధి ద్వారా ఎవరు లాభపడుతున్నారనేది పట్టించుకోవాల్సిన అవసరంలేదు. అది అంతిమంగా దేశాన్ని బాగుపరచి, స్థిరపరచి ప్రతివారికి మేలు చేస్తుంది. అంతిమంగా అభివృద్ధి "ఫలితాలు" కులం, వర్గం, జాతీయత, మతం, ప్రాంతం నిమిత్తం లేకుండా ప్రతివారికి నెమ్మదిగా అందుతుంది. ఈ సందర్భంలో ఈ కింది పేరాలో లోకజ్ఞానం గురించి పండగ చేసుకోమని అమర్త్యసేన్ చెప్పాలి.

"వ్యవసాయం నుంచి ప్రజలు బయటకు పోయినా ఉత్పత్తేమీ పడిపోదు. కాబట్టి తలసరి ఆదాయం పెరుగుతుంది. పరిశ్రమ, వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థాభివృద్ధికి పారిశ్రామికీకరణం అవసరం. ఏ పారిశ్రామికవేత్తయినా బెంగాల్‌లో ఇబ్బంది అనుకొంటే లేక పరిశ్రమ కోసం భూమి కొనుగోలులో ఇబ్బందికి గురయేటట్లు ఎవరైనా రాజకీయంగా అడ్డుకొంటే, అది పేదల ప్రయోజనాలకు సేవ చేయటం కాదు ..... మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో అనేక లోపాలు ఉండవచ్చు..... కాని అది ఉపాధి, ఆదాయం సృష్టిస్తుంది. ఆదాయం పెరిగితే ప్రభుత్వం రెవిన్యూ పెరుగుతుంది. అప్పుడు విద్య, ఆరోగ్యం, ఇతర విషయాల అమలు కోసం ధనం సమకూరుతుంది".

అమర్త్యసేన్ మార్కెట్ మాటల గారడీ, ఏ వర్గాల ప్రయోజనాల కోసం అభివృద్ధి చలన ప్రక్రియ ఉందో గుర్తించడంలో వైఫల్యం చెందింది. అమర్త్యసేన్ వాదన ప్రకారం, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో తమ ఉపాధులు పోగొట్టుకొనే వాళ్ళు పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థలో తమ ఉపాధి సంపాదించుకోవాలి. పరిశ్రమలు లేకపోవడం వలననే వారు ఉద్యోగాలు పొందటం లేదు. ఈ పరిస్థితి నుండి బయట పడాలంటే ప్రయివేటు పెట్టుబడి అది విదేశీది స్వదేశీది అయినా, తెచ్చి పరిశ్రమలు ప్రారంభిస్తే, అవి ఉద్యోగాలు సృష్టిస్తాయి. మరో మాటల్లో, పెట్టుబడి ఆవిర్భవించకుండా పారిశ్రామిక అభివృద్ధి జరగటం సాధ్యం కాదు. కాబట్టి ప్రయివేటు పెట్టుబడి తప్పదు. అదెటువంటి పరిశ్రమ, ఎటువంటి ఉద్యోగాలు సృష్టిస్తుంది, ఎంత సంఖ్యలో ఉద్యోగాలు సృష్టిస్తుందనేది లేదు. పట్టించుకోవాల్సిన అవసరం లేదు. తమ జీవనాధారం పోవడానికి వ్యతిరేకంగా రైతాంగం భూమిలేని వ్యవసాయ కూలీలు తెలిపే నిరసన ఆయన దృష్టిలో రాజకీయ ప్రేరేపితంగా భావించి, ఆయన వ్యతిరేకిస్తారు. 1947 తదనంతర ఇండియాలో గ్రామాలకు - పట్టణాలకు మధ్య, వ్యవసాయ - పారిశ్రామికోత్పత్తి మధ్య పురోగమనం, తిరోగమనాల అనుగుణ్యతను పట్టించుకోరు. మరోమాటలో, అమర్త్యసేన్ దృష్టిలో వ్యవసాయం నుండి పారిశ్రామికీకరణకు మార్పులు సాఫీగా జరుగుతుంది. తమ జీవనాధారాలు కోల్పోయిన వాళ్ళు పారిశ్రామిక రంగంలో ఉద్యోగాల ద్వారా లాభపడతారు. ఏ కాలంలోనైనా, ఎక్కడైనా అభివృద్ధి క్రియాశీలత ఒక తటస్థ కేటగిరీయే. ఈ ప్రొఫెసర్ చెప్పేదాన్ని చూస్తే, ప్రసారతర్కం ఎవరికైనా అర్థమవుతుంది. ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ కాలంలో పెట్టుబడిని సృష్టించడంలో ఐదు ప్రణాళికల ప్రాముఖ్యతలేంటి ? అనేదానితో ప్రారంభిద్దాం. అభివృద్ధికోసం వ్యవసాయం పెట్టుబడి సృష్టించడంలో గ్రీన్ రివల్యూషన్ ప్రాముఖ్యమేమిటి ? అభివృద్ధి కోసం పెట్టుబడి సృష్టిలో సామాజిక రంగాల ప్రాముఖ్యతేమిటి ? అభివృద్ధి కోసమే పెట్టుబడి సృష్టిలో వ్యవసాయరంగ కార్పొరేటీకరణ ప్రాముఖ్యతేమిటి ? అభివృద్ధి కోసమే పెట్టుబడి ఏర్పాటులో భూకేంద్రీకరణ ప్రాముఖ్యతేమిటి ? అభివృద్ధి కోసమే పెట్టుబడి సృష్టి కోసం జరిపే పారిశ్రామికీకరణ కోసం వ్యవసాయ భూమిని విస్తృతంగా వాడడం ద్వారా లక్షలాది ప్రజల నిర్వాసీకరణ ప్రాముఖ్యతేమిటి ? మరల, అభివృద్ధి కోసమే ఈ రాతలన్నీ చదివితే అమర్త్యసేన్ మనకు చెప్పేది ఏమిటంటే అభివృద్ధి సంక్షోభాల, వినాశనం, నిర్వాసీకరణ ధ్వంసం తీసుకొస్తుంది. ఎందుకంటే అభివృద్ధి సంక్షోభాల నుండి అభివృద్ధి ద్వారానే బయటపడగలదని బోధపడుతుంది.

అభివృద్ధి గురించిన పై అవగాహన వున్నవారు, గత శతాబ్దం 1980 దశకు మధ్యవరకు అంతాబాగానే ఉందని, అప్పటినుండే పరిస్థితులు క్షీణించటం ప్రారంభమైందనే అభిప్రాయం కలిగి ఉన్నారు. ఈ వాదనలోని ముఖ్య భావన ఆ కాలమంతా అభివృద్ధి ప్రణాళికలో అంగీకార ముద్ర ప్రభుత్వరంగ సంస్థలు (PSU) పంచవర్ష ప్రణాళికలు, జాతీయాకరణల గత మంచికాలం గురించిన దిగులు మాత్రమే. ఈ అనుభూతిని సోషలిస్టులు, గాంధేయ వాదులు, సి.పి.ఐ, సి.పి.ఎం. పార్లమెంటులోనున్న వాళ్ళ లాంటి వాళ్ళు కలిగి ఉన్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి తటస్థ కేటగిరీ స్థాయినిచ్చి, స్థల, కాలం, చట్రంలకు ప్రాతినిధ్యం వహించే వాస్తవ ప్రయోజనాన్ని విడగొడుతున్నారు.

ఆ విధంగా పట్టణాలలో అభివృద్ధి సాధ్యం. ఎందుకంటే పెట్టుబడి, మార్కెట్, ఆదాయం కలిగిఉంది. మార్కెట్‌లో లాభించే ఉత్పత్తులను వినియోగించుకొంటారు. కొద్దిగా ఉండి, అందుబాటులో కొచ్చే ఉత్పత్తులు కొనుగోలుకు సరిపోయేటంత ఆదాయం రాదు. తక్కువ ఆదాయం తక్కువ పెట్టుబడి సృష్టి ఫలితంగా ఈ సామాజిక సంస్థలలో మార్కెట్ లేకపోవడమో, వక్రీకరణ చెందటమో జరుగుతుంది. ఆవిధంగా అభివృద్ధి, పెట్టుబడి, మార్కెట్, ఆదాయం లేకపోయే స్థాయికి అభివృద్ధి కుదించబడుతుంది. ఈ నమూనాలో ప్రజల స్థానంకు ప్రాముఖ్యత లేదు. ఆ విధంగా పేదరికం ఉపశమించటానికి అభివృద్ధి చేయటానికి పనికి ఆహారం పథకం, రోజ్‌గార్ యోజన, జాతీయగ్రామీణ ఉపాధి గ్యారంటీ స్కీం లాంటి ప్రోగ్రాంలు ఈ అభివృద్ధి నమూనాలో ఉంటాయి. ఈ నమూనా లూప్‌కు బయటనున్న తరగతులు ప్రజానీకం దగ్గరకు చేరుకొనటానికి బయటినుండి ప్రవేశపెట్టే ప్రోగ్రాంలుగా ఉంటాయి. ఈ స్కీమ్‌లు, భావనలు అభివృద్ధి అవగాహనకు బయట ఉంటాయి.

9848657300
9848657300
Ble 94909 52590
Sele 9491336411

ఈ స్కీమ్‌లకు టార్గెట్‌గా మారిన ప్రజలు జీవరహిత వస్తువుల స్థాయికి కుదించబడి, పైకి తేబడవలసిన వాళ్ళుగా, రాజ్యం ప్రోత్సహించే అభివృద్ధి నమూనాలో వారు భాగంకాకపోయినా, ఆ భారాన్నంతా వారి భుజస్కంధాలపై పెడతారు. ఆ విధంగా పతనావస్థలో నున్న పెట్టుబడిదారీ విధానం తన పరాన్నభుక్కు స్వభావ ముద్రలను వారిపై వదులుతుంది. వారు దాని గరిష్ట అదనపు విలువ తర్కానికి టార్గెట్లుగా చేసుకొంటుంది. ఈ విధంగా ఒక కేబినేట్ మంత్రి తమను తాము బతికించుకోవటానికి విషపువేళ్ళు, గడ్డి వినియోగించుకొనే తెగల ప్రజలను, 'సహజమైన' 'సాంస్కృతిక' లక్షణాలుగా, ప్రభుత్వం అందించే బియ్యం తినే అలవాటు లేనోళ్ళుగా చిత్రీకరిస్తారు. వాస్తవమేమిటంటే, రాజ్యం వారిపై రుద్దిన అభివృద్ధి నమూనా లూప్‌లో వారులేరు. కాబట్టి ప్రజలుగా అస్తిత్వంలో ఉండటానికి అవకాశాలు లేకపోవడం వలన చావుకు ఎదురుచూసే వారిని రాజకీయ ప్రేరేపిత జోక్యం చేసుకొనేవారని, అభివృద్ధికి వ్యతిరేకులని, ఆదిమ సమాజ దృక్పథంగలవారని పిలుస్తుంటారు.

నెహ్రూకాలపు ప్రణాళికార్థిక వ్యవస్థను లోతుగా పరిశీలిస్తే, సామ్రాజ్యవాద ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత దశ అభివృద్ధి రాజకీయాలలో వెల్లడయ్యే పరిమితి ఈనాడు మన్‌మోహన్‌సింగ్ లాంటి వాళ్ళు అమలు జరిపే ఎల్.పి.జి. రూపం దానికి మరొక కోణమే. నెహ్రూయుగ ప్రణాళికార్థిక వ్యవస్థ ఏర్పాటును పరిశీలిస్తే, 1947 తదనంతరం ఏర్పాటు, రెండవ ప్రపంచయుద్ధం తర్వాత పాత వలస యజమానులకు వలస వాద వ్యతిరేక ప్రతిఘటనలో పాత వలసలలో ఆవిర్భవించిన పాలక వర్గాల మధ్య ఏర్పడిన ఏకాభిప్రాయం ప్రపంచ మార్కెట్ పునర్విభజనకు ఎలా తోడ్పడుతుందో చూద్దాం.

1947 వారసత్వం

రెండవ ప్రపంచ యుద్ధం ముగింపులోనే ఇండియన్ ఉపఖండంలో అధికార మార్పిడి జరిగింది. బ్రిటీష్ వలసవాద రక్షణలో అభివృద్ధి చెందిన ఇండియన్ బడాబూర్జువా వర్గం ప్రపంచ సామ్రాజ్యవాద విభజనలో భాగంగా మార్కెట్, వనరుల కొత్త విభజన పునరుత్పత్తి కీలక శక్తులలో ఒకటిగా ఆవిర్భవించింది. 1947 తదనంతర ఇండియాలో ఇండియన్ దళారీ బడాబూర్జువా వర్గం, పెద్ద ఫ్యూడల్ ప్రభువుల కూటమి పాలక వర్గాలుగా ఆవిర్భవించాయి. స్థానిక చొరవ పెంపొందింపుచేసి, అత్యధిక స్థాయిలలో అవకాశాలు సృష్టించటం ద్వారా విస్తృత ప్రజానీకాన్ని సంలీనం చేసుకొనే, గ్రామీణ - పట్టణాల మధ్య పరస్పర సమన్వయం వృద్ధిని పెంచుకొనే, స్వయం సమృద్ధి అభివృద్ధి ద్వారా ఇండియాను పురోగమింప చేసే రాజకీయ సంకల్పం ఈ వర్గాలకు లేదు. నూతనంగా రూపొందిన ఇండియన్ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి 1947 తదనంతర ఇండియన్ రాజ్యనిర్మాణాన్ని నిర్వచించిన ప్రధాన సూచనలనందిస్తాయి.

1948 - 49 లో మొత్తం జాతీయాదాయంలో వ్యవసాయం వాటా 49.1 శాతం. దీంట్లో పశువుల పెంపకం, అనుబంధ కార్యకలాపాలు, అడవులు, చేపల పెంపకం ఉన్నాయి. 1901లో 69.4 శాతంగా ఉన్న వ్యవసాయం ఆర్థిక వ్యవస్థలోని శ్రామిక శక్తి, 1951 నాటికి 73.7 శాతంకు పెరిగింది. 1950.51 లో మొత్తం శ్రామిక జనాభాలో 2 శాతంగా కన్నా తక్కువగా ఫ్యాక్టరీలలో పనిచేస్తూ, ఆర్థిక వ్యవస్థలో 5.8 శాతంగా పరిశ్రమలున్నాయి. ఆ విధంగా వలస వ్యతిరేక ప్రతిఘటనలో పాల్గొన్న ప్రజల డిమాండ్ల రూపంలోనూ, పాలసీల రూపకల్పనలో అభిప్రాయ నిర్మాణవేత్తలుగా పాత్ర నిర్వహించే మధ్య తరగతి అవసరాలు కూడా ఆర్థిక వ్యవస్థ, సమాజంలో తలెత్తుతున్న వైరుధ్యాలను మేనేజ్ చేయాల్సిన బాధ్యత ఆవిర్భవిస్తున్న రాజ్యం ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాల్సి వచ్చింది.

ధనికులు, పేదల మధ్య వ్యత్యాసాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. వ్యవసాయ రంగంలోని మొత్తం దొంతర్ల వ్యవస్థ కూడా ప్రోత్సాహకరంగా లేదు. వ్యవసాయంలో పాల్గొనని భూస్వాములు మొత్తం వ్యవసాయం జనాభాలో 3 శాతంకన్నా తక్కువగాను, వ్యవసాయదార్లు (స్వంతదారులు, కౌలుదారులు) 63 శాతంగాను, వ్యవసాయ కూలీలు 32 శాతంగాను ఉన్నారు. 3 శాతంకన్నా తక్కువగా నున్న వ్యవసాయ జనాభా చేతిలో భూకేంద్రీకరణ జరిగిఉంది.

ఈ దృశ్యాన్ని ఛార్లెస్ బెతల్‌హెం ఈ విధంగా క్రోడీకరించారు. ...... గ్రామీణ రంగంలో చాలా భాగంలో మార్కెట్ లేకపోవటం తక్షణ ఉత్పత్తిదారుడు భూస్వామికి సాధనంగా ఉపయోగపడే ప్రజలుండటం, భూమి కౌలుకు అత్యంత ప్రాముఖ్యం, అభివృద్ధి చెందని మార్కెట్ వ్యవస్థ కారణంగా సామాజిక శ్రమ విభజనకు గురికాకపోవటం, తక్కువ రేటులో సంచయనం, ఉత్పత్తి వాడకం ప్రధానంగా తక్షణావసరాలు తీర్చుకోవడానికి వాడడం.

ఇంకా ఆయన ఆర్థిక వ్యవస్థను "అర్ధ భూస్వామ్య వ్యవస్థ" గా పేర్కొన్నారు. ఇండియన్ దళారీ పాలక వర్గాలు, అంతర్గత ప్లానింగ్, అభివృద్ధిలో రెండు ప్రధాన సమస్యలు ఎదుర్కొన్నారు. (1) తక్కువ స్థాయి పారిశ్రామిక పునాది. ఎక్కువ మొత్తాలలో విదేశీ మారక ద్రవ్యాన్ని పారిశ్రామిక వస్తువుల దిగుమతికి వాడాల్సిన పరిస్థితి దేశీయ ఆర్థిక వ్యవస్థకు ఏర్పడింది. (2) ప్రాథమిక సరకులను అభివృద్ధి చెందిన పెట్టుబడీదారీ దేశాలకు ఎగుమతి చేయటం ద్వారా మాత్రమే అత్యవసర విదేశీ మారక ద్రవ్యం ఆవిర్భవించడం సాధ్యం. ఈ ఎగుమతులు డిమాండ్‌ను అందుకోవటంలో తీవ్ర హెచ్చు తగ్గులకు గురవుతూ, కొనుగోలుశక్తిని కుదింపచేసింది.

ప్రస్తుత అభివృద్ధి నమూనాలో నిర్వాసీకరణ తప్పనిసరి :

అర్ధసేవకా వర్గ స్వభావంగల భారత బడాబూర్జువా - ఫ్యూడల్ భూస్వాముల కూటమికి పై చెప్పిన ఆటంకాలును విజయవంతంగా ఎదుర్కొనే స్వతంత్ర, స్వయం విస్తారిత పెట్టుబడిదారీ అభివృద్ధికి ఏమాత్రం అవకాశం లేదు. ఎందుకంటే అటువంటి ప్రక్రియ 1947 తదనంతర ఇండియా వర్గ పునాదికే ప్రమాదకరం. కానీ అదే సమయంలో వారు స్వదేశీ ఆర్థిక వ్యవస్థ నుంచి పెరుగుతున్న వత్తిడులతో రాజీపడాల్సి వుంది. అందులో విఫలమైతే వాళ్ళు విస్తరణ స్వప్నాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుంది.

తక్కువస్థాయి పారిశ్రామిక పునాది, సాపేక్షికంగా పెట్టుబడి సంచయన రేటు తక్కువగా ఉండటం, దళారీ బూర్జువా - భూస్వామ్య కూటమికి పెట్టుబడి సమీకరణకు ప్రధాన వనరులలో ఒకటిగా ప్రభుత్వరంగ సంస్థలతో కూడిన ఆర్థిక వ్యవస్థకు ఆమోదం తెలిపారు. మౌలిక పరిశ్రమలైన ఉక్కు భారీ ఇంజనీరింగ్, గనులలో అవసరమైన టెక్నాలజీని విదేశీ మిలాఖత్తు ద్వారా పొందారు. విదేశీ మారక ద్రవ్యం (ఆధారపడడానికి ప్రధాన కారణం విదేశీమారక ద్రవ్యం లేకపోవడం) పై తక్కువ స్థాయికి ఆధారపడడానికి చేసిన ప్రయత్నాలన్నీ తద్విరుద్ధ ఫలితాలనిచ్చాయి. నెహ్రూలాంటి వాళ్ళు జాతీయ సమర్థనలెన్ని చెప్పినప్పటికీ - నెహ్రూవియన్ సోషలిజంగా చెప్పబడిన - ప్రత్యామ్నాయ దిగుబడి పారిశ్రామికీకరణ వ్యూహంపై సామ్రాజ్యవాద తర్కమే గెలిచింది. పారిశ్రామిక వస్తువుల దిగుమతి కారణంగా విదేశీమారక ద్రవ్యంపై పడే భారాన్ని కనిష్టస్థాయికి తగ్గించటానికి, దాని స్థానంలో స్వదేశీ ఉత్పత్తి తేవటానికి చేసిన ప్రయత్నం స్థానంలో, ఉపఖండంలో సామ్రాజ్యవాద భవిష్యత్తు అభివృద్ధి వాస్తవ రూపం వచ్చి, తక్కువగా అభివృద్ధి చెందిన భారత ఆర్థిక వ్యవస్థ యొక్క బహుళస్థానిక ప్రత్యేకతలు (బహుళ ఉత్పత్తి విధానాలు) గా పునరుత్పత్తి కావటం ప్రారంభమైంది. భారత జనాభాలో అత్యంత భాగం బతకటానికి భూమికి బంధించబడిన పేదలుగా మిగిలిపోయి, మార్కెట్‌కు సరకులను సరఫరా చేయడంలో అశక్తులయ్యారు, స్వదేశీ పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తి ప్రయత్నాలు ప్రజా వినియోగ వస్తువుల ఉత్పత్తిగా మారలేదు. ఆవిధంగా 1947 తదనంతరం ఇండియాలో వెల్లడించేది ఏమిటంటే వ్యవసాయ పారిశ్రామిక రంగాల మధ్య పురోగమన - తిరోగమన సంబంధం కనబడడం లేదని.

ఇండియన్ రాజ్యం ప్రోత్సహించిన అభివృద్ధి, గరిష్ట అదనపు విలువ సాధించాలంటే సామ్రాజ్యవాద ప్రయోజనాలకు సేవకా సాధనంగా తెచ్చిన ఈ నమూనాలో అత్యధిక మంది పేదరిక సముద్రంలో మునిగిపోయిన కొరగానివారు. మిగిలిన మానవ సముద్రంలో వర్ధిల్లే ధనిక ద్వీపాలను

సృష్టించింది. ఈ నమూనా సమాజంలోని కొద్దిమంది ప్రాబల్యవర్గ / కులాల జనాభాకు మేలుచేసింది. ఈ జనాభా ప్రయోజనాలు సామ్రాజ్యవాద పెట్టుబడి అవసరాలకు అనుగుణంగా ఉంటాయి. ఇది మెజారిటీ ప్రజలను ఉపయోగ విలువలను చురుకుగా సృష్టించే ఉత్పత్తిదారులుగా తమ పాత్రను నిర్వహించకుండా అడ్డులేని; భారత ఆర్థిక వ్యవస్థ ఉత్పత్తి సామర్ధ్యాలను వెనక్కులాగి పట్టిఉంచటం ద్వారానే సాధ్యం అవుతుంది. ఈ ప్రజలు చేయగలిగింది. కనీస నైపుణ్యా అవసర శ్రమ అవసరమైన పనులకు చౌక శ్రమగా ఉపయోగపడి, మరింత మానవీకరణకు గురవుతారు. ఈ నమూనా శ్రామికులను అంతస్థుల పిరమిడ్‌లో మరింత అడుగుస్థాయికి నెట్టి, యధాతథ వ్యవస్థను ఉత్పత్తి, పునరుత్పత్తి కొనసాగించేటట్లు చేయగలుగుతుంది. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో అతడు / ఆమె భూమిలేని వ్యవసాయ కార్మికులుగా అవకాశం పోగొట్టుకుంటే పట్టణ కేంద్రాల్లోని ఫ్యాక్టరీలో కార్మికులుగా అవకాశం పొందుతారనేదేమీ లేదు. ఈ నమూనా ప్రోత్సహించేదేమిటంటే గ్రామీణ ప్రాంతాలలో శ్రమజీవి సెక్షన్లను హింసాత్మకంగా నిర్వాసులను గావించి, పేవ్‌మెంట్ నివాసులుగానో, లేక హక్కులు లేకుండా స్థలాల నాక్రమించే వారుగానో మార్చి, పట్టణ అవసరాలకు పనికిరాని వారుగా తయారు చేయబడి, తమ ఉనికి కోసం పోరాడుకొంటుంటారు.

ఇదేదో అతిశయోక్తి అనుకోకపోతే, పెట్టుబడిదారీ విధాన జీవన సరళిగా మారిన సామ్రాజ్యవాదం ఇండియాలాంటి వెనుకబడిన దేశాలలో తన భవిష్యత్ రూపాన్ని 'అభివృద్ధి రూపం'లో అందించుతుంది. ఈ విధంగా ఇండియా లాంటి వెనుకబడిన దేశాలలో సామ్రాజ్యవాద భవిష్యత్ రూపం వాస్తవీకరించబడి వడ్డీ వ్యాపారి - వర్తకుడు - భూస్వాముల కూటమి రాజ్యాధికారం కలిగి ఉంటూ, సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తయ్యే అదనపు విలువ లాభాలను పంచుకొనే యధాతథ వ్యవస్థ ప్రతిరూపంగా అభివృద్ధి నమూనా ఉంటుంది. అర్ధవలస - అర్ధ భూస్వామ్య వాస్తవంలో ఈ నమూనా కొనసాగడం, సామ్రాజ్యవాదం మీద సంపూర్ణంగా ఆధారపడకుండా మనుగడ సాగించజాలదు. ఈ నమూనాలో తప్పనిసరి నిర్వాసీకరణ లేకుండా, తనను తాను పునః సృష్టించుకోజాలదని చెప్పాల్సిన అవసరంలేదు. విపరీత అసమానత, ప్రాంతీయ అసమానతలు విస్తృతమవడం, ప్రజలు దివాళా తీయడం పెరగడం ఈ తప్పనిసరి. ఈ నమూనా చెడులు భూ పునః పంపిణీ, శ్రామిక జనావాళికి అనుకూలంగా రాజకీయాధికారంలో జరిగే ఆర్థికవ్యవస్థ చట్రం మార్పు దిశగా పయనించే ప్రత్యామ్నాయ నమూనాకు ఇది సంపూర్ణంగా విరుద్ధం. ఈ నమూనాలో ప్రజలు పాల్గొంటూ, ప్రజలు గౌరవప్రదమైన అర్థవంతమైన అస్తిత్వం కొనసాగించటానికి, ప్రజలకు నిత్యజీవితంలో అవసరమయ్యే వస్తువుల ఉత్పత్తి సరకుల తయారీ పరిశ్రమలకు మార్గదర్శక అంశం. వాటికి ప్రజల అవసరాలే మార్గదర్శకం. ఇది ఆర్థిక వ్యవస్థ పునాది వనరు, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణమైన పెట్టుబడిని కోరుకోవడం లేక దృక్పథంను తప్పనిసరి చేస్తుంది. ఇటువంటి అభివృద్ధి నమూనాలో ప్రజలు ఆర్థిక వ్యవస్థకు ఆస్తి అవుతారే తప్ప భారం కారు. అభివృద్ధి అంటే ప్రజల భౌతిక, మానసిక సంరక్షణే. అది ఆర్థిక వ్యవస్థలో అధికారాన్ని కలిగిన భూస్వామి - వడ్డీ వ్యాపారి - వర్తకుడి సంఘటనా ప్రయోజనాలకు పూర్తిగా నష్టదాయకం. మనం సామ్రాజ్యవాద తర్కం లేక సామ్రాజ్యవాద భవిష్యత్ పునరుత్పత్తి ఇండియాలాంటి అర్ధ ఫ్యూడల్, అర్ధ వలస వాస్తవం ఎలా కలగలసి ఉందో చూద్దాం.

పంచవర్ష ప్రణాళికలు - ప్రభువు నూతన ముసుగు వస్త్రాలు :

1947 అధికార మార్పిడి సమయంలో ఇండియాలో ఆహార కొరత సంక్షోభం దాదాపుగా దుర్భిక్ష పరిస్థితులను పోలిఉంది. రెండవ ప్రపంచ యుద్ధానంతర పరిస్థితిలో పాత వలసలలో కొత్త మార్కెట్లలో పెట్టుబడులు పెట్టటానికి మంచి అనుకూల పరిస్థితి ఉంది. అదే సమయంలో ఇండియన్ ఆర్థిక వ్యవస్థలో భారీగా అమెరికన్ ప్రయివేటు పెట్టుబడి పెట్టదు. ఆకర్షణీయంగా లేదు. కారణం విదేశాల నుండి ప్రయివేటు పెట్టుబడిని ఆకర్షించటానికి కావాలసిన మౌలిక వసతులు లేవు. ఇంకొక అంశం పైనా విప్లవం ఒక భూతంలాగా అగుపించి, అది శ్రమ జీవులను ఆకర్షిస్తుందని పాలక వర్గాలు, సామ్రాజ్యవాదం భయపడ్డాయి. తెలంగాణా సాయుధ పోరాటం తెలంగాణా పొలాల్లో, అడవుల్లో, గ్రామాలలో ఉవ్వెత్తున లేస్తూ రైతాంగం, భూమిలేని వ్యవసాయకూలీల ఉద్యమంగా పూర్తిగా అభివృద్ధి చెందింది. ఆవిర్భవిస్తున్న దృశ్యాన్ని ఆనాటి ఇండియాలోని అమెరికా రాయబారి చెస్టర్ బౌల్స్ దిమార్కేవిలా.....

"మనకు ప్రత్యామ్నాయం సందిగ్ధంగా ఉంది. మనం ఇప్పుడు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలను వూపివేస్తున్నా, ఆర్థిక, సామాజిక పెనుమార్పు నిర్మాణాత్మక, శాంతియుత చానెళ్ళలోకి మళ్ళించటంలో సహాయపడగలం, మార్గదర్శకత్వమివ్వగలం లేక ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో విప్లవ ఆకాంక్షలు పెరుగుతూ, మనం కోరుకొనే దానికి వ్యతిరేకులైన ఉగ్రవాదుల చేతులలోకి వెళ్ళుతుంటే ఎర్రచైనాలు, ఎర్ర క్యూబాలు విజయవంతమవు తుంటుంటే ఆందోళన పడుతూ మౌనంగా కూర్చుంటామా."

తన ఉనికిని రక్షించుకోవటానికి, స్వేచ్ఛాప్రపంచ రక్షణా నైతిక బాధ్యతను తలకెత్తుకొన్నట్లు, ఎప్పుడూ ప్రదర్శించే వాక్చాతుర్యం మధ్య, నూతన రిపబ్లిక్‌లో ఆధిపత్య స్థానం కోసం ప్రయత్నిస్తున్న పాలక వర్గాల అధికారాన్ని పటిష్టపరిచే అభివృద్ధి మార్గంలోకి ఇండియాను నెట్టింది. పరాన్నభుక్కు మరణశయ్యమీద నున్న అమెరికా, ఇతర సామ్రాజ్యవాద శక్తుల ఫైనాన్స్ పెట్టుబడి కూడా ఇండియాలోకి ప్రవేశించింది. దక్షిణాసియా మార్కెట్‌ను ముంచెత్తింది. అదే సమయంలో పాత సోవియట్ యూనియన్ కూడా అదే పాత పరిస్థితులు అంటే తక్కువస్థాయి సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడి నిర్మాణంతో ఇండియన్ ఆర్థిక వ్యవస్థను యధాతథంగా ఉంచుతూ, సామ్రాజ్యవాద ప్రయోజనాలతో జతగడుతూ, అదనపు విలువను గుంజుకొనే పరాన్న భుక్కు వర్గాల కోసం ఇండియా ఆర్థిక వ్యవస్థలో వెదుకుతున్నది.

ఈ సందర్భంలో ఇండియాలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించారు. అది తరువాత ఇండియన్ పంచవర్ష ప్రణాళికలలో అంతర్భాగంగా మారింది. ఈ ప్రోగ్రాం అమలు కోసం వివరమైన రోడ్‌మాప్ వేయడానికి 1952 మే 31న ఇండియన్ ప్రభుత్వం అమెరికా మధ్య రెండు ఒప్పందాలు కుదిరాయి. అమెరికా నిపుణులు, ఏజెన్సీల చొరవతోనే ప్రోగ్రాం వివరంగా అభివృద్ధి చేయబడింది. ఫోర్డ్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్లు యు.ఎస్. ఎయిడ్ ఫర్ ఇంటర్నేషనల్ అమెరికా వ్యవసాయ డిపార్టుమెంటులు నిధులందిస్తూ, ఈ ప్రాజెక్టు అమలు కోసం అమెరికా నుండి దిగుమతైన 'నిపుణుల'తో కలిసి పనిచేశాయి. వీరిలో భూమి పాలసీలలో నిపుణులైన ఇద్దరు అమెరికన్‌లు వూల్ఫ్ లాడెన్స్కీ, ప్రొఫెసర్ కెన్నెత్ పార్సన్‌లు కూడా ఉన్నారు. ఫలితంగా ఈ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విశాల గ్రామీణ ప్రజల ఉత్పత్తి సామర్థ్యంను విడుదల చేయకుండానే, గ్రామీణ అధికార చట్టాన్ని మరింత పటిష్టపరచింది. ఇది మధ్య తరగతి, ధనిక భూ యజమానులకు, వడ్డీ వ్యాపారికి యధావిధంగానే ఉంది. పేదరైతు, భూమిలేని వ్యవసాయ కూలీల శ్రమద్వారా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ పేరుతో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలోకి అదనపు విలువ గుంజుకోవటానికి సహాయపడింది. ఇండియన్ రాజ్యం పెంపొందించే అనేక విధానాలు, సహాయం వలన ఈ ప్రోగ్రాం వలన గ్రామీణ కమ్యూనిటీలోని ధనిక తరగతులకు లాభం కలిగించి, వారిని పటిష్ట పరచింది. ఇది గ్రామీణ ఇండియా ఆర్థిక వ్యవస్థలోని ఉత్పాదక రహిత దృక్పథాన్ని మరింత పెంచి, పోషించి లేక భూస్వామి - వడ్డీ వ్యాపారి - వర్తకుడి కంబైన్ పరాన్న భుక్కు స్వభావాన్ని పటిష్ట పరచింది.

మొదటి పంచవర్ష ప్రణాళిక ముసాయిదా ప్రకటనలో కూడా పై నుదహరించిన గ్రామీణ వర్గ/కుల ఆకృతి పటిష్టత 'సహకార వ్యవసాయం' అనేదాన్ని ప్రవేశపెట్టబడడానికి అనుకూలంగా ఉందని ప్రకటించింది. 1959 జనవరి కాంగ్రెస్ సెషన్‌లో దీనికి అవసరమైన అనుమతి నిచ్చింది. ప్లానింగ్

కమిషన్ భాషా గారడీ లో "గ్రామం మొత్తం భూమి" "ఒకే ఒక క్షేత్రం"గా పరిగణించి యాజమాన్య హక్కులు కొనసాగుతూ, "ప్రతి పంట కోత సమయంలో యాజమాన్య డివిడెండ్లు" ద్వారా పరిహారం ఇస్తారు. పేదరైతులు, వ్యవసాయ కూలీల శ్రమను వినియోగించడానికి "గ్రామ వనరులు, గ్రామ భూమి నిర్వహణ గరిష్ట ఉపాధిని అందించేటట్లు ఆర్గనైజ్ చేయాలి". కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సహకార వ్యవసాయ రాజ్య విధానాలు దళారీ పాలక వర్గాలు, అమెరికా సామ్రాజ్యవాదం మధ్య బంధాన్ని మరింత బలపరిచింది.

బయటి నుంచి చొప్పించిన క్రియాశీల అభివృద్ధి మౌలికంగా సామ్రాజ్యవాద పెట్టుబడి అవసరాల కోసం కాగా, అంతర్గతంగా జొప్పించే స్వయం విస్తరణ క్రియాశీలత విశాల ప్రజానీక అవసరాలు తీర్చటం లక్ష్యంగా ఉండి, అదే దాని బలానికి ఆధారంగా ఉంటుంది. స్వయంగా, అంతర్గతంగా జొప్పించే అభివృద్ధిని చేర్చుకోని నమూనాలో ప్రజల ఉత్పాదనా సామర్థ్యాలు విడుదల చేయకుండా అమలు పరచడం సాధ్యంకాదు. భూసంస్కరణలు చేయకుండా, దున్నే వానికి భూమి పంచకుండా ఇది సాధ్యంకాదు. ఈ నమూనాకు భూసంస్కరణలు ముందస్తు అవసరం. దీంతోబాటు ఈ నమూనా స్థానికతకు కొత్త ఆవిష్కరణల ప్రోత్సాహాన్నిస్తుంది. అంతర్గతంగా జొప్పించే అభివృద్ధి ప్రత్యక్ష ఫలితం ఏమిటంటే ఆర్థిక వ్యవస్థను వెనుకకు గుంజుతున్న, కొనసాగుతున్న వర్గ / కుల నిచ్చెనమెట్ల వ్యవస్థను దెబ్బతీయటమే. అసంఖ్యాకంగా ప్రజలను నిర్వాసితులను చేయడం, భాగస్వామ్యంలేని లేక అవకాశాలు లేకుండా చేసే సమస్యను విజయవంతంగా పరిష్కరించే అలాంటి అభివృద్ధి ఈ దేశ పాలక వర్గాల ప్రయోజనాలకు సరిపడదు. గరిష్ట అదనపు విలువ కోసం ప్రయత్నించే మరణశయ్య మీద ఉన్న, పరాన్న భుక్కు ఫైనాన్స్ పెట్టుబడి పునాదిగా నుండే సామ్రాజ్యవాద అనుకూల నమూనాను అమలు పరుస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థలోకి తిరోగమన నిర్మాణాలను కొనసాగిస్తుండే ఈ నమూనాలో నిర్వాసీకరణ తప్పనిసరి.

నెహ్రూ సోషలిజం ఒక అభూత కల్పన

నెహ్రూ నాయకత్వంలోని ఇండియన్ రాజ్యం అమెరికా లాండ్-గ్రాంట్ యూనివర్సిటీలు రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్లను ఇండియన్ వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వ్యవసాయ పరిశోధనా సంస్థల ఏర్పాటులో సహాయపడవలసిందిగా కోరింది. అప్పటి ప్లానింగ్ కమిషన్ కార్యదర్శి పాలసీ తయారు చేయడంకోసం అవసరమయ్యేదిగా ఉంటూ ఉత్పాదకాల నైపుణ్యాన్ని అందించటం కోసం దేశమంతా అప్లైడ్ ఎకనమిక్ సెంటర్లు ఏర్పాటు చేయవలసిందిగా ఫోర్డ్ ఫౌండేషన్ అర్థించారు. గతంలోకి తొంగిచూస్తే గ్రీన్ రివల్యూషన్ (మూడవ పంచవర్ష ప్రణాళిక)లో అమలు జరిగినదిగా చెప్పే పాలసీ స్ట్రాటజీ కోసం ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్ రీసర్చ్, ఢిల్లీస్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, పూనే గోఖలే ఇన్‌స్టిట్యూట్‌లు మెస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో భాగస్వామి ఒప్పందం కుదుర్చుకున్నప్పుడే రంగం సిద్ధమైంది. ఈ మిలాఖత్‌కు ఫోర్డ్ ఫౌండేషన్ నిధులందించడం పటిష్టపరచి, ఆశీర్వదించింది.

ఈ సోషలిస్టు ప్లానింగ్ 'పొగతెర' మధ్యలోనే అమెరికా, తదితర సామ్రాజ్యవాద దేశాలనుండి వచ్చే విదేశీ సహాయాన్ని లెక్కించారు. 1952-59 నుండి (ఇంతకు ముందే చెప్పినట్లు మొదటి ఇండో-అమెరికన్ అగ్రిమెంట్‌పై సంతకాలు జరిగింది 1952లో ఇండియా) అమెరికా నుండి (గ్రాంట్, లోన్ల రూపంలో - 4 శాతం వడ్డీ లేక డాలర్లలోనైతే 3 శాతంతో సహాయం అందింది. ఇండియాకు అందిన అత్యంత ఏకైక పెద్ద సహాయం పి.ఎల్. 480 రూపంలో 915 మిలియన్ డాలర్లు అందింది.

1958-62 నుండి అమెరికా బట్వాడ చేసిన సహాయంలో 12.3 శాతం పొందిన ఇండియా లిస్ట్‌లో అగ్రస్థానంలో ఉంది. 1963-68 కాలంలో మొత్తం సహాయంలో 8.4 శాతం పొంది దక్షిణ వియత్నాం తర్వాత ద్వితీయ స్థానంలోను, 1969-74 కాలంలో బట్వాడ అయిన సహాయంలో 2.9 శాతం పొంది నాలుగవ స్థానంలోను ఉంది. పైన చెప్పిన రెండు దశలలోను ఇండియా మొత్తం అమెరికా ఆర్థిక సహాయంలో 14.8, 13.9 శాతం పొంది అగ్రస్థానంలో ఉంది. చివరి దశలో 4.9 శాతం వాటాతో రెండవ స్థానంలో ఉంది.

రెండవ ప్రపంచయుద్ధం తర్వాత ప్రథమశక్తిగానున్న అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాలకు, భారత పాలకవర్గాలు రూపొందించిన అభివృద్ధి నమూనా మధ్య సామరస్య సంబంధముండడం సుస్పష్టమే. "ఇండియా లాంటి దేశాలకు వాగ్దానం చేసిన ఈ అభివృద్ధి సమయం గురించి వారికి సహాయపడ్డా, వారికి వారు సహాయపడతారు" (బెస్టర్ బౌల్స్ ల్లేమినా) అని అమెరికా చెప్పింది ప్రాముఖ్యమైన విషయం. అప్పటి అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ డీన్ ఆచెసన్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ కోసం చట్టం చేయాల్సిన ఆవశ్యత గురించి సెనెట్ ఫారిన్ రిలేషన్స్ కమిటీకి చేసిన విజ్ఞప్తిలో ఇలా చెప్పారు.

"వాస్తవానికి ఇది ఒక రక్షణచర్య... ఆర్థికాభివృద్ధి మనకు కొన్ని ఆచరణాత్మక భౌతిక ప్రయోజనాలు తెచ్చిపెడుతుంది. మనకు అవసరమైన మెటీరియల్స్ వస్తువులకు సంబంధించి నూతన వనరులను తెచ్చిపెడుతుంది. మనక్షేత్రాల, ఫ్యాక్టరీల ఉత్పత్తులకు కొత్త మార్కెట్లను తెరుస్తుంది."

కనీస స్థాయిలో అభివృద్ధి చెందిన దేశాల ప్రజల జీవితాలు మెరుగుపడడం గురించి దాని లక్ష్యం సాంకేతిక నైపుణ్యాల మార్పిడిని ప్రోత్సహించడం, ప్రైవేటు ఇన్‌వెస్ట్‌మెంట్ పెట్టుబడి ప్రవాహాన్ని ప్రోత్సహించడం.

పి.ఎల్. 480, అగ్రికల్చరల్ ట్రేడ్ డెవలప్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ యాక్ట్ ఆఫ్ 1954 ప్రధాన ఆర్కిటెక్టులలో ఒకరైన హెరాల్డ్ కూలీ అనేక సంవత్సరాల తర్వాత ఈ చట్టం వెనకనున్న ప్రధాన ఉద్దేశంను "అదనపు ధాన్యం పరిష్కార ప్రోగ్రాం - ద్వారా మన విదేశీ మార్కెట్లను విస్తరించగలం అనుకొన్నాము."

ఆ విధంగా ఇండియా లాంటి పెద్దమార్కెట్లను వెదుక్కొంటూ, విదేశీ పెట్టుబడి తన జాతీయ సరిహద్దులను దాటడం తప్పనిసరి. రెండవ ప్రపంచ యుద్ధానంతరం అమెరికా ఆర్థిక వ్యవస్థలో కనుపించిన వికాసం ఇండియాలాంటి నూతన "స్వతంత్ర" దేశాలకు అందించిన సహాయంతోబాటు యుద్ధానంతర పశ్చిమ యూరప్, ఆసియాలలో పునర్నిర్మాణం కోసం అందించిన దాడి స్వభావ సహాయ ప్యాకేజీలన్నీ అమెరికా దేశ ఆర్థికవ్యవస్థ క్రియాశీలత కోసం తప్ప మరేమీకాదు. సామ్రాజ్యవాద ఆధ్వర్యంలోని విస్తరణసారం అదనపు విలువ కోసం ఎడతెగని వెదుకులాట. ఇండియాలాంటి దేశాల నిర్దిష్ట స్థానిక భౌతిక పరిస్థితులతో కలగలసి అదనపు విలువ సంపాదించడం కోసం మాత్రమే. సామ్రాజ్యవాదం తన అస్తిత్వం శాశ్వతంగా కొనసాగించడం కోసం సంచయన వేగాన్ని నిలబెట్టుకోవడానికి తప్పని పరిస్థితి. దీనిని సిద్ధాంతీకరించింది లెనిన్ తప్ప మరొకరు కాదు" కొన్ని దేశాలలో పెట్టుబడిదారి విధానం 'అధిక పరిపక్వత' చెందడం అనే వాస్తవికత నుంచే పెట్టుబడి ఎగుమతి చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుంది. పెట్టుబడి 'లాభదాయకమైన' ఇన్‌వెస్ట్‌మెంట్‌ను కనుగొనలేక పోతున్నది అంతేగాక, పెట్టుబడిదారి విధానం అభివృద్ధి చెందిన కొద్దీ, దానికి ముడిసరుకుల అవసరం మరింత పెరుగుతుంది, పోటీ మరింత చేదెక్కిస్తుంది, ప్రపంచమంతా ముడిసరుకుల కోసం మరింత తీవ్రంగా వేటాడుతుంది".

పాశ్చాత్య ప్రపంచాన్నందుకోవడం

ఇక్కడ యుక్తంగా వున్న కేంద్రీకృత అంశాన్ని గ్రహించాలి. పెట్టుబడి వెనుకనున్న ప్రధాన వుద్దేశం లాభకర అవకాశాలు ఎక్కడుంటే అక్కడ సాధ్యపడే అవకాశాలను వినియోగించుకోవడం. కాబట్టి సామ్రాజ్యవాదానికి సుంకాల గోడలను తప్పించుకొని వెళ్ళడం అవసరం. అవసరమైన ముడి సరుకుల (ప్రస్తుత భవిష్యత్తు) సరఫరాలను నియంత్రణలోకి తెచ్చుకోవాల్సిన అవసరం. దీన్ని పొందడానికి పెట్టుబడి, తానే పెట్టుబడులను మౌలిక సదుపాయాల నిర్మాణానికి సహాయం చేయడంగా వివరించుకోవాలి; పెట్టుబడిని సమీకరించడానికి పెద్ద ఎత్తున సంస్థలను అభివృద్ధి పరచడం; గుత్తాధిపత్యం

పెరగడం, ముడి సరుకులు, మార్కెట్లు, లాభాల కోసం గుత్త సంస్థల ఏర్పాటు. ఇందుకు అంతర్జాతీయ శ్రమ విభజన దోహదం చేసింది.

ఆరంభంలోనే చెప్పినట్లు, దిగుమతి ప్రత్యామ్నాయ పారిశ్రామీకరణ వైపుగా ఆరంభ యత్నాలు ఇండియాను పంజాబ్‌లో భాక్రా డ్యామ్, ఒరిస్సాలో హిరాకుడ్, కర్నాటకలో షారవతీ ప్రాజెక్టులకు సహాయం, నైపుణ్యజ్ఞానం (రూపంలో విదేశీ సహాయంతో, పెద్ద పెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి దింపింది. అంతర్జాతీయ పునర్నిర్మాణ, అభివృద్ధి బ్యాంక్, 62.5 మిలియన్ డాలర్లు ప్రధానంగా వ్యవసాయ, విద్యుత్ ప్రాజెక్టులు, రైలు ఇంజన్లు కొనుగోలుకు లోన్‌లను గ్రాంట్ చేసింది. షారావతి ప్రాజెక్టుకు అమెరికా సహాయమందించింది. మొదటి పంచవర్ష ప్రణాళికలో ప్రభుత్వం రంగం కోసం కేటాయించిన దానికంటే రెండు రెట్ల ధనాన్ని అంటే 233కోట్ల రూపాయలను మొత్తాన్ని ప్రయివేటు రంగ విస్తరణ కోసం కేటాయించింది. ఈ కాలంలో "సంయుక్త రంగ పరిశ్రమల వ్యవస్థ"ను ప్రారంభించటం చూడవచ్చు. ఈ పద్ధతిలో విదేశీ సంస్థలు ఇండియన్ వ్యాపారస్తులతో మిలాఖతై దేశంలో పరిశ్రమలు స్థాపించారు. రెండవ పంచవర్ష ప్రణాళికలో విదేశీ మిలాఖత్తుతో ఉక్కు పరిశ్రమలు స్థాపించడం గమనించవచ్చు. మొట్టమొదటి ఉక్కు కర్మాగారాన్ని యు.ఎస్.ఎస్.ఆర్. సాంకేతిక సహాయంతో బిలాయి దగ్గర స్థాపించారు. స్టాలిన్ నాయకత్వంలో సోవియట్ యూనియన్ చైనా ప్రజారిపబ్లిక్‌లో ఉక్కు ఫ్యాక్టరీలు స్థాపించడానికి సాంకేతిక సహాయమివ్వడానికి ప్రతిపాదన చేసింది. కాని మావో నాయకత్వంలోని చైనా ఈ ప్రతిపాదనలను తిరస్కరించి, స్థానిక టెక్నాలజీపై కేంద్రీకరించి, చిన్న తరహా పరిశ్రమలు ప్రారంభించి, ప్రోత్సహించే చొరవను ప్రదర్శించింది. స్వయం సమృద్ధి, భారీ స్థాయిలో ఉక్కు ఉత్పాదన చైనా విధానంలో మైలు రాళ్ళు. ఆ విధంగా మావో "పాశ్చాత్య ప్రపంచాన్ని అందుకోవాలనే" సోవియట్ నినాదాన్ని నిర్ణయాత్మకంగా తిరస్కరించారు. అంతేగాదు, ఈ అందుకోవలనే నినాదం తరువాత కృశ్చేవ్ నాయకత్వంలో సోవియట్ యూనియన్ అమెరికా సామ్రాజ్యవాదంతో - రివిజనిజం, సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం పూర్తి స్థాయి వ్యక్తీకరణ శాంతియుత సహజీవనం", "శాంతియుత పోటీ" నినాదంగా పరివర్తన చెందింది.

ఇతర ఉక్కు కర్మాగారాలు రూర్కెలా (పశ్చిమ జర్మనీ) దుర్గాపూర్ (బ్రిటిష్) తరువాత వచ్చాయి. ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ రైల్వేలకు రైలింజన్ ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, కావాలనీ టాటా యాజమాన్యంలోని టెల్కోకు అనుకూలంగా వ్యవహరించి, ప్రభుత్వ రంగాన్ని నిరుత్సాహపరిచారు. టెల్కో తన ఉత్పత్తులను అధిక ధరలకు అమ్మింది. ఏనాడు సమయానికి అందించలేదు. ప్రయివేటు రంగానికి పన్నురాయితీలు, వడ్డీలేని లోన్లు, విదేశాల నుంచి తీసుకొన్న అప్పులన్నింటికి కౌంటర్ గ్యారంటీలు, దిగుమతులపై రిబేట్, డెవలప్‌మెంట్ రిబేటులు ఇచ్చినప్పటికీ, అది యాంత్రిక పరికరాల ఉత్పత్తి పరిస్థితిని మెరుగుపరచడంలో ఘోరంగా విఫలమైంది.' 1954లో ప్రభుత్వ ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదించింది. రెండు లక్షల తేలిక యాంత్రిక పరికరాల కాలం తీరినవైపోయాయి. 22 ఇండియన్ ప్రయివేటు ఎంటర్ ప్రైజెస్ ఇండియాకు విదేశీ పెట్టుబడులు ఛానలైజ్ చేయడానికి ఇండస్ట్రియల్ క్రెడిట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అనే ఏజన్సీని కూడ ప్రతిపాదించింది. ఈ ఏజన్సీలో పాల్గొనే దేశాలు ఇండియా, బ్రిటన్, అమెరికా.

ప్రయివేటు రంగ పరాన్న భుక్కు స్వభావం : దళారీ బూర్జువా వర్గ దోపిడీ సాధనం : దళారీ బూర్జువా వర్గం పెంపొందించిన నమూనా ఇండియన్ ఇండస్ట్రీ యొక్క తీవ్ర పరాన్న భుక్కు స్వభావానికి ఇండియన్ పార్లమెంట్ ఏ మాత్రం సిగ్గుపడ లేదనడాన్ని లోకసభ అనుబంధం నుండి తీసిన ఈ కింది భాగం తెలియజేస్తుంది. దళారీ బూర్జువా వర్గం ప్రారంభించిన పారిశ్రామిక స్వభావానికి ఉదాహరణగా దీన్ని ఉదహరించడం చాలా చక్కగా సరిపోతుంది.

"జెంషెడ్ పూర్ ఇంజనీరింగ్ అండ్ మెషిన్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్ ఉదాహరణను పరిశీలిద్దాం. 1958లో లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా .... నిర్దిష్ట సంపూర్ణ వాస్తవాలు వెలుగులోకొచ్చాయి. ముద్ద ఇనుమురోల్స్ తయారు చేయడం ఒక స్పెషలైజ్డ్ లైన్ కావడంతో, ప్రభుత్వం ఈ కంపెనీని విదేశీ సాంకేతిక మిలాఖత్ ఏర్పాటుకు ప్రోత్సహించింది. 1955 చివరినాటికి కంపెనీ ప్రధానమైన ఎలక్ట్రికల్ ఫర్నేస్‌ను దిగుమతి చేసుకొంది. ఆ తరువాత నాలుగు సంవత్సరాలకు దానిని నిర్మించారు. అప్పుడు తెలిసిందేమిటంటే, ఫర్నేస్ పనిచేయటానికి అవసరమైన అనుబంధ సహాయక ఎక్విప్‌మెంట్‌ను ఇన్‌స్టాల్ చేయలేదని ! ఆలస్యానికి సంబంధించి ప్రభుత్వం ఒకటికిమించి ఎక్కువ సార్లు విచారించింది. ఒక 'షోకాజ్' నోటీస్ కూడా ఇచ్చింది. దిగుమతి చేసుకొన్న కేబుల్స్ కనపడడం లేదని కొత్త కేబుల్స్ వచ్చే సమయానికి విదేశీ స్థాపకులు ఇండియా వదలి వెళ్ళి పోయారని నివేదించింది. తరువాత ఎలక్ట్రికల్ ఫర్నేస్ ఉత్పత్తి చేయటం ప్రారంభిస్తుందని చెప్పబడింది. కాని అది డిమాండ్‌లో 5 శాతంను మించి సంతృప్త పరచలేక పోయింది. ఈ మధ్యలో, ప్రభుత్వం జకోస్లోవేకియా మిలాఖత్‌తో రాంచీలో ప్రభుత్వరంగ సెంట్రల్ ఫౌండరీ ఫోర్జ్ ప్రాజెక్టును ఏర్పరచాలని నిర్ణయించింది.........."

అంతేగాక లోకసభ చర్చలలో, 1958 ఏప్రియల్ నాటికి రెండు సంవత్సరాల కాలంలో 350 పైగా పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలను ప్రయివేటు కంపెనీలుగా హఠాత్తుగా మార్చడంపై పార్లమెంటు సభ్యులు తీవ్ర బాధ వ్యక్తం చేశారు. కంపెనీల చట్టానికి సవరణలు చేయడం గురించి ఆలోచిస్తున్నట్లు బాగా ప్రచారంలోకి వచ్చింది. ప్రయివేటు రంగంలోని చాలా పరిశ్రమలు ప్రభుత్వం నుంచి రాయితీలు, రిలీఫ్, ఆర్థిక సహాయం బాగా పొందాయి. అంతేగాక ప్రయివేటు రంగ కంపెనీలు విదేశాల నుంచి పొందిన లోన్లు అన్నింటికి గ్యారంటీనిచ్చింది. అప్పటి లోక్ సభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ టి.ఎన్.సింగ్ ప్రకారం దిగుమతి రిబేటు, అభివృద్ధి రిబేటు లాంటి ఇతర రకాల బెనిఫిట్లు, ప్రోత్సాహకాలు ప్రపంచంలోనే అసాధారణమైనవని చాలా కంపెనీల వాటి విస్తరణ కార్యక్రమాలు విజయానికి కారణం ఈ అభివృద్ధి రిబేటు స్కీమ్ అని ఆయనే అంగీకరించారు. దీనర్థం ప్రభుత్వ ఖజానాకు విపరీత నష్టం.

1948 నాటికి ఇండియాలో ప్రయివేటు రంగంలో మిగిలిన విదేశీ వ్యాపార పెట్టుబడుల విలువ రు. 264.6 కోట్లు. అది 1967 మార్చి చివరి నాటికి రూ. 1230.6 కోట్లుకు పెరిగింది. మరొక సమాచారం ప్రకారం 1948 - 1964 మధ్య విదేశీ మిలాఖాత్ ఒప్పందాలు 2250. ఇందులో 1900, 1956 - 1964 మధ్య అమలులోకొచ్చాయి.

1950 నుండి 1967 మధ్య కాలంలో నిర్వహణ టేబుల్, మాన్వెల్ల ప్రకారం ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, యు.కె, యు. ఎస్. ల అడుగు భాగంలో మొత్తం జాతీయవ్యయం పబ్లిక్ రంగ వాటా వుంది. ఆ టేబుల్‌లో ఇండియాతో బాటు చూపించిన ఇతర దేశాలన్నీ సోషలిస్టు నియమాలు ప్రకటించాయనడానికి ఎటువంటి సూచన లేదు. 1950లో జాతీయ వ్యయంలో ప్రభుత్వ రంగం వాటా 8.3 కాగా, 1967 నాటికి కొద్దిగా 12.7 శాతానికి పెరిగింది. స్థూల ఫిక్స్‌డ్ పెట్టుబడి ఏర్పాటులో పబ్లిక్ రంగ పాత్ర గమనించదగినంత లేకపోవడం చూస్తే, సమిష్టి ప్రయోజనం కోసం పెట్టుబడి సృష్టిలో రాజ్య నియంత్రణ ఒట్టి కల్పితమని బట్టబయలైంది. పై టేబుల్‌లో తక్కువ కంట్రోళ్ళున్న అమెరికా దీనికి మినహాయింపు. అది 1950లో 2.9 శాతముందని 1967 నాటికి 7 శాతంగా వుంది. ఇది ఇండియన్ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలపై ప్రభుత్వ నియంత్రణ ఏ మాత్రమూ లేదని ఎటువంటి అనుమానం లేకుండా తెలియజేస్తుంది.

హరిత విప్లవం : అసమానాభివృద్ధి ప్యాకెట్లు

టెక్నాలజీ ముందుకు తెచ్చిన మరొక స్పందన గ్రీన్ రివల్యూషన్ అనే మాజిక్. స్లోగన్ ఇది ఫెర్టిలైజర్ - పెస్టిసైడ్-అధిక దిగుబడి విత్తనాల కాంబినేషన్ ప్యాకేజీ. అప్పటి యు.ఎస్.ఎ.ఐ.డి. కి చెందిన చీఫ్ ఎకనమిస్ట్ జాన్ డి మెల్లర్ ఈ ప్యాకేజీని ప్రధానంగా ఫెర్టిలైజర్ స్కీమ్ అని పేర్కొన్నాడు. ఇది కాలువల

సేద్యం కింద వచ్చిన కొత్త సాగుప్రాంతాలను బందీ చేసిన మార్కెట్లు. ఈ ప్రాంతాలలో స్వంత భూమి తగిన ధనిక రైతు ఫెర్టిలైజర్, పెస్టిసైడ్, విత్తనాల కోసం అమెరికన్ అగ్రిబిజనెస్, ఫెర్టిలైజర్ కార్పోరేషన్లపై పూర్తిగా ఆధారపడాలి. గ్రీన్ రివల్యూషన్ బెనిఫిట్లలో సింహభాగాన్ని ధనిక వ్యవసాయదారులు పొందారని ఆ పాలసీ ప్రధాన రూపశిల్పుల్లో ఒకరైన ఉల్ఫ్ లాజెన్ జిస్కీ అంగీకరించారు. ఆయన నెహ్రూకు అత్యంత నమ్మకస్తుడనేదీ ప్రధాన విషయం. 1940 చివరి, 50 ల ఆరంభాలలో ఇండియాకు అమెరికా రాయబారిగా పనిచేసిన చెస్టర్ బౌల్స్ ఆయన ప్రత్యేకంగా అమెరికా నుండి పిలిపించబడిన గ్రామీణ వ్యవహారాల నిపుణుడు. ఆహార ధాన్యాల విషయంలో స్వయం సమృద్ధి సాధించడంలో గ్రీన్ రివల్యూషన్ విఫలమవడమేగాక, ఆ టెక్నాలజీ అమలు జరిపిన ప్రాంతాలలో పెరిగిన ఆదాయం వలన ప్రాంతీయ ఆదాయ వ్యత్యాసాలు తీవ్రతరమయ్యాయి. గ్రీన్ రివల్యూషన్ గురించి ఆనందాలెన్ని వున్నప్పటికీ ఇండియా ఆహార ధాన్యాల దిగుమతి లో గమనించదగిన మార్పేమీలేదు.

తెలిసిన ఇంకొక నిర్దిష్ట అంశం ఏమిటంటే, ఇండియన్ ఆర్థిక వ్యవస్థపై భూస్వామి - వడ్డీ వ్యాపారి - వర్తకుడి కూటమి ఆధిపత్యం చెక్కుచెదరలేదని జాతీయ ఆదాయానికి వ్యవసాయం నుంచి రాష్ట్రాలు వసూలు చేసే భూమిశిస్తు, వ్యవసాయ ఆదాయ పన్ను వాటా క్రమంగా 1960 - 61 లో వున్న 1.63 శాతం నుంచి 1970-71 నాటికి 0.85 శాతానికి తగ్గిపోవటం తెలియజేసిందేమిటంటే ఆ వర్గాల ప్రయోజనాలకు ఈ సామ్రాజ్యవాద అనుకూల నమూనా సేవచేస్తున్నదని. ప్రణాళిక అంటే ధనికులకు, పెద్ద భూస్వాములకు స్వేచ్ఛ నివ్వడం తప్ప మరేమీ కాదు. అదే సమయాలలో ఈ వాస్తవం పేదల, శ్రమించే ప్రజల జేబుల్లోంచి వసూలు చేసే పరోక్షపన్నుల వాటా జాతీయాదాయంలో 1950-51 నుండి 1970-71 మధ్య మూడురెట్లు 4.2 నుంచి 11.0 శాతంకు పెరగటాన్ని తెలియజేస్తుంది.

పెరుగుతున్న అసమానతలు, పెరుగుతున్న తేడాలు : నిర్వాసీకరణ అత్యంత హింసాత్మక రూపం

రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా కోసం పి.డి.ఝూ, పి.వి భట్‌లు ఆదాయ పంపక నమూనా పై చేపట్టిన అధ్యయనం ఇండియన్ ఆర్థిక వ్యవస్థలో అదనపు వడ్డీ సమీకరణ స్వభావం ఒక కీలక అంశాన్ని ముందుకు తెచ్చింది. ఇండియాలో ప్రణాళికాయుత ఆర్థికాభివృద్ధి ఆరంభించి, అమలు చేయడం ద్వారా ఆదాయ పంపకంలో అసమనతా స్థాయి పెరిగిందని తెలియజేసింది అధ్యయనం చేసిన సమయం 1953 - 54 నుంచి 1956 - 57 మొత్తం వ్యక్తిగతాదాయంలో 28 శాతం వరకు పై స్థాయి 10 శాతం కుటుంబాలు పొందినట్లు కనుగొన్నది. మరోపక్క, పట్టణ దిగువ ఆదాయగ్రూపు తమ కుటుంబ ఆదాయంలో మొత్తంగా క్షీణతకు గురయిందని తెలియజేశారు. ప్రత్యక్ష పన్నులు వ్యక్తిగత ఆదాయంలో మార్పులను కలిగించలేదని తెలియజేశారు. ఇండియన్ ఆర్థిక వ్యవస్థ 1960లలో నడచిన తీరు, ఆదాయంలో అసమాన పంపక స్థాయి. ఉన్నతాదాయ వేతనేతర సంపన్న (పెట్టుబడిదారీ, భూస్వామ్య స్థాయి, వర్గాలు) గ్రూపు యొక్క వ్యక్తి గత గృహాదాయంలో గణనీయమైన పెరుగుదల వలననే నని గమనించింది.

ఈ నిర్దిష్ట వాస్తవాలు "నెహ్రూ సోషలిజం" లేక 'మిశ్రమ ఆర్థిక వ్యవస్థ' లేక 'సోషలిస్టు తరహా సమాజం' గురించిన ప్రకటనలు అన్నీ వివిధ పార్టీల నాయకులు పార్లమెంటరీ చర్చలలో చేసే సుదీర్ఘ ఉపన్యాసాలు, లేక ఎన్నికల ఉపన్యాసాలలో భాగంగా చేసే నినాదాలు లేక ఖాళీ వాక్చాతుర్యంల పొగతెర వెనుక వాస్తవంగా ఏం జరుగుతున్నదో తెలియజేస్తున్నాయని చెప్పవచ్చు. ఈ నాడు ఇండియన్ ఆర్థిక వ్యవస్థలో కనబడుతున్న పరిస్థితి పై చెప్పిన గతశతాబ్ది 1970 ఆరంభంలోనున్న పరిస్థితి కన్నా భిన్నంగా ఏమీ లేదు. ఆ విషయానికి తరువాత వస్తాను.

ఏర్పడుతున్న అసమతూకాలు లేక పరిశ్రమ వ్యవసాయంల పురోగామి తిరోగామి లింక్‌లు లేక పోవడం ఆర్థిక వ్యవస్థను తీవ్ర ఒత్తిడికి గురిచేసింది. ఇంతకు ముందు చెప్పినట్లు పరిశ్రమలు ఉత్పత్తి చేసింది వ్యవసాయంలోను, మొత్తంగా పరిశ్రమలలోను ఉత్పత్తిని పెంచే దిశలో ఆర్థిక వ్యవస్థను నిలబెట్టక పోగా, ప్రజా వినియోగ అవసరాలను కూడా తీర్చలేక పోయింది. అమెరికా నుంచి పబ్లిక్ లా 480 కింద పెద్ద ఎత్తున దిగుమతి చేసుకొన్న ఆహారం పరిశ్రమ వ్యవసాయం మధ్య ఏర్పడిన అసమానత కలిగించిన ప్రకంపనలకు ఒక వ్యక్తీకరణం. దీని తర్వాత మరొకసారి అమెరికా సంస్థలు ప్రాయోజిత (ఇంటెన్సివ్ అగ్రి కల్చరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) ధనిక రైతులకు సబ్సిడీ పై ఉత్పాదకాలు ఉదార క్రెడిట్లు, ధరల రాయితీ, సాంకేతిక సలహా, మార్కెటింగ్ సౌకర్యాలపై కేంద్రీకరించింది.

కాని ఈ చర్యలేవి ఇండియన్ ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను పరిష్కరించలేక పోయాయి. తీసుకున్న చర్యలన్నీ పీడితులపై పీడక వర్గాల ఆధిపత్యాన్ని పటిష్టపరచి, ఇండియన్ ఆర్థిక వ్యవస్థపై వడ్డీ వ్యాపారి - భూస్వామి - వర్తకుడి కూటమి పట్టును మరింత పటిష్ట పరచాయి. 1950 - 51 నుండి ఇండియన్ ఆర్థిక వ్యవస్థ అనేక ఎగుడు దిగుడులకు గురయింది. ఇది ప్రధానంగా వ్యవసాయ రంగం ఎగుడు దిగుడు పంటల దిగుబడుల వలన జరిగింది. విదేశీ టెక్నాలజీ, ఎక్విప్‌మెంట్‌పై భారీఎత్తున ఆధారపడిన పారిశ్రామీకరణ గా చెప్పబడేదానికి అవసరమైన పెట్టుబడి విదేశీ మారక ద్రవ్యం అందించేటట్లు వ్యవసాయం రంగంపై కేంద్రీకరణ అని కూడా చూపించింది. వ్యవసాయ రంగం నుంచి ఎడతెగకుండా వచ్చిన మిగులు పెట్టుబడి తీవ్రత గల యంత్రాలను పరిశ్రమలకు క్రమబద్ధంగా జరగటానికి తరలించబడింది. సామ్రాజ్యవాదం ప్రయోజనం కోసం మొదటి మూడు ప్రణాళికలలో ఆర్థిక వ్యవస్థలో ప్రధానమైన వ్యవసాయం అతి తక్కువ వాటా పొందింది. అదే సమయంలో ఇంతకు ముందు చెప్పినట్లు గ్రామ రంగంలో పి.ఎల్. 480, తదితర ప్రోగ్రాంల రూపంలో పెట్టుబడిలో అమెరికా ప్రయోజనం, పరాన్న భుక్కు భూస్వామ్య దళారీ వర్గాల గరిష్ట మిగులు సామర్థ్యాన్ని పెంపొందించడటమే.

1966 - 67 నాటికి మందగించిన పరిశ్రమ రంగాల వెంట లాగబడ్డ ఇండియన్ ఆర్థిక వ్యవస్థ బృహదృశ్యం మిణుకు మిణుకుమంటూ ప్రజా వినియోగ వస్తువులను ఉత్పత్తి చేయటంగాని, ఉపాధి కల్పించటంగాని చేయలేక పోయింది. ఆర్థిక వ్యవస్థలో మొత్తం మీద మందగమనం ప్రజల కొనుగోలుశక్తి క్షీణించడం, విదేశీ మారకద్రవ్యం కొరత ఆహార ద్రవ్యాల ముడిసరుకులు దిగుమతులు డిమాండ్ అసాధారణంగా పెరిగిపోయింది. 20 సంవత్సరాల ప్లానింగ్ తర్వాత 1977 నాటికి నిరుద్యోగం మూడు రెట్లు పెరిగిపోయింది. మూడవ ప్రణాళికలో మొత్తం ఇన్వెస్ట్‌మెంట్‌లో విదేశీ సహాయం 23 శాతంగా వుంది. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో దేశీయ పొదుపు రేటు 5.5 శాతం నుండి 1969 - 70 నాటికి 9.0 శాతంకు పెరిగినప్పటికే అది ఎల్లప్పుడు ఇన్వెస్టుమెంటు రేటుకన్నా తక్కువగానే వుంది. ఇన్వెస్ట్ మెంట్ పొదుపుల మధ్య లేదా విదేశీ సహాయం సహాయంతో పూడ్చబడింది. జనాభా పెరుగటంలోను, 20 సంవత్సరాల ప్లానింగ్ తర్వాత సాధారణ ఇండియన్‌లకు వ్యవసాయ భూమి, గృహవసతి, నీరు, వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యాలు అందుబాటులో వుండటం అనేది అనేక సందర్భాలలో దిగజారిపోయింది.

సామ్రాజ్యవాద అవసరాలు తీర్చేసాధనంగా తయారు చేయబడ్డ ఆర్థిక వ్యవస్థలో సహజంగా నున్న నిర్వాసీకరణ మరింత అసమానతలను పుట్టించే క్రమం తప్పమరేమి కాదు. మరోమాటల్లో నిర్వాసీకరణను ప్రధానంగా ప్రేరేపించే అంశాలను ఆర్థిక వ్యవస్థలోని ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి శక్తుల మూలాల్లో మాత్రమే వెదకాలి. ఇండియా ప్రధానంగా అసంఖ్యాక ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడ్డ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థగా నుండి వ్యవసాయరంగంలో ఆవిర్భవించిన మిగులును గుంజుకొని ఆర్థిక వ్యవస్థకు అప్పగించటం ద్వారా

పారిశ్రామిక రంగంగా చెప్పబడిన దానితో సహా మొత్తం ఆర్థిక వ్యవస్థ నడిపించబడుతున్నది. ఇది పెద్ద ఎత్తున హెచ్చు తగ్గులతో కూడిన ఆర్థిక వ్యవస్థను సృష్టించింది. పట్టణ కేంద్రాలలో సంపద కేంద్రీకృత మవుతుండగా, గ్రామీణ రంగంలో తీవ్ర దివాళాకోరుతనం కేంద్రీకృతమయింది. ఇది అసంఖ్యాక ప్రజానీకం తమ ఉత్పాదక సామర్థ్యాలను వినియోగించలేక పోయిన గ్రామీణరంగంలో సౌష్టవం లేని మార్కెట్ పరిధిలో బందీలుగానున్న నిర్వాసీకరణ తప్ప మరేమీ కాదు. ఈ అభివృద్ధి నమూనా పట్టణ గ్రామీణ వ్యవసాయం పరిశ్రమల మధ్య, భారీ లఘు పరిశ్రమలు, భారీ పెట్టుబడి - చిన్న పెట్టుబడి, పెద్ద పరిశ్రమ - చిన్న పరిశ్రమ అంతిమంగా మానసిక శారీరక శ్రమల మధ్య హెచ్చు తగ్గులు సృష్టిస్తుంది. ఇంతకు ముందు చెప్పినట్లు, వృద్ధి కేంద్రాలు ప్యాకెట్లు మిగతాప్రాంతాలకేమో అవకాశాలు లేక పోవడం, దివాళా తీయడం కు గురవుతుంటారు. పురుషులు, స్త్రీలు, యువకులు, వృద్ధులు ఎవరూ ఈ అభివృద్ధి భయం పరిధి నుంచి బయటపడలేరు.

విదేశీ సహాయ ప్రధాన పాత్ర ధనికుల కోసం ప్లానింగ్ :

ఇండియన్ ఆర్థిక వ్యవస్థను పెంపొందింప చేయడంలో సహాయం పాత్ర గురించి, రాజ్య పాలసీ అంగాలలో ఒక దాని పత్రం ఇలా చెబుతుంది.

"మొత్తం ఆహారేతర సహాయంలో 86 శాతం మౌలిక సదుపాయాలు బలోపేతం చేయటానికి, ఉత్పత్తిదారుల ఉత్పత్తులను వృద్ధి చెందించటానికి అంకితం చేయబడింది. మిగిలిన దాంట్లో 7.6 శాతం వినియోగ వస్తువుల పరిశ్రమలో ఇన్వెస్టుమెంటుగా వెళ్ళగా, 3.6 శాతం విద్యా పరిశోధనల్లో పెట్టుబడి వస్తువులు 2.8 శాతం అనిర్దిష్ట అవసరాలకు వాడబడింది. ఇండియాలో ప్రస్తుత విదేశీ సహాయ వినియోగ చట్టం మార్జినల్ అవకాశాలు అందించటానికి, కాకపోతే అభివృద్ధికి ప్రత్యక్ష నష్టం లేకుండా తగ్గించిన మొత్తం అందించబడింది."

ఒక పక్క ప్రభుత్వ పాలసీ డాక్యుమెంట్లన్నింటిలోను, ప్రధాన మంత్రి, ఇతర నాయకుల బహిరంగ ప్రకటనలలో ఎప్పుడూ ఇండియాలో ప్రణాళికాభివృద్ధిని కొనసాగించటంలో ఒక ప్రధాన వనరుగా విదేశీ సహాయంపై ఆధారపడటాన్ని వదలించుకోవటానికి ఓర్పుతో వేచివుండాలని పదేపదే విజ్ఞప్తులు చేస్తుంటారు. కాని మరోపక్క ప్రభుత్వ డాక్యుమెంట్లు, రాజ్యంకు అనుకూలంగా వకాల్తా పుచ్చుకొనే అంగాలు కళాత్మకంగా బుకాయింపుకు దిగుతూ, అంతిమంగా పరిశ్రమ డిమాండ్ల తీర్చటానికి, చెల్లింపుల బ్యాలెన్స్ సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి, విదేశీ సహాయ అవసరంపైన గట్టిగా సమర్ధిస్తుంటాయి. అనేక ఇతర మూడవ ప్రపంచ దేశాలలాగే ఇండియా కూడా పాశ్చాత్యదేశాలను అందుకోవాలనే గమ్యం చేరుకోవటానికి చేసిన ప్రయత్నం వలన, ఎగుమతుల ఆదాయంతో దిగుమతుల అవసరాలను తీర్చుకోవడం సాధ్యం కావడం లేదు.

ఆ విధంగా ఈ రాజ్య ఏజెన్సీలు స్వయం సమృద్ధి తర్కాన్ని తల కిందులుగా చేసి చూపిస్తున్నాయి. ఇది రాసే సమయానికి, ఈ దేశ ప్రజలను ఒక పద్దతి ప్రకారం అంతకంతకు అప్పులలోకి దించుతూ, దివాళా తీయించి, స్వయం సమృద్ధి కోల్పోయేటట్లు చేశారనేది స్పష్టంగా అర్థం చేసుకోవాలి ఇందుకు భిన్నంగా ఈ నిపుణులు ఇండియాలోని ఎక్కువ భాగం పరిశ్రమలు పెట్టుబడి సాంద్రత ఎక్కువగా వుంది, విదేశీ టెక్నాలజీపై ఆధారపడి వుండడం వలన అవి విదేశీ సహాయం లేకుండా, అటువంటి అవసర టెక్నాలజీ నిరంతరం లేకుండా సాధ్యం కాని పారిశ్రామిక ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. విదేశీ సహాయం పారిశ్రామికోత్పత్తిని పెంపొందించి సమర్థవంతంగా ఉపాధి కల్పిస్తూ, మార్కెట్లో వికాసం పెంచి, అంతిమంగా విదేశీ సహాయంపై ఆధారపడడం తగ్గిస్తుం దంటారు. ఆ విధంగా వారు సంక్షోభాన్ని సృష్టించడానికి కారణమైనదాన్నే సంక్షోభాన్ని పరిష్కరించేదిగా వాదిస్తున్నారు. జాగ్రత్తగా విదేశీ సహాయాన్ని పొందటానికి దోహదం చేసిన అవసరాన్ని దాచి పెడుతున్నారు. మేం ఇంకొక సారి నొక్కి చెప్పేది ఏమిటంటే, ఇండియన్ పాలకవర్గాలు విదేశీ సహాయం లేకుండా ఇండియన్ ఆర్థిక వ్యవస్థపై తమ ఆదిపత్యాన్ని నిలబెట్టుకోజాలరు.

ఈ పరిస్థితిని శాశ్వతంగా వుండేటట్లు చూడడం అమెరికా సామ్రాజ్య వాదానికి ఎంత అవసరమో స్పష్టమవుతున్నది. దీనికి ఐదు పంచవర్ష ప్రణాళికల కాలమంతా విస్తృతంగా ఎయిడ్ పాకేజీలను అందించడంలో అనేక అంశాలు భిన్న దిక్కులలో వ్యాపించడం కన్నా ఒక దగ్గరికి చేరటం అవసరంగా కనుపిస్తుంది. మొదటి పంచవర్ష ప్రణాళికలో రు. 380.3 కోట్లున్న విదేశీ సహాయం నిరాఘాటంగా పెరుగుతూ రెండవ పంచవర్ష ప్రణాళికలో రు. 2731.3 కోట్లు మూడవ ప్రపంచ వర్ష ప్రణాళికలో 3937.8 కోట్ల రూపాయలకు పెరిగింది. మొదటి ప్రణాళిక తర్వాత మొత్తం విదేశీ సహాయంలో గ్రాంట్ల వాటా తీవ్రంగా తగ్గిపోయి 1970 - 71 నాటికి 5.5 శాతానికి పడిపోయింది. లోన్లు ఏ దేశం నుంచి తీసుకుంటే ఆ దేశం నుంచి మాత్రమే దిగుమతులు చేసుకోవాల్సి వుంటుందనేది స్పష్టం. కాబట్టి ఇండియాలాంటి దేశం లోనే కాంట్రాక్టుకు కట్టుబడి వుండటం వలన అత్యంత చౌకగా వుండే మార్కెట్లును ఎంపిక చేసుకొనే అవకాశం లేదు. దీని వలన రుణాల తిరిగి చెల్లింపులో తీవ్ర అసౌకర్యముంది. అప్పుడు పూర్తి స్థాయిలో మార్చదగిన విదేశీ మారక ద్రవ్యంలోనే చెల్లించాలి. దిగుమతుల కిచ్చే లోన్లు కావడం వలన దాత దేశాలలోనే రేటు, ఇతర సర్వీసింగ్ ప్రమేయం లేకుండా కొనుగోలు చేయాల్సి వుంటుంది. ఆ విధంగా అప్పు అనేది పుచ్చుకునే దేశం అప్పును వడ్డీతో సహా తిరిగి చెల్లించడం తప్ప మరేమి కాదు. అంటే దాత దేశం పుచ్చుకునే దేశంలో తన మార్కెట్ను పెంచుకోవడం కోసమే అప్పులిస్తారన్న మాట ! ఆదే సమయంలో ఇండియా అప్పు పరిస్థితి ప్రమాద ఘంటికలు మోగించే ధోరణులను తెలియ జేసింది. 1970 - 71 లో ఇండియన్ ఆర్థిక వ్యవస్థపై అప్పు సర్వీసు భారం ఎగుమతులలో 28 శాతం, కొత్త విదేశీ సహాయ వాగ్దానం లో 55 శాతంపైగా వుంది.

ప్రపంచ బ్యాంక్ మార్గదర్శ తీర్పులలో దాని సంబంధిత సహాయం వలన, ఇండియా 1970 దశకం చివరిలో బృహత్తర ఎరువుల ఫ్యాక్టరీల కోసం విదేశీ మిలాఖత్తులను ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాని అప్పటికే ఇండియాలో ప్రభుత్వరంగం ఎరువుల టెక్నాలజీకి సంబంధించిన మౌలిక నైపుణ్యజ్ఞానాన్ని సంపాదించింది. తత్ఫలితంగా ఎరువులనుత్పత్తి చేసే ప్రభుత్వ రంగ ఫ్యాక్టరీలను మొత్తంగా రద్దు చేసి, కృత్రిమంగా పెంచిన ఖర్చుతో ప్రాజెక్టులు ప్రారంభించాల్సి వచ్చింది. ఆ విధంగా ఎరువుల ఫ్యాక్టరీల పెట్టుబడి ఖర్చులు వాస్తవ ఖర్చుల కంటే కొన్ని రెట్లు ప్రభుత్వం భరించాల్సి వచ్చింది. అదే కొన్ని సమస్యలున్నా స్థానికంగా లభించే టెక్నాలజీపై ఆధారపడి వుంటే ఖర్చులు తగ్గివుండేవి. దీని వలన ఎరువుల రేట్లు బాగా పెరిగిన ఫలితంగా రైతుల నడ్డి విరిగింది.

ఆర్థిక వ్యవస్థను ఆవరించిన తీవ్ర సంక్షోభం ప్రజల నుంచి పెరిగిన తీవ్ర అసంతృప్తి రాజకీయ రూపంలో వ్యక్తమైంది. అది 1960 దశకం చివరలో ఆవిర్భవించిన నక్సల్బరీ వుద్యమ ఘంటారావం ఆ చివరి నుంచి ఈ చివరకు ప్రతిధ్వనించింది తీవ్రంగా పెరిగిన నిరుద్యోగ భూతం తీవ్ర దుర్భిక్షం మూలంగా వచ్చిన తీవ్ర ఆహార కొరత, సంక్షోభం పాలక వర్గాలను, వారి సామ్రాజ్యవాద అనుకూల రాజకీయాలను ఢీకొంది. ఇది నక్సలైట్ల విప్లవ పిలుపుతో ప్రతిఫలించింది. 1947 లో అధికార మార్పిడి తర్వాత నెహ్రూ ప్రణాళికాబద్ధ అభివృద్ధి స్వభావాన్ని బహిర్గత పరచిన మొట్టమొదటి ఉద్యమం. ఈ ఉద్యమం మొట్టమొదటి సారిగా భూమి గురించిన చర్చను ఇండియా రాజకీయ నిఘంటువులోకి తీవ్ర రూపంలో తిరిగితెచ్చింది. సామ్రాజ్యవాద సేవలోనున్న ఈ దేశ ఆర్థిక వ్యవస్థను వెనుకకు గుంజుతున్న నిర్మాణాల అన్నింటిని సమూలంగా నిర్మూలించితే తప్ప దోపిడీ రూపాలన్నింటి నుండి స్వేచ్ఛగా అభివృద్ధిని సాధించడం సాధ్యం కాదని ప్రకటించింది. ఈ సందర్భంలోనే అభివృద్ధి కోసం ఏ పంథాను అనుసరించాలనే చర్చను ముందుకు తెచ్చింది.

నూతన వ్యూహం అవసరం

ఇండియన్ బడా బూర్జువా వర్గం ఎదుర్కొన్న సవాలు చాల పెద్దది. మొదటిది ఇండియాలాంటి మూడవ ప్రపంచ దేశాలలో అత్యధికం, తాము

స్వయంగా సృష్టించిన సంక్షోభాలతో తలపడాల్సివుంటుంది. వారు చెప్పుకొన్న దానికి విరుద్ధంగా విదేశీ మార్కెట్, విదేశీ పెట్టుబడిపై ఆధారపడేటట్లు ఆర్థిక వ్యవస్థను నెట్టిన దిగుమతి ప్రత్యామ్నాయ పారిశ్రామికీకరణ వ్యూహం నుండి బయట మార్గం వెతుక్కోవాలి. ఎగుమతిలో చాలా పెద్ద భాగం రుణమొత్తంలో అసలు గాక, రుణంపై వడ్డీకి సరిపోయే అప్పుల దాస్యం అనిశ్చిత పరిస్థితుల్లో, పాలక వర్గాలు మరింత, ఎగుమతులు చేసే పరిస్థితికి నెట్టబడుతున్నారు. దీనర్థం విదేశీ మార్కెట్ పై మరింత ఆధారపడటమే.

అదే సమయంలో అమెరికా నాయకత్వంలోని పెట్టుబడిదారీ ప్రపంచం, అంతర్జాతీయ దృశ్యంలో ఒక పరిస్థితిని సృష్టిస్తున్నది. అది మూడవ ప్రపంచదేశాలను ఎగుమతి ఆధారిత పారిశ్రామీకీకరణ సరికొత్త వ్యూహానికి దిగేటట్లు ప్రోత్సహిస్తున్నది. అటువంటి వ్యూహం అవలంబించడంలో సామ్రాజ్య వాదానికి ఒక గట్టి కారణముంది. బహుళ జాతి కార్పొరేషన్లు అంతర్జాతీయ సబ్‌కాంట్రాక్టింగ్ కొత్త ధోరణి దానర్థం. ఈ అంతర్జాతీయ సబ్‌కాంట్రాక్టింగ్‌కు గల ప్రధాన కారణాలలో ఒకటి పెరుగుతున్న అంతర్గత వర్గ ఒత్తిడులు, పోరాటాలు అమెరికాలో 1960 మధ్య కాలానికి మెరుగైన వేతనాల కోసం, రాజకీయ లాభాల కోసం పెరుగుతున్న కార్మిక వర్గ డిమాండ్లతో పెట్టుబడిదారుల అధిక లాభ మార్జిన్‌లను ఇంకేమాత్రం నిలబెట్టు కోలేకపోతున్నారు. పేమెంటు లోట్లు పెద్ద బాలెన్స్ ద్రవ్యోల్బణం, సంపూర్ణ ఉపాధులు ప్రాఫిట్ గుంజుకోవడం లాంటి స్వదేశీ ఆర్థిక ఒత్తిడులు అమెరికా పెట్టుబడిదారులను నిరంతర ధరల పెంపుదల ద్వారా ప్రాఫిట్ మార్జిన్లను విజయవంతంగా పునఃప్రతిష్టించుకోవాల్సిన పరిస్థితికి త్రోయబడ్డారు. ప్రాఫిట్ మార్జిన్‌లను పునఃప్రతిష్టించుకోవటానికి మూడవ ప్రపంచ దేశాల్లోని చౌక శ్రమ మార్కెట్లలోకి చొరబడి ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకొని, స్వదేశంలోని సంపూర్ణ ఉపాధి వత్తిడులను ఎదుర్కోవడం ఒక మార్గం. మార్కెట్ కోసం మరింత ప్రత్యక్ష ఉత్పత్తి కోసం అమెరికా అంతర్జాతీయ సబ్ కాంట్రాక్టింగ్‌కు దిగడం నూతన అంతర్జాతీయ శ్రమ విభజనను వేగవంతం చేసింది.

పారిశ్రామిక సామ్రాజ్యవాద దేశాల్లోని పెట్టుబడిదారులు ఎలక్ట్రానిక్స్ లాంటి నూతన శ్రమ తీవ్ర మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమల అభివృద్ధి, బట్టలు, చెప్పుల తయారీలాంటి తేలికపాటి మాన్యుఫ్యాక్చరింగ్ జాయినింగ్ పాత శ్రమ తీవ్ర పరిశ్రమలలో సబ్ కాంట్రాక్టింగ్ విధానాల గురించి ఆలోచించే అవకాశం కూడా ఏర్పడింది. పారిశ్రామిక పాశ్చాత్య దేశాలలో అనేక ఉత్పత్తులు స్టాండర్డ్‌విగా మారి మాస్ మార్కెట్లలో అమ్ముడు పోతుండటంతో అటువంటి ఉత్పత్తుల తయారీని సబ్ కాంట్రాక్టింగ్‌కు ఇవ్వడం తేలిక. రవాణా, కమ్యూనికేషన్లలో వచ్చిన నూతన సాంకేతిక ఆవిష్కరణలు కూడా అటువంటి ఉత్పత్తులను సబ్ కాంట్రాక్టింగ్‌కిచ్చి, తమ ఉత్పత్తులు, విడి భాగాలు వేగంగా, చౌకగా, సురక్షితంగా పంపగలగడం కూడా ప్రొడక్ట్‌లైన్స్‌లో పురోభివృద్ధి తెచ్చాయి. ఈ అంతర్జాతీయ శ్రమ విభజన చలనశీలతకు. సామ్రాజ్యవాదుల మధ్యగల పరస్పర శత్రుత్వం కూడా దోహదం చేయటం మరొకఅంశం. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత మూడవ ప్రపంచ దేశాలలో పెట్టుబడులు పెట్టే ప్రాబల్య పెట్టుబడిదారీశక్తిగా అమెరికా తయారైంది. అమెరికా బహుళ జాతి సంస్థలు మాత్రమే మూడవ ప్రపంచ దేశాలలో ఆ మార్కెట్లను పొందే ఏకైక లక్ష్యంతో పెట్టుబడులు పెట్టాయి. పెట్టుబడిలో అత్యధిక భాగం స్వదేశీమార్కెట్ సరిపోయిన సైజులోనున్న లాటిన్ అమెరికా దేశాలలోకి వెళ్ళింది. 1960 మధ్య నాటికి రెండవ ప్రపంచ యుద్ధంలో బూడిదగా మిగిలిన జర్మనీ, జపాన్‌లు అంతర్జాతీయ మార్కెట్‌పై అమెరికా నియంత్రణను గట్టిగా సవాలు చేయడం ఆరంభించాయి. సాపేక్షికంగా చౌకశ్రమ, మరింత ప్రభుత్వ సహాయం, మరింత ఆధునిక ఫ్యాక్టరీలు, ఎక్విప్‌మెంట్‌ల పరంగా అనుకూల పరిస్థితి గల ఈ దేశాల ఎగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థలను ఎదుర్కోటానికి, అమెరికా దేశాంతర పెట్టుబడి అంతర్జాతీయ సబ్ కాంట్రాక్టింగ్ విధానం ద్వారా పాక్షికంగా ఆ సవాలు నెదుర్కొంది. ఈ వ్యూహం ద్వారా జపాన్, జర్మనీలను అదే వ్యూహం అవలంబించేటట్లు ఒత్తిడి చేయటం ద్వారా కూడా అమెరికా తన మార్కెట్లను రక్షించుకుంది.

ఇండియాపై ప్రభావం

1960 ల మధ్యలో ఇండియన్ ఆర్థిక వ్యవస్థ బాహ్యంగా, అంతర్గతంగా తానెదుర్కొన్న ఒత్తిడులను అనేక ప్రభుత్వ జాతీయ వకాల్తా పాలసీ ప్రకటనలలో నుండి చదువు కోగలం. చెప్పాలంటే :

"ఎగుమతుల ద్వారా పరిశ్రమలకు అవసరమైన విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించుకునే ప్రయత్నం చేయాలి. ఉత్పత్తిలో ఒక భాగాన్ని ఎగుమతులకు మరల్చడం వలన పరిశ్రమ లాభం రేటులో కొంత క్షీణతకు గురికావచ్చు ......రెండవ చర్య, మొదటి దాని నుండి స్వతంత్రమైందేమీ కాదు, కొన్ని ప్లాంట్లు / పరిశ్రమలను ప్రత్యేకంగా ఎగుమతులకు కేటాయించవచ్చు. ఈ ప్లాంట్లను అదే పరిశ్రమలోని ఇతర ప్లాంట్లతో భిన్న స్థాయిలో పన్నుల విధింపు, ఇతర విషయాలు, రవాణా చార్జీలతో కూడా చేయబడగలగాలి. స్పెషల్ ట్రీట్ మెంట్ ఎలా గుండాలంటే స్వదేశీ మార్కెట్లో అమ్మటానికి బదులుగా ఎగుమతి చేయడం వలన ఆ యూనిట్లు నష్టపడకుండా చేయాలి."

దీంతో బాటు, 1970 ల మధ్యలో యూరోపియన్ మార్కెట్లో పూహించిన డిమాండ్‌లో పెరుగుదలకు అనుగుణంగా ఇనుపఖనిజ ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచటానికి ప్రయత్నాలు జరిగాయి. ఖనిజ రంగంలో బొగ్గు, మాగ్నసైట్ ఇతర ప్యాక్టరీలు, ఇల్మనైట్, స్లేటైట్, గ్లాస్ శాండ్, డైమెన్షన్ స్టోన్‌లలో ఎగుమతి అవకాశాలు ఏర్పడ్డాయి. అధ్యయనం కూడా ఒరిస్సాలోని కిరుబురు ఇనుపగని నుండి ఆంధ్ర ప్రదేశ్‌లోని విశాఖపట్టణం నుండి ఎగుమతి చేయటం వలన రవాణా ఖర్చులు వలన నష్టం జరుగుతున్నది. కాబట్టి దానికి బదులుగా చౌకగా రవాణా చేయటానికి పరదీప్ ఓడరేవును అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని తెలియజేసింది. ఇంకా చత్తీస్‌ఘడ్‌లోని ఇంద్రావతి నదీ లోయ నుంచి అపార జలవిద్యుత్ సామర్థ్యాన్ని పరిశోధించి, ఆ అవకాశాలను కోర్బా ప్రాంతంలో ఉత్పత్తి చేసే ఇనుపఖనిజం కరగించటానికి వాడుకోవటం ద్వారా గరిష్ట లాభం సంపాదించే అవకాశం గురించి నొక్కి చెప్పింది. తరగని అపార సహజ వనరులున్న ఈ ప్రాంతాలన్నింటిని గుంజుకోవటానికి లాభంకలిగివున్న బహుళ జాతి సంస్థలు ప్రస్తుత ప్రత్యేక ఆర్థిక మండలాలు, మెగా జల ప్రాజెక్టులు, మైనింగ్ ఆపరేషన్లు ప్రస్తుత పాలసీచొరవతో వుండటం ఆశ్చర్యం కలిగించదు.

ఎక్స్‌పోర్టు ప్రాసెసింగ్ జోన్లు - ఎస్. ఇ. జెడ్‌ల పూర్వీకులు

విధాన నిర్మాతలు పెట్టే విధానాలకు అనుగుణంగా, నూతన అంతర్జాతీయ, క్రియాశీల, స్వదేశీ ఇంబాలెన్స్‌లను పరిగణలకు తీసుకొని, పారిశ్రామిక రంగానికి అవసరమైన విదేశీ మారక ద్రవ్యం కోసం, చెల్లింపుల బ్యాలెన్స్ సంక్షోభం నుండి బయట పడేసేదిగా ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్లలను ప్రవేశపెట్టారు.

ఆవిధంగా గుజరాత్, కేరళ, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌లలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్లలకు సెజ్‌లకు పూర్వీకులు గుజరాత్‌లో మొట్టమొదటి ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్‌ను 1960 చివరిలో ఏర్పాటు చేశారు. తరువాత 1973 లో బొంబాయిలో ఇ.పి.జడ్ శాంతాక్రజ్ దగ్గర ఏర్పడింది. 1980 ల మొదట్లో కేరళలోని కోచి, పశ్చిమ బెంగాల్‌లో ఫాల్టా, ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నంలో దగ్గర ఈ నాలుగు ఇ.పి.జడ్ లు ఏర్పాటయ్యాయి. "బహుళ కంట్రోళ్ళు, క్లియరెన్స్‌ల వలన తరుచుగా ఏర్పడుతున్న లోటుపాట్లను అధిగమించటానికి అంతర్జాతీయస్థాయి మౌలిక సదుపాయాల అలభ్యత, అస్థిర ఆర్థిక విధానం ఇండియాలోకి పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులు ఆకర్షించేందుకు ఇ.పి.జడ్ లను ఏర్పాటు చేయటానికి గల కారణాలను ప్రత్యేక ఆర్థిక మండలాలు రేఖామాత్ర పరిశీలనలో సమర్థించారు. కాని "అస్థిర ఆర్థిక విధానం ను సరిచేయటానికి ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్‌ల ఏర్పాటు విధానం ఎలా సహాయపడిందో సమీక్షలో ఎక్కడా కనపడదు.

ఇండియాలో 1965 నాటికే గుజరాత్‌లోని కాండ్లాలో మొదటి ఇ.పి.జడ్ నెలకొల్పారు. 1973 నుండి శాంతాక్రజ్ ఎలక్ట్రానిక్స్ ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్ పనిచేయటం ఆరంభించింది. కేంద్రప్రభుత్వం 1984 లో కోచి (కేరళ), చెన్నై (తమిళనాడు), ఫాల్టా (పశ్చిమ బెంగాల్), నోయిడా (ఉత్తర ప్రదేశ్) వద్ద మరో నాలుగు జోన్‌లను నెలకొల్పింది. తరువాత ఇంకొకటి విశాఖపట్టణం (ఆంధ్ర ప్రదేశ్) లో ఏర్పాటు చేశారు.

ముంబాయిలోని యస్.ఈ.ఈ.పి.జడ్ శ్రమ తీవ్రత గల లఘు పరిశ్రమలను తినేసింది. వీటిలో చాలా భాగం గృహ పరిశ్రమ స్థాయి వాటిని ఉన్నత యాంత్రీకృత వస్త్రాల పరిశ్రమ తొలగించివేసింది. ఇది 2002-03 లో మొత్తం వస్త్రాల ఎగుమతిలో దీని వాటా 55 శాతం కన్నా ఎక్కువ వుంది. తాతాలు అమెరికా కంపనీ బ్యూరాక్రసీ మిలాఖాతై, 1977 లో ఎస్.ఇ.ఇ.పి.జడ్ ద్వారా సాఫ్ట్‌వేర్, పెరిఫెంట్స్‌లో ఇండియా ఎగుమతులు ప్రారంభించడం కనిపిస్తుంది.

సిటీ బ్యాంక్ 1985 లో ఎస్.ఇ.ఇ.పి.జడ్ 100 శాతం విదేశీ యాజమాన్య ఎగుమతి స్వభావ ఆఫ్ షోర్ కంపెనీని ఏర్పాటు చేసింది. మొదటి ప్రయివేటు ఈ.పి.జడ్ 1998 లో సూరత్‌లో ఆపరేషన్స్ ప్రారంభించింది. ఈ ఎనిమిది ఈ.పి.జడ్ సూరత్‌తో సహా నూతన సెజ్‌స్కీమ్‌లోకి పరివర్తన చేయబడ్డాయి. లోని మొత్తం పెట్టుబడిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి తక్కువగా 16.7 శాతం దగ్గరుంది. ఎక్కువ చేసి చెప్పడం ఆశించింది ఏమైనప్పటికీ 2004-05 నాటికి దేశం ఎగుమతుల్లో ఈ.పి.జడ్‌ల వాటా 5 శాతం మాత్రమే వుంది, మొత్తం ఫ్యాక్టరీ ఉపాధి అవకాశాల్లో 1 శాతంగాను, ఫ్యాక్టరీ ఇన్వెస్ట్‌మెంటు లో 0.32 శాతంగా వుంది. ఇది తెలియజేసేది ఏమిటంటే ఇండియా ఇప్పటికే సాంప్రదాయ ఎగుమతి వనరుల పునాది నుండి బయటపడలేదని అర్థమవుతుంది. ఇది అంతర్జాతీయ సబ్ కాంట్రాక్టింగ్ పోటీలో దూసుకెళ్ళడంతో బడాబూర్జువాజీ అసమర్థతను కూడా ప్రతిబింబిస్తుంది. దాని ప్రయోజనాలు మౌలికంగా సామ్రాజ్యవాద మార్కెట్, పెట్టుబడిలో ఎగుడు దిగుడులను కట్టి వేయటం వలన మాన్యు ఫాక్చర్ చేసిన పారిశ్రామిక వస్తువులపై ఆధాపడిన మార్కెట్‌ను అభివృద్ధి చేయటంలో అసమర్థమైంది.

ఆ విధంగా 1970 లో మెక్సికో, బ్రెజిల్, ఆర్జెంటైనా, ఇండియాలు మొత్తం మూడవ ప్రపంచ దేశాల పారిశ్రామిక ఉత్పత్తిలో 55 శాతం కలిగి ఉన్న ఈ దేశాలు తమ కున్న పెద్ద ప్రకృతి వనరుల ఎండోమెంట్ వుండటం వలన ఎగుమతులు సాంప్రదాయ వనరులపై ఆధారపడి వున్నాయి. ఈ ఎగుమతి ఉత్పత్తుల్లో ఎక్కువ భాగం ఆహార పదార్థాలు, పొగాకు, బట్టలు, చర్మ తయారీ వస్తువులున్నాయి. ఇండియా వస్త్రాలు చర్మం పాద రక్షలు, బట్టల తయారీలో ప్రత్యేకీకరణ చెందింది.

ప్రత్యేక ఆర్థిక మండలాలు : మూడవ ప్రపంచ దేశాలలో భవిష్య సామ్రాజ్యవాద రూపం

ప్రస్తుత ప్రత్యేక ఆర్థిక మండలాల విశ్లేషణ భౌగోళికంగా ఇండియాలోని పంజాబు నుండి దక్షిణాదిన కేరళ రాష్ట్రం వరకు పరిమితమైంది. అనేక జాతులున్న మొత్తం ఈశాన్యప్రాంతం, జమ్మూ కాశ్మీర్ ప్రాంతంకు సంబంధించి వివరంగా విశ్లేషించాల్సిన అవసరముంది. ఇది మన ప్రస్తుత వ్యాస పరిధిలో లేదు. ఇది మొదటి కేటగిరిలోని ప్రత్యేక ఆర్థిక మండలాల రాజకీయ ఆర్థిక శాస్త్ర రేఖామాత్రంగా ప్రస్తుతం పరిమితమవుతుంది. ఇక్కడ చెప్పొస్తుంది ప్రస్తుత విశ్లేషణా పరిధి పరిమితమైంది ఒక నిర్దిష్ట ప్రాంతం లేక రాష్ట్రం స్థాయిలో విశ్లేషణ చేస్తే, మనకు అనుభవాత్మకంగాను, భావనా సంబంధమైన లోతైన అధ్యయనాలను సాగిస్తే మరింత నిశిత కోణాలు అందిస్తుంది. ఈ పాలసీ చొరవకు సంబంధించిన తీవ్రంగా విస్తరించిన శాఖోపశాఖలు ఉపఖండంలోని వివిధ వర్గాల ప్రజల జీవితాలపై, జీవనాల భవిష్యత్‌పై ఎలాగుంటుందో వెలుగులోకి వస్తుంది.

ఏప్రియల్ 2000లో ప్రకటించబడిన ప్రత్యేక ఆర్థిక మండలాల (సెజ్) విధానం ప్రయివేటు పెట్టుబడికి మరిన్ని లాభసాటి ప్రోత్సాహకాలు / లాభాలు వాగ్దానం చేసింది. నవంబర్ 1, 2000 నుండి ఫిబ్రవరి 9, 2006 కాలంలో విదేశీ వ్యాపార విధానం ఏర్పాటుతో ఆచరణలో కొచ్చిన సెజ్‌లు, అప్పటికే వున్న జోన్‌ల (EPZ)తో సహా సెజ్‌లుగా మార్చబడ్డాయి ఆర్థిక ప్రోత్సాహకాలను చట్టబద్ధం చేయటానికి శాసనం చేసిన తరువాత అమలులోకొచ్చాయి.

స్పెషల్ ఎకనమిక్ జోన్స్ (సెజ్) యాక్ట్ 2005, మే 2005లో పెద్ద చర్చ లేకుండానే అతి త్వరగా ఇండియన్ పార్లమెంట్ ఆమోదించడం, దానికి జూన్ 23, 2005న రాష్ట్రపతి ఆమోదముద్ర లభించడం పెద్దగా ఆశ్చర్యపోవాల్సిన విషయమేమీ కాదు. సెజ్‌యాక్ట్, సెజ్‌రూల్స్ మద్దతుతో ఫిబ్రవరి 10, 2006న అమలులోకి వచ్చింది. కొత్త సెజ్‌చట్టం పారిశ్రామిక కార్యకలాపాలకే పరిమితం కాక, సర్వీసులు, వ్యాపారాన్ని కూడా కవర్ చేసింది. ఎగుమతులు ఉత్పత్తి చేసి, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడం అనే మామూలు లక్ష్యం మాత్రమే వుంది. ముందే నిర్ణయించబడిన వాల్యూ ఎడిషన్ కంపోనెంట్ లేక కనీస ఎగుమతి అవసరాలు గాని లేవు.

సెజ్‌లు రాజ్యాంగ ప్రకరణం 243Q కింద "పారిశ్రామిక పట్టణాలు" ప్రకటించబడి, ఎన్నికల ప్రక్రియ ద్వారా ఏర్పడే స్థానిక ప్రభుత్వాలకు వర్తించే రాజ్యాంగం పారా 1X - ప్రొవిజన్ నుండి మినహాయింపులిచ్చారు. ఒక ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ అథారిటీ ఏర్పరచి, ఒక మున్సిపాలిటీకున్న అధికారాలు, బాధ్యతలు పొందుతాయి. డెవలప్‌మెంట్ కమీషనర్ డెవలపర్‌తో బాటు, స్థానిక ప్రజాస్వామ్య సంస్థల పరిధి నుండి తొలగి, రాజ్యంకు సంబంధించిన పబ్లిక్ సర్వీసులు, పోలీస్, న్యాయ, స్థానిక పరిపాలనలాంటి రాజ్య కేంద్రీకృతాధికారాలన్నీ ఈ డెవలప్‌మెంట్ కమిషనర్, డెవలపర్, కేంద్రప్రభుత్వ నిర్వహణలోకొస్తాయి.

న్యాయ పోలీసింగ్ విధులు యాక్ట్ సెక్షన్ 22 కింద డెవలప్‌మెంట్ కమిషనర్ అనుమతి లేకుండా ఏ ఏజెన్సీ లేక ప్రత్యేక ఆర్థిక మండలంలో ఎటువంటి పరిశోధన, సోదా లేక స్వాధీనాలు కొనసాగించరాదు. యాక్ట్ సెక్షన్ 21కింద కేంద్రప్రభుత్వం ప్రకటించిన 'ప్రకటిత నేరాలు' సందర్భంలో మాత్రం ఇందుకు మినహాయింపు. వీటిని కూడా డెవలప్‌మెంట్ కమిషనర్‌కు తెలియజేయాల్సి వుంటుంది. సెజ్‌ల యాక్ట్ 21 క్రింద స్పెషల్ కోర్టులు ఏర్పాటు చేసి, సివిల్, క్రిమినల్ విషయాలు రెండింటిని విచారిస్తారు. అవి మాత్రమే సెజ్‌పరిధిలో ఏ సివిల్ వివాదాన్నైనా విచారిస్తాయి. తీర్పు చెబుతాయి ప్రకటిత నేరాలపై విచారణను అవి మాత్రమే చేస్తాయి. అప్రకటిత నేరాలకు సంబంధించి సాధారణ క్రిమినల్ విచారణలను సాధారణ కోర్టులలోనే విచారిస్తారు. కాని డెవలప్‌మెంట్ కమిషనర్ అనుమతి లేకుండా అటువంటి నేరాల విచారణ సాధ్యం కాదు. స్పెషల్ కోర్టులపై అప్పీళ్ళు రాష్ట్ర హైకోర్టులలోనే దాఖలు చేయాల్సి వుంటుంది. సెజ్‌ల కోసం ఇటువంటి ప్రొవిజన్స్ డెవలప్‌మెంట్ కమిషనర్ కీలక పాత్ర పోషించే ప్రత్యేక జ్యూడిషియరీ వ్యవస్థను ఏర్పాటు చేస్తాయి. ఈ జోన్‌లో వనరులపై నియంత్రణ ప్రజలపై అధికార మార్పిడి బడా వ్యాపార, ఇన్‌వెస్ట్‌మెంట్ పెట్టుబడికి మార్పిడి జరగడమే అసలు ఫలితం. ఒక కొత్త ఆర్థిక, భౌగోళిక, రాజకీయ వాస్తవికతను సృష్టిస్తుంది.

'జోన్' హోదాను 1947 పారిశ్రామిక వివాదాల చట్టం కింద ప్రజా ప్రయోజన సర్వీసులు కింద హోదా ప్రకటించడం వలన తాము కార్మిక సంఘాలను ఏర్పాటు చేసుకోలేకపోతునట్లు కార్మికులు చెప్పారు. మంత్రిత్వ శాఖ నుండి ముందస్తు అనుమతి లేకుండా లేబర్ ఇన్‌స్పెక్టర్లు జోన్లను సందర్శించరాదని వాణిజ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిసింది. భూసేకరణ లేక భూవినియోగ మార్పిడి వలన సెజ్‌బయట నిరుద్యోగం పెరిగితే కూడా అంతే. గత అనుభవం చూస్తే చుట్టూ వున్న ప్రాంతాలలో కాలుష్య ప్రభావం, భూవినియోగంలో మార్పుల ప్రభావం లాంటి దీర్ఘకాల ప్రభావం, రెగ్యులేటరీ మెకానిజం సడలింపులతో కూడిన అనుకూల స్థితి, అతిగా చేయడం వలన, సెజ్‌లు ఆర్థిక నేరాల

హబ్బులుగా తయారవుతాయి. ఉదాహరణకు, ఫైనాన్స్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 33వ రిపోర్టులో 2002-2003, 2004-2005 మధ్య రూ.3,400 కోట్లకు పైగా షోకాజ్ నోటీసులిచ్చినట్లు తెలిపింది. ఇవన్నీ ఎక్స్‌పోర్ట్ ఓరియెంటెడ్ యూనిట్స్ (EOU) లలోను, కొన్ని ఇతర ఎక్స్‌పోర్ట్ స్కీమ్‌లలో ఈ మోసం జరిగింది.

సెజ్‌యాక్ట్ కింద పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు, సౌకర్యాలు, పన్ను లేని దిగుమతి / స్వదేశీ వస్తువుల ప్రొక్యూర్‌మెంట్ కలుపుకొని; ఎగుమతి ఆదాయంపై 100శాతం ఆదాయపన్ను మినహాయింపు; ప్రత్యామ్నాయ పన్ను, సెంట్రల్ సేల్స్ టాక్స్, సర్వీస్ టాక్స్, రాష్ట్ర అమ్మకం పన్ను, ఇతర లేవీల నుండి కస్టమ్స్ / ఎక్సైజ్ పన్నులు, డివిడెండ్ పంపిణీ టాక్స్‌ల నుండి మినహాయింపు ఎటువంటి మెచూరిటీ పరిమితి లేకుండా, సంవత్సరానికి 500 మిలియన్ యు.ఎస్.డాలర్ల వరకు విదేశీ వాణిజ్య అప్పు తీసుకోవటానికి అనుమతిస్తుంది. దీర్ఘకాల లీజ్‌లో తక్కువ అద్దెకు స్టాండర్డ్ ఫ్యాక్టరీలు / ప్లాట్లు, మౌలిక వసతులు, సౌకర్యాలు అందించబడతాయి. దేశీయ టారిఫ్ ప్రాంతం నుండి పొందే వస్తువులకు చాలా టాక్స్‌లు, సెస్‌లు వర్తించవు. తరువాతి 5 సంవత్సరాలకు 50శాతం తిరిగే ఇన్వెస్ట్ చేసే లాభాలకు అప్పటినుండి 5సంవత్సరాలు 50శాతం, డెవలపర్లు 10సంవత్సరాల వరకు 100శాతం టాక్స్ మినహాయింపు పొందుతారు. విద్యుత్ పన్నులు, చార్జీల ప్రాసెసింగ్ ప్రాంతంలో వాడినంత వరకు మినహాయింపుపొందుతారు.

సెజ్‌ల కిచ్చిన ప్రోత్సాహకాల వలన సెజ్‌లు, నాన్ సెజ్‌ల మధ్యపోటీ పరిస్థితులు తలకిందలవుతాయి. ప్రోత్సాహకాలివ్వడంతో సెజ్‌లు కొత్త పరిశ్రమలు ప్రారంభించటానికి బదులు దేశంలో ఇతర ప్రాంతాల నుండి అప్పటికే పనిచేస్తున్న పరిశ్రమలను ఆకర్షించాయి. అవి గరిష్ట లాభాలు సంపాదించటానికి ప్రోత్సాహకాలు వాడుకొని సెజ్‌లో తిరిగి ఏర్పరిచారు. ఇది ప్రస్తుతం సెజ్‌ల బయటనున్న పెట్టుబడులు స్థానచలనం చెందాయే తప్ప, కొత్త పెట్టుబడులేం కాదు. ప్రకటించిన సెజ్‌లలో ఒకే ఒక సెక్టర్ ఐ.టి. సెజ్‌లో మెజారిటీ ఐటి/ ఐటియిఎస్‌లు వచ్చాయి. టెక్స్‌టైల్స్ అప్పారెల్ / ఊలు, ఫార్మా/ రసాయనాలు వాటిననుసరించాయి. ఐ.టి.రంగంలోకి అత్యధికంగా పెట్టుబడి స్థానాంతీకరణ ప్రక్రియ వుండటం కనిపిస్తుంది. 2006 నవంబర్‌లో ప్రభుత్వం మరిన్ని ఐ.టి. సెజ్‌లను అనుమతివ్వకూడదని సూత్రప్రాయంగా నిర్ణయించింది. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీపార్క్‌ల చొరవకు సంబంధించి ప్రధాన స్కీమ్ 2009కి ముగించాలని నిర్ణయించారు. సెజ్‌లలో అత్యధిక పెట్టుబడి ప్రయివేటు రంగానికి సంబంధించింది. ఐ.టి. కంపెనీల తర్వాత ప్రయివేటు రంగంలోని మెజారిటీ దరఖాస్తులు రియల్ ఎస్టేట్ రంగం నుంచి వచ్చాయి. రెండూకలసి ప్రభుత్వరంగేతర అనుమతులు మూడొంతులు వున్నాయి. ఐ.టి. మల్టీ ప్రొడక్ట్ సెజ్‌లు రియల్ ఎస్టేట్ కంపెనీల తర్వాత అత్యధికంగా వున్నాయి. ఎగుమతులు పెంచటం కన్నా రియల్ ఎస్టేట్ అభివృద్ధే ప్రధాన లక్ష్యమనేది తెలుసుకోవచ్చు.

ఇంతకుముందు తెలియచేసినట్లు సాపేక్ష అనుకూల పరిస్థితి అవకాశంగా తీసుకోవటానికి, సెజ్‌ల బయటినుండి సెజ్‌లలోకి పరిశ్రమలు మరోచోట పెట్టుకోవడం అంటే కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పడడంగాక, అప్పటికే వున్న శ్రామికులను మరోచోట పని చేయించటం మాత్రమే అవుతుంది. అంతేగాక సెజ్‌ల బయటనున్న పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు క్షీణించడం నెగెటివ్ ప్రభావం 1998-2003 మధ్య, ఈపిజెడ్‌లలో పెట్టుబడులు 73శాతం పెరగగా, ఉపాధి అవకాశాలు మాత్రం 13.7శాతం మాత్రమే పెరిగాయి. మొత్తం మీద చూస్తే సెజ్‌లలో పెరిగే పెట్టుబడులతో పోల్చితే ఉపాధి అవకాశాల పెరుగుదల వాస్తవానికి అతితక్కువ.

సెజ్‌లపై ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాలు

సెజ్‌లపై అభ్యంతరాలు వివిధ కోణాలనుంచి వున్నాయి. ప్రాజెక్టు సాధ్యతపై ప్రభుత్వంలోని ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క కారణముంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలు పాలసీపై అసంతృప్తిగా నుండటానికి కారణం విపరీతమైన మినహాయింపులు రెవిన్యూ నష్టానికి దారితీయడం, రియల్ ఎస్టేట్ స్పెక్యులేషన్ పెంచుతాయనేది. సెజ్‌ల వలన ప్రభుత్వానికి జరిగే నష్టం అపారం 2004-2005ల అప్పటికే ప్రభుత్వం రూ.41,000 కోట్లు నష్టపోయింది. కస్టమ్స్ రెవిన్యూలో 72శాతం మొత్తం పరోక్ష పన్నుల నుంచి 23శాతం నష్టపోవటం జరిగింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం రాబోయే 5 సంవత్సరాలలో రాబోయే నష్టం రూ.1.75లక్షల కోట్లుంటుందని అంచనా వేసింది.

ఐ.ఎం.ఎఫ్. ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకులు సెజ్‌లను మార్కెట్ ఫ్రెండ్లీగా గాక, 'బిజినెస్ ఫ్రెండ్లీ'గా తయారు చేశారని, మార్కెట్ నియమాలను, మార్కెట్ సంస్కరణలను పెంపొందించకపోగా ఉల్లంఘించాయని విమర్శించాయి.

పెద్ద ఎత్తున వ్యవసాయ భూసేకరణ ఆహారభద్రతపై తీవ్రంగా దెబ్బతీస్తుందని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. సెజ్‌ల ఏర్పాటు కోసం గణనీయంగా భూమిని సేకరించటమో లేక డెవలపర్‌లు కొనుగోలు చేయటమో చేయాల్సి వుంటుంది. అనుమతించిన, సూత్రప్రాయంగా అనుమతించిన సెజ్‌లను ఏర్పాటు చేయాలంటే దాదాపు రెండు లక్షల హెక్టారులు భూమి అవసరం. దుర్మార్గ 1894 భూసేకరణ చట్టాన్ని, డెవలపర్ ప్రభుత్వ రంగమైనా, ప్రయివేటు రంగమైనా భూసేకరణకు ఉపయోగించారు. భూమిపై ఆధారపడిన వారిని భూసేకరణలో నష్టపోయిన వారుగా పరిగణించకుండా, మార్కెటు విలువకన్నా తక్కువ ధరకు భూమిని సేకరించారు. ఈ భూసేకరణ చట్టం సెక్షన్ 3(ఎఫ్) నిర్వచనం ప్రకారం 'ప్రజా ప్రయోజనం' కోసం మాత్రమే భూసేకరణ చేయాలి. దీనిలో కంపెనీలు చేరవు. అయినప్పటికీ న్యాయవ్యవస్థ ఈ చట్టాన్ని పునర్నిర్వచించి ప్రభుత్వం ఒకసారి భూమిని సేకరించిన తర్వాత, సేకరణ సమయంలో ఉద్దేశం ఏమయినప్పటికీ, ప్రభుత్వం ఆ భూమిని ఎవరికైనా అమ్మవచ్చు, ఇచ్చివేయవచ్చు లేక హక్కులను ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు అని చెప్పింది. ఫలితంగా, రాజ్య భూసేకరణ అనేది 'ప్రజా ప్రయోజనం' నుంచి నిర్ణయాత్మకంగా మారిపోయి, 'ప్రయివేటు లాభానికి' భూసేకరణగా మార్పు చెందింది. కాని మిలిటెంట్ ప్రతిఘటనలతో, పరిష్కారంగా డెవలపర్ భూయజమాని నుండి ప్రత్యక్షంగా ప్రభుత్వ మధ్యవర్తిత్వం లేకుండా కొనుగోలు చేయాలని ప్రయత్నించింది.

వ్యవసాయ ప్రధాన భూముల సేకరణ ఒక ప్రధాన సమస్యగా తయారైంది. ఈ ప్రమాదకర చిక్కుల వలన పడావు భూమితోబాటు ఒక పంట మాత్రమే పండే వ్యవసాయ భూమిని మాత్రమే సేకరించటానికి పరిమితం చేసే ప్రయత్నం ఇప్పుడు జరుగుతుంది. రెండు పంటల భూమి అవసరమైతే మొత్తం భూమిలో అది 10శాతంకు పరిమితం కావాలి. అంతేగాక ఆ ప్రాంతాలలో బలమైన వ్యవసాయ ప్రయోజనాలుండి, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో గుండెకాయలాంటివి. బంజర భూమి రకం తరచుగా అత్యధిక సంఖ్యలోనున్న పేదలకు జీవనాధారమనే విషయం నిర్లక్ష్యం చేశారు. భూసేకరణలు లేక ప్రత్యామ్నాయంగా భూమి కొనుగోళ్ళు, మార్జినల్, ఆదివాసీ ప్రాంతాలపై కేంద్రీకరించింది. అధికార పునరావాస స్కీమ్‌లు అవి ప్రభుత్వం లేక ప్రయివేటు రంగమైనా అసంతృప్తికరంగా పనిచేస్తుంటాయి. అయినప్పటికీ, ప్రజాస్వామ్యంలో ప్రయివేటు కొనుగోలుదారుల కన్నా ప్రభుత్వాన్ని బాధ్యులు చేయటం తేలిక. భూమిని లీజుకు తీసుకోవాలనే ప్రతిపాదన కూడా ముందుకు వచ్చింది. దీని ద్వారా నిర్వాసితులకు శాశ్వత ఆదాయం చేకూరుతుంది.

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ప్రభుత్వ ఆయిల్ రిఫైనరీ ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పోరేషన్ ONGCతో పాటు సెజ్‌ను 10,000 ఎకరాలలో నిర్మించడం సమస్యలతో కూరుకుపోయింది. ఆ ప్రాంతంలోని రైతులు తమ సారవంతమైన భూములు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు.

ఈ భూములన్నీ ముడిసరుకులకు, పట్టణ కేంద్రాలకు, రవాణా సౌకర్యాలకు దగ్గరలో ఉండడం సహజమైన విషయమే. సేకరించిన భూమిలో కనీసం 35శాతం ప్రాసెసింగ్ ప్రాంతంగానూ, మిగిలిన దానిని గృహ, వినోద సౌకర్యాల కోసం వుపయోగించాలి. సేకరణలో పంచాయితీల్లాంటి స్థానిక స్వయం పరిపాలనా సంస్థలను బైపాస్ చేయడమో, ప్రాముఖ్యత లేకుండా చేయడమో జరుగుతున్నది. అంతేగాక సెజ్‌లు పెద్ద ఎత్తున రియల్‌ఎస్టేట్ కార్యకలాపాల స్పెక్యులేషన్ నోడల్ పాయింట్లుగా తయారయ్యాయి. ఈ జోన్ల చుట్టూ అధికారుల వత్తాసుతో బలమైన ల్యాండ్ మాఫియాలు ఆవిర్భవించి, సమీప ప్రాంతాల్లోని ప్రజలను వాళ్ళ భూముల నుండి తొలగించి సెజ్‌లలోను పరిసర ప్రాంతాలల్లోను భూమి ధరలను పైపైకి పెంచేస్తున్నారు. క్రమంగా తక్కువ ఖర్చు సెజ్ అనే ప్రధాన ఆకర్షణ ఓడిపోయి సెజ్‌ల పట్ల ఆకర్షణ అంతరించి పోతున్నది. మొత్తం ఈ పరిస్థితిని గుర్తించిన రిజర్వ్ బ్యాంక్, ఇండియాలోని బ్యాంకులు సెజ్‌లకిచ్చే అప్పులను మౌలిక వసతుల కల్పనకు గాక రియల్ ఎస్టేట్ బిజినెస్‌గా పరిగణించమని కోరింది.

ప్రస్తుతం సేకరించిన భూమిలో ఇంతకుముందు చెప్పిన 35శాతం నుండి 50శాతం భూమిని ప్రాసెసింగ్ యూనిట్ కోసం వాడాలి అంటున్నారు. దీని ద్వారా రియల్ ఎస్టేట్ బాగా తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. చివరిగా, ఇంతకుముందుతో పోల్చితే ఎగుమతి అవసరాన్ని మరింత కఠినంగా చేస్తున్నారు.

సెజ్‌ల డెవలపర్లకు అందించిన అనేక రాయితీలలో ఒకటి నగరాలు, కొత్త హైవేలకు దగ్గరగా నున్న చౌక భూమి పరిశ్రమల అవసరం కన్నా అధికంగా భూమిని కేటాయిస్తున్నారు. దీనిలో జరిగేది స్పష్టంగా అత్యధిక లాభాలు సంపాదించే పట్టణ రియల్ ఎస్టేట్‌గా మాత్రమే భూమిని చూస్తున్నారు. సింగూరు సెజ్ కాకపోయినా కార్ల ఫ్యాక్టరీకి 70ఎకరాల భూమే సరిపోయిన 1000 ఎకరాల భూమిని ఇచ్చారు. సింగూరులో భూమి రెండు ప్రధాన హైవేలు కలిసే చోటనున్న ప్రైమ్‌లాండ్ ఇటువంటి పరిగణనే అనేక సెజ్‌ల ప్లాన్‌లలో ప్రధానమనేది స్పష్టం.

ఇటువంటి పెద్ద ఎస్టేటుల ఏర్పాటును ఇంకొక కారణం కూడా వుంది. గత ముందు సంవత్సరాలలో కార్పోరేట్ సెక్టార్ లాభాలు సరాసరి 30శాతంగా వుండి, ఇన్వెస్ట్‌మెంట్ చేయటానికి నగదు మొత్తం చాలా వుంది. ఈ ధనాన్ని ఇన్వెస్ట్ చేయడానికి రియల్ ఎస్టేట్ మంచి ప్రతిపాదన ఆ విధంగా, మనం అసంఖ్యాక నూతన భూస్వాములను సృష్టించడం చూస్తున్నాము.

గత అనుభవం బట్టి సెజ్‌ల కోసం పరిశ్రమలు సేకరించిన భూమిని నిర్దేశించిన అవసరాలకే వాడతారని, రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం కాదనటానికి గ్యారంటీ ఏముంది? గుర్‌గాంలో డి.యల్.ఎఫ్. తదితరులు మనకు గుర్తుచేస్తాయి. అవి ముందుగానే క్రొత్త యన్.హెచ్.8 చుట్టూ పట్టణీకరణ చెందే ప్రాంతాలను గుర్తించి సమాచారం సంపాదించి, ఆ భూమిని రైతుల నుండి అతి తక్కువ ధరలకు (అప్పటి మార్కెట్ ధరలు) సేకరించారు. వారు నెమ్మదిగా 20 సంవత్సరాలలో కృత్రిమంగా అధిక ధరలను నిలబెడుతూ, క్రమంగా భూములను వదులుతూ విపరీతంగా లాభాలు గడించారు. ఈ పొలాలలో భూమి ధరలు 500 రెట్లు పెరిగాయి. ఏ ధరల సూచికకన్నా ఇది అత్యధిక స్థాయిలో వుంది.

ప్లానింగ్ కమిషన్‌కు సంబంధించిన ఒక అధ్యయనం ప్రకారం దేశంలోని 73శాతం సాగు భూమి 23.6 శాతం జనాభా చేతుల్లో వుందని తెలియజేసింది. సెజ్‌ల కోసమే లేక వుడ్ ప్రాసెసింగ్ జోన్లో, టెక్నాలజీ పార్క్‌లో లేక రియల్ ఎస్టేట్ లక్ష్యాల కోసమో చేసే భూసేకరణ వలన మరింత మంది రైతులు భూముల నుండి తొలగించబడుతూ, కులీన ధనిక వర్గం చేతుల్లో భూమి మరింతగా పోగుపడుతున్నది. ముఖ్యమంత్రులే ఆస్తుల అమ్మకందార్లుగా ప్రవర్తిస్తూ, రైతులను వ్యవసాయ భూమిపై నియంత్రణ వదులుకొనేటట్లు ప్రలోభ పెడుతున్నారు.

'బిజినెస్ స్టాండర్డ్' వార్తాపత్రికా మేనేజింగ్ ఎడిటర్, స్వతంత్ర పరిశీలకుడు అశోక్‌కుమార్ భట్టాచార్య - సెజ్‌ల్లో భూముల్లో 50శాతం వాణిజ్యేతర అవసరాలకు వాడాలనేది పారిశ్రామిక లేక వాణిజ్యకృత్యాల పేరు మీద రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున భూమిని సేకరించి తెలివైన అద్దె కోరుకునే ఒక గ్రూపు పారిశ్రామికులకు ప్రతిస్పందనగా వచ్చిందని చెప్పారు.

పర్యావరణం, అభివృద్ధిపై భూసేకరణ ప్రభావానికి సంబంధించిన సమస్యలపై పరిశోధిస్తున్న సామాజికవేత్త భావిష్కర్ మాట్లాడుతూ, "భూ సంస్కరణలకు తిరోగమనం"గా మాత్రమే ఇండియన్ ప్రభుత్వ పాలసీ మారి, భూమిపై హక్కులను నిమ్న ప్రజల సమూహాల నుంచి ధనిక వ్యాపార కులీనులకు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నదన్నారు.

సెజ్‌లు ప్రాంతీయ అసమానతలు పెంచుతున్నాయి. అనుమతులు ఇచ్చిన సెజ్‌ల్లో మూడొంతులు ఆరు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హర్యానా, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడుల్లోనే వున్నాయి. ఈ అనుమతులన్నింటిలో మూడవవంతుకుపైగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోనే వున్నాయి. ఈ రాష్ట్రాలన్నీ అత్యంత పారిశ్రామిక సామర్థ్యంతో సాపేక్షికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు. ఇవన్నీ పాక్షికంగా మహారాష్ట్ర తప్ప అన్నీ అత్యధిక పట్టణీకరణ చెందినవే. ఇప్పటికే ఉన్నత స్థాయిలో పరిశ్రమలు పెట్టుబడులున్న ప్రాంతాల్లోనే పెట్టుబడి ప్రవహించి, ఈ రాష్ట్రాలు, విజయవంత రాష్ట్రాలుగా చూపించబడుతున్నాయి.

ఇంకా, ఇవ్వబడిన రాయితీల వలన ఆర్థిక వ్యవస్థలోని మిగతా ప్రాంతాల్లోకి పెట్టుబడులు రాకుండా ఈ సెజ్‌లలోకే ఎక్కువ పెట్టుబడి చేరుతుంది. అంతిమంగా, కొంతమంది దేశ ఇతర ప్రాంతాల్లోని తమ పరిశ్రమలను మూసివేసి, సెజ్‌లలోకి తరలిస్తారు. ఈ మూడు కారణాల వలన అనుకున్నదానికన్నా ఈ సెజ్‌లలోకి పెట్టుబడి తక్కువగా వస్తుంది. వాస్తవానికి దేశంలోని ఇతర ప్రాంతాల్లో కన్నా, సెజ్‌లలో తయారైన వస్తువులు ధరలు ఇతర ప్రాంతాల్లో కన్నా తక్కువగా వుండటం వలన, స్మగ్లింగ్ బాగా జరిగి, మిగతా ప్రాంతాలలో తయారైన ఉత్పత్తులు తీవ్ర నష్టానికి గురయి దెబ్బతినిపోతాయి. ఇది ఉపాధి అవకాశాలను మరింత దెబ్బతీస్తుంది.

ఇంకా సెజ్‌ల నుండి చౌక వస్తువులు, మిగతాదేశంలోకి స్మగ్లింగ్ జరగటం వలన, పన్నుల వసూలు మరింత తగ్గిపోతుంది. కాపలా కాస్తున్న సరిహద్దుల నుంచే తేలికగా స్మగ్లింగ్ జరుగుతుంటే రక్షణలేని సెజ్‌నుండి ఎంత తేలికగా జరుగుతుందో ఊహించుకోవటం కష్టమేమీ కాదు. ఈ రెవిన్యూ నష్టాల ఫలితం బడ్జెట్ లోటును మరింత తీవ్రతరం చేసి ఎఫ్.ఆర్.బి.ఎమ్. యాక్ట్ అవసరాలను పూర్తి చేయటానికి అవసరమైన నిధుల్లో మరింత కోత కోయాల్సి వస్తుంది. ఈ కోతలలో ఎక్కువ భాగం సామాజిక రంగాలలో జరిగి, పేదల పరిస్థితి మరింత దిగజారిపోతుంది.

కొన్ని ఎంక్లేవ్‌ల అభివృద్ధి జరిగి, అసమానతలు మరింత పెరుగుతాయి. పట్టణ ప్రాంతాలకు వలసలు మరింత పెరుగుతాయి. మరింత క్షీణించిపోతారు. సెజ్‌లకు కేటాయిస్తున్న అధిక భూముల వలన కొత్త భూస్వాముల సృష్టి జరుగుతుంది. దేశంలో భూస్వామ్యాన్ని అంతమొందిచటమే లక్ష్యమని వివేకంగా ఆలోచించిన 60 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత ప్రభుత్వమే నూతన భూస్వాములను సృష్టిస్తున్నది. కార్పోరేట్లు ఏర్పాటుచేస్తున్న కొన్ని పెద్ద సెజ్‌లు "దేశ్"గా పిలువబడుతున్నట్లు రిపోర్టులు తెలియజేస్తున్నాయి. అంటే బంగ్లాదేశ్‌లాగా ఇక్కడ ధనికులు స్టైల్‌గా జీవిస్తారు.

సెజ్‌లపై వచ్చే మొత్తం లాభాలపై అస్పష్టత కొనసాగుతున్నా, ప్రభుత్వం ఈ స్కీమ్‌లో ముందుకు ఎందుకెళుతుందంటే, అది కొన్ని వర్గాలకు (దీనిని ముందుకు నెడుతున్నవారు) రాయితీలు ఇవ్వాలని కోరుకొంటున్నది. ప్రపంచబ్యాంక్, ఐ.ఎం.ఎఫ్‌లు పెట్టుబడులు ఆకర్షించటానికి రాయితీలివ్వటానికి జాతి రాజ్యాల మధ్య పోటీ పెట్టినట్లే, అదే పోటీని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నది. పెట్టుబడి పొందటానికి సెజ్‌విధానంలో రాష్ట్రాలు ఒకదానితో

ఒకటి పోటీ పడేటట్లు చేస్తున్నది. సెజ్‌ల కోసం ప్రయత్నించని రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాలు మరింత ముందుకు పోయి, పెట్టుబడిని ఆకర్షిస్తుంటే, తాము మరింత దెబ్బ తింటాయి.

గత శతాబ్ది 50ల ప్రారంభంలో నెహ్రూ "సహకార వ్యవసాయం" నుండి ఇండియన్ రిపబ్లిక్ సుదీర్ఘ ప్రయాణం 60సంవత్సరాల అధికార మార్పిడి తర్వాత మన్‌మోహన్ 'కార్పొరేట్ వ్యవసాయం' లది ఒకే సిద్ధాంతం: అసంఖ్యాక శ్రామిక ప్రజానీకం తమ అస్తిత్వాన్ని కాపాడుకోవటానికి పోరాడుతుండగా ఇండియన్ ఆర్థిక వ్యవస్థలోని దళారీ బూర్జువా భూస్వామి- వడ్డీ వ్యాపారి - వర్తకుడి కూటమి పరాన్న భుక్కు తత్వం పెరిగిపోతున్నది. ఇప్పటికే ఇండియాలో ప్లానింగ్ అభివృద్ధి, దాని అమలు సామ్రాజ్యవాదం కనుసన్నలలోనే జరుగుతున్నది. ప్రస్తుతం ఈ అభివృద్ధి నమూనా ఏ స్థాయికి చేరిందంటే అత్యంత దారుణంగా దోపిడీ చేయబడుతున్న ప్రజలు, వనరులకు అనుకూలంగా అమలులోఉన్న ఆర్థిక వ్యవస్థను హింసాయుత పునర్నిర్మాణం ద్వారా తప్ప మరోవిధంగా సరిచేయలేని ప్రజ్వరిల్లటానికి సిద్ధంగానున్న స్థాయికి చేరింది.

అన్ని రకాల నిర్వాసీకరణలకు వ్యతిరేకంగా పోరాటమే ప్రస్తుత అవసరం

సెజ్‌లకు వ్యతిరేకంగా, మొత్తం సామ్రాజ్యవాద అంతర్జాతీయకరణ ఎజెండాకు, దాని భావజాలానికి వ్యతిరేకంగా ప్రజా ప్రతిఘటనోద్యమం నిర్మించే కర్తవ్యంపై దృష్టిని కేంద్రీకరించటం ఇప్పటి తక్షణావసరం. ప్రస్తుత అభివృద్ధి నమూనాను మనం సవాలు చేస్తూ, ప్రణాళికాబద్ధంగా ప్రతిఘటన కొనసాగిస్తూ, ఆక్రమంలో మానవుడే కేంద్రంగా ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను ఏకకాలంలో ప్రారంభించాల్సి వుంటుంది.

ఈ క్రమంలో కలిసి వచ్చే వ్యక్తులూ లేక సంస్థలూ, తాత్కాలిక లాభం కోసం సంకుచిత మనస్తత్వంతో వ్యవహరించకుండా, నిర్వాసీకరణకు వ్యతిరేకంగా అన్ని నిజమైన ప్రతిఘటనా ఉద్యమాలను ఏకతాటిపై తీసుకొస్తే, దేశవ్యాప్త దుర్భేద్య ప్రతిఘటన కొనసాగించడం సాధ్యమే. తమ ప్రాజెక్టుల అమలుకోసం కొనసాగించే భూసేకరణకు వ్యతిరేకంగా ముందుకొచ్చే ఉద్యమాలను అణచివేయడానికి అత్యంత క్రూర అణచివేత యంత్రాంగాన్ని ఉపయోగించడానికి ఇండియన్ పాలకవర్గాలు, వారి సామ్రాజ్యవాద యజమానులు నిర్ణయించుకున్నారని మనమందరమూ స్పష్టంగా అర్థంచేసుకుంటే పోరాడే శక్తుల మధ్య హద్దులేని ప్రతిఘటన, సౌహార్ధత నిర్మించటమే మన విశాల ఐక్యతా లక్ష్యం.

ప్రారంభంలో మనం సెజ్‌లపై దృష్టి సారించటం ద్వారా విస్తృతమైన మద్దతు సమీకరించే అవసరమున్నా అన్ని రకాల నిర్వాసీరణలకు వ్యతిరేకంగా పోరాటాలను ఏకతాటిపై తెచ్చి, ఉపఖండ స్థాయిలో ఐక్య ప్రతిఘటనా పోరాటం ప్రారంభించాలి.

సామ్రాజ్యవాద దేశాల పారిశ్రామిక గుత్త సంస్థలు పెద్ద ఎత్తున చొరబడటం వలన తమ సహజ నివాసాల నుండి ప్రజలను నిర్వాసితులను చేయటానికి వ్యతిరేకంగా సమగ్ర ఉద్యమం ద్వారా దేశ ప్రజల ముందు నిర్దిష్టమైన స్పష్టమైన డిమాండ్లు నుంచాలి. దృష్టినిలపాలసిన తక్షణావసరమైన కొన్ని అంశాలు:

1. సెజ్ యాక్ట్ 2005ను రద్దు పరచటం ద్వారా ప్రత్యేక ఆర్థికమండళ్ళ పద్ధతి రద్దు చేయాలి. సేకరించిన భూమిని తిరిగి రైతులకిచ్చివేసి, రైతులనుండి భూమి తీసుకొన్నంత కాలానికి తగు పరిహారం చెల్లించాలి.
2. 1894 భూసేకరణ చట్టాన్ని రద్దు చేయాలి. ప్రజలపై, వారి వనరులపై పాలకులకు నియంత్రణనిచ్చే భావనను రద్దు చేయాలి.
3. భారీ డ్యామ్‌లు నిర్మించరాదు. నదుల అనుసంధాన ప్రాజెక్టును చేపట్టరాదు. ప్రజలలో విస్తృతంగా చర్చించిన తర్వాతే ప్రజలను నిర్వాసితులను చేయని, పర్యావరణకు నష్టం కలిగించని చిన్న తరహా సేద్య ప్రాజెక్టులు చేపట్టాలి.
4. దేశ ప్రజల ఉపయోగానికి భూగర్భంలో నున్న ఖనిజాలను ఉపయోగించటంపై సరిగ్గా మూల్యాంకన లేకుండా ఎటువంటి గనుల తవ్వక ప్రాజెక్టులు ప్రారంభించరాదు.
5. పట్టణాల, నగరాల పునర్నిర్మాణం, బ్యూటిఫికేషన్ పేరుతో పట్టణ ప్రాంతాలలో ప్రజలను నిర్వాసితులను చేయటం వెంటనే ఆపివేయాలి.

నిర్వాసీకరణ, పునరావాస విధానాలు

నిర్వాసీకరణకు తావులేదు అనే పెద్ద నినాదం కేంద్రంగా రాజీలేని నియమమే మనపోరాటం. అదేవిధంగా ఒక పెద్ద పునరావాస పథకాలకు, అవెంత ప్రగతిశీలంగా ధ్వనించినా అవెంత పెద్ద పరిహారమైనా మనకు ఏ మాత్రం అంగీకార యోగ్యం కాదు. మన ప్రతిఘటనా ఉద్యమం కేంద్ర ఉద్దేశం నిర్వాసీకరణ మరియు పునారావాస చక్రాన్ని సంపూర్ణంగా తిరస్కరించడమే.

అయినప్పటికీ, 1947 నుంచి గనుల త్రవ్వకం, మెగా ప్రాజెక్టులు, డ్యామ్‌లు, పరిశ్రమలన్నింటిని ఫలితంగా నిర్వాసితులు కావించబడిన కోట్లాది కుటుంబాలు, ప్రజలకు న్యాయమైన, సరైన పునరావాసం కోసం డిమాండ్ చేయాలి. అభివృద్ధి భావన నుండి నిర్వాసీకరణ అనే భావననే తొలగించాలి. ప్రస్తుత అభివృద్ధి నమూనాలో నిర్వాసీకరణ అనే నియమం ప్రధాన స్థానంలో ఉంటుంది. పునరావాస విధానం ఏదైనా ఆ ప్రాజెక్టుల నుండి లాభం పొందే వారి నుండి, ఇతరుల లాభం కోసం తమ మీద త్యాగాల భారం మోపటాన్ని వ్యతిరేకించే వారిని విడగొట్టటానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఉదాహరణకు 1947 తర్వాత ప్రాజెక్టులు లేక డ్యామ్‌ల కోసం గణనీయ సంఖ్యలో నిర్వాసులు గావించబడిన వారికి పునర్వాసం కల్పించలేదు. ఈ అభివృద్ధి నమూనాలో అదెంత ప్రగతిశీల పునరావాస ప్యాకేజీ / పాలసీ అయినప్పటికీ పునరావాసం అసాధ్యమైన పథకమే. పునరావాసమంటే కొన్ని మిగిలిపోయిన ఎముకలు విసరటమేనని మనం అర్థం చేసుకోవాలి. మంచి పునరావాసమనేది సాధ్యం కానిదని మనం తప్పక గ్రహించాలి.

అభివృద్ధికి ఏకైక మార్గం ఇలాగుంటుంది

"నేను ఇక్కడి నుండి ఏ మార్గంలో వెళ్ళాలో చెప్పగలరా?" ఆలీస్ అడిగింది. "నీకెక్కడికి వెళ్ళాలనే మంచి డీల్‌పై అది ఆధారపడుతుంది" చెప్పింది పిల్లి.

"నేను ఎక్కడికి వెళ్ళాలనేది ఆలోచించలేదు" ఆలీస్ అంటే

"నీవు ఎటు వెళ్ళాలనేది విషయమే కాదు" పిల్లి చెప్పింది.

లూయిస్ కరోల్, అద్భుత ద్వీపంలో ఆలీస్ సాహసయాత్రలు

సామ్రాజ్యవాదానికి సేవ చేస్తూ, సేవకాసాధనంగా నున్న ప్రస్తుత అభివృద్ధి నమూనాను ధ్వంసం చేయడం ద్వారా మాత్రమే ప్రజానుకూల అభివృద్ధి నమునాను నిర్మించగలుగుతాము. ఈ అభివృద్ధి నమునా ప్రజలే కేంద్రంగా నున్న నమూనా. స్వయం సమృద్ధి ఆర్థిక వ్యవస్థ ఆధారంగా అన్ని రకాల సామ్రాజ్యవాద నియంత్రణ, దాస్యం వుండవు. ఈ అభివృద్ధి నమూనా దేశ ప్రకృతి వనరులను ప్రజానీక అవసరాలను తీర్చడం కోసం ఉపయోగించ బడతాయి తప్ప పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదులకు అదనపు విలువ ఉత్పత్తి చేసి పెట్టేదిగా గాని లేక అస్తిత్వంలోనున్న క్షీణ పరాన్న భుక్కు వర్గం, ఫ్యూడల్, వలసవాదుల కోరికల కోసం దుబారా చేసేదిగా వుండదు ఇది. భూమి పునఃపంపిణీ, శ్రమ జీవులకు అనుకూలంగా రాజకీయాధికారం మార్పిడి జరగడం లాంటి ఆర్థిక వ్యవస్థలోని నిర్మాణపర మార్పులు ద్వారా సాగుతుంది. దీని ప్రత్యక్ష ఫలితం ఏమిటంటే అంతర్గతంగా అభివృద్ధిని ప్రేరేపించుతూ, ఆర్థిక వ్యవస్థను వెనుకకు లాగి పట్టి వుంచుతున్న ప్రస్తుత వర్గ / కుల దొంతర్ల వ్యవస్థను దెబ్బతీస్తుంది. ఈ తరహా అభివృద్ధి అసంఖ్యాక ప్రజానీకాన్ని నిర్వాసులను చేయడమో లేక భాగస్వామ్యం లేకుండానో లేక అవకాశాలు లేకుండా చేసే విధానాన్ని తప్పించుకొని, సమస్యలను విజయవంతంగా పరిష్కరించుకుంటుంటే గాని ఈ దేశ పాలకవర్గ ప్రయోజనాలకు సేవ చేయదు.

ప్రస్తుత సామ్రాజ్యవాద అభివృద్ధి దోపిడీ నమూనాను ప్రజలు పెద్ద ఎత్తున ప్రతిఘటించే క్రమంలోనే ప్రజానుకూల అభివృద్ధి నిర్మించబడుతుంది. దోపిడీ, పీడన, అనాదరణను పెంపొదిస్తూ, గౌరవంగా జీవించే హక్కును హింసాత్మకంగా నిరోధించే అర్ధవలస, అర్థ భూస్వామ్య రాజ్య స్థంభాల అన్నింటినీ నాశనం కావించకుండా ప్రస్తుత అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా చేసే ప్రతిఘటనా పోరాటం విజయవంతం కాజాలదు. మరొక రకంగా చెప్పాలంటే ప్రస్తుత సామ్రాజ్యవాద అనుకూల అభివృద్ధి నమూనా మానవ జీవితాన్ని అర్ధవంతం గానిదిగా చేస్తూ , జంతు స్థాయికి కుదించే నిర్వాసీకరణ గావిస్తుంది. ఇటువంటి హంతక, మృగప్రాయ అస్తిత్వానికి వ్యతిరేకంగా ఏ ప్రత్యామ్నాయమైనా పెట్టుబడి సృష్టిలో తరగని మానవ ఉత్పత్తి సామర్థ్యాన్ని కేంద్రంగా అభివృద్దిని నడిపించడం నుంచి తప్పించుకోజాలదు. దీని వలన మానసిక, శారీరక శ్రమలుగా తన ప్రతిబింబం ప్రపంచాన్ని ఉత్పత్తి, పునరుత్పత్తి చేయగల మానవ ఉత్పత్తి సామర్థ్యానికి దోపిడీ సమాజం వేసిన సంకెళ్ళను బ్రద్దలు కొట్టి అన్నిరకాల దోపిడీ రూపాల నుండి విముక్తి చెంది నూతన ప్రపంచ సృష్టిలో మునిగిపోతుంది.

ప్రస్తుత దోపిడీ అభివృద్ది స్థానంలో ఉపాధిని సృష్టిస్తూ, తమ నివాసాల నుండి నిర్వాసితులను చేయని స్వదేశీ పరిశ్రమలను అభివృద్ధి చేస్తుంది. శ్రామికులను రక్షించే విధానమే గాక, స్వదేశీ పరిశ్రమల నిర్మాణాన్ని కొనసాగించటమే గాక, ఆ పరిశ్రమలను కార్మికులు తమకు తామే నడుపుతూ నిర్వహించుకొంటారు. భూమిలేని రైతులకు భూమి పంపకం ద్వారా వ్యవసాయ రంగంపై ఆధారపడుతూ క్రింద నుంచి ప్రారంభించటం ద్వారా అభివృద్ది కొనసాగించటం ద్వారా మాత్రమే ఇటువంటి ప్రత్యామ్నాయం అభివృద్ధి నమూనా సాధ్యం. వ్యవసాయోత్పత్తిని సంలీనం చేసుకొంటూ, వ్యవసాయ రంగం నుంచి అదనపు జనాభాను సంలీనం చేసుకొనే వ్యవసాయేతర పరిశ్రమలను అభివృద్ధిని చేయాలి. 'భూమిని, పరిశ్రమను కమ్యూనిటీ యాజమాన్యం, వ్యక్తిగత హక్కుగా ఉపయోగించే' దిశలో నడిపించే లక్ష్యంతో ఈ నమూనాను అభివృద్ధి చేయాలి. భూమిని కొద్ది మంది చేతుల్లో కేంద్రీకరించటానికి గాని, లేక పెద్ద, మెగా ఇండస్ట్రీయల్ కాంప్లెక్స్‌లు నిర్మాణానికి కేటాయించడానికి అనుమతించ నీయరాదు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రజల విద్యా, వైద్య సౌకర్యాలు నిర్మించటంపై కేంద్రీకరించాలే గాని, సూపర్ హైవేలు, లేక మెగా మాల్‌ల నిర్మాణానికి కాదు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరుల పునఃసృష్టి పద్ధతులను అభివృద్ధి చేయడం ఈ ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాలో విడదీయరాని భాగం, సూపర్ ప్రాఫిట్స్ లక్ష్యంగా గలిగిన పరిశ్రమ, వ్యాపారం ఈ ప్రశ్ననెప్పుడూ పట్టించుకోవు. కొద్దిమంది చేతుల్లోకి వెళ్లేటట్లు అదనపు విలువను సృష్టించడం అనే భావనను నాశనం చేయటం ద్వారా మాత్రమే పర్యావరణ పునఃసృష్టి దిశగా నిర్మించగలం. ఈ అభివృద్ధి నమూనాలో నిర్ణయాలు తీసుకునే శక్తిని ప్రజలు తమ చేతుల్లోకి తీసుకొంటారు. వనరులు, ఉత్పత్తి సమపంపిణీ, పునరుజ్జీవ పద్ధతుల ద్వారా పునరుత్పత్తిని భద్రపరచడం చేయాలి.

ప్రజలు అర్ధవంతమైన; గౌరవ పూర్వక జీవితం కొనసాగించడం కోసం ప్రజల జీవితావసర వస్తువుల ఉత్పత్తి జరిగేటట్లు, ప్రజల అవసరాలు చుక్కానిగా నుండే, ప్రజల భాగస్వామ్యాన్ని ఈ నమూనా లక్షణంగా వుంటుంది. ఇది ఆర్థిక వ్యవస్థను వనరుల పునాదికి, స్వదేశీ టెక్నాలజీకి స్పందించేదిగా వుండేటట్లు చేస్తూ, 'నిపుణుడు' కేంద్ర స్థానంలో వుండే ప్రస్తుత ఉత్పత్తి సంబంధాల కొరతను అస్థిరపరచే స్థానిక ఆవిష్కరణలకు ప్రోత్సాహమివ్వటం తప్పనిసరి చేస్తుంది.

స్వయం ప్రేరేపకం / అంతర్గత ప్రేరేపకం అభివృద్ధి కలుపుకునే నమూనా. దీన్ని అమలు చేయడం ప్రజల ఉత్పత్తి సామర్థ్యాలను వెలికిదీయకుండా సాధ్యంకాదు. భూ సంస్కరణలు లేకుండా, దున్నేవానికి భూమి పంచకుండా ఇది సాధ్యంకాదు. ఈ నమూనాకు భూ సంస్కరణలు ముందస్తు షరతు.

ఈ దిశలో దండకారణ్య ప్రజల చొరవ ముందడుగే. ఇండియన్ రాజ్యం వెంటనే వారిని తీవ్రవాదులని, జాతి వ్యతిరేకులని తిట్టిపోస్తున్నది. ప్రాథమికంగా తెగ ఆర్థిక వ్యవస్థగానున్న తమ సామాజిక వ్యవస్థలో సామ్రాజ్యవాద అనుకూల అభివృద్ధి నమూనాను అమలు చేయాలనే రాజ్య ప్రయత్నాలకు వ్యతిరేకంగా సి.పి.ఐ (మావోయిస్టు) నాయకత్వంలో సంఘటితమయ్యారు.

ఈ ఉత్పత్తి విధానంలో సామ్రాజ్యవాద అనుకూల అభివృద్ధి నమూనా ముద్ర స్థానిక కాంట్రాక్టర్ తునికి ఆకులు పోగుచేసుకోవడానికి వస్తాడు, ఫారెస్టు అధికారులు వారి సహజ ఆవాస హక్కును నిరాకరిస్తుంటారు, మైనింగ్ కార్పోరేషన్లు ఖనిజాలు త్రవ్వుకోవటానికి వస్తారు, పెద్ద జల విద్యుత్ ప్రాజెక్టుల రూపంలో వస్తుంది. బీడి ఆకులకు మంచి ధర కోసం ఫారెస్టు అధికారులు, కాంట్రాక్టర్‌లకు వ్యతిరేకంగా ప్రారంభమైన ప్రతిఘటన బయట నుంచి గూండాలను తెచ్చే ఫారెస్ట్ అధికారులు - కాంట్రాక్టర్‌ల కూటమి నుండి నిర్బంధాన్ని ఎదుర్కొంది. ఈ ప్రతిఘటన కాంట్రాక్టర్‌లు / ఫారెస్ట్ అధికారుల నుండి ప్రత్యేక ప్రయోజనాలు పొందుతున్న తెగనాయకులు, యువకుల రూపంలో తెగలోపలి నుండే వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ విధంగా ప్రతిఘటన సామాజిక వాస్తవికత లోవలి. బయట నుంచి నిరంతరం ప్రశ్నాపరంపర నెదుర్కొంది. కాంట్రాక్టర్ / అధికారుల దోపిడికి వ్యతిరేకంగా చేసిన పోరాటం తెగ సామాజిక నిర్మాణం లోపలి పీడన, దోపిడీ ధోరణులతో పోరాటం చేయాల్సిన అవసరాన్ని ముందుకు తెచ్చింది. ఆ విధంగా మహిళలు బలవంతపు పెళ్ళిళ్ళు, లైంగిక దోపిడీలకు వ్యతిరేకంగా, తమ సమాజ రోజువారీ వ్యవహారాలలో సమాన పాత్ర కోసం పోరాడారు. పెట్టుబడి గరిష్ట లాభం కోసం అటవీ సంపద, తెగశ్రమను దోపిడీ చేయటాన్ని ప్రతిఘటించాల్సిన అవసరం కూడా వారిని తమను తాము స్థిర నివాసం కమ్యూనిటిగా సంఘటితపడేటట్లు చేసింది. ఆ ప్రక్రియ వారిని మాత్రమే గాక, వారి భవిష్యత్ తరాలను కూడా జాగ్రత్త పడేటట్లు చేసింది. అది విత్తనాలను, నేలను సారవంతం చేసే జీవ ఎరువులను పంచుకునే, భాగస్వామ్య వ్యవసాయం అలవాటు రూపొందించు కొనేటట్లు చేసింది. సహకార సంఘాలు కూడా సృష్టించబడ్డాయి. నేల, విత్తనాలు యూనిఫారమే కాకపోవడంతో పంటలు, పంట నమూనాలు కూడా భిన్నంగా వున్నాయి. సమాజంలో క్రిందనున్న లేక గతంలోనున్న వారికంటే ఎక్కువ భూమి గల తెగ రైతు చారిత్రక కారణాల రీత్యా బాగా నిర్వహించ కలుగుతున్నారు. ఇది ఈ ఆర్థిక వ్యవస్థలో అసమానతలు, ఇంబాలెన్స్‌లు సృష్టించగలదు. కాని ఈ పరిస్థితి ప్రజలను అదనపు విలువ పునఃపంపిణీ చేసే మార్గాలు, సాధనాలు రూపొందించడాన్ని కూడా ఉత్తేజపరచింది.

ఇదంతా కూడా ఆదివాసీ ప్రజలను తమ విజయాలను రక్షించు కోవటానికి స్థిరపడేటట్లు సంఘటిత శక్తిగా, వారిని నూతన మానవులుగా పరివర్తన చేసే క్రమంలో సమీకరించకుండా సాధ్యం కాదు.

ఇటువంటి ప్రజాభివృద్ధి నమూనా - స్వయం అభివృద్ధి చేసుకోగల మార్గం - రూపంలో ప్రతిఘటించే ప్రమాదాన్ని సామ్రాజ్యవాద మద్దతుగా ఇండియన్ రాజ్యం సాల్వాజుడుం ద్వారా ప్రజలపై విరుచుకుపడేటట్లు ఒత్తిడి చేసింది. పతనావస్థలో వున్న పెట్టుబడి సామ్రాజ్యవాదతర్కాన్ని ధిక్కరించే ఎటువంటి కార్యాచరణనైనా, హింసాత్మక ప్రతిస్పందన ద్వారా ఎదుర్కోవటం పెట్టుబడి లక్షణమే. మానవుడే కేంద్రంగా నూతన ప్రపంచాన్ని నిర్మించాలని కోరుకునే ఏ ప్రతిఘటనైనా, తనను తాను రక్షించుకోవటం నుంచి పారిపోజాలదు. ఈ పిలుపునే నక్సల్బరీ ఇచ్చింది. నందిగ్రాం, కళింగనగర్, కాశీపూర్, జగత్సింగ్ పూర్, లోహండి గుడి, కియోల్‌కారో లాంటి ప్రజల పోరాటాలు అటువంటివే.

ఐక్యపోరాటం దిశగా.......

నిర్వాసీకరణ అంటే మనం ఏమనుకొంటున్నాం? డ్యామ్‌ల వలన నిర్వాసితులైన ప్రజలు మాత్రమే అనుకొంటున్నామా? సూపర్‌హైవేల వలన మైనింగ్ వలనా? పెద్ద పరిశ్రమల వలనా? నిర్వాసీకరణను చూసే సాంప్రదాయక అవగాహనను అధిగమించాలి. అప్పుడు మాత్రమే తన పునరుత్పత్తికి మౌలిక నియమంగా నిర్వాసీకరణను పెంపొదింపచేసే ఆర్థిక వ్యవస్థ మూల కారణాలను

కనుగొనగలుగుతాము. దాన్ని పెంపొందించబడి, అనేక మందిని నష్టపరచడం ద్వారా పిడికెడు మంది లాభపడగలిగే వ్యూహం. ఆ అర్థంలో ప్రత్యేక ఆర్థిక మండలాలు, డ్యామ్‌లు, మైనింగ్ ప్రాజెక్టులు, సూపర్ హైవేలు, పట్టణ సుందరీకరణ, గుత్త సంస్థల రిటైల్ మార్కెటింగ్‌లాంటి వాటన్నింటి మధ్యనున్న ఉమ్మడి లక్షణంగా జరిగే నిర్వాసీకరణ అభివృద్ధి నమూనా మౌలిక ఆవశ్యకతగా వుండటాన్ని అర్థం చేసుకోగలం. ఈ అన్ని నిర్వాసీకరణ రూపాలు పెనవేసుకొని ఒకటి ఇంకొక దానిని పునఃప్రతిష్టిస్తూ సామ్రాజ్యవాద అంతర్జాతీయకరణ మౌలిక సిద్ధాంతం విలువ, లాభం గరిష్టీకరించటం కోసమేనని గ్రహించాలి. ఉపఖండ ఆర్థిక వ్యవస్థలోనున్న తిరోగమన నిర్మాణాలన్నింటినీ పదిలంగా వుంచే వ్యూహం ఈ క్రమం కొనసాగడానికి అనుకూల పరిస్థితులు కల్పిస్తూ పెంపొందింప చేయడం, అదే సమయంలో ప్రాధమికంగా అభివృద్ధి రూపంలో వచ్చే క్రియాశీల ప్రతిఘటనను సృష్టించే ఆర్థిక వ్యవస్థలోని అవకాశాలన్నింటినీ నిర్మూలించడమే. అదే సమయంలో ఇతర రూపాల ప్రతిఘటనను తిరస్కరించకుండా వుండడం.

పాలకవర్గాలను పట్టుకొని వదలని సంక్షోభం అపరాధం అనేక రూపాలలో వ్యక్తమవుతున్నది. ఆరంభం నుంచే రాజ్యం, దాని వివిధ అంశాలు దేశ చట్టాన్ని ఉల్లంఘించటానికి సిద్ధపడడం. పాలక వర్గాలు ఈ పాలసీలతో ఎలాగోలా ముందుకెళ్ళాల్సిన అవసరాన్ని పుంఖాను పుంఖాలుగా ప్రచారం చేస్తూ, ప్రజాస్వామిక రాజకీయ పద్ధతులు రాజ్యాంగ గ్యారంటీలు, ఇతర ప్రమాణాలను వుల్లంఘిస్తూ ప్రజలను లొంగిపోయేటట్లు చేయటానికి, గుడ్డురుముతూ రాజ్య అణచివేత యంత్రాంగాన్ని సమీకరించే పద్ధతుల్లో కనిపిస్తుంది. అదే సమయంలో నిరసన రూపాలన్నింటిని అణచి వేయటానికి క్రొత్త చట్టాలను చేస్తున్నది. భిన్న రూపాల నిర్వాసీకరణకు వ్యతిరేకంగా పోరాడే ప్రజలను విభజించటానికి రాజ్యం ప్రయత్నిస్తున్నది. నిర్వాసీకరణకు వ్యతిరేకంగా పోరాడే వివిధ తరగతులు ఎదుర్కొంటున్న విషమ సమస్యని పరిగణనలోకి తీసుకొని వివిధ రకాల నిర్వాసీకరణ వ్యతిరేక పోరాటలను సమైక్యం చేయాలి. ఇది శక్తివంతమైన పోరాట సంగమం చేసే, ప్రత్యామ్నాయమంటే ఓటి నినాదంగా గాక, వాస్తవికంగా తయారవుతుంది. దేశ వ్యాప్తంగా ప్రజలు తమ స్థానిక ప్రాంతాలలో తమ స్థానిక ఆవాసాల నుండి కోట్లాది ప్రజలను నిర్వాసీకరిస్తున్న అనేక ప్రాజెక్టులకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం లేక రాష్ట్ర ప్రభుత్వాలు కుదుర్చుకున్న ఎం.ఒ.యుల ద్వారా కొనసాగుతుండమో జరుగుతున్నది. ప్రజలను విస్తృతంగా నిర్వాసులు చేసే అనేక రకాల ప్రాజెక్టులు ప్రత్యేక ఆర్థిక మండలాలు, మెగా ప్రాజెక్టులు, పట్టణ పునర్జీవ సుందరీకరణ, సూపర్ హైవేలు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెద్ద డ్యామ్‌లు, కార్పోరేట్ వ్యవసాయం, నేషనల్ పార్క్‌లు, అభయారణ్యాలు లాంటి వాటి కోసం ప్లాన్ వేయబడింది.

ప్రభుత్వం పోలీసులు, పారామిలిటరీ బలగాలు, స్థానిక గూండాలు, పాలకవర్గ తొత్తులు, ప్రాజెక్టుల్లో పాల్గొంటున్న ప్రయివేటు కంపెనీలు పాత విభజించు - పాలించు ఎత్తు గడలు ద్వారా నిర్వాసీకరణ జరిగిన స్థానిక ప్రాంతాలలో భిన్న సమాయాలలో బ్రద్దలయి సాగుతున్న పోరాటాలు అణచివేయబడుతున్నాయి. దేశ వ్యాప్త స్థాయిలో ప్రజా పోరాటాల నెట్‌వర్క్ ప్రస్తుతం తక్షణ అవసరం. ఈ భిన్నత్వ పునాది ఉద్యమాలన్నింటిని రాజ్య అణచివేతను సమిష్టిగా ఎదుర్కొంటూ విస్తృతం చేయాలి.

మిత్రులారా, యిక్కడ ఇండియా పురోగమన దిశలోని దిశారేఖ, దృగ్విషయాన్ని చర్చించాము. ఇది నిర్దిష్ట ఇండికేటర్స్‌ను స్పష్టంగా చూపిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇది ముగించే సమయానికి ఇండియా నుంచి వార్తలు వస్తున్నాయి. పశ్చిమబెంగాల్ ప్రభుత్వం హర్మాడ్స్‌గా అపఖ్యాతికరంగా పిలువబడే దాని ఫాసిస్టు క్యాడర్లు నందిగ్రాం ప్రజలపై ప్రణాళికబద్ధంగా హత్యాకాండ జరిపి 10,000 మందికి పైగా ప్రజలను నిర్వాసితులను చేశారు. రాష్ట్ర ప్రభుత్వ బలగాలు మూగ ప్రేక్షకులుగా నిలబడగా సి.పి.యం. గూండాలు వందలాది మంది. స్త్రీలపై లైంగిక అత్యాచారాలు చేశారు. కెమికల్ హబ్ ఏర్పాటు చేయటానికి తమ జీవితాలను, తమ జీవనాధారాలను వదులుకోటానికి నిరాకరించి, సి.పి.యం. కేడర్ల ఫాసిస్టు అణచివేత ఎత్తుగడలను పోరాడి ఎదురించిన ప్రజల గృహాలన్నింటిని తగులబెట్టారు.

పశ్చిమ బెంగాల్‌కు అతి దగ్గరలో ఝార్ఖండ్ రాష్ట్ర ప్రజలు తమను పెద్ద ఎత్తున నిర్వాసితులను గావించే అన్నిరకాల ప్రభుత్వ పాలనలపై ఐక్యంగా పోరాడుతున్నారు. ప్రజల గట్టి ప్రతిఘటన వలన నాగరిక సురక్షాదల్ (పౌర రక్షణ బలగం) పతాకం క్రింద ఝార్ఖండ్‌లో సాల్వాజుడుం లాంటి శాంతి పరిరక్షణ బలగాన్ని ఏర్పాటు చేయటంలో ఇంతవరకు ఆ రాష్ట్రం విజయవంతం కాలేదు. ఒరిస్సాలో ప్రజలు జగత్సింగ్‌పూర్, కళింగనగర్, కాశీపూర్ లాంటి చోట్ల విస్తృత నిర్వాసీకరణకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. పొరుగునున్న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో రాజ్యం సాల్వాజుడుంగా పిలువబడే శాంతి పరిరక్షణ గ్యాంగ్ ముసుగులో మావోయిస్టులతో రక్తసిక్త పోరాటం సాగిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు 2,00,000 మంది ప్రజలకు పైగా నిర్వాసులను గావించే విశాఖ పట్టణంలోని బాక్సైట్ మైనింగ్, పోలవరం మెగా డ్యామ్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఇతన్నీ రాబోయే రోజుల్లో ఆవిర్భవించే పోరాటాలను తెలియజేస్తుంది. ప్రజలు ఒక పక్షంగా, సామ్రాజ్యవాద సేవలోని క్రూర రాజ్య అణచివేత యంత్రాంగం మరొక పక్షంగా వున్నాయి. ఇది సంక్షుభిత రోజులుగా మారబోతున్నాయి. ఉపఖండంలోని మా దేశంలో సామ్రాజ్యవాద క్రూర మృగం పెంచి పోషించే స్తంభాలన్నింటిని నుంచి నిర్ణయాత్మకంగా దూరంగా వుండే విస్తృత భవిష్యదర్శనం లేకుండా ఈ పోరాటం విజయవంతం కాదని నేను గుర్తు చేశాను. నేను నమ్మేదానిలో రాక్ ఫెల్లర్ తప్ప ఇతరులెవ్వరు నమ్మరు. మనం లోతుకు పోయే కొద్ది నిజం బయటపడుతుందనేది ఆయన వాదం. అమెరికా అధ్యక్షుడు ఐసన్ ఐరోవర్‌కు వ్రాసిన లేఖ నుండి ఉల్లేఖిస్తున్నాను.

"సమస్యను మన విధానం ప్రపంచంలోని ప్రతి ప్రాంతాన్ని ఆవరించే "అంతర్జాతీయం మరియు మొత్తం"గా వుండాలి. అంటే దాంట్లో రాజకీయ మనోవిజ్ఞాన, ఆర్థిక, మిలిటరీ, ప్రత్యేక పద్ధతులన్నింటిని ఒకే మొత్తంగా సమగ్రంగా కలిపివేయాలి. మరో మాటలో చెప్పాలంటే మన అన్ని గుర్రాలను ఒకే ఒక టీమ్‌గా సాగేటట్లు చూసే కర్తవ్యం.

మన మొత్తం సహజ రబ్బర్, మాంగనీసు, క్రోమియం, తగరం గణనీయ భాగం మన జింక్, కాపర్, చమురు, మూడవ వంతుకన్నా ఎక్కువ సీసం, అల్యూమినియం, మనకు కావలసివన్నీ మనకు విదేశాల నుండి రావాలి. ఇంకా ఇదంతా ప్రధానంగా వెనుకబడిన ప్రాంతాలైన ఆఫ్రికా, ఆసియాల నుండి వస్తున్నది. ఈ దేశాలన్నీ అమెరికా నిర్మించిన ఏదో ఒక మిలిటరీ కూటమిలో వున్నాయి. మన "సూపర్ వ్యూహాత్మక పదార్థం" (యూరేనియం ఖనిజం (ప్రత్యేకంగా)లో ప్రధాన భాగం విషయంలో కూడా ఇది నిజం."

"ప్రభుత్వం ప్రయివేటు పెట్టుబడిదారులను ప్రోత్సహించి ఉపయోగించుకోవాలి. వారి సహాయంతో చాలా రాజకీయ లక్ష్యాలు నెరవేరుతాయి. దీర్ఘకాలంలో ఈ పెట్టుబడులు మన విధానానికి అవిశ్వాసంగా వుండే ప్రతిపక్షం లేక ప్రతిఘటనను నిర్మూలించడమో లేక తటస్థీకరించడమో చేసే అవకాశాన్ని మనకు యిస్తాయి. అవి మనకు మద్దతు యివ్వడంలో సందిగ్ధంగా వుండడమో లేక సందేహించే స్థానిక వ్యాపార ప్రయోజనాలపై ఆర్థిక ఒత్తిడులు పెంచడానికి ఉపయోగపడతాయి. అదే సమయంలో మనతో సహకారం నెరపడానికి సిద్ధపడే స్థానిక వ్యాపార కమ్యూనిటీలోని సమూహాలకు ఆర్థిక సహాయం అందించడం పెంచి, వారిని కీలక ఆర్థిక స్థానాలలో వుండేటట్లు ఈ వ్యాపారస్తులకు అవసరమైన పరిస్థితులను సృష్టించి అదే విధంగా వారి రాజకీయ ప్రభావం పెంచాలి."

(ఐర్లాండ్‌లోని డబ్లిన్‌లో జరిగిన సెమినార్‌లో సమర్పించిన పత్రం) *

వ్యాసం

❖ డా. బాలగోపాల్

"భూ" నిర్వాసితుల పక్షాన ఐక్య ఉద్యమం అవసరం

పేదలకివి మంచి రోజులనుకున్న రోజులలో భూమిలేనివారికి ప్రభుత్వం డి-ఫారం పట్టాలు ఇచ్చిన భూముల పటం తయారు చేయండి. పట్టా యిచ్చిన భూములను రంగులలో చూపించండి.

గడచిన రెండున్నర సంవత్సరాలలో సెజ్‌లకు ఇతర వాణిజ్య అవసరాలకు ప్రభుత్వం అప్పగించిన భూముల పటం తయారు చేయండి. ఆ భూములను కూడ రంగులలో చూపించండి. ఆ పటం మీద ఈ పటాన్ని ఉంచండి.

రెండూ సరిగ్గా అతుక్కుంటాయి. పోనీ, సరిగ్గా కాకపోతే నూటికి తొంభై శాతం అతుకుతాయి. పేదరికం పోగొట్టడానికి చెప్పి ఒకనాడు పంచిన భూమిని ఏరిఏరి వెనక్కి తీసేసుకొని కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారు. ప్రభుత్వ భూములను పేదలకు పంచడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రభాగాన నిలిచింది. దేశం మొత్తంమీద జరిగిన భూమి పంపిణీలో దాదాపు సగం ఆంధ్రప్రదేశ్‌లోనే జరిగింది. ఇప్పుడు సెజ్‌లలోనూ ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలిచింది. దీని వెనకున్న మర్మం ఇదేనా?

పెట్టుబడిదార్లకు ప్రభుత్వం భూములు కట్టబెడుతున్న వైనాన్ని గురించి దినపత్రికలలో - ప్రత్యేకించి ఈనాడులో, ఆంధ్రజ్యోతిలో చాలా రాస్తున్నట్టు మనం అనుకుంటాంగానీ ఈ కీలక విషయం ఆ రాతలలో కనిపించదు. ఈ వరవడికి మూలం చంద్రబాబు పాలనలోనే ఉండడం దీనికి కారణం కావచ్చు. ఇస్తే అసైన్డ్ భూములే కంపెనీలకి ఇవ్వాలన్న నీతి చంద్రబాబు నియమం తప్పకుండా పాటించాడు. హైదరాబాద్ పరిసరాలలో ఐటి కంపెనీలకు ఆయన హయాంలో ఇచ్చిన భూములన్నీ పేదల డి-ఫారం భూములే. అనుమానముంటే ఒకసారి నానక్‌రాంగూడకు పోయి చూడండి.

అప్పట్లో న్యాయవ్యవస్థ వైఖరి కూడ అతనికి అనుకూలంగా ఉండింది. అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుంటే ఒక్కటమ్మితే కూడ నష్ట పరిహారం ఇయ్యనక్కరలేదని చెప్పిన అయిదుగురు న్యాయమూర్తుల బెంచి తీర్పు అప్పట్లో అమలులో ఉండింది. నిజానికి డి-ఫారం పట్టా ఆ మాటే అంటుంది. అత్యధికంగా నిరక్షరాస్యులయిన భూమిలేని పేదలకిచ్చే డి-ఫారం పట్టాలో చదువుకున్న వాళ్లకే కళ్ళు తిరిగిపోయేటన్ని షరతులుంటాయి. వాటిలో ఒకటి, 'ఎప్పుడయినా ఏ ప్రజావసరానికి అయినా ఈ భూమి ప్రభుత్వానికి అవసరమయితే ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండ వెనక్కి తీసుకోవచ్చు' అనేది. చాలాకాలం అట్లాగే సాగింది.

కానీ ఇది అన్యాయం అన్న విమర్శ బలంగా రాగా రాష్ట్ర ప్రభుత్వం దానిని పాక్షికంగా సవరిస్తూ జీవోనెం. 1307 జారీ చేసింది. దాని ప్రకారం అసైన్డ్ భూములను వెనక్కి తీసుకుంటే రిజిస్ట్రేషన్ ధరప్రకారం నష్టపరిహారం ఇస్తారు గానీ ఆపైన సొలేషియం (బలవంతంగా తీసుకొంటున్నందుకు అదనంగా ఇచ్చే ఊరడింపు పైకం) ఇవ్వరు. కోర్టులలో దావా వేసి నష్టపరిహారం మరింత ఎక్కువ పొందే అవకాశం ఇవ్వరు. ఈ జీవో నెం. 1307ను ఒక విచిత్రమైన తీర్పుతో మన హైకోర్టు కొట్టేసింది. ఒక ప్రజావసరం (పేదరిక నిర్మూలన) కోసం ఇచ్చిన భూమిని ఇంకొక ప్రజావసరం(పరిశ్రమలు, లేక ప్రాజెక్టులు)కోసం తీసేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని దానికి నష్టపరిహారం ఇయ్యనవసరం లేదనీ ఆ తీర్పు చెప్తుంది.

చంద్రబాబునాయుడు పాలన చివరిదశ దాకా ఈ తీర్పు అమలులో ఉన్న కారణంగా విప్రోలు, సత్యంలు ఐటి పరిశ్రమ అభివృద్ధికోసం కారుచవగ్గా పేదల భూములు పొందగలిగారు. ప్రపంచ విఖ్యాతిగాంచిన తెలుగుదేశపు ఐటి రంగ వికాసం భూమిలేని దళితుల విస్థాపన మీద నిలబడిందని వేరే ఎక్కువ అతిశయోక్తి లేకుండా చెప్పుకోవచ్చు. అయితే రాజశేఖరరెడ్డి ప్రభుత్వం వచ్చేసరికి హైకోర్టు తన వైఖరి మార్చుకుంది. పాత తీర్పును కొట్టేస్తూ జీవోనెం. 1307ను బతికించడమేకాక, పాక్షిక నష్ట పరిహారసూత్రం చెల్లదనీ అసైన్డ్ భూములకు కూడ స్వంత భూములకిచ్చినట్టు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం ఇవ్వాలనీ 2004 పూర్వార్థంలో ఏడుగురు జడ్జిల బెంచి తీర్పు ఇచ్చింది.

వేరే ఎవరయినా ఇక అసైన్డ్ భూముల జోలికి పోకపోదురుగానీ పులివెందుల ప్రభువులు అంతచిన్న విషయాలకు జడవరు. హైకోర్టు తీర్పుపైన, సుప్రీం కోర్టులు అప్పీల్ వేసి ఏ సంగతీ తేలేలోపల అసైన్డ్ భూములనేవి మిగలకుండా పోయేంతగా వాటిని స్వాధీనం చేసుకొని 'అభివృద్ధి'కి అర్పిస్తున్నారు. నష్టపరిహారమంటారా, ఒక పద్ధతి ఒకరీతి లేకుండ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. అసైన్డ్ భూమితోబాటు రైతుల జిరాయితీ భూమిని కూడ చెప్పుకోదగ్గ మోతాదులో స్వాధీనం చేసుకున్న చోట అసైన్డ్ భూమికి కూడ జిరాయితీ భూమితో సమానంగా కాకున్న చెప్పుకోదగ్గ మొత్తం ఇస్తున్నారు. అసైన్డ్ భూమే ప్రధానంగా స్వాధీనం చేసుకున్న చోట జీవో నెం. 1307ను కొన్నిసార్లు పాటిస్తున్నారు. చాలా సందర్భాలలో అసలేమీ ఇవ్వడం లేదు.

హైదరాబాద్‌కు కంప్యూటర్ సంబంధిత పారిశ్రామిక రంగంలో చాలా ప్రతిష్ఠతెచ్చిపెట్టనున్న ఫ్యాబ్‌సిటీ ఒక ఉదాహరణ. మహేశ్వరం మండలం రావిరాల గ్రామంలోని సర్వే నెం. 18లో 120 ఎకరాల అసైన్డ్ భూమి (లావాణి) ఫాబ్‌సిటీ కోసం తీసుకున్నారు. లావాణి పట్టా పొందిన వారు బోర్లు వేసుకొని బాగుచేసుకొని కడుపునింపే మేరకు తిండిగింజలు పండించుకునేవారు. ఆ భూమి తీసుకొని దాని చుట్టూ కంచె వేసేసుకొని రెండేళ్ళు దాటింది. కానీ నష్టపరిహారం ఊసెత్తడంలేదు. ఎంతిచ్చేదీ చెప్పడం లేదు, ఎప్పుడిచ్చేది చెప్పడం లేదు.

ప్రభుత్వ భూములను బలహీనవర్గాలకే ప్రధానంగా అసైన్‌మెంట్ ఇవ్వాలని నియమాలు చెప్తాయి. ఎక్కువగా పొందింది దళితులు, లంబాడీ తండాల గిరిజనులు, వాళ్ళ కడుపుకొట్టి 'దేశాన్ని' అభివృద్ధి చేసే వికృత విధానం మనకళ్ళముందు కొన్నేళ్ళుగా అమలవుతున్నది.

ఈ బలహీన వర్గాలు తరచుగా డి-ఫారం పట్టాలు సహితం లేకుండా ప్రభుత్వ భూములు చేసుకుంటారు. అటువంటి సందర్భాలలో వారి అర్హత గురించి విచారణ జరిపి డీ-ఫారం పట్టాలు

ఇవ్వాలని స్వాతంత్ర్య పూర్వకాలం నుండి అమలులో ఉన్న నియమాలు చెప్తాయి. కానీ చేయి తడవనిదే మంచి పనులు చేసే అలవాటు రెవెన్యూ యంత్రాంగానికి లేదు. తమ సిఫారస్ లేకుండ ప్రజలకివ్వవలసింది ఇచ్చేస్తే రాజకీయ నాయకులు ఊరుకోరు. అందువల్ల అర్హులయి ఉండి సాగు చేసుకుంటున్న భూములకు డి ఫారం పట్టా సహితం పొందని దళిత తదితర పేద వర్గాలవారు వేల సంఖ్యలో రాష్ట్రమంతటా ఉన్నారు. వారి భూములనిప్పుడు ప్రభుత్వం తీసేసుకొని 'ఇది నాదేగా' అని దమ్మిడీ చెల్లించకుండ ఏ సెజ్‌కో అప్పగిస్తున్నది. ఇవ్వవలసి ఉన్న పట్టా ఇవ్వకపోతే చట్టంకళ్ళలో ఇచ్చినట్టేనని ప్రకటించటానికి న్యాయస్థానాలు సిద్ధంగా ఉన్నట్టయితే వీరికే కనీసం జీ.వో నెం. 1307 వర్తించాలి గానీ న్యాయస్థానాలను అంతగా నమ్ముకొని ఖర్చుపెట్టుకునే సాహసం చేసిన వారెవరూ కనబడడం లేదు. అయ్యో, జరగగల రోజులలో ఎంఎల్ఏని పట్టుకొని పట్టా పొందకపోతిమే అని చింతిస్తూ భూమిని ఉద్దరకు అప్పగించి వెళ్ళిపోతున్నారు. వరంగల్ జిల్లా భూపాలపల్లి దగ్గర సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులకోసం స్వాధీనం చేసుకున్న భూమిలో ముత్యంరావు అనే ఒకనాటి దేశ్‌ముఖ్‌కు చెందిన సీలింగ్ భూమి విస్తారంగా ఉంది. సీలింగ్ మిగులు భూమిగా గుర్తించిన దానిని వెంటనే భూమిలేని పేదలకైనా పంచాలి లేదా వేరే ఏదయినా ప్రజాప్రయోజనానికి వినియోగించాలి అని భూగరిష్ఠ పరిమితి చట్టం చెప్తుంది. ప్రభుత్వం కేవలం దానిని సీలింగ్ భూమిగా గుర్తించి ఊరుకుంది. చాలామంది పేదలు - ప్రధానంగా జంగేడు, గడ్డిగాని పల్లి గ్రామాలకు చెందిన దళితులు - 300 ఎకరాల సీలింగ్ భూమిని 15-20 ఏళ్ళుగా సాగుచేసుకుంటున్నారు. మామిడి తోటలు సహితం పెట్టారు. ఎస్‌సి కార్పొరేషన్ నుండి అప్పులు తీసుకొని పెట్టుబడిపెట్టారు. 'అన్యాక్రాంతం' అయిన ప్రభుత్వ భూములను ఎప్పటికప్పుడు గుర్తించి, ఆక్రమించుకున్న వారు అర్హులయితే అసైన్‌మెంట్ ఇవ్వాలనీ లేకపోతే తొలగించాలనీ బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ చెప్తాయి. ప్రభుత్వం 15-20 ఏళ్ళుగా ఏమీచేయలేదు. రికార్డులలో అది ప్రభుత్వం బంజరుగా ఉండి పోయింది. ఇప్పుడు దరఖాస్తుదారుకు పైసా ఇవ్వకుండ సింగరేణికి స్వంతం అయింది.

కంపెనీలకే కాదు, ప్రభుత్వంవారి భద్రతావసరాలకు కూడ బడుగు వర్గాల భూములే అక్కరకొస్తున్నాయి. నల్గొండ జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో ఒక ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ రాబోతున్నదని చాలాకాలంగా వింటున్నాం. అదంతా లంబడా తండాల భూమే. అధిక భాగం లావాణి పట్టాల భూమి, కాకపోతే పట్టా లేకుండ లంబాడాలు చేసుకుంటున్న భూమి. ఇప్పుడు అనంతపురం జిల్లా కంబదూరు, కనగానపల్లి మండలాలోనూ ఒక ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ ప్రతిపాదిస్తున్నారు. అదికూడా అధికంగా లంబాడీ తండాల భూమే. లంబాడీ గిరిజనులు డి-ఫారం పట్టాలు పొంది సాగుచేసుకుంటున్న భూమే. నిజానికి వేరే ఎవరూ ప్రవేశించడానికి సాహసించని చోట రాళ్ళు కొట్టి తుప్పలు నరికి భూమిని సాగులోకి తెచ్చిన ఘనత లంబాడీలది. ఆ ప్రక్రియలో వారికి ప్రభుత్వం నుండి ఏ సహాయం లభించదు. అంతా అయిపోయిన తరువాత సరైన పైరవీ ఉంటే అసైన్‌మెంట్ పట్టా దొరుకుతుంది, లేకపోతే అది కూడా దొరకదు. వారి శ్రమతో వారు వ్యవసాయాన్నీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసారన్న మెచ్చుకోలు ఎప్పుడూ వినపడదు. వేరే వారి 'అభివృద్ధి' కోసం మాత్రం వారి భూములు ఫ్రీగా అప్పగించిపోవాలి.

టీవీలలోను, దినపత్రికలలోనూ ప్రతిరోజూ ప్రభుత్వం మీద ప్రతిపక్ష పార్టీల నాయకులు 'దుమ్మెత్తిపోస్తున్నట్టు', 'కన్నెర్రజేస్తున్న'ట్టు, 'ధ్వజమెత్తు తున్నట్టు' చూసే, వారికి ఈ అన్యాయాన్ని గురించి ప్రతిపక్ష పార్టీ మాట్లాడటం లేదంటే ఆశ్చర్యం కలుగుతుందేమో. కానీ అది నిజం. తెలుగుదేశం పార్టీ సమస్య ఏమిటంటే రేపు అధికారానికి వస్తే గిస్తే వారు ఇంత కంటే భిన్నంగా నడుచుకో బోరు. రాజశేఖరరెడ్డి దోచుకొని తింటున్నారని నిందించడం వేరు, అతననుసరి స్తున్న విధానాలే అన్యాయమనటం వేరు. ఈ తేడాను చంద్రబాబునాయుడు చాలా జాగ్రత్తగా పాటిస్తున్నాడు. సిపిఐ (ఎం) సమస్యేమిటంటే పశ్చిమబెంగాల్ లో ఇంతకంటే భిన్నమైన విధానాలు పాటించడం లేదు. పైగా అందరిలాగ సిపిఐ (ఎం) సిద్ధాంతవేత్తలు కూడ అభివృద్ధికి కావాలంటే మెట్టభూములు తీసుకోండి, మాగాణి భూములు విడిచి పెట్టండి అనడం, లేదా దళితులకు, లంబాడీలకు డి-ఫారం పట్టాలు ఇచ్చిన భూమంతా మెట్టభూమేకదా, మాగాణిలెక్కడిస్తున్నారు? ఈ మాట అనడంలోనే బాగున్న రైతులను విడిచిపెట్టి బడుగువర్గాల వారి భూములు తీసుకోండి అన్నధ్వని ఉందని గ్రహించని వారు ఆ తరువాత బీదలకు అన్యాయం జరిగిందని ఏ ముఖం పెట్టుకొని ఆందోళన చేయగలరు?

ఇక ప్రజాసంఘాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంతమంచిది. ఎక్కడికక్కడ చిన్న గిరిగీసుకున్న పార్టీల ప్రజాసంఘాలు, మీడియా పుణ్యాన ఇంకా బతికి ఉన్న పార్టీయేతర సంఘాలు, తమ చిన్న ప్రపంచాన్నే సర్వస్వం అనుకునే ఎన్జీవోలు తప్ప మన దగ్గరిప్పుడు ప్రజా ఉద్యమం అనేదీ లేదు. పాలకులకిది గొప్పవరం అయింది. *

స్వీకారం

1. **హిరణ్యరాజ్యం**
   రాయలసీమ ఫ్యాక్షనిజం చారిత్రక నేపథ్యం పరిణామ క్రమం
   రచన : వేంపల్లి గంగాధర్ వెల : రూ. 50/-
   పి.టి.వీరారెడ్డి ఫౌండేషన్ ప్రచురణ
   ప్రతులకు : డా. ఆదర్శరెడ్డి, చైర్మన్
   శ్రీ పి.టి. వీరారెడ్డి ఫౌండేషన్,
   21-460, పి.పి.స్ట్రీట్, 7 రోడ్స్, కడప.

2. **దాడి (నవల)** వెల : 100/-
   రచన : పెద్దింటి అశోక్ కుమార్
   తెలంగాణ రచయితల వేదిక ప్రచురణ
   ప్రతులకు : పెద్దింటి అశోక్ కుమార్
   మల్లారెడ్డి పేట పోస్ట్, గంభీర రావు పేట మండలం.
   కరీంనగర్ జిల్లా.

3. **రెక్కలు పొదిగిన చూపు**
   సుహాసిని కవిత్వం వెల : రూ. 50/-
   ప్రతులకు : డా. డి.ఎల్.సుహాసిని, తెలుగు రీడర్
   డి.ఆర్.డబ్ల్యూ.కాలేజ్, గూడూరు. నెల్లూరు జిల్లా.

వ్యాసం

❖ ప్రొ. కోదండరాం

సెజ్‌ల ఆర్థిక వ్యవస్థ : పరిణామాలు - పరిష్కారాలు

సెజ్‌ల ఏర్పాటు పట్ల రాష్ట్రవ్యాపితంగా నిరసన వ్యక్తమౌతున్నది. అయితే ఇప్పటి వరకు సెజ్‌ల కారణంగా నిర్వాసితులౌతున్న ప్రజలు మాత్రమే నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇతర వర్గాల నుండి పెద్దగా స్పందన లేదు. అందుకు కారణం లేకపోలేదు. సెజ్‌ల చర్చను నిర్వాసితుల అంశానికి మాత్రమే పరిమితం చేస్తున్నాం. అట్లా కాకుండా సరళీకరణ యుగంలో పారిశ్రామికాభివృద్ధికి అనుసరిస్తున్న విధానాలలో అంతర్భాగంగా సెజ్‌లను చూడాలి. అప్పుడే విస్తృత ప్రజానీకాన్ని కదిలించడానికి అవకాశం ఏర్పడుతుంది.

స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికీకరణకు ప్రభుత్వం కృషి చేస్తూనే ఉన్నది. తొలుత భారీ పరిశ్రమలను ప్రభుత్వరంగంలోనే ఏర్పాటు చేసి పారిశ్రామికీకరణకు పునాదులు వేసింది. వీటికి అనుబంధంగా ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడానికి 1970ల నుండి రాష్ట్రాలు మౌలిక సదుపాయాలను కల్పించే బాధ్యతను స్వీకరించాయి. అయితే 1990ల దాకా వ్యవసాయానికిచ్చిన ప్రాధాన్యతను పారిశ్రామిక రంగానికి ఇవ్వలేదు. ఎందుకంటే అన్ని పార్టీలు పెత్తందారీ వర్గాల మీద ఆధారపడి ఉండేవి.

హరిత విప్లవం కారణంగా వ్యవసాయంలో వచ్చిన మిగులును పారిశ్రామిక రంగంలోను, సేవా రంగంలోను పెట్టుబడి పెట్టి లాభాలు గడించి ఒక బలమైన కాంట్రాక్టరు / పెట్టుబడిదారీ వర్గం ఎదిగింది. ఈ వర్గం ఎదుగుదలకు రాజ్య యంత్రాంగమే పూర్తిగా సహకరించింది. హరిత విప్లవాన్ని తెచ్చి ధనిక రైతాంగం ఎదుగుదలకు తోడ్పడిన ప్రభుత్వం ఆ తరువాత 1970లలో ధనిక రైతాంగం తన మిగులును లాభసాటిగా పెట్టుబడి పెట్టడానికి కావలసిన సదుపాయాలను కూడా కల్పించింది.

అట్లా ఎదిగిన వర్గమే ఇవ్వాళ అధికారంలోకి వచ్చింది. అదీ సరళీకరణ యుగంలో. ఈ వర్గం దేశ, విదేశీ పెట్టుబడిని ఆకర్షించి, పారిశ్రామికీకరణను సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నది. అందుకని వ్యవసాయ రంగంకన్నా, అసంఘటిత రంగం కన్నా పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యతనిస్తున్నది. మన రాష్ట్రంలో చంద్రబాబు ఇటువంటి వర్గాల ప్రతినిధిగా దొడ్డిదారిలో వచ్చి అధికారాన్ని చేపట్టినాడు.

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ముందుగా పబ్లిక్‌రంగ సంస్థల్లో సంస్కరణలు తీసుకొచ్చాడు. కొన్ని కంపెనీలను అమ్మి, మరికొన్ని కంపెనీలను మూసివేసినాడు. ఇక మిగిలిన కంపెనీలు ప్రభుత్వం మీద ఆధారపడకుండా తమ వనరులను తామే సమకూర్చుకోవాలని ఆదేశించాడు. అందువలన ఆ కంపెనీలు డబ్బు ఆదా చేయడానికి, ఆదాయాన్ని పెంచుకోవడానికి కార్మికుల సంఖ్యను కుదించాయి. కొన్ని రంగాలలో పనులను కాంట్రాక్టర్లకిచ్చి తక్కువ వేతనాలతో పనులు చేయించుకుంటున్నాయి.

ఇట్లా 50 వేల కార్మికులను తొలగించి పబ్లిక్‌రంగ సంస్థలను చిన్నాభిన్నం చేసిన తరువాత ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వం ప్రయత్నాలను ప్రారంభించింది. బిల్‌గేట్స్‌ను ఒప్పించి మైక్రోసాఫ్ట్ కంపెనీని ఆకర్షించడానికి చంద్రబాబు, వోక్స్‌వేగన్ కంపెనీని ఆకట్టుకోవడానికి రాజశేఖర రెడ్డి చేసిన ప్రయత్నం మొత్తం ప్రపంచానికి తెలుసు. ఇతర రాష్ట్రాలు కూడా వీరితో పోటీ పడినాయి. ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూలును రాష్ట్రానికి రప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇట్లానే ప్రయత్నించింది.

వ్యవస్థాగత మార్పులకుగాను రాష్ట్ర ప్రభుత్వానికి 1997లో ప్రపంచ బ్యాంకు రుణ సౌకర్యం కల్పించిన తరువాత ప్రభుత్వం దృక్పథంలో మరికొంత మార్పువచ్చింది. అప్పటి వరకు పెట్టుబడిని ఆకర్షించడానికి జరిగిన ప్రయత్నాలను క్రమబద్ధీకరించి రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక విధాన పత్రాన్ని, ఐ.టి. విధాన పత్రాన్ని ప్రకటించింది.

మొదటి ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ పాలసీని 1999లో విడుదల చేయగా దాన్ని పెంపొందించి 2002లో రెండవ విధాన పత్రాన్ని విడుదల చేశారు. దీని తరువాత 2005లో మూడవ విధాన పత్రం జారీ అయింది. ఇది 2010 వరకు అమలులో ఉంటుంది. ఐటి రంగంలో పెట్టుబడులను ఆకర్షించడం, ఐ.టి ఎగుమతులను పెంచడం, ఐ.టి రంగంలో ఉపాధి అవకాశాలను కల్పించడం ప్రధాన లక్ష్యాలు. ఈ లక్ష్యాల సాధనకుగాను భూమి ఇవ్వడమే కాక, మౌలిక సదుపాయాలను కల్పించడం, పన్నులు తగ్గించడం, కాలుష్య నివారణ చర్యలకయ్యే ఖర్చులపై రాయితీలివ్వడం ప్రభుత్వం ఎంచుకున్న మార్గాలు.

పారిశ్రామిక విధానాలు కూడా అదే విధంగా పెంపొందినాయి. 2005-2010 కాలానికి పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించడానికి. విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఈ విధానాల ప్రకారం ఐ.టి రంగానికి ఇచ్చే రాయితీలనే పారిశ్రామక రంగానికి ఇస్తున్నారు. పారిశ్రామికాభివృద్ధికి గాను మౌలిక సదుపాయాలను పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చింది. ఈ లక్ష్యాల ప్రకారం భూమిని సేకరించి పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడే విధంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే బాధ్యతను ప్రభుత్వం ఎ.పి.ఐ.ఐ.సి కి అప్పగించింది. ప్రత్యేకమైన మౌలిక సదుపాయాల బోర్డును ఏర్పర్చింది. మౌలిక సదుపాయాల నిర్మాణానికి గాను 2000 సంవత్సరమున భూమిని సేకరించి ప్రైవేటు పెట్టుబడిదారుల సహాయంతో పారిశ్రామిక అభివృద్ధి కేంద్రాలను నెలకొల్పడం ప్రారంభించింది. అయితే కంపెనీ పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా పనిచేయడం లేదని కాగ్ 2007 నివేదికలో పేర్కొన్నది. పలుకుబడి కలవారికి తక్కువ ధరకే భూములు కేటాయించిందన్న ఆరోపణలున్నాయి. 2002-2007 మధ్యకాలంలో ఎపిఐఐసి రాష్ట్రంలో దిగువ చూపిన విధంగా భూమిని సేకరించింది.

సం॥	సేకరించిన భూమి (ఎకరాలలో)
2002-03	1,106
2003-04	1,951
2004-05	4,549
2005-06	14,493
2006-07	6,498
	28,597

సేకరించిన భూమిని ఏ.పి.ఐ.ఐ.సి ఈ విధంగా పంపిణీ చేసింది. ఇవి కొన్ని ముఖ్యమైన సంస్థలు మాత్రమే. జాబితా ఇంకా పెద్దది.

సంస్థ పేరు	సంవత్సరం	ఎకరాలలో భూమి
జడ్చర్ల, అభివృద్ధి కేంద్రం	2003	954.22
విశాఖపట్నం, అప్పరెల్ పార్క్	2004	145.60
పాశమైలారం, టెక్స్‌టైల్ పార్క్	-	50.00
హైదరాబాద్, జెమ్స్ సెజ్	-	200.00
హైదరాబాద్, హార్డ్‌వేర్ పార్క్	2000	2090.32
వైజాగ్, ఫార్మాసిటీ	2001	2255.93
హైదరాబాద్, ఐ.టి.పార్క్	2001	180.00
హైదరాబాద్, ఐ.టి.పార్క్	2000	147.69
హైదరాబాద్, కన్వెన్షన్ సెంటర్	2002	531.98
కుప్పం, ఫుడ్ ప్రాసెసింగ్, పార్క్	2000	182.41
విశాఖపట్నం, సెజ్	2000	9113.00
విశాఖపట్నం, గంగవరం పోర్టు	2000	-

ఇవికాక హైదరాబాదులో రింగ్ రోడ్డు కొరకు, అంతర్జాతీయ విమానాశ్రయం కొరకు కూడా భూమిని సేకరించారు. క్రమంగా ఈ పారిశ్రామిక వాడల చుట్టూ అల్లుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగింది. మరొకవైపు పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి వలన లబ్ధి పొందిన కాంట్రాక్టరు వర్గం ఎదిగింది. పారిశ్రామికీకరణ వలన పారిశ్రామికాభివృద్ధి ఎంతజరిగిందో కాని రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగింది. ఈ పారిశ్రామిక కేంద్రాల వలన లాభపడిన కాంట్రాక్టర్లున్నారు. నిజానికి మౌలిక సదుపాయాల కల్పనలో కాంట్రాక్టర్లకు లాభం కలిగించే లక్ష్యంతో మౌలిక సదుపాయాల అభివృద్ధి చట్టం వచ్చింది. ఈ చట్టం ప్రకారం మౌలిక సదుపాయాల బోర్డు ఏర్పడింది. బోర్డు మౌలిక సదుపాయాల నిర్మాణానికి ఎవ్వరినైనా పిలిచి కాంట్రాక్టు ఇవ్వవచ్చు. లేదా కాంట్రాక్టర్లే ప్రతిపాదనలు చేయవచ్చు. నిర్మాణం చేసిన తరువాత ఆ కట్టడాలపైన ఆదాయాన్ని పొందవచ్చు. అట్లా పారిశ్రామికాభివృద్ధి చర్యల వలన రియల్ ఎస్టేటు వ్యాపారస్తులకు, కాంట్రాక్టర్లకు కూడా లాభం కలిగింది. అందువలన 2000 సంవత్సరం తరువాత పారిశ్రామికీకరణ చర్యలపై కాంట్రాక్టర్లకు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు ఆసక్తి పెరిగింది. అందుకే పారిశ్రామికీకరణ చర్యలు వేగం పుంజుకున్నాయి.

2005లో కేంద్ర ప్రభుత్వం సెజ్ చట్టం తెచ్చిన తరువాత రాష్ట్రంలో అప్పటికే ఏర్పాటిన పారిశ్రామిక వాడల్లో కొన్నింటిని సెజ్‌గా మార్చారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సెజ్‌లు మన రాష్ట్రంలో ఉన్నాయి. అందులో 42 ఐ.టి రంగానికి చెందినవి. ఇవికాక ఇంకొక 5 రాబోతున్నాయి. పారిశ్రామిక వాడలను సెజ్‌లుగా మార్చడానికి గల కారణాలను ప్రభుత్వం పేర్కొన్నది. వారి దృష్టిలో సెజ్ పారిశ్రామిక, వ్యాపార, సేవా కార్యకలాపాలకై పన్ను కానీ ప్రపంచీకరణం ఫలితంగా క్రమంగా ఆలోచనలు మారిపోయాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో సెజ్‌ల వలన ఒక ప్రధానమైన ప్రయోజనం ఉన్నది. సెజ్‌లు ఒక ప్రాంతంలోని వనరులను తక్కువ ధరకు పొందడానికి, వాటి నుండి లబ్ధిపొందడానికి ఉపయోగపడగలవన్న భావన బాగా బలపడింది. ఆ కారణాల చేత సెజ్‌ల చట్టం 2005లో వచ్చింది.

మన రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొరకు, కాంట్రాక్టర్ల లబ్ధికొరకు పారిశ్రామిక వాడలు ఏర్పడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సెజ్‌ల ఏర్పాటు ఆంధ్రప్రదేశ్‌లో వేగం పుంజుకున్నది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సెజ్‌లు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని, ఇందులో ఎక్కువ భాగం ఐ.టి రంగానికి చెందినవేనని ముందు చెప్పుకున్నాం. నిజానికి ఐ.టి. రంగానికి పెద్దగా స్థలాలు అవసరం లేదు. 1000-1500 గజాలలోనే అద్భుతమైన ఐ.టి కంపెనీ నిర్మించవచ్చు. కానీ ఒక్క కంపెనీకి మినహా అన్నింటికి 10 ఎకరాలపైనే కేటాయించారు. ఇట్లా కేటాయించిన భూమిని విధిగా కంపెనీ వినియోగించాలన్న నియమం లేదు. ఆ భూమిని కంపెనీ ఏ అవసరాలకైనా వాడుకోవచ్చు.

ఇందు కొరకు రైతుల నుండి ప్రత్యేకించి ప్రభుత్వ భూములు పొందిన చిన్న సన్నకారు రైతుల నుండి భూములను నామమాత్రం ధరకు గుంజుకొని మార్కెటు ధరకన్నా తక్కువ ధరకే కంపెనీలకు కేటాయించారు. అంటే ఎస్.సి, ఎస్.టి, బి.సిలకు కేటాయించిన ఎసైన్డ్ భూములను కాకులను కొట్టి గద్దలకు వేసినట్టు కంపెనీలకు అప్ప చెప్పారు. ఒక వ్యాపార సంస్థకు ప్రభుత్వం ఈ రకంగా సహాయం చేయడం రాజ్యాంగ విరుద్ధం. భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం తన ఆస్తిపాస్తులను న్యాయాన్ని పెంపొందించే విధంగా, సమానత్వాన్ని సాధించే లక్ష్యంతో వినియోగించాలి. కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది.

మన రాష్ట్రంలో సెజ్‌ల ఏర్పాటు వలన ఒక్క ఐ.టి రంగానికే ప్రోత్సాహం లభించింది. మిగతా అన్ని రంగాలు నిర్లక్ష్యానికి లోనయ్యాయి. పబ్లిక్ రంగ సంస్థలు మూతబడినాయి. అందువల్లనే సుమారు 20,000 ఉద్యోగాలు పోయాయి. అదేవిధంగా చిన్న కంపెనీలు ముఖ్యంగా మందుల కంపెనీలు మూతబడిపోయినాయి. అక్కడా ఉద్యోగావకాశాలు పోయాయి. అది అట్లా ఉండగా ఐ.టి రంగంలో వచ్చే ఉద్యోగాలకు ఇంగ్లీషు, కంప్యూటర్ తెలిసిన కొద్ది మంది మాత్రమే అర్హులు. ఇతరులకు అందువలన కలిగే ప్రయోజనాలు నామమాత్రమే.

కనుక పారిశ్రామిక విధానాలను, సెజ్‌లను పరిశీలిస్తే తేలేదేమిటంటే సమిష్టి వనరులను పేద ప్రజల ప్రయోజనాలకు ఉపయోగించే బదులు కొద్ది మంది కొరకు కేటాయిస్తున్నారు. ఈ వర్గాలు తమకు తక్కువ ధరకు సంక్రమించిన వనరుల వలన విశేషంగా లాభాలను సంపాదిస్తున్నాయి.

ఈ అభివృద్ధి నమూనా వలన కొద్దిమంది మధ్యతరగతికి చెందిన వ్యక్తులు ఉపాధి పొందుతున్నారు. వారికి ఎక్కువ జీతాలు వస్తుండటం వలన మోటారు వాహనాల కొనుగోలును, ఇళ్ళ నిర్మాణాలకు అప్పుపెట్టి ఫైనాన్సు కంపెనీలు లాభపడుతున్నాయి. ఇళ్ల నిర్మాణం వలన రియల్ ఎస్టేటు కంపెనీలు లబ్ధిపొందాయి. మొత్తం నగరాలకు చెందిన వనరులన్నీ ఈ కంపెనీలకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకే ఖర్చవుతున్నాయి.కనుక బస్తీల పరిస్థితి ఇంకా దిగజారిపోతున్నది.

సెజ్‌ల వ్యతిరేక పోరాటం నిర్వాసితుల పోరాటంగా సాగుతున్నది. ఇట్లా కొనసాగుతున్నంత కాలం ఈ పోరాటం పరిమితంగా సాగుతుంది. అట్లా కాక సెజ్ వ్యతిరేక పోరాటం అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా సాగితే విశాల ప్రాతిపదికన ప్రజలను కదిలించవచ్చు. వనరుల కేటాయింపులను అసమానతలకు వ్యతిరేకంగా సాగుతున్న దళిత, తెలంగాణ ఉద్యమాలతో సెజ్ వ్యతిరేక ఉద్యమాలను అనుసంధానం చేయవలసిన అవసరం ఉన్నది. *

Statement about ownership and other particulars of periodical **ARUNATARA** as required to be published in the first issue of every year after the last day of February

Form IV (See Rule 8)

1.	Place of publication	:	Vijayawada
2.	Periodicity of its publication	:	Monthly
3.	Printer's name	:	Chalasani Prasad
	Whether citizen of India	:	Indian
	Address	:	33-13-3, Seetarampuram, Vijayawada- 520 002.
4.	Publisher's name	:	Chalasani Prasad
	Whether citizen of India	:	Indian
	Address	:	33-13-3, Seetarampuram, Vijayawada- 520 002.
5.	Editor's name	:	Chalasani Prasad
	Whether citizen of India	:	Indian
	Address	:	33-13-3, Seetarampuram, Vijayawada- 520 002.
6.	Name and address of individuals who own the newspaper	:	Chalasani Prasad

I.N. Chalasani Prasad here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : March 1st. 2008

Sd/-
(Chalasani Prasad)
Signature of Publisher

వ్యాసం

❖ ప్రొ. బుర్ర రాములు

సెజ్ అభివృద్ధికైతే కావచ్చు మానవాభివృద్ధికేమాత్రం కాదు

మానవ హక్కులు అనుభవంలో ఉన్న అవరోధాలను అర్థం చేసుకోవడానికి ఐక్యరాజ్యసమితి 1990వ దశాబ్దంలో అంతర్జాతీయ సదస్సులు నిర్వహించింది. ఒక దశాబ్దంపాటు అధ్యయనం చేసిన పిమ్మట 2000 సంవత్సరంలో సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను ప్రకటించింది. ఈ లక్ష్యాలు వివిధ దేశాలలో ముఖ్యంగా 'అభివృద్ధి' ని కాలానుగుణంగా అందుకోలేక పోతున్న దేశాలు 2015 కల్లా సాధించుకోవాలని ఆశించింది. అప్పటినుండి 'మానవాభివృద్ధి' సాధించుకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు అభివృద్ధి వ్యూహాలను ఎంచుకున్నవి. ముఖ్యంగా అభివృద్ధికి నోచుకోని దేశాలు తమదేశంలోని బీదరికాన్ని తగ్గించుకోవడానికి ఉద్యోగ కల్పనపై దృష్టి సాధించాలని భావించాయి. ఇంకా ముఖ్యంగా మానవాభివృద్ధి కీలకమని భావించాయి. మానవాభివృద్ధి అంటే ప్రజలు తమ స్వేచ్ఛలను అనుభవించే సామర్థ్యాలను కలిగి ఉండటం. ప్రజలు ఈ సామర్థ్యాన్ని పొందగలగాలంటే విద్య, ఉపాధి, ఆరోగ్యం అనే మూడు అంశాలు తమ అందుబాటులో ఉండటం ప్రాథమిక షరతుగా చెబుతారు. అంటే మానవాభివృద్ధి అనేది దేశాలు వృద్ధిరేట్లను సాధించడంవల్ల రాదు. ఆదాయానికి, బీదరికానికి ప్రత్యక్ష సంబంధాన్ని చూడడంతోనే కాకుండా పిల్లలు పౌష్టికాహారాన్ని, రోగాలు లేని స్థితిని పర్యావరణంలో సుస్థిరతను అందించగలిగే సామాజిక, ఆర్థిక, పర్యావరణ స్థితిని దేశాలు అంటే ప్రజలు కలిగి ఉండాలి. మనదేశంలో ఇప్పటికీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోనే ఎక్కువమంది తమ ఉపాధిని కలిగి ఉన్నారు. అంతే కాకుండా బహుళ ఉత్పత్తి పద్ధతులు అమలులో ఉన్నవి. ఒకే సందర్భంలో ఒకేచోట సంప్రదాయ, ఆధునిక ఉపాధి అవకాశాలతో కొనసాగుతున్న ఆర్థిక వ్యవస్థ మనది. ఇలాంటి ఆర్థికవ్యవస్థ గత ఆరు దశాబ్దాలుగా విభిన్న లక్ష్యాలకోసం విభిన్న అభివృద్ధి నమూనాలను అమలు చేస్తున్నది. ఐనప్పటికీనీ రాజ్యాంగంలో ప్రకటించుకున్న మౌలిక లక్ష్యాలను అందుకోలేకపోయింది.

గత దశాబ్దకాలంగా అంతర్జాతీయంగా వచ్చిన పరిణామాలలో ఈ దేశ ఆర్థిక వ్యవస్థను మన పాలకులు భాగంచేశారు. ప్రపంచీకరణలో అనివార్యత పేరుతో భాగంచేసిన పాలకులు అభివృద్ధిని శీఘ్రంగా తీసుకురావడానికి ఇంతకన్నా గత్యంతరం లేదన్నారు. దానిలో భాగంగానే శీఘ్ర అభివృద్ధి, సుస్థిర అభివృద్ధి, అభివృద్ధికి మానవీయ ముఖం అనే వైద్య భావనలను పాలకులు ప్రచారంలో పెడ్తూ వచ్చారు.

ఈ భావనల మాటున మన పాలకులు సంక్షేమం లక్ష్యంగా ఉండవలసిన ఉత్పత్తి విధానం వృద్ధి, అభివృద్ధి లక్ష్యంగా సాగింది. పాలకులు రెండంకెల వృద్ధి రేటు లక్ష్యంగా విధానాలను అమలుచేస్తున్నారేకాని మెజారిటీ ప్రజలకు రెండు పూటల బువ్వ పెట్టగలిగే విధానాలను ఎంచుకోలేదు. ఈ రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను వల్లెవేయడంతోపాటు, ప్రజలు సృష్టిస్తున్న సంపదను బహుళజాతి కంపెనీలకు, తమ కుటుంబాలకు మళ్లిస్తున్నారు.

ఈ విధానంలో భాగమే ప్రత్యేక ఎగుమతి మండళ్ళు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు. పదేళ్ళ క్రితం వరకు చైనాను ఏ విధంగా కూడా సమర్థించని మన పాలకులు ప్రత్యేక ఆర్థిక మండళ్ళ నిర్మించడంలో చైనానే ఆదర్శంగా చూపుతున్నారు. నాటి ప్రభుత్వం, నేటి యుపిఏ ప్రభుత్వాలు పోటీపడి ఆచరిస్తున్నాయి. ఫలితంగా దేశ ఆర్థిక విధాన నమూనాలో రూపాంతరం కనిపిస్తున్నది. (Paridism Shift) సంక్షేమ లక్ష్యంగా ఉండవలసిన ఆర్థిక విధానం అభివృద్ధి లక్ష్యంగా మారింది.

అభివృద్ధి అంటే ప్రజల యొక్క శక్తిసామర్థ్యాలను విస్తరించే క్రమంగా అభివృద్ధిగా విశ్లేషకులు చెబుతారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో అభివృద్ధి ఉత్పత్తి క్రమం ఇంత సరళంగా ఉండదని అనుభవం సాక్ష్యంగా ఉంది. వృద్ధి రేట్లు పెరిగినా, పేదరికం తగ్గకపోవడం, నిరుద్యోగిత తగ్గకపోవడం మనకు తెల్సిందే. నిజానికి అభివృద్ధి అనే భావన, అభివృద్ధి క్రమం విడదీయరానివిగా ఉండాలి. అయితే అభివృద్ధి క్రమం మూడవ ప్రపంచదేశాలలో ఉద్యోగితను పెంచేదిగా ఉందో లేదో కుదించేదిగా ఉందో అనే సంశయానికిచ్చే జవాబు ఆ దేశాలలో జరిగే అభివృద్ధి క్రమం ప్రజల శక్తులను, సామర్థ్యాలను పెంచుతూ విస్తరించేవిగా ఉన్నవో లేవో అనేవే ఆధారం. దీనినే ఇంకో విధంగా చెప్పుకుంటే ఎంచుకున్న ఆర్థిక విధానం ఆవిష్కరించే అభివృద్ధి ప్రక్రియ అభివృద్ధి అనే భావనను అంటే శక్తి సామర్థ్యాలు విస్తరణను నిజంచేస్తే ఆ ప్రక్రియ ఆ దేశానికి (ప్రజలకు) హక్కులను అనుభవించే అవకాశాలను విస్తరింపజేసిందని భావించాలి.

ఒకవేళ ఫలితం హక్కులను అనుభవించే అవకాశాలను కుదించినా, నిర్మూలించినా ఆ ప్రక్రియ మానవహక్కుల అనుభవాన్ని నిరోధించినట్లే, నిర్మూలించినట్లే. ఈ కోణంలో మనదేశంలో ఈనాడు అమలవుతున్న అభివృద్ధి ప్రక్రియ పరిశీలిద్దాం.

అమెరికా రాజకీయ ఆధిపత్యంలో నిరాఘాటంగా అమలవుతున్న ప్రపంచబ్యాంకు నమూనాలు, గాట్ ఒప్పందాలు, ప్రపంచీకరణ పరిణామాలు మన ఆర్థికవ్యవస్థ ప్రైవేటీకరణ, సరళీకరణగా రూపాంతరం చెందింది. ఈ ఆర్థిక అవతారంలో ఆవిష్కరించబడినదే సెజ్. సెజ్ దేశ ఆర్థికాభివృద్ధికి అనివార్యమని భావించడంతోనే ఈ దేశంలోనే విదేశీ ఆర్థిక ద్వీపకల్పాలు నిర్మింపజేసుకొనే చట్టాలు ఉబికి వచ్చినవి. ఈ సెజ్‌ల ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభం కాకముందే అంటే చట్టం రూపొందిన క్రమం నుండే ఈదేశ సార్వభౌమాధికారాన్ని నామమాత్రంగా నిలిపింది. అన్ని స్థాయిలలో కార్యవిధాన పరంగా, శ్రామిక చట్టాల పరంగా ఈదేశ చట్టాల నుండి, విధానాలనుండి స్వేచ్ఛను ప్రకటించి ఈ దేశ వనరులపై, శ్రమపై, అవధులు లేని హక్కులనిచ్చి, ప్రజల స్వేచ్ఛలను హరించింది. అంటే అభివృద్ధి ప్రక్రియ ఈ దేశ ప్రజల శక్తిసామర్థ్యాలను హరించి వేసేదేనని చెప్పవచ్చు.

ఈ దేశంలో అభివృద్ధిని సాధించే పేర తాజాగా ఎంచుకున్న ఆర్థిక ప్రక్రియ సెజ్. ఇది విదేశీ భూభాగంగా భావించబడే ఓ ద్వీపమని చెప్పుకుంటారు. ముఖ్యంగా వ్యాపారవ్యవహారాల దృష్ట్యా డ్యూటీలు టారిఫ్‌ల రూపంలో ఇది ఓ కొత్త ఈస్టిండియా కంపెనీ నమూనాగా చెప్పవచ్చు. ఈస్టిండియా కంపెనీ వ్యాపారం, బ్రిటీష్ ఇండియా పాలన ఈ దేశ సంపదను ఎలా తరలించాయో దాదాబాయ్‌నౌరోజీ 19వ శతాబ్దంలో బ్రిటీష్ పాలకులకు తెలియజేసిన దానిని గుర్తుకు చేసుకుంటే చాలు రాబోయే రోజులలో ఈ దేశం ఎలాంటి హక్కులను కలిగి ఉంటుందో ఊహించవచ్చు. 2005లో చేసిన సెజ్ చట్టం ఫలితంగా ఇప్పటికే దేశంలోని 17 రాష్ట్రాలలో 400 సెజ్‌లకు పాలకులు తలలూపి, 154 సెజ్‌లను ప్రకటించారు. మన రాష్ట్రం మొదటి స్థానంలో అంటే మనరాష్ట్రంలో 66 సెజ్‌లకు

తలలూపి 46 సెజ్‌లను అమలుకు ప్రకటించారు. ఇవి 15 జిల్లాలలో ఉన్నవి.

ఈ సెజ్‌లకు పూర్తిస్థాయి అవస్థాపనా సౌకర్యాలను సిద్ధంచేయడానికి ప్రభుత్వం 'చిత్తశుద్ధి' తో కట్టుబడిఉందని ఔటరింగ్ రోడ్.

అంతర్జాతీయ విమయానాశ్రయాలు, 4 వరసల రోడ్లు, నౌకాశ్రమాలు, విద్యుత్తు ప్రాజెక్టులతో కోస్టల్ కారిడార్ నిర్మాణం, జలయజ్ఞం పేరుతో పోలవరం ప్రాజెక్టులు శరవేగంగా నిర్మాణమవుతున్నాయి. ఇవన్నీ ఎందుకు అనే ప్రశ్నకు 'అభివృద్ధి' కోసమని జవాబు. ఇవన్నీ పూర్తయిన తర్వాత ఉనికిలోకి రాబోయే అభివృద్ధి ప్రక్రియ (Development Process) ఇక్కడి ప్రజలకు అందించబోయే మానవాభివృద్ధి ఎలాంటిది అనే ప్రశ్నకు పాలకుల జవాబు భూతల స్వర్గంగా మనకు ప్రాచీన సాహిత్యంలో వర్ణించిన రూపాన్ని తలపించే విధంగా వారి అంచనాలు ఉన్నవి.

ప్రపంచస్థాయి ప్రమాణాలను మరిపించే విధంగా హైదరాబాద్ రింగ్‌రోడ్ చుట్టూ, అంతర్జాతీయ విమానాశ్రయం చుట్టూ, కోస్టల్ కారిడార్ వెంబడి నిర్మించబడుతాయని నమూనాలు ప్రతిపాదించారు.

ఇక్కడ నివాసం కొద్ది దూరంలోనే ఉపాధికేంద్రంగా దాని ప్రక్కనే రిక్రియేషన్‌క్లబ్ ఇటు పక్కన ఆటస్థలాలు, ఆ పక్కన దేవాలయాలు, ఆ ఎదురుగా విద్యాసంస్థలు కొద్ది అడుగుల దూరంలోనే మార్కెట్ సముదాయం వీటన్నింటినీ మనిషినీ రక్షించే పర్యావరణ సమతుల్యత .... ఇంకేమి కావాలి? ఇవన్నీ మనిషి అనుభవించడానికి శక్తి సామర్థ్యాలు కలిగి ఉండే ఆర్థిక వ్యవస్థ ఉన్నా స్వర్గం గొప్పదా ? కాదు .... ఈ జీవన ప్రమాణాలు ఎంతమందికి అందబోతాయనే ప్రశ్నకు జవాబు ఏమిటి ? చాలా కొద్దిమంది మాత్రమే దీనికి అర్హులు. అంటే గతజన్మలో పుణ్యకార్యాలు చేసిన వారే ఈ జన్మలో ఈ స్థాయి జీవన ప్రమాణాలు అందుకోబోతారనే హక్కులు హరించే జవాబు మెజార్టీ ప్రజలకు సిద్ధంగా ఉంటుంది. అంటే రేపు రాబోవు మానవాభివృద్ధి కేవలం కొద్దిమంది కోసమని అంటే వేల సంవత్సరాలుగా హక్కులు అనుభవించకుండా ఉండిన అమానవీయస్థితి కొత్తరూపంలో కొనసాగబోతుందని చెప్పవచ్చు. అది ఎప్పుడో మొదలైంది కూడా !!

ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఆలోచనే ఇక్కడి ప్రజలకు వ్యతిరేకమైనది. సార్వభౌమాధికారాన్ని వెక్కిరిస్తున్నది. ఈ చట్టం ఆధారంగా రాబోయే ఆర్థిక మండళ్ళ ఉత్పత్తులు స్థానిక అవసరాలకోసం కాదు ఎగుమతికి ఉద్దేశించబడింది మాత్రమే. అంటే వనరులు ఇక్కడివి, ఉత్పత్తి ఇక్కడిది వినియోగం మాత్రం ఇక్కడి ప్రజలది కాదు. ఆ రకంగా వనరుల కొల్లగొట్టే విధానం ఆవిష్కరించడబడబోతున్నది. పర్యావరణం నాశనం కాబోతున్నది.

ప్రత్యేక ఆర్థిక మండళ్ళ కోసం భూములు సేకరించడానికి బ్రిటీష్ ఇండియా స్థానిక అవసరాలకోసం భూములను సేకరించే నిరాటంక అవకాశమిచ్చే చట్టాన్ని ఆధారం చేసుకొని విదేశీ అవసరాలకోసం, బహుళజాతి కంపెనీల పెట్టుబడికి లాభాలకోసం సేకరించే విధంగా అవకాశమిచ్చి, భూములపై ఆధారపడే ప్రజల జీవించే హక్కులను రద్దుచేస్తున్నదీ చట్టం. కోస్టల్ కారిడార్ పేరుమీద అపార జలసంపదను నాశనం చేసే అవస్థాపనలను నిర్మించడం వలన వేల సంవత్సరాలుగా జలసంపదపై ఆధారపడే జాలరుల జీవించే అవకాశాలను సముద్రంలో కలుపుతున్నదీ చట్టం. విధానం.

వ్యవసాయ భూములను తీసుకోమని చెబుతూనే కేవలం వ్యవసాయ యోగ్యమైన భూములనే ఆక్రమిస్తున్న విధానం ఈనాడు అమలవుతున్నది. ఈ భూసేకరణ. విధానంవల్ల గత 50 సంవత్సరాలుగా కొద్దోగొప్పో అనువైన భూపంపిణీ చట్టాలవల్ల లబ్ధి పొందిన షెడ్యూల్డు కులాల వారికున్న ఒకటీ, రెండెకరాల భూమిని కోల్పోయి, ఉపాధి కోల్పోయి విస్థాపనకు గురై, అప్పటివరకు సమకూర్చుకున్న శక్తి సామర్థ్యాలను కోల్పోయి కుటుంబం విచ్ఛిన్నమైన స్థితి ఏర్పడింది. చిత్తూరుజిల్లా సత్యవేడు, మహబూబ్‌నగర్ జిల్లా పోలేపల్లి గ్రామాల్లో ఈ పరిణామం ఏం తెలియజేస్తున్నది ?

ప్రత్యేక ఆర్థిక మండళ్ళు ఏం ఉత్పత్తి చేస్తాయో తెలియకముందే తమకాళ్ళమీద తాము నిలబడి జీవించే అతి సామాన్య ప్రజల హక్కులను హరించే ఈ ప్రక్రియ శక్తిసామర్థ్యాలను రద్దుచేసేదే తప్ప పెంచేది కాదు. విస్తరింపజేసేది కాదు.

భవిష్యత్తులో రాబోయే ఉపాధి అవకాశాలు ఎన్ని? ఎవరికి ? కనీసం ప్రస్తుతం జీవనావకాశాలను కోల్పోతున్న ప్రజలకు వీటిలో చోటు ఉంటుందా? అంటే ఉంటుంది కానీ చాలా కొద్దిమందికే. అదీ కొద్దికాలానికేనని చెప్పవచ్చు. మరీకొద్ది మందికి ఊడ్చేపనులు, రక్షణ సిబ్బంది పనులు దొరకవచ్చు. ఈ సంస్థలలో ఉపాధి కేవలం హై-టెక్ చదువులు చదివిన వారికే... అవీ కొద్దిమందికే. వాళ్ళు స్థానికేతరులే అయి ఉంటారనేది కూడా సత్యమే. ఆ విధంగా ఉండబోయే ఈ ఉత్పత్తి ప్రక్రియ లేదా అభివృద్ధి ప్రక్రియను ఏ విధంగా ఆహ్వానించతగింది ? అభివృద్ధి ప్రక్రియ తప్పనిసరిగా అక్కడిప్రజలకు ఉపాధిని కల్పించి వారి శక్తిసామర్థ్యాలను పెంచేదిగా, విస్తరింపజేసేదిగా ఉండాలి. అప్పుడే అది మానవాభివృద్ధిని పెంచినట్లుగా భావించాలి.అంటే ప్రజలు తమ హక్కులు అనుభవించే అవకాశాలు విస్తరించినట్లు అవుతుంది.

ఈ విధమైన అభివృద్ధి ప్రక్రియ కొనసాగడానికని విస్తరించబోయే విస్థాపన సౌకర్యాలు ఆదివాసీ ప్రజల జీవించే హక్కులను మాత్రమే కాదు, జీవితాలనే హరించివేస్తున్నది. పోలవరం ప్రాజెక్టు లక్షలాది ఆదివాసీ కుటుంబాలు విస్థాపనకు గురవుతున్నవి. వీరి విస్థాపన సెజ్‌ల కోసమని నిర్మించే అవస్థాపన సౌకర్యాలకు ఉద్దేశించినదైతే ఏవిధంగా సమర్థనీయం ? ఆదివాసీ ప్రజల భూములు, ఇండ్లు, నీళ్ళు వారి సహజ జీవన ప్రక్రియ నీటమునిగితే వచ్చే అభివృద్ధి ప్రక్రియ వారికిచ్చేది చెల్లాచెదరు జీవితం. వీళ్ళు అడివిని విడిచిపెడితే జీవించే ఉపాధులు కూడా దొరకవు. ఎందుకంటే వారు ఏ ఉపాధిని ఎంచుకొనే మానవాభివృద్ధిని కలిగి లేరు, ఉండరు. కాబట్టి లక్షల కుటుంబాలను విస్థాపనకు గురిచేసే ఈ అభివృద్ధి ప్రక్రియ ఏవిధంగా ఆమోదించతగింది.

అటవీ గ్రామాలలో, అటవీ భూములలో దాగిఉన్న భూగర్భ వనరులపై ఈ అభివృద్ధి ప్రక్రియ ఆధారపడిఉంది. అటవీభూములు, భూగర్భసంపద ఆదివాసీల ప్రాణవాయువు. ఆ ప్రాణవాయువు రక్షించే పేరుమీద అటవీ చట్టాలు, ఆదివాసీ చట్టాలు ఉన్నప్పటికీ ఖాతరు చేయకుండా ఆక్రమించి కొల్లగొట్టే విధానం దేనిని తెలియజేస్తున్నది. అమెరికాను, ఆఫ్రికాను, ఆసియాను ఆక్రమించుకున్న యూరోపువాసుల తీరును గుర్తుచేస్తున్నది కదా ! తన భూమిమీద, తనమీద తనకే హక్కు, రక్షణలేని స్థితి ఆవిష్కరించబడితే దానిని ఏ విధమైన అభివృద్ధి ప్రక్రియగా భావించాలి ?

ఏ అభివృద్ధి ప్రక్రియనైనా అక్కడి ప్రజలకు మానవాభివృద్ధిని కలిగించాలి. అంటే ఆ ప్రజలకు తాము మిగతా వారితో సమత్వంగా ఉన్నాయని భావించాలి. అంతేకాదు వారి సామర్థ్యాలు పెరగాలి, విస్తరించబడాలి. వారికి అప్పటి వరకు ఉన్నవారి ఉత్పాదకశక్తి కనీసం కాపాడబడుతూ ఉండాలి. మరియు వారి జీవితం పై వారికే సాధికార కలిగి ఉండాలి.

మరి సెజ్ విధానం వల్ల అమలవుతున్న భూసేకరణ విధానం భవిష్యత్తులో రాబోయే అభివృద్ధి ప్రక్రియ సరిగ్గా వీటిని రద్దు చేయడానికే, అంటే ప్రజలు తమ హక్కులు అనుభవించే స్వేచ్ఛను కోల్పోవడమే. దీనిని మనం వ్యతిరేకించకుండా, ప్రతిఘటించకుండా 'జీవిస్తామా' ? ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధిని విస్తరించడానికి దశాబ్దకాలం సదస్సులు జరిపితే, అమెరికా, ప్రపంచబ్యాంకు బహుళజాతి కంపెనీలు సమాధి కడుతుంటే మన మానవాభివృద్ధి ఏ తరహాదని ప్రశ్నించుకోవాలి కదా !? *

కవిత్వం

గీతాంజలి కవిత

కనిపించని గొడ్డలి - మాయమైన చెట్టు

ఎన్నిసార్లు అనుకుంటానో కదా
ఈ చెట్టు నీడ నాది కాదని
కనీసం ... దీని కొమ్మా - గూడూ
చివురూ - పూవూ
వికసించని మొగ్గా
ఆఖర్కి రాలిపోయిన
పండుటాకూ ...
వికసించి వాడిపోయిన
పూవూ ... కసిగాయా...
ఏదీ నాది కాదని - కాలేదనీ తెల్సు
ఈ చెట్టు మీద నించి సాగి నన్ను తాకే
పరిమళభరితమైన గాలి
ఈ ఆకులపై మెరిసే సూర్యబిందువు
వేడీ - వెన్నెలా - ఏదీనాది కాదని తెల్సు
చెట్టుపైన ఆకాశం
చెట్టుకింద నేలా ... నావి కావని తెల్సు

అయినా ... ఎందుకు ... ఈ చెట్టునే
కావలించుకొని ఉండిపోవాలన్పిస్తుంది
తన కొమ్మలతో నన్ను కౌగిలించుకొమ్మని
బతిమిలాడాలన్పిస్తుంది.
కనిపించని గొడ్డళ్ళతో...
ఈ చెట్టు నెవరైనా నానించి
విడదీస్తారేమోనని
చెట్టుగూటిలో రామ చిలుకనై ...
ఇల్లు కట్టుకోవాలన్పిస్తుంది.
పోనీ మరణం తర్వాతైనా
తన నీడన ఉన్న భూమిగుండెలో
చోటిస్తే ... ఈ చెట్టుకే పూవునై
పూయాలని ....
ఈ చెట్టంటే ... ఎందుకింత ప్రేమనాకు ?
ఈ చెట్టు ఎన్నెన్ని నినాదాల్ని
హోరుహోరుగా ప్రతిధ్వనించిందని?
ఎన్నెన్ని కన్నీళ్ళ సంద్రాల్ని తనవేళ్ళలోకి
నిశ్శబ్దంగా ఏడుస్తూ ఇంకించుకుందని?
తన నీడలో మూడురాళ్ళ పొయ్యిమీద
ఉడుకుతున్న రైతు ఆఖరి వడ్లగింజల్ని
చూస్తూ ... తనూ కుతకుతా ఉడికిపోయిందని?
ఆకు ఆకులో అగ్నికణాలను ...
రైతులాగే ... తనూ కూకటివేళ్ళతో సహా
భూమినించి పెకిలిస్తారేమోనని
కొమ్మలతో - రెమ్మలతో తలబాదుకుంటూ
భోరు భోరున ఏడ్చిందనీ?
చెట్టూ - రైతూ - భూమీ ఒక్కటన్న
నినాదాన్ని విప్లవించిందని?
అందుకే ఈ చెట్టంటే చెట్టంత ప్రేమనాకు!

(పోలేపల్లిలో సెజ్‌లకు వ్యతిరేకంగా ధర్నాచేస్తున్న రైతులకు ఒక మహావృక్షం నీడనిచ్చింది. దాని నీడలో రైతులు రోజులు రోజులబడి అక్కడే వండుకుని పడుకొని ధర్నాచేసారు. చెట్టే లేకుండా చేస్తే రైతులిక ధర్నాచేయ్యరని కంపెనీ చెట్టునే కొట్టేసిందని వలవలా ఏడ్చిన ముసలి జంగమ్మకు, భూమినించి పెకిలించి వేయబడ్డ రైతన్నలకు)

అసుర కవితలు నాలుగు

చేజారడం

ఏదైనా చేజారిపోవడం అందరికీ తెలుసు
యిల్లు వాకిలి చేజారిపోతాయి
తాతలనాటి ఆస్తిపాస్తులు కలిసినట్టే కలిసి చేజారిపోతాయి
రేపటి కోసం ఎల్లుండి కోసం కన్న కలలన్నీ చేజారిపోతాయి
ఎదిగి వచ్చిన బిడ్డలు కూడా చేజారిపోతారు

కేవలం దుఃఖం
కన్నీళ్ళు కూడా సాయంరాని దుఃఖం

అందునా ఓచిన్న ఊరట
యివన్నీ కనుకున్నవి
కల్పించుకున్నవి
నిర్మించుకున్నవి
తానొచ్చాక తెచ్చుకున్నవి

యివేవీ లేకుంటే యింకేముంటుంది?

పదే పదే తడిమి చూచుకోవడం
భద్రంగా ఉన్నాయా అనేకాదు
తాను తానయిన రీతిని తరచి చూసుకోవడం

ఎముకల సత్తువ నుండి కొన్ని పుట్టాయి
ఆలోచనల నుండి కొన్ని పుట్టాయి
నేర్చుకోకుండా ఉండలేని తనం నుండి మరికొన్ని పుట్టాయి
అట్లా పుట్టేకొద్ది నిండుదనం....
నిండుదనం

తను రాకముందే తనకొక ప్రపంచం సిద్ధంగా ఉన్నది
చేయి ఒక పనిముట్టుగా మారిన రోజు నుండి
పొరలు పొరలుగా వికసిస్తూ
తను భూమిపై పడటానికి ముందే
తనకు పురుడు పోసిన చరిత్ర ఒకటున్నది

నేల గుణాన్ని మూచూసి చెప్పడం
నిలువుబద్దలు పెట్టి గీచినట్లు అలవోకగా దున్నడం
పై మరచి నిద్రించే వేళ
పచ్చనిపొలాలే కలలై ఎదిగిరావడం
బతుకు అట్టడుగు అస్తిత్వం
నేల మాత్రమే కావడం
కోటాను కోట్ల దివారాత్రాల
ఊహాలు కల్పనలు అన్వేషణలు
సకల ప్రాకృతిక ప్రయోగాలూ పోగుబడ్డం

మరి చేజారిపోవడం ఎప్పుడు మొదలైంది

తెలిసినవన్నీ తెలియనివి కావడం
వచ్చినవన్నీ విస్మృతిపాలవ్వడం
అర్థవంతమైన ఆవృతాన్ని అందించినవన్నీ
ముక్కలు ముక్కలైపోవడం
ఒక్కసారి లోపలికి తొంగిచూచుకుంటే
మొండిబావి భయకుహరమై కనిపించడం

పాడిన పాటలు
తీర్చిదిద్దుకున్న నైపుణ్యాలు
అంతకుమించిన ఆత్మిక సౌందర్యాలు
కొరగానివైపోవడం
కడకు
తన నుంచి తనే చేజారిపోవడం

ఒకానొక నిర్దయ హస్తం మెడబట్టి తోసిందో
కనుచూపు కానని రీతి ఏదో
మెల్లగా పురావశేషంగా మార్చివేసిందో
నిన్నటిలోనుండి ఏ రక్తసిక్త వికృత శిశువు
చరిత్ర వడిలోకి చేరిందో

జీవితావధిలోనివి చేజారిపోవడం సరే
యుగావధిలోనివీ పెటిల్లున తెగిపోయి
మూర్తమంతమైనవన్నీ
అమూర్తం కావడంకన్నా చేజారిపోవడం ఏముంటుంది

ఊరు పోయింది

ఊరు సొర్గమని మా నాయిన అనేటోడు
పాడిపంటల పాదుగనేటోడు
అయన్నీ కల్లో మాటలుగాదు
నిజంగానే నమ్మి చెప్పేటోడు

యియాల అంతా తల్లకిందులై పాయె
పల్లెపాదుగు ఎండిపాయె

పెద్దబజార్లోని రెడ్డికాడ
టౌన్లో పర్టిలైజరోనికాడ
ఊర్లో పొలాలుకౌలుకిచ్చి
పదూర్లలో పైనాన్స్ చేసే కాపోల్ల పొట్టెగానికాడ
పట్టా కాయితాలు పెట్టుకొనే బ్యాంకోనికాడ
దొరికినకాడ దొరికినంత అప్పుచేస్తి

కల్లమైనాక యింట్లోకి పడి గింజలు మిగల్లా

తవుడుపెడితే పాలియ్యనీక
సేద్యం ఏమన్నా నోరులేని పసరమా
యింటిల్లిపాది చెమట చేలో పోసినా
కుదార్తంగ తిండిలేకపాయె

అప్పులోల్లకు దుడ్లు కట్టనందుకు
నడిగేర్లో సిగ్గుమానం పాయె
మానాయిన మంచంలో ఎగబోసుకుంట కూడ
బుజాలు చరుచుకొనే పరువుపాయె
గొంతులో గురగుర అనేటప్పుడు కూడ
నీల్లు పోస్తాంటే
చేత్తో తోసేసి
చేలను కండ్లలో పెట్టుకోమని చెప్పినాడు
తను పోయినాక మాయమ్మ ఎట్లుంటదో అని ఎదారు చెయ్యాలా
మనమండ్లను బాగ చూసుకోమనీ చెప్పలా
కోడల్ని పిలిచి ఒక మాటయినా మందలించలా
చేలను కండ్లలో పెట్టుకోమని చెప్పినాడు
అదే ఆకరిమాట

* * *

సేద్యం చేస్తేనే బువ్వ పుట్టుతదని వాయిన నమ్మకం
దుడ్లు పొయ్యకపోతే సేద్యం ఎట్ల ఎల్లుతది
యాడాది తిరక్కుండానే
సేద్యం చేసేకి నా వల్ల గాలా
చేలు బీడుపెట్టి
పెండ్లాన్ని తోలుకోని
బల్లారికి కూలిపన్లకు పోబడితి -
పొట్టెగాల్లను ముసలామె ఎదాన పారేసి

చేలనింక కండ్లలో పెట్టుకొని యాడజూసేది

నేల ఒక తాన
మేము ఒక తాన అని ఎదారు పడుతుంటే
ఆ కంపెనోడు వచ్చి
కండ్లలో దుమ్ముకొట్టి చేలను లాక్కపాయె
అత్త యిచ్చిన బూమిని కోడలు గుంజుకొనె

ఊరికి దూరం కావడం మామూలేగాని

కడాకు ఈ పొద్దు ఊరే మాయమైపోయె
మా నేల మీద యింకో దేశం పుట్టుకొచ్చె.

ఆశా భ్రమణం

భూమి ఎన్ని విపత్తులను ఎదుర్కొన్నది
మనిషి కంటే ఎక్కువ
తాను మానవుడవుతూ భూమినెంత వ్యథలో ముంచెత్తాడు

ప్రతిసారీ భూమి మానవుడి పాదాల కింద ఆసరా అయింది
మెట్టుమెట్టుగా పైపైకి ఎదిగే సోపానమైంది
అప్పుడప్పుడు మహోగ్రమైపోయి
ఒక శిథిల వాడిగా మారినా
మళ్ళీ తనలోకి తీసుకొని లాలించింది

భూమి సరుకయ్యాక కదా కొత్త చరిత్ర మొదలైంది
పేగు బంధమో
సరుకుల సూత్రమో
భూమినీ మనిషినీ కలుపుతూనే వచ్చింది

తెప్పరిల్లేలోగా
మనిషీ భూమీ వేలంపాటలో
తలొంచుకొని చేతులు కట్టుకొని నిలబడాల్సి వచ్చింది

నేల రూపురేఖలు మారలేదు
మనిషికి నేల అవసరం తీరలేదు
భూమీ గుండ్రంగా బంతివలె తన చుట్టూ సూర్యునిచుట్టూ
తదేకంగా తిరుగుతూనే ఉన్నది
రెక్కల కష్టం మీద భూ ప్రదక్షిణం చేసే మనిషికే
భూమి భ్రమావలయమై పోయింది

యిప్పుడక్కడంతా లాభనష్టాల కోలాహలం
చారెడు చెమట చల్లి
దోసెడు గింజలుతీసే వైనానికి తావు లేదు
ఎక్కడెక్కడోపోగవుతున్న సంపదకు నిలువ నీడ లేదు
రూపాయికి పిల్లలు లేపే దారి లేదు
ఏదైనా నేల మీదే జరగాలి కదా
సరుకైన నేల యివాళ సంపద స్థావరమైంది

ఈ మాట వినండి

యిది మీకెలా చెప్పాలి
అన్నిటివలె ఉపన్యసించలేనిది
రచించలేనిది
కంఠనాళ విస్ఫోటనలోంచి విచ్చుకొనే నినాదం కాలేనిది
మీ లోలోపలి ప్రతిధ్వని కావలసినదాన్ని మీకెలా చేరువ చేయాలి
విన్నవీ కన్నవీ తొలుచుకుంటూ పోయే కొద్దీ
లోపల పొగయిన వాటిని అచ్చం అట్లాగే ఎత్తి ఎలా చూపాలి
ఎక్కడో స్పష్టాస్పష్టంగా స్పృశిస్తున్నది ఎరుకగా మారుతున్నట్టుంది...
దేనికీ లొంగనిది కవిత్వానికే లొంగుతుందనే వాళ్ళున్నారు
ప్రతివారూ ఎప్పుడో ఒకప్పుడు కవిత్వానికి లొంగిపోతారు

దూరం కావడం భారమే
భారం కూడా అయితే

నేల పోవడం ఊరుపోవడం వరకే అయితే
ఆశించని 'లెక్క' వొడిలోకి జారవచ్చు
అది దూరం కావడం
మోయజాలని భారమూ కావడం

యింకా ఏదో ఉన్నది
తెలియకపోవడం ఒక స్థితి
స్థితినీ గతినీ ఏకకాలంలో ఎట్లా విప్పి చెప్పడం

యిది యిప్పుడు వచ్చింది కాదు
యిట్లా కనిపిస్తున్నదీ కాదు
అందుకే ఎంత అర్థమవుతుందో అంత అర్థంకాదు

ఎక్కడో గోడ కూలుతున్న చప్పుడు
గోడే అయితే కంటికి ఆనుతుంది
చెయ్యి అయినా అడ్డం పెట్టవచ్చు
గోడతోపాటే మరేవో కూలిపోతుంటాయి
ఒక చేత్తో రెండో చేత్తో
శరీరావయవాలన్నిటితో
మూలుగులలోని సమస్త శక్తులతో
రెప్పలు మూతబడని ఆలోచనలతో ఆపాలని చూడవచ్చు

యింకో పక్కన వికారధ్వనితో మరేదో కూలిపోతుంది
నిలబెట్టేందుకు ఆబగా అటువైపు విస్తరిస్తాం
యిదంతా స్థితి మాత్రమే అయితే బాగుండు
అడుగు నుండి దిక్కుదిక్కులా జోరెత్తే బహువేగాల గతి
కనుపాపలు పసిగట్టలేని స్థితీగతీకన్నా
కాళ్ళకిందికి చారెడునేల లేకపోవడం గదా ఈ కాలపు విషాదం
ఎకరాను కోటి చేసిన మార్కెట్
తక్కెట్లో ధరణీ మండలాన్ని తూస్తున్నప్పుడు
ఈ పక్కన రూపాయల గుట్టలు గుట్టలు...
నిలబడేందుకు చోటు ఎక్కడ

అంతవరకే అయితే ఏదో ఒక భాషలో చెప్పుకోవచ్చు

చోటు మారితే చూపు మారుతుంది
కాలగుణానికి నిలువెత్తు ముద్రవేస్తుంది

నేల యిచ్చేది లేదని అడ్డంబడుతున్న వాళ్ళున్నారు
చేతులెత్తి ధారపోస్తున్న వాళ్ళూ ఉన్నారు
మట్టి గురించి ఎంత చెప్పుకున్నా అన్నంతినే బతకాలి గదా
ఈ బాధా స్థితిలోని గతి ఏమిటి
అన్నీ చెల్లా చెదరవ్వడం
శకల శకలాలుగా విచ్ఛిన్నమవ్వడం
చివరకు అదే ఒక స్థితిగా మారడం

అంతర్గతిలో మాత్రం
మహాద్భుతమైన
పురా మానవ శ్రమా జనితమైన
మహేతిహాసంతో పాటు
పాత సంకెలా విరిగిపడుతున్న దుఃఖమయ విధ్వంసం
మరోకొత్త సంకెలలోకి సకలం యిముడుతున్న నిర్దయా దృశ్యం
యిలా అనుకోవడానికి మనసు రాదు. ఊరుకోబుద్ధీ కాదు
అయినా ఈమాట యిలా చెప్పాలని ఉన్నది. *

పాట

సెజ్‌లొద్దు - గిజ్‌లొద్దు

డా. లక్ష్మీ సుహాసిని

సెజ్జులొద్దు గిజ్జులొద్దు

1. చేను చెలక చెల్లు జేసే
పల్లెలన్నీ డొల్ల జేసే
ఊరువాడ గుల్ల జేసే
పరాయిదేశంపాలు జేసే ॥సెజ్జులొద్దు గిజ్జులొద్దు॥

2. ఐన వారికి ఆకులల్లో
కానివారికి కంచాలల్లో
లాభాలన్నీ వాడిపాలు
చేతారోతా మనపాలు జేసే ॥సెజ్జులొద్దు గిజ్జులొద్దు॥

3. చేతివృత్తులు చెదిరిపోయె
పాడిపంటలు ఒట్టిపోయె
దూడ గడ్డికి బీడుపోయె
జీవాల మేపుకి జాగాపోయె ॥సెజ్జులొద్దు గిజ్జులొద్దు॥

4. కొలువులన్నరు, డబ్బులన్నరు
భూమి ముదరా ఇష్టమన్నరు
భూములన్నీ గుంజుకొని
పట్టాలు లేవని ముదరాఎగేసినా ॥ఈసెజ్జులొద్దు గిజ్జులొద్దు॥

5. బహిర్భూమికి మరుగులేక
మనిషి చస్తే కాల్చడానికి పూడ్చడానికి
స్మశానానికి స్థలం లేక
ఊర్లని వల్లకాడు జేసే ॥ఈసెజ్జులొద్దు గిజ్జులొద్దు॥

6. కూలినాలి పనులు పోయె
'అపాచి' పనులు జూస్తె
ఊరికిద్దరికైనా రాక పోయె
ఆత్మ గౌరవం మాట అటుంచి
బూటులిసిరి కొట్టుడాయె ॥ఈసెజ్జులొద్దు గిజ్జులొద్దు॥

స్వీకారం

1. **రాగింగ్ మనకొద్దు**
రచన : డి. నటరాజ్
బోధిసత్వ పుస్తకమాల ప్రచురణ వెల : రూ. 20/-
ప్రతులకు : డి.నటరాజ్,
9-31-6/2, షణ్ముఖ ఫ్లాట్స్,
కూరగాయల మార్కెట్ ఎదురుగా,
పిఠాపురం కాలనీ, విశాఖపట్నం.

2. **కవిత 2007**
ప్రచురణ : సాహితీ మిత్రులు, విజయవాడ. వెల : రూ.80
సంపాదకులు :
పాపినేని శివశంకర్, దర్భ శయనం శ్రీనివాసాచార్య
ప్రతులకు : నవోదయ పబ్లిషర్స్,
కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ - 2.

3. **చీకటి నుంచి స్వప్నం దాకా (వ్యాస సంపుటి)**
రచన : డా. తక్కోలు మాచిరెడ్డి
ప్రచురణ : అభ్యుదయ రచయితల సంఘం
వెల : రూ. 80/-
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్ బ్రాంచీలు

4. **గాంధీవాద శవ పరీక్ష**
హిందిమూలం : యశ్‌పాల్ తెలుగు : సమతారావు
ప్రచురణ : జనసాహితి వెల : రూ. 25/-
ప్రతులకు : మైత్రి బుక్ హౌస్
కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ - 2.

5. **జీవ శాస్త్ర విజ్ఞానం - సమాజం**
రచన : డా.కొడవటిగంటి రోహిణి ప్రసాద్
ప్రచురణ : జనసాహితి వెల : రూ. 50/-
ప్రతులకు : మైత్రి బుక్ హౌస్
కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ - 2.

6. **జీవన సమరం (నవల)**
రచన : యం.వి.తిరుపతయ్య
ప్రచురణ : యం.వి. పబ్లికేషన్స్ వెల : రూ. 120/-
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్
3-3-865, ఆర్యసమాజ్ మందిర్ ఎదుట,
కాచిగూడ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్.

కథ

❖ డా. భారతి (గీతాంజలి)

ఆఖరి వడ్ల గింజలు

"పాగల్‌దానా నా మొక్కకు నీళ్ళెందుకు పోస్తున్నవ్ ? ఎట్లైన గా చింత చెట్టు నరికినట్లే గీ దాన్ని నరుకుడే. చింత చెట్టు కింద ధర్న చేసినట్లు గీ చెట్టుకింద గూడంగ ధర్న చేస్త అని అనుకుంటున్నవా ఏంది ?"

సూపర్‌వైజర్ సత్యనారాయణ పండ్లికిలిస్తు అంటుంటే ఫాక్టరీ గోడవతలంగ తన చెల్కలున్న మామిడి చెట్టుకు నీళ్ళు పోస్తున్న గమ్‌లీ అగ్గిరేగినట్లే ఒర్లింది.

"గా సర్కారోనికి గూడంగ మా భూమి గుంజుకునే అధికారం లేదు. నువు ఇకిలించుడు గాదు. దొంగ తీరంగ దాక్కున్న అ సర్కారోన్ని నా ముంగట్కి రమ్మను. వాని పనిచెప్త. గీ సెట్టు మీదైతే నీ గొడ్డలి పడనీ చెప్త" శివంగోలె అరుస్తున్న గమ్‌లీ ఒంటి మీదున్న లాంబాడా బట్టలల్ల ఉన్న గవ్వలు గల్ గల్ మంటున్నయ్. "పో, పో పన్జూస్కో. ఎక్కువ తక్కువ ఒర్లినవంటే పనికెల్లి తీసేస్త" యాదిరెడ్డి పిచ్చికుక్కోలె ఒర్లిండు "ఏం చేస్తవ్ ? నా భూమి మీదనే నువ్వు బత్కుతున్నవ్. గీ నౌఖరీ నీకు నా భూమే ఇచ్చింది. ఖ్యాల్ ఉంచుకో" అంట ఖాళీ ప్లాస్టిక్కు బిందెతోని గమ్‌లీ కంపెనీ లోపట్కి వచ్చింది.

హోమ్‌గార్డు "కార్డు చూపియ్యవా" అని ఒర్లుతుంతే" నీ పోరడా. కార్డు దినాం చూపాల్నారా ఛల్ తియ్" అన్కుంట ముదుకు నడ్చింది. గేటు కాడ చూస్త అక్కడ్నే కొద్ది సేపు ఆగింది. యాభైఏండ్లుంటయ్ యాదమ్మకు. "నా తండ్రివి కదర శంకరు...పోనియ్యరా నా కొడకా. లోపట్కి. ఆడిని ఈ దినం అడిగేయ్యాల నా భూమి నాకియ్యమని" అంది. హోమ్‌గార్డు గమ్‌లీ దిక్కెల్లి యాదమ్మ దిక్కు తిరుగుత "ఒద్దే నా మాటిను. ఇప్పుడేం ఫాయిదలేదే. యాదిరెడ్డి మంచోడు గాడు. నన్ను ఈ ఫాక్టరీ పూర్తయినంక ఐదువేల జీతం చేసి ఒరిస్సా పంపుతడంట.... రెండేళ్లసంది గిట్లనే గేటుకాడకచ్చి లొల్లి చేస్తాన్నవ్. ఈ కొలువుంది కాపట్కి గీ బతుకన్న బత్కుతాన్నం. నువ్వు పో ఇంటికి" శంకర్ గేటు మూసేస్త అంటున్నడు. శంకర్ పది ప్యాసయ్యిండు. సర్కారు వాండ్ల మూడెకరాల భూమి గుంజేస్కుంది. శంకర్‌కి హోమ్ గార్డు నౌఖరీ ఇచ్చింది.

"అరె గాడ్డి కొడకా నీ పెండ్లం నాకూ నా మొగనికి గంజినీల్లు పోస్తలేదురా. పామ్మంటుందిరా ఇంట్లకెల్లి .... రేపు ఈడ నీకు నౌఖరీ లేకపోతే ఇంకోతాన చేస్తవ్. రెక్కలిరిగిన ముసలోల్లం మాకేముంది ? మర్యాదగ లోపట్కి పోనియ్" ఒర్లింది యాదమ్మ కోపంతోని. గేటు పట్టుకొని అటు ఇటు ఊపుకుంట "రెండేళ్ళు గాదురా. సచ్చేదంక నా భూమి కోసానికి ఒర్లు తనే వుంట ...." అంటూ కొడుకుని బెదిరిస్తోంది. ఇంతల ఆడికి యాదిరెడ్డి కారచ్చి ఆగింది. శంకర్ సలాంచేసి గేటు పూరాగ తెర్సిండు. "ఏం లొల్లి చేస్తున్నది ముసల్ది, ఎల్లగొట్టు" యాదిరెడ్డి యాదమ్మను చూస్త "ఏందే కాకుల్లెక్క ఒర్లుతున్నవ్, నీ కొడ్కు నౌఖరీ పీకెయ్యమంటవ ఏంది ?" బెదిరిస్త అన్నడు. పీకైతే చూడరా ...... వానికి గూడంగ బుద్దస్తది, బాడ్కావ్ ఏం బెదిరిస్తానవురా నాభూమి గుంజుకుని.................. మర్యాదగ నా భూమి నా కిప్పియ్యి" యాదమ్మ ఒర్లు తనే ఉన్నది. యాదిరెడ్డి శంకర్‌కు సైగ చేసిండు యాదమ్మను ఎల్ల గొట్టుమని. కారు లోపట్కి ఎల్లి పోయింది దుమ్మురేపుకుంట. శంకర్ మల్ల గేటు మూసేసి తల్లిదిక్కు చూస్త "పోవే చప్పుడు చేయ్యకుండ దండం పెడ్త. నన్ను లోపట్కి పిల్చి ఏం తిడ్తడో, నీ దిక్కు కెల్లి నా నౌఖరి పోయేటట్లున్నది" అంట ఒర్లిండు. గమ్‌లీ గిదంత చూస్త "అదేంరా శంకర్ నీకు తల్లి అన్న కనికరం గూడా లేదారా" అన్నది. యాదమ్మ కంపెనీ ఓడ్ని తిడ్తనే ఉన్నది. ఇంగిట్ల కాదని శంకర్ గేటు తెర్చి తల్లి రెక్కల్ని బల్మిటికి గుంజుత కొంచెం దూరం తీస్కపోయి "చప్పుడు చెయ్యక ఇంటికి పో .... పొద్మికి మాట్లాడుదం" అంటా కంపెనీ దిక్కు ఎల్లిండు. మందుల కంపెనీని చుట్టుకొని తమ సెల్కల సుట్టు అంతెత్తు లేసిన ప్రహరీ గోడలను, దానికి కాపలా బానిస తీరు కాస్తున్న తన జవాను కొడుకును చూస్త అట్ల ఆడనే చానాసేపు నిల్చుంది తర్వాత "ఒరే శంకర్ సిగ్గు షరం, నియత్ ఉంటే గా నౌఖరీ ఒదిలి పట్నంల కూలీ పని చేస్కున రారా .... " అని ఒర్లి ఇంగ లాబంలేదని ఇంటి దారి పట్టింది. గిదంత రోజూ జరిగెడిదే. యాదమ్మ దినాం ఫాక్టరీ కెళ్ళాల్సిందే, యాదిరెడ్డిని తిట్టాల్సిందే, భూమిని తల్చుకొని ఏడ్వాల్సిందే.

ఫ్యాక్టరీ లోపట మన్నెత్తే పన్లు చేస్తున్నరు మొగులమ్మ అంజమ్మ బాలమ్మ లింగయ్య దావయ్య శ్రీనివాస్ బిక్కునాయిక్ అందరూ ఆ ఊరి రైతులే...... నాలుగైదు ఎకరాల ఆసాములే. వాళ్ళు పనేస్తున్న ఫాక్టరీ లోపట్నే ఆ భూమంత సర్కారు మందుల కంపెనీల కోసం గుంజుకున్న వాళ్ళ చెల్కలన్నీ ఉన్నయ్.

ఇంతట్ల పెద పెంటయ్య "ఓ మొగిలీ నీ పశురాలను కాలుస్తున్నరే. నీ కొడ్కు ఆడికే ఉర్కిండు" అని ఒర్లుత వచ్చిండు.

మన్ను గంపనెత్తి కెత్తుకున్న మొగిలమ్మ గంపనేలమీద పడేసి గుండెలు బాదుకుంట "భూమి గుంజుకుని నా మొగున్ని చంపింద్రు గిప్పుడు గీ పశురాల్ని గూడంగ చంపుతాన్రు అన్కుంటనే ఉన్న గీ దినం గూడంగ వస్తదని, ఎట్ల సేతు........ ఏమిసేతు గీ బాడ్కావు సర్కారు కెవలు నిప్పుపెట్టాల?" అనుకుంట .... ఏడుస్తనే ఊరిదిక్కు ఉర్కులాడింది.

"ఓ మొగిలీ ఆగవే నేనస్తున్న జరాగు" అంటు నర్సమ్మ గంప కింద పడేసి మొగిలి వెంబడి ఉర్కింది. వాళ్ళ ఎనకనే పెద పెంటయ్య ఆయాసపడ్త కర్ర సేతబట్టి ఉర్కుతున్నడు.

మొగిలమ్మ పోయేటప్పటికే పశువుల చెల్లా చెదురై పోయినయ్. నాలుగు బర్రెలు చచ్చి పడున్నయ్. వాట్ని చూస్త మొగులమ్మ ముగ్గురు కొడ్కులు బిడ్డె సంగీత ఎక్కెక్కి ఏడుస్తున్నరు. తల్లిని సూడంగనే వాళ్ళ దుఃఖం ఎక్కువయ్యింది. నల్ల బొగ్గు తీరు చచ్చిపడున్న బర్రెల్ని చూస్త మొగులమ్మ భూమి మీద దుఃఖంతోని కూలపడిపోయింది. భూమికి తలకొట్కుంట ఏడ్చింది, భూమితోని తన ఎతలు చెప్తున్నట్లె! మొండిగా పైకి లేపి మొగుళు కమ్మిన ఆకాశం దిక్కుచూస్త దానికి ఇనపడెటట్లే గొంతు గీర పోయెద్దంక "ఎవ్వడు వాడు నా పశురాలను కాలబెట్టినోడు ముందుకు రారా......" అన్కుంట ఒర్లుత ఒర్లుతనే కోపంతోని ఊగిపొయ్యింది.

సర్కారోల్లను, కంపెనోల్లను సత్తెనాశనం కావాల్నని ఆల్లు గూడంగ గిట్లనే కాలి కాలి బూడిదవ్వాల్నని ఒర్లి ఒర్లి బేహోశ్ అయ్యింది.

మొగులమ్మను నర్సమ్మ మెల్లంగ లేపి ఇన్ని నీల్లు తాపింది. ఆడ సుట్టు గడ్డి గాదం గిట్ల అన్ని కాలి పోయినయ్ పశురాలు తినకుండ. నర్సమ్మ గుండె చెరువైంది. తన చెల్కల బాయిల లారీల ఇస్కను తెచ్చి ఏసిన్రు బోరు బావులు కాలబెట్టిన్రు పండకుండ. పండిన పంటను రాత్రికి రాత్రే కోస్కపోయింద్రు. పంట పండిచ్చిందంటే ఇనకుంటయ్యినమని చెల్కలను ఖాళీ చేపియ్యనీకి. ఇంతట్ల మొగిలమ్మ పెద్ద కొడ్కు ఎంకటేశ్ "అమ్మ సర్పంచు విఠల్ ఉన్నడంటనే దీనివెనుక, బాలయ్య అంటుంటే ఇన్ననే.......... అన్ని బొక్కల సున్నం లేకుండ కొడ్తనే వాడ్ని ఒదిలిపెట్ట ...." కోపంతోని ఊకిపోత అన్నడు మొగులమ్మ ఒక్కసారి శివంగోలె లేసి "నడురా... కొడుక, ఈ దినం ఆడో నేనో తేలాల నడు" అన్కుంట సర్పంచు విఠల్ ఇంటి దిక్కు ఉర్కులాడుతున్నట్లే నడువబట్టింది. ఆమె ఎనుక నర్సమ్మ పక్కపొంట ఎంకటేశ్ ఊరిజనం బయలెల్లిన్రు.

ఆడే .... ఆ దొంగనాకొడుకే ఊర్లె ఇల్లిల్లు దిర్గ సర్కారు భూములు తీస్కుంటున్నది. అన్ల పార్కులు తోటలు, ఫ్యాక్టరీలు కడ్తున్నరు. అన్ల ఇంటికొక్క నౌఖరి ఇల్లు కట్టిస్తంది. ఇప్పుడు మీరు ఒప్పకపోయినా తీసేసుకుంటది. మీరు గిన పట్టా కాగితాలు ఇచ్చి ఈ పైసలు తీస్కోక పోతే గీ ఇంత పైసలు గూడంగ ఇయ్యకుంట ఉట్టిగనే ఫుఖ్కట్‌ల తీస్కుంటది అని మనిషిని పది పార్లు బెదిరిచ్చి

అందర్ని ముంచిండు కాదు గీ కొడ్కు ! ఆనింట్ల గూడంగ పీనిగెల్ల .... ఊరికి పీడోలె తగిలిండు కాదు ? ఆన్ని నరక్కాల, నల్లపోచమ్మకు హారతియ్యాలె...... మొగులమ్మకు జరిగిందంత యాదికచ్చి కోపం ఇంకింత ఎక్కువైతున్నది. ఇంతలో సర్పంచు విఠల్ ఇల్లచ్చింది.

"అవ్‌తల్కు రమ్మను బాడ్కోను .... మేం ఓట్లేసి గెలిపిస్తే సర్పంచై ఊరినే కాటేసిండు" మొగలమ్మ ఒర్లింది. సర్పంచు పెండ్లం గౌరమ్మ అవుతలకు వచ్చి "సర్పంచు లేడు టవునుకు పోయిండు" అన్నది గేటుకాడ నిలబడి గేటు లోపట్కెల్లి తాళం వేసి ఉన్నది. గౌరమ్మ పెయ్ నిండ బంగారు నగలున్నయ్. ఇంటి పక్కల రెండు ట్రాక్టర్లున్నయ్. అంతకు ముంగట్ల ఆమె నిల్చున్న జాగల పెంకుల కమ్మ ఉండెడ్డి ఇప్పుడు రెండంతరాల బిల్డింగున్నది. సైకిలు తాన అర్రవైవేల హోండా బండి వచ్చింది. గివ్వన్ని ఏడివి ? తమ భూములు సర్కారోనికి అమ్మట్ల సాయం చేసినందుకు, ఊరిని ముంచినందుకు వీనికి గా కంపెనీ వోల్లు నెల నెల ఫస్టు తారీకు రాంగనే వెయిలకు వెయిలు ఇస్తే వచ్చినవి కావా ? తమ ఊల్లె గుంజుకున్న ఎకర ఎకరాకు వీనికి అర్రవైనుంచి డెబ్బై వెయిలు వచ్చినయ్యంట. తమకేమో ఎకరాకు మెట్టు మెట్టుకు ఒకడు తిన్నంక గా ఆర్.డీ.ఓ కెల్లి ఇగో గీ సర్పంచు పట్వారి ముండ కొడుకుల దంక లంచం దిన్నంక తమ కాడకు వచ్చేటాల కల్ల ఒక్కో ఎకురంకు 4 - 3 వెయిలు గూడంగ మిగల్లె. అది గూడంగ షావుకారి వచ్చి కాకి లెక్క గుంజుకుంటే భూమి పైసలు ఏమీ మిగలకుండ బిచ్చగాళ్ళ తీర్గైతిమి మొగులమ్మకు దుఃఖం కోపం ఎక్కువైతాన్నై.

"ఇంట్ల దాసిపెట్నవేమో బయటకు పిల్వు" వెంకటేశ్ గేటు ఇగ్గబట్టిండు. "అరె చేప్తే ఇనవా సర్పంచులేడు. పొండ్రి పొండ్రి పోక పోతే పోలీస్ స్టేషన్ల కంప్లెంటిస్త........" గౌరమ్మ బెదిరిచ్చుకుంట ఇంట్లకెల్లి తలుపేసుకుంది. దీనీగురం పాడుగాను. ..... కొంగు చాచి బిచ్చమడుగుతాన్న ఓటేసి నా మొగన్ని సర్పంచుగ గెల్పియ్యుర్రి అని ఇల్లిల్లు తిర్గితే ఆడబిడ్డ రోడ్డున బడ్డదని తరస్ వచ్చి అందరు ఓటేస్తే ఈ దినం బల్సిపోయి మనల్ని చూస్తే చాలు పోలీసంటది.... నర్శమ్మ మెటికలిర్సింది.

"ఇంగేం చేత్తం ? కలెక్టరు తానకు పోయి కంప్లెంటు ఇద్దం....." పెద పెంటయ్య అంటుండు. "ఏమిస్తము గామెకు కంప్లెంటు ? భూములు పోయినంక కలెక్టరాఫీసుతాన ధర్నచేస్తే పోలీసులతోని కొట్టిచ్చి జైల్ల ఏసింది ఆమెనేనాయె! కంపెనీ ముండ కొడ్కులు పనిస్తలేరని, చేసిన పనికి జీతాలిస్తలేరని అడిగితే, బూటు కాల్లతోని పెద్దంతరం - చిన్నంతరం లేకుండ కొడ్తాన్రని కంప్లెంటు చేస్తే 'నాకేమి తెల్వది మా చేతాల్ల ఏమీ లేదు సామరస్యంతోని పన్లు చేస్కోండ్రి .... మీ కసలు ఏ కానూను నడ్వది, చప్పుడు చేయ్యకుండ మర్యాదగ ఏ పనిస్తే ఆ పని చేసి ఎంత జీతమిస్తే గంతనే తీస్కొని ఉండుండ్రి' అంట ఎల్లగొట్టింది గామెనే. సర్కారు - కంపెనీల తోని మిలాఖత్ అయ్యింది గా అమ్మతల్లి. మనుషుల్ని పట్టించుకోని కలెక్టరమ్మ పశురాలు కాల్తే వస్తదానే పెంటయ్య?" అంటా లింగయ్య ధూత్ గీ బత్కుకు అగ్గిదగల గీ పోలేపల్లికి పోయే కాలం వచ్చింది. ఎవడన్న గా రెండు మందుల కంపెనీల మీద ఆకాశం కెల్లి బాంబులిడిస్తే ఎంత మంచి గుంటది అన్కుంట నేలమీత ధూత్‌మంటూ ఊసిండు.

మల్లందరు కల్సి మొగులమ్మను బుదరకిస్తా ఆమెకు మిగిలిన సెల్కాలకు తోల్కబోయిన్రు. చచ్చిన పశురాల్ని వదలిపెట్టి మిగిలిన వాటిని ఇంటకాడికి తోల్కపోయిండ్రు.

రాత్రి అయ్యింది. మొగులమ్మకు పెద్ద దిగులు కమ్మింది. పిలగాండ్లందరు ఏడ్సి ఏడ్సి పన్నరు. ఎవ్వలేం తినలె. నిద్రేడికెల్లి వస్తదని ? చచ్చిన మొగడు యాదికస్తున్నడు. సర్కారోల్లు మందులకంపెనీ కోసానికి తమ నాలుగెకరాలు గుంజుకున్నంక మస్తు మనాది పడ్డడు. పిల్లలు ఇంక బుడ్డగనే ఉన్నరు. అందరు చద్వుతున్నరు. బిడ్డె పెండ్లికెదిగింది.

దినాం భూమిపాయె. భూమిపాయె అనుడే ...... బువ్వ తినుడు బందు పెట్టిండు. ఎప్పుడు సూడు సెల్కాలకు పొయ్యి కూసునేది. పిల్లలే ఎవలో ఒకలు అయ్యారా రమ్మంట తోల్కొచ్చేది. అపుడంక పోయిల ఉండెటోడు ఒగ దినం దినం అంతా చెల్కాలనే కూసున్నడు. మర్నటి దినం తన చెల్కాల కంపెనీ

శంకుస్థాపన చేస్తందని ఎరికె చేస్కొని
యాదిరెడ్డి కాళ్ళ మీద పడ్డడు ఆపమని
గుంజి అవుతల బడెయ్యిండని కొబ్బ/
తన మొగుడు గది చూసి అక్కన్నే
కంపెనీ గోడవతలంగ పడేశిన్రు. /
మొగడేనాయే .... తన గుండె గ
కోసానికి గట్టిచేస్కుంది. గా ఉ
పిలగాండ్లకేం బెట్టాలె..... పశు
అమ్ముకున్నది. గా అర్థ ఎకురం భూ..
ఎంట బడ్డడు సర్పంచు, తీరు తీరు

నాలుగెకరాల భూమి ......, ఆ భూమికి ఆనామి పోగొట్టుకొన్నంక..... గీ అర్థం ఎకురం భూమితో నన్న పిల్లలను దక్కించుకుందామని మస్తు పోరాటం చేస్తున్నది. సర్పంచుకు లొంగుతలేదు. జిద్దుతోని ఎన్ని సార్లు కంపెనోల్లు బెదిరిచ్చినరు? పిల్లల్ని పశురాల్ని బత్కించుకోనీకి, కంపెనీల ఆ కాంట్రాక్టరు కాళ్ళు పట్కోందే కలెక్టరు తానకు పాయిన గదేదో పని కారటు రాపిచ్చుకొస్తే గని పని ఇయ్యలే గా దొంగ నా కొడుకు ఒకటి గాదు రెండు కంపెనీలున్నయ్ ఈడ, మీదికెల్లి ముంగటికెల్లి ఉన్న మందుల కంపెనీ గూడంగ ఉంది గని అన్న పని మస్తు డేంజరు - ఇద్దరు పిల్లలు కండ్లల్ల యాసిడీ పడి కండ్లే పోయినయ్. ఇప్పుడు తన బేహాలత్ చూసి కంపినోల్లు నవుతాన్రు. తన భూమిలనే తను బానిస లెక్క కూలీ పని చేస్తంది.

తన పెద్దకొడ్కు ఎంకటేశు గీ ఏడాది జడ్జర్ల కాలేజీల షరీకైదని అనుకుండగనే భూమిపాయె. తండ్రీ సచ్చిపాయె.... దిక్కే లేకపోయే, ఇంక టవున్‌ల మేస్త్రీ పని చేస్తాండు.... రెండోవానిది గూడంగ పది వరకు వచ్చి ఆగిపొయ్యింది. వాడు గూడంగ జడ్జర్లల ఒక హోటల్ల పనిల కుదిరిండు. తర్వాత బిడ్డె ఎనిమిదికాడ ఆపేసింది. దాని లగ్గం చెయ్యాల. బుడ్డ పోరడు ఎటు కాకుండై రోడ్లపొంటి తిర్గుతాండు. సంగీత లగ్గం ఎట్ల చేయ్యాల్నో తెలియకచ్చింది - ఏమిచ్చి చెయ్యాల ? ఈ రోజు కాలబెట్టిన గా అర్దెకరంల గూడ సర్కారు తన పచ్చదిమ్మె పాతుతది, రేపు గా బొందలగడ్డల పాతినట్లు. గీ అర ఎకురం పోయిందంటే బిడ్డ లగ్గం చేసేదే కుదరది. కాలబెట్టిండంటే గా జాగ ఖాళీ చెయ్యమన్నట్లు కదా ? ఈ సర్కారు గింతసిగ్గులేకుంట గీ భూమి మీది కాదు మాది అని గుంజుకుంటాందేంది ? దీన్ని ఆపెటోల్లు, అడిగెటోల్లు ఏవలు లేరా ? అన్నలెటు పోయిండ్రు ? ఇదేమి రాజ్యం? దొంగల్లెక్క ఊరు ఊరు దోచుకుంటున్రు ? గవుతాను భూములే గాదు కష్టపడి సంపాయిచ్చిన పట్టాభూములు గూడంగ గుంజుకుంటుంది. అది పోయినట్లే గా అర్థ ఎకురం భూమీ పోయినట్లే ...... మొగులమ్మకు మల్ల దుఃఖమొచ్చింది. గట్ల దిగులు మబ్బోలె ఎంతసేపు ఏడ్చిందో? ఏడ్చి ఏడ్చి ఆల్సిపోయింది. లేచి ఇన్ని నీల్లు తాగింది. ఇంగ గీ పశురాల్ని గూడంగ అమ్మెయ్యాల - గడ్డి యాడికెల్లి తేవాల ? పైసలేడియి ? రోజుకు ఒక మూడు లీటర్ల పాలన్న వచ్చేటివిగా సచ్చిన పశురాలతోని. పెద్దోడు పాలు - పెరుగు హోటల్ల అమ్ముకొస్తుండె. కానీ ఇప్పుడెక్కడ కట్టాల వీటికి కొట్టం? ..... ఏమి తిన్పించాల, పైసల్లేవు. అగో గా మూలనున్న బస్తల వడ్లగింజలు అమ్మితే ఇంకేం మిగలవు. గవే గ తమ చెల్కాల పండిన ఆఖరి వడ్లగింజలు. మొగలవ్వ తమ గుడ్సెల ఒక మూలనున్న వడ్ల గింజల బస్తను దుఃఖంతోని ..... ఇక కన్పించదేమోనన్న లాలసతోని కండ్లనీల్లు అడ్డమొస్తాంటే చూస్కున్నది. ఆరు నెలల కింద చెల్కాల కెల్లి వడ్ల గింజల బస్తలను తెస్త ఎంత సంబురపడ్డడు తన పెనిమిటి ? గీ యాడాది ఒక పది బస్తల వడ్ల గింజలు ఎక్కువ పండినయని!

మొగులవ్వను ఆమె ఇంటికాడ ఒదిలిపెట్టి తన ఇంటికచ్చి పడ్డదన్న మాటనే గని నర్శమ్మ దుఃఖంతోని కుములుతాంది లోపటి లోపట్నే. ఆకిట్ల నులకమంచం మీద ఓబులయ్య నిద్ర రాక తన్లాడుతున్నడు.

నర్శమ్మ రాంగనే ..... "దొర్కిండా సర్పంచుబాడ్కవు?" అనడిగిండు ఓబులయ్య

"వాడేడ దొర్కుతడే ? జడ్చెర్ల దెంకపోయిండు" అన్నది నర్శమ్మ కచ్చతోని.

"మొగులమ్మకు ఎంత కష్టమొచ్చింది ? బుడ్డ పోరగాళ్ళున్నరు. ఒంటరి

రుగు గింత ఆదుకునేట్టి..... గిప్పుడు ఆ పశురాల ఆశ రదన్నమాట" ఓబులయ్య తనలో తానే మాట్లాడుతున్నట్లే

వుగని ... జ్యోతి బువ్వ తిన్నదా ? అల్లునికి ఫోన్ చేస్తివా లేదా ? ...డు?" నర్సమ్మ ఆశతోని మొగన్ని అడిగింది. "చేసిన్నే .... గా బాడ్కావు ...చ్చినాగ్ని రాడంట. వాని అయ్య వానికి ఆమన్‌గల్ లేదూ, గా ఊర్ల పిల్లను చూస్తా...ంట. ఆ పిల్లకు ఆరెకురాల భూమి ఇస్తాండ్రంట..... అయినగని ఆ వుల్లె గూడంగ మన పోలేపల్లిల తీస్కున్నట్లు కంపెనీ కోసానికు సర్కారు భూమి గుంజుకుంటున్నదంటనే. అప్పుడు తెల్సివస్తది వానికి........" ఓబులయ్య గొంతు దుఃఖంతోని పూడుకపోయ్యింది. ఓబులయ్య మాటలింట నర్సమ్మ వానింట్ల పీనుగెల్ల బిడ్డ గొంతు కోసెకద... రేపే దాన్ని దవాఖానకు తీస్కపోయి కడుపు తీపించేస్త.... గా సర్కారు భూమి గుంజుకుందని పెండ్లాన్ని గర్భవతని గూడ సూడకుండగ నువ్విచ్చిన భూమే పోయినంక నీ బిడ్డతోని నాకేం పని అని ఒదిలిపెట్టి పోయిండు. ఎంత ఏడ్చింది ? అల్లుని కాల్ల మీద పడి బత్మిలాడింది..... ఇసం మింగి సస్తనన్నది - కంపెనీ ఇచ్చే ఇల్లు నౌఖరీ అన్నీ నువ్వే తీస్కోమంది. గిదంత ఒట్టిదే .... మల్ల మన భూమి మనకొస్తది అని బూకాయించ చూసింది. తన ఒంటి మీద ఉన్న వెండి తనకి తన మొగునికి మిగిలిన రెండు బర్ల పెంకుటిల్లు ఇచ్చేస్తనన్నది. ఊహు దేనికైన ఒప్పిండా అని? నా నాలుగెకరాలు నీకిస్తేనే తీస్కపోత, లేకుంటే లేదు అంట అటే పోయిండు. ఏడివి నాలుగెకరాలు ? కంపెనీ ఇస్క కంకర నింపి ఆస్మాన్ అంత గోడ కట్టేస్కున్నంక. జ్యోతి రోజా అడుగుతాంది, మొగన్ని తీస్కరమ్మని. ఏడి కెల్లి దెత్తు ? రోజా ఫోన్లు చేసుడే, వాడు మాట్లాడకుంట ఫోన్ పెట్టేత్తాండు. ఇగో ఈ దినం వాని లగ్గం, ఖబర్ "రేపు పోయి అడుగత తియ్యి ఎట్ల చేస్కుంటడో లగ్గం పెండ్లం బత్కి ఉండంగనే......... కానూన్ లేదనుకున్నడు కావచ్చు ! అయిన గీ సర్కారే కానూన్ చూడకుంట భూములు గుంజుకున్నంక అల్లుడాయె వాడు ఆపాటి రాజరికం చేస్కుంట బేకానున్‌గ ఉండచ్చు అనుకున్నడు....... నర్సమ్మ అయిపు లేకుండ మాట్లాడ్తనే ఉంది. ఇంతట్ల పక్క గుడిసెల వుండె రవీందరు పెండ్లం సుజాత ఓర్నాయినో చంపుతాండంట నర్సమ్మ ఇంటి దిక్కు ఉరుక్కుంట వచ్చి నర్సమ్మ ఎనక ఒనుకుతున్న పిట్టోలె కర్సుకున్నది. "రేయ్ మల్ల కొడ్తన్నవారా..... సిగ్గులేదుర దాన్ని కట్నం తెమ్మని కొట్టనీకి.... చంపుతర నాకొడ్క దాని ఒంటి మీద చెయ్యిబడితే" అంట నర్సమ్మ - సుజాతను కొట్టపొస్తున్న రవిందర్‌ను ఆపింది. దాని అయ్య కొడుకు నాకు ఇవ్వ భూమి లేదని తక్వ చేసి మాట్లాడచ్చు గని నేను కొడితే తప్పా ? అందరికంటే తక్వ కట్నం తీస్కున్న. గిప్పుడు నా భూమి సర్కారు గుంజుకుంది. నాకు దాని వుల్లె భూమన్న ఇమ్మను కట్నం కింద, లేకపోతే పైసలన్న ఇమ్మను అంట రవీందర్ తాగి ఒర్లుతండు. ఇంతట్ల సుజాత తండ్రి కుర్మయ్య ఆడికి ఉర్కులాడుతవచ్చి - "ఈ నా కొడుకు మొన్న నా బిడ్డ మీద కిరోసిను పోసిండంట లక్షరూపాలు తెమ్మని - కడుపుతో ఉన్న పిల్లని ఫాక్టరీ తానకు పన్లకు పొమ్మని జబర్దస్తుగ తొల్కపోతండంట, బిడ్డె నాకు చాతకాదు అంటున్న గని, లక్ష్మమ్మ చెప్పింది. నేను తీస్కపోత నాబిడ్డను. అయినగని నర్సమ్మ ఒదినే ...... ఏముందని ఇప్పుడు వీనికాడ ? సిగ్గులేకుంట దస్తఖత్ చేసి సర్కారోల్ల కాడ తొమ్మిది వెయిలు తీస్కుని భూమి ఇచ్చేసిండంట... నా బిడ్డ ఏం తినాల తాగాల చెప్పు" అంట..... ఏడుస్తున్న సుజాతను లేపుత........ "లెవ్వే తల్లి పోదం. ఈడోద్దు - వీడు నిన్ను చంపేస్తడు. చెప్తివా నాకు వీడు నీమీద కిర్సోను పోసిండని?" కుర్మయ్య వల వల ఏడుస్త సుజాతను లేపిండు, గని సుజాత అప్పుడ్కే కడ్పుల నొస్తాంది అంట బాధతోని ఒర్లుతుంది. రవీందర్ కడ్పుల పిడిగుద్దులు గుద్దినందుకు ఆమె కడ్పుల పిండం చచ్చిపోయింది. కాల మధ్యన రక్తం పోతున్నది. పెద్దమ్మా అన్కుంట సుజాత బేహోష్ అయ్యింది. అయ్యో.... కడ్పుల పిండంకు ఏమైందో, అన్నా జర్ర జల్ది దవాఖానకు తీస్కపోవాల.... పద అంట నర్సమ్మ బీరి పోయి చూస్తాన్న తన బిడ్డ జ్యోతిని బిడ్డా .... ఇప్పుడే వస్తనే దర్వాజ పెట్కోని పండు..... అన్కుంట సుజాతను పట్కోని కుర్మయ్యతోని దవాఖాన దారిపట్టింది రవీందర్‌ను తిట్టుకుంట ..... తాగుడెక్కువయిన రవీందర్ కూడా బేహోష్ అయ్యిండు.

* * *

"నీ బాంచెన్..... జర్ర పనియ్యి ఇంట్లో పస్తులుంటాన్నము. ఎకరాకు ఒక మనిషికి ఇంటికొక్క నౌఖరి ఇప్పిస్తనంటివి. నావి రెండెకురాలు గుంజుకున్నవు ఇంట్ల నా పెండ్లాము బీమారున్నది. డాక్టరు తానకు తీస్కపోవాల.... జర్ర దయిఉంచు సారూ...." వెంకటయ్య కాంట్రాక్టరు గోవర్ధన్ రెడ్డి కాళ్ళ మీద పడ్డడు కన్నీల్లతోని ! గోవర్ధన్ రెడ్డి మందుల కంపెనీ గూడ యాదిరెడ్డి మందుల కంపెనీ పక్కన్నె వుంది. ఇద్దరు ఆ కంపెనీలకు కంట్రాక్టర్లు .... గోవర్ధన్ రెడ్డి బాగా కర్కోటకుడు. కంపెనీల పన్జేస్తున్న కూలోల్లకు నీల్లు గూడంగ ఇయ్యకుండ ఎల్లగొడ్తడు.

"యాభై దాటినయ్ గదరా నీకు.... తెల్వదా నీకు యాభై దాటితే కంపెనీల నౌఖరీ లేదని.... గాలొస్తే పడేటట్ల ఉన్నవ్, నువ్వేం చేస్తవురా పని చల్ .....నడు" గోవర్ధన్ రెడ్డి కుక్కతీరు ఒర్లిండు. అప్పటిదంక కండ్లనీల్ల తోని పరేషాన్ అయితున్న ఎంకటయ్య ఒక్కసారి గొంతుపెంచుత" నా భూమి గుంజుకుని నాకే పని ఇయ్యవా గిదేం న్యాయం ? అన్నాలంగ కష్టపడి పండించుకున్న కోతకొచ్చితిన వరి పంటకు నిప్పుపెట్టి దోసుకుని నన్ను నా భూమి కెల్లి బేదఖల్ చేసినవ్.... పనిప్పియ్యి లేకపోతే నా భూమి నా కియ్యి....." అన్నడు... "నీదా భూమి ? ఏదిరా ఏడుందిరా ...... జర్రంత గుర్తు పట్టు నీ భూమిని ... గుర్తు పడితే..... ఇగో గిప్పుడ్నే నీకిచ్చేస్త ...." గోవర్ధన్ రెడ్డి కంకర ఇస్క నిండిపోయిన భూమిని వేలుతోని చూపిస్త సవాలు చేసిండు ఒంకరగ నవ్వుతానే ! ఎంకటయ్య భూమి దిక్కు పిసచూపులు చూసిండు... ఏది తన భూమి ? అంత కంకర, ఇసుక.... "కండ్లనీల్లతోని గిట్లంటె ఎట్ల సారూ.... భూమంత కంకరతోని గ్రౌండ్ చేసినంక నా భూమిని ఎట్ల గుర్తు పడ్త సారూ ? కత్తి తోని కుత్తుక కోసి పానమేది చూపియ్యి అన్నట్లు" అన్నడు ! నీర్సంగ తన ముంగట చేతుల కట్కోని ఒంగి పెరిగిన గడ్డంతోని దీనంగ నిలబడ్డ ఎంకటయ్యను చూస్తా ...... వీడే కాదూ... పంట వెయ్యద్దనంగ వేసి ఏపుగ పండించింది...... పండిన పంట పక్కల చెల్కల నిలబడి పెద్ద ఆసామితీరు...... నిట్టనిడంగ నిలవడి నా చెల్క నీకియ్య .... పో ఏం చేస్కుంటవో చేస్కో అని సవాలు చేసింది ? మర్సటి దినమే వాని పొలం కాలిపోయ్యింది. గోవర్ధన్ రెడ్డి కివ్వన్ని యాదచ్చినయ్.. గా గీరంత తగ్గి బానిసోలె తన ముంగట నిల్చున్న ఎంకటయ్యను మల్ల పొమ్మని కసిరి ఆడికెల్లి ఎల్లిపోదమని కుర్సీల కెల్లి లేసిండు.. ఎండ సుర్రుమంటంది.

"అగో గా గుంటూరు, ఒరిస్సా కెల్లి తెప్పిచ్చినవ్ - కూలీలను - మా పోలేపల్లికి ...., ఏం పని తెప్పిచ్చినవ్ మా దగ్గర భూములు గుంజుకుని మాకే కూలీ పనిప్పిస్తనన్నవ్, అల్లాకెందుకిస్తాన్నవ్ - అల్లనెల్ల గొట్టాల అని 18 సం॥ల సామ్లానాయిక్........ కోపంతోని ఊగిపోత "లేకుంటే పేపరోల్లకు కంప్లైంటు ఇప్పిస్తం" అన్నడు. ముందే చిర్రెత్తి ఉన్న గోవర్ధన్ రెడ్డి - ఏందిబే దొంగ గాడ్డి కొడకా..... కుక్కల్తోని కర్పిస్తా ..... ఇంద దీసుకో ఇన్ల సీ.ఎమ్ కాన్నించి కలెక్టరమ్మ వరకు అందరి ఫోన్ నంబర్లున్నయ్. ఎవలకు ఇస్తవురా కంప్లైంటు........... నువ్వు నాదే పీకలేవురా....... తీస్కో చెయ్యి అంట తన సెల్‌ఫోనును సోమ్లా మీదకు ఇసిరిండు. ఇంతట్ల గీ కతంత తెల్వని ఒరిస్సా కెల్లి వచ్చిన కూలీ ముక్తావర్ ఆడికచ్చిండు ..... "సాబ్ తీన్‌దిన్‌సే ఆప్‌కేలియే దేఖ్‌రై చార్ దిన్ కా మజ్దూరీనహీ మిలా ఆజ్‌దేదో కైసాతోభీ" అన్నడు (సారు .. మూడు రోజుల కెంచి నీ కోసం ఎదురు చూస్తాన్న. నాలుగు రోజుల కూలీ ఇయ్యలే ఇంక ఈ దినం ఇచ్చెయ్యి) అంతే ! గోవర్ధన్ రెడ్డి మీద కారం చల్లినట్లే అయ్యింది. ఒక్కసారి ముక్తావర్‌ను ఎగిరి కాళ్ళతోని కడ్పుల తన్నిండు ముక్తావర్ గావుకేక వేసి కిందమన్నుల బడ్డడు. ఏ మిషని కాడ పన్జేస్తున్నడో అపుడాంక ఒళ్ళంతా గ్రీసు నల్లగ అంటుకుని ఉంది బట్టలు మాసిపోయి బలహీనంగున్నడు. అతని భార్య పిల్లలు..... గూడంగ ఆడ్నే నిల్చున్నరు ఒక్కోలు పానం లేనట్లే పీక్కపోయి ఉన్నరు.

గోవర్ధన్ రెడ్డి కిందబడి ఉంగలు చుట్టుకుని ఒర్లుతాన్న ముక్తావర్‌ను తన బూటు కాల్లతోని ఇష్టం వచ్చినట్లు తన్నిండు..... కసితీరక తన నడ్ముకున్న బెల్టు తీసి మోదిండు. ఏడబడితే అటు, మారో నక్కో అని ఒర్లుతున్న ముక్తావర్ లేచి ఎనక్కి తిరుగుత .... ఎక్కెక్కి ఎడుస్తనే వేలు చూపిస్తూ బోల్తా సబ్‌కో - పేపర్ లో గోంకో - బాహర్ మీటింగ్ చల్రై జావుంగా .... బోలుంగా అంటు

తనుకుతనే ..... ఒంటినిండా గాయాలతోని గేటుదిక్కు ఉర్కిండు... ఆయన తోనే ఆయన భార్యా పిల్లలు ఏడుస్తా పరిగెత్తిన్రు...

"కొడుకుల్లారా ! నేను ఎవలకంటే వాళ్ళకు కూలీ ఇస్త - గుంటూరుకెల్లే కాదు, అమెరిక చైనా దేశాల కెల్లి గూడంగ కూలీలను పిలిపిస్త. మీకు అడిగే అధికారం లేదు పోండ్రి ...." చూపుడు వేలతోని బెదిరిచ్చుకుంట అన్నడు. నర్సింహ్ గసుంట పో గా ముక్తావర్ గాడు గేటు బయటకు ఉర్కిండి. బైట గదేందో ప్రజాసంఘాలోల్ల సభ జర్గుతాందంట రోడ్డు మీన. జర్ర గాన్ని ఆపు - ఇగో - వీండ్లను ఎల్లగొట్టు "ఎక్కడి కెల్లస్తరో లంజకొడ్కులు దిమాఖ్ తాండర్" అన్నడు. నర్సింహ.... పోయ్యా అంటు గల్లా పట్టి నడు బయటకు అని గేటు దిక్కు దొబ్బిండ్రు.

హోంగార్డులు ముక్తావర్ వెనక పడ్డరు గని ముక్తావర్ అప్పట్కే సభ జరుగుతున్న కాడికి పొయ్యిండు. ఆయనకెవలో మైక్ ఇచ్చిన్రు. ఒంటి నిండ రక్తం కార్తున్న దెబ్బలతోని ఎక్కెక్కి ఏడుస్త పిట్టతీరు గజ గజ వనుకుతు...... పండ్లు టప టప గొడ్తాంటే .... మైకు పట్కోని..... 'మైల ముక్తానర్ ...... అంట తన కత చెప్తబట్టిండు.

ఎంకటయ్య - పొయ్యి నాయక్ గేటు బయటకు వచ్చిండు..... ఇంతట్ల అర్వై ఏండ్ల లంబాడా రుక్కి ఏడుస్త బయటకు వచ్చింది. పనియ్యరంట..... ముసల్దాన్నంట. ఇంత ఇస్క జల్లెడపోస్త. పని చెయ్యిస్త లేదంటే ఎట్ల సాదాల నా మనుమలను ? భూమి పోంగనే కోడలు సచ్చే - కోడలు సావంగనే నా కొడ్కు ఇసం మింగి సచ్చిపోయె..... ఇప్పుడు వీళ్ళు పనియ్యిరంట ఏం చేయ్యాలె ? నిన్నంత జడ్చర్ల సీన్మ థియేటర్ తాన బిచ్చమడిగితే ఇర్వై వచ్చినయ్.... అవి గూడంగయిపోయిమ్ ఎంకటయ్య - ఒరే సోమ్లా జర్ర చెప్పుండ్లి. ఏం చేయ్యాలో, గింత ఇసం ఇయ్యన్న, నాకు నా మనమలకు.... సోమ్లా మీ అయ్యగూడంగ గుండె పగిలి సచ్చే కదర ? అంటా సోమ్లా నాయిక్ ఒళ్ళంత వునుకుత - ఒక్కసారి భూమి మీద కూలవడ్డిది - నేల మీదున్న మన్ను తీస్కుని నెత్తిమీన పోస్కుంట ...... మొత్తం గుండ్ల గడ్డ తాండ అంత అమ్మేసిన్రంట గీ కంపెనీకు. సర్కారోల్లు రేపో మాపో బుల్డోజర్లతోని తాండాల ఇళ్ళు - గుళ్ళు గూడంగ కాల్చేస్తరంట.... ఏం చేయాలి.... ఎటు బోత గీ సర్కారు మీద మన్ను బడ అన్కుంటి ఏడ్చిబట్టింది.

ఎంకటయ్య కండ్ల నీల్లు తుడ్చుకుంటు .... లేవే నడు గీడ ఉంటే గా గోవర్ధన్ రెడ్డిగాడు కుక్కల్ని ఒదులుతడు పదవ్వ..... ఎంకటయ్య రుక్కిని బలవంతంగ పైకి లేపిండు. సోమ్లా నాయక్ కండ్లెర్రబడ్డయ్ - అన్ల నిండిన కన్నీరు వేడెక్కి చెంపల కెల్లి కారింది..... ఆయన గుండెల్ల బుల్డోజర్లు మోగుతున్నయ్.... మెల్లంగ రోడ్డుమీన నడుస్తున్న సభ కాడికి నడ్వబట్టిండు.... గసొంటి సభలు గీ రెండేండ్ల ఎన్ని జర్గుతలెవ్వ...... అని అనుకున్న ఎంకటయ్య గూడంగ సభ దిక్కు నడ్సిండు కంపెనీ వాల్లేమో - భూమి లేకుంటే .... సర్కారు తన ఉండాలె, భూమి గీ ప్రైవేటు కంపెనీ కాడ ఎట్లుంది..... ? రాల్లు రవ్వలు రగల గొట్టి బర్రెలు - దోపులు సాపు చేస్కుని భూమిని కాపాడుకుంటు ఆరెకరాల పంటలు పండిచ్చుకోంటిం.... గిప్పుడు బికార్ల మయినం, కూలోల్లమయినం .... బానిసలమయినం .... మా భూమి మాకు కావలె......... నావి రెండెకరాలు పోయినయ్............ లింగయ్య మైకు ముంగట ఒర్లుతున్నడు ! ఆదివారం - సోమవారం కంపెనీకి శెలవు. ఇంకేమన్న అంటే చాలా సార్లు వారానికి నాలుగురోజులే ఇస్తడు పని - ఐదోరోజు పోతే ఎల్లగొడ్తమంటరు - ఒరిస్సా కూలీలతోనే పనిచేపిచ్చుకుంటాడు. ఆ రెండు శెలవురోజులల్ల..... అవసరమైతే ఎవలనైన ఊరోల్లను పిలిపించుకుంటాడు. ప్రతి ఆదివారం ఊరి జనమంత యాకయ్య ఇంటికొడున్న రచ్చబండ కాడ కలుస్తరు.... కంపెనీ కబుల్లు అన్ల వాళ్ళు పడ్తున్న కష్టాలు కంట్రాక్టర్ల మాటలు చేష్టలు ... అనక్‌చార్ల ఖచర్లు - ప్రజా సంఘలోల్ల మాటలు - పార్టీల వాదాలు చచ్చిపోయిన తమ బంధువుల యాది చేస్కునుడు...... దుఃఖపడుడు సర్కారు మీద రోషపడుడు అన్ని జర్గుతమ్.

ఇంట్లకెల్లి బయలెల్లి రచ్చబండచేర్తన్నరు. లక్ష్మి అంజమ్మతో "అత్త గా సత్తెనారాయణ సూపర్‌వైజర్ గాడు లేడూ..... వాడు..... నువ్వు మూత్రానికే పోయినవని నమ్మకమేంది. మూత్రంపోసిన గా జాగ ఏడుందో చూపియ్యి అండు లంజకొడుకు. సిగ్గుతో సచ్చిపోయిన. లక్ష్మయ్యకు చెబితే వాణ్ణి కొట్టబొయ్యిండు" నా పెండ్లంను అట్లాంటవేరా అని. సత్యనారాయణ లంజకొడుక కర్రతోని కొట్టంగ లక్ష్మయ్యను కండ్లపొంట నీల్లు కార్తంటే అంది లక్ష్మి. పోలీసుకంప్లైంటు ఇద్దమంటే ఆల్ల తాన్నే పోలీసోల్లున్నరంట సత్యనారాయణ మీదకు పోయినందుకు పోలీసులతోని అరెస్టు చేస్తమన్నదే అత్త..... అన్నది లక్ష్మి "ఏం అరెస్టు చెయ్యరు యియ్యాల గట్ల బెదిరిచ్చుడలవాటైంది గా ముండకొడ్కులకు - గీ సారు గా ముండ కొడ్కు మూత్రం పోసిన జాగ చూపియ్యిమంటే - నీ ముట్టుగుడ్డ చూపు తిక్క కుదుర్తది...... ఊకో తియ్య అంజమ్మ లక్ష్మిని బుదరకిచ్చింది. పొద్దున్న సభల సర్పంచు గుట్టు విప్పినది - నన్ని రేపట్కల్ల అరెస్టుచేపిస్తడంట గా సర్పంచు విరలు....... బిక్కుగాడు చెప్పిండు విష్ణు పెదపెంటయ్య కొడుకు అంటున్నడు. విష్ణు ఇంటరు ఫెయిల్ అయ్యిండు, కంపెనీలనే కూలీ పని ఇంకోసారి సూపర్‌వైసర్ పని చేస్తడు. "ఆ.... వాడేం చేస్తడు? ఏం చెయ్యడు తియ్ పెదపెంటయ్య కొడ్కుని సమాజయించిండు.

"అవుగని విష్ణు గా దినం సభకు బీజేపి వాల్లు గూడంగచ్చిన్రు .... చానా రోజులైంది కాదరాక.... సీపిఎం వాల్లు గూడంగ" సోమ్లా అడిగిండు. అవురా బై ఎంక్షన్లస్తున్నయ్ గద ...... ఐన గని డిల్లీల గీ బీజేపీ వొల్లే మన దేశంల మొదటి సారిగా సెజ్‌లు రానీకి సంతకాలు చేసిర్నంట..... సీపిఎం వాల్లు గూడంగ రాష్ట్రంలో సెజ్‌ల కావాల్నని లోకసభల అడిగిర్నంట. నందిగ్రాంలనైతే ...... సలీం కంపెనీకి జాగ ఇచ్చేతందుకు గీ సీపీఎం..... పార్టీ ప్రభుత్వమే మనుషుల్ని కుక్కల్ని ఏటాడినట్ల ఏటాడి నరికి చంపిందంట...... ఆక్కోల్లను గా గుజరాత్‌ల మోడీ చేపిచ్చినట్లే మానభంగాలు చేపిచ్చిందంట. చిన్న పిలగాండ్లను గూడంగ చంపిన్రంట, జాగ ఖాళీ చెయ్యిమని. ఇగో ఈడ అదే సీపిఎం వోల్లు సెజ్‌లొద్దని వేశాలు వేస్తాన్రు. అయినగని ఏడస్తున్నరు సీపీఎమ్ పార్టీ వోల్లు. రాక చానా రోజులైంది. కంపెనీ వాళ్లతోని మిలాఖత్ అయిన్రంటరు కొందరు. విష్ణు చెప్తా పోతాండు......... రెండేండ్లగ సంఘంలో కల్సి ఉండుడుతోని విష్ణుకు విషయాలు తెలుస్తన్నయ్.

"అయినగని - వారీ - విష్ణుగా గిదన్న నిజమేనార ? తెలంగాన సంఘపోల్లు ఈ ఎన్నికల్ల మన భూమి పోయిన రైతులతోని నామినేషన్లు ఏంపిస్తున్నరంట... దాంతోని ఏమొస్తదిరా ...... అందరు గిట్లనే ఆశలుచూపిస్తాన్నరు". ఎంకటయ్య అడిగిండు. "కాదే ఏమస్తదని కాదు, పోలేపల్లిల ఏం జర్గిందో దునియికంత తెల్వాల గద. మనల్ని వాడుకుంటున్న పార్టీ వాండ్లకు బుద్ది సెప్పుడు....... మనకు భూమి కావాలె..... గది అధికారంతోని వస్తది......... గది వస్తదో రాదోగని......... ఒక ప్రయత్నం .... గంతే" విష్ణు అంటుండు.

"మొన్నెవలో వచ్చి మన భూముల కాడ రెండంతరాల ఇళ్ళు కట్టనీకి తెల్లబండలు పాతి పోయిండ్రు. ఒక్క ఇల్లు యాభై లక్షల కమ్ముతరంట కదనే మొగులమ్మకు చుక్కమ్మ చెప్తున్నది. అవ్ గది సయేనే వాడు రియల్ ఎస్టేటు అంటే మన భూముల్లల్ల ఇల్లుకట్టి అమ్ముతడంట...... ముందుల కంపెనీలతోని గీ దంద గూడ నడుస్తదంట. మొన్న రాజన్న సభలో చెప్పిండు...... ఎప్పటికెల్లో తెల్సిందే నాయె.... ఇప్పుడు సర్కారు తన పెయ్యి మీదున్న ఒక్కొక్క చట్టా ఇప్పుతాంది అన్నడు లింగయ్య

"అవ్ నర్సమ్మ జ్యోతి ఎట్లుందే, అల్లుడేమన్న ఖబర్ చేసిండా లేదా - వాపి లగ్గం ఆగెనా లేదా......." చుక్కమ్మ అగుతుంటే నర్సమ్మ బాధతోని కండ్ల నీల్లొపుతా కండ్లు గట్టిగ మూస్తా తల అడ్డంగ ఊపింది ఏం లేదన్నట్లు. చుక్కమ్మ మొగుడుగూడ భూమి పోయిన మనాదితోనే గుండెపగిలి సచ్చిండు.

సుజాతకు పిండం పడి పోయిందంట కద.... గా రవిగాడు కడ్పుల గుద్దిండంట - గదే గా కంపెనీ వాడు గుద్దితే - వానిపైన కంప్లైంటిస్త అని ఒర్లుతడు - మల్ల పెళ్ళాంతోని గట్ల చేస్తడు, ఏడి కెల్లి తెస్తదది పోయిన భూమి..... సచ్చినోడ ఎంత పజ్జేసినావురా అంట పక్కనే చుక్కమ్మ రవిని ఈపు మింద ఒక్కటేసింది........... "సచ్చిపోయిన భీక్సినాయిక్ - పిలగాండ్లు తాండల అగుపిస్తలేరంట గాద"...... బాలయ్య అడిగితే "అవ్ వారం అయ్యింది. దేవులాగుతున్నరు గని దొర్కుత లేరు..." సోమ్లా అంటుంటే.... ఎవరో

లేపుకపోయ్యి అమ్ముకుని ఉంటారు... రుక్కి ఎక్కెక్కి ఏడుస్తు "అయిన గని తాండనే లేవగొడ్తున్నరు. తాండనే గాయిబ్ అయితాంది..... ఇంక మనుషులు - పిట్టలు గాయబ్ అవుట్ల ఏమున్నది పెద్దకత ... బత్కులిట్లైయినయ్....." అన్నది... ఉకో రుక్కి ఉకో........ అందరి కత లట్టనే ఉన్నయ్........ రుక్కి నెవరో బుదరకిస్తున్నడు.

రచ్చబండ కాడ రోజు ఆట్టనే కబుర్లు అయితయ్... ఆది - సోమారాల్ల ఇంకెక్కువ కబుర్లు - పోలేపల్లి ఊర్లె రోజు గిన్నే కబుర్లు ....

రచ్చబండ కాడున్న గుడ్సె ముంగట నులక మంచాల కాల్చేతులు పడిపోయిన ముసలి అటిటు కదుల్త...... "అయిన వారీ .... యాకయ్యా........ గింతన్నాలం ఎప్పుడు సూడలేదుర..... మా తాత ముత్తాతలు పోరాటం చేసి భూసాముల దొరల కాడికెల్లి భూములు దక్కించుకున్నరు - దొరలు జమీందార్లు ఉచ్చపోస్కుని ఊర్లెకెల్లి పారిపోయి పట్నం దెంకపోయి.... ఆడ బిజినెస్సులు చేస్కుంటాన్నరు........ ఇప్పుడు గీ సర్కారు బయటి దేశం కంపెనీలకు మనలను కొట్టి దొంగతనంగ లంగతనం చేసి కొల్లతీరు - హత్యలు చేసి మన భూములు గుంజుకుని జైల్లవేసి ఇస్తన్నదేందిర......." అన్నది. దానికి "గీ సర్కారు అగ్గి దగల నాశనంకాను" యాకయ్య గొంతు దుఃఖంతోని మూస్కపోయింది. "ఊకో యాకయ్య ఊకో పానం పోతే పాయె........ పోరుచేద్దం. మనం గూడంగ భూమికోసానకు" మొగులమ్మ యాకయ్యని బుదరకిస్త అన్నది. పెండ్లి గిట్లనే సర్కారు భూమి గుంజుకున్నంకనే ఆగిపోయ్యింది. లగ్గం ఇంక రెండు దినాలుందనంగ భూమి పోయిందని తెల్సి పెండ్లి పిలగాని తండ్రి చేస్కోమని కబురంపించిండు. బాధకు కాల్చేతులు పడిపోయినయ్, దవాఖానల ఉన్నడు. పెండ్లి కెదిగిన కూతురు లగ్గం ఆగిపోయి దిగులు పిట్టోలె ఇంట్లో తిర్గుతుందే అలనికాని బాధతోని - అవమానంతోని. భార్య బాయిల దూకింది పానం పోలే కానీ కాలిరిగింది. అయ్యవ్వలిద్దర్ని ఇప్పుడు వాళ్ళ బిడ్డె ఫాక్టెరీల "ఫాక్టరీలు కట్టుడైనంక మనం ఇంక రోడ్డు మీన బిచ్చమడుక్కోవ్వాల్నానె........... ఇంకేం పని చేస్తం ....." రుక్కమ్మ అడుగుతుంది. "ఫాక్టరీల పని అయిపోతే మనం బయట - ఆల్లు లోపట...... ఇంకేంవుంది ధూత్ పనికోసంకు విస్తర్ల ముంగట కొట్టుకునే కుక్కల తీరైనది మన బత్కు " పెంటయ్య తాగి ఒర్లిండు. "దినాం గా ఫాక్టరీల చేసే పనే మన చెల్కలచేస్తే పుట్లు పుట్లు వడ్లు పండిద్దుము..... " మళ్ళీ చుక్కమ్మ అంది. మొగులమ్మకు తనింట్ల మిగిలిన ఆ ఆఖరి వడ్లగింజల బస్త కండ్ల ముంగట కనబడి గుండె బరువెక్కింది.

ఇంతట్ల ఆడికి కరీంభాయ్ ఉర్కుత వచ్చిండు. ఆయన ఎనక ఇంకొందరు........ "సునో ...... సునో .... మన బచ్చెన్న మీన కరెంటు కంబపడి తల పండు పగిలి చేహోష్ అయితే కంట్రాక్టరు సర్కారు దవాఖాలనకు తోల్కపొమ్మని ఎల్ల గొట్టిండంట. పైసలు గూడ ఇయ్యిలేదంట...... దవాఖనకు పోత పోతనే దార్ల సచ్చే పోయిండంట. బచ్చెన్న కొడుకు రాగన్న తండ్రి సీనుగతోని కంపెనీకాడికి పోతే పోలీసోల్ల తోని కొట్టించిండంట.......... ఇప్పుడు బచ్చెన్నను ఖబర్స్తాన్‌కో తీస్కపోతున్నరు" అని చెప్పిండు. క్షనాల్ల ఖచర్ ఊరంత పిల్లగాలి తీరు పారిపోయింది.

ఓపికున్నోల్లందరు ఊరాతలున్న బొందలగడ్డ దిక్కు చేరుకున్నరు. ఇరవైమంది పట్టాల్సిన గా కరెంటు దిమ్మె లేపే తందుకు వీడు ఐదుమందితోని లేపిచ్చిండంట. బరువు తాళలేక గది బచ్చెన్న మీద పడ్డట్టుంది పాపం" శివమ్మ పక్కోల్లతో అంటున్నది.

బొందల గడ్డ కాడ ఏందో లొల్లి జరుగుతుంది. బచ్చెన్న కొడ్కు రాగన్న తన మిందకు చెయ్యి లేపిండన్న కచ్చెతోని గోవర్ధన్ రెడ్డి పోలీసోల్లను బొందల గడ్డ తానకు గూడ పంపిండు. సర్కారు బొందల గడ్డ కాడకూడ ఆ జాగ తమదే అన్న అక్షరాలున్న పసుపు దిమ్మెల్ని ఎప్పుడో పాతింది. బతుకునిచ్చే భూమి లేదు..... సస్తే పాతనీకి జాగ గూడలేదని ఊరిజనం ఏడుస్తనే ఉన్నరు.... అక్కడ పోలీసోల్లు లాఠీలతోని కొడ్తున్నారు జనాన్ని. బచ్చెన్న పీనుగని శ్మశానం లోపట్కి పోనిస్త లేరు. "ఉరవతల తీస్క పోయి కాలబెట్టుండ్రి .... గిది మీ జాగ కాదు, పచ్చ రాయి కన్పిస్తలేదా" ఒక పోలీసోయిన అంటుండే కరీంభాయ్ పెంటయ్య ఎంకటయ్య చుక్కమ్మ అంజయ్య జంగయ్య మొగులమ్మ అంత అగ్గోలె రగిలస్సు రాగన్న పచ్చరాయిని గడ్డపారతోని కసిగ అందరు కలసి ఒక్కసారి పోలీసుల మీద బడి దొబ్బుకుంట - తోస్కుంట...... పీనుగల్ని పాతే భూమి కావాల్నార గీ దొంగ సర్కారుకు "అని తిట్కుంట తొయ్యిర్రి .... లంజకొడ్కులను అనుకుంటు బొందల గడ్డ అవతలకు వచ్చి ఆడ్నే నిలబడ్డరు. మొగులమ్మ .... "రేపు నీ తల్లి సస్తే ఏడపాతువో చూస్త గదర ....." అని ఒక పోలీసాయిన్ను నిలదీస్తున్నది... "ఏడపాతుతడు ? గా మందుల కంపెనీల తయారయ్యే ఆసిడ్ల కరగ దీస్తడు.... గట్ల చేసి గాయింత భూమి బచాయించుకుంటడు దొంగ లంజ కొడుకు" అంజమ్మ ఒర్లింది...... లోపట్కివస్తే పానాలు తీస్తం .... గా సర్కారోణ్ణి కంపెనీ ఓణ్ణి గిక్కడ్నే పానాలతోని బొందబెడ్తం అన్కుంట బెదిరిచ్చుకుంట పోలీసోల్లకు కాపలా కాసిర్రు. బచ్చెన్నను ఆడ్నే పాతిపెట్టిర్రు. రగన్న తండ్రికి దొంద తవ్విన గడ్డ పారతోని కసికసిగ సర్కారోడు ఆడ పాతిన పసుపు సిమెంటు దిమ్మెను కసి తీర మోదిండు.......... ఏడుస్త .... గా దిమ్మెను పెకిలించనీకి కోషిష్ చేస్తున్నడు. బలం సాల్తలే... "ఊకోరా..... ఊకో.......... దా ...." విష్ణు రాగన్నను ఆపిండు. పోలీసులు చప్పుడు చెయ్యికుండ ఎల్లిపోయిర్రు.

ఎంకటేశ్.......... వడ్ల గింజల బస్తా తీస్కోని సైకిల్ మీన జడ్చెర్ల బయలెల్లిండు అమ్ముదమని. ఇంతట్ల మొగులమ్మ "ఎంకటేశా ఆగరా" "అన్కుంట రొప్పుతా వచ్చింది రోడ్డు మీదకు. ఇంతట్ల జంగయ్య చేతిల కుందేలుతోని నదుముల పిడికత్తితోని వస్తున్నాడు. పోలేపల్లి జంగల్ల పట్టినట్లున్నడు దాన్ని జంగయ్య. గుడ్సెకాలి పట్టాలు కాలిపోయినయ్. సర్కారు భూమి గుంజుకుంది. నా భూమి అన్న సాక్ష్యం కాలి పోయినంక పైసల్లేవు... కూలీ లేదు. నల్గురు పిల్లలతోని ఎట్ల బత్కాల్నో తెల్వలే. కంపెనోడ్ని కూలీ ఇమ్మని బిచ్చం అడిగీ అడిగీ విసిగి పోయి ఇంక పిడికత్తి పట్టి జంగల్‌కు పోయి నాటుకోళ్ళు పిట్టలు వాటి గుడ్లు కుందేళ్ళు ..... దినమంతా ఆడ్నే ఉండి వేటగానితీరు మునికాళ్ళమింద గుబుర్ల ఎనకాతల సప్పుడు సెయ్యకుండా కూసుని జీవి కనపడంగనే కత్తి విసుర్తె గా .... చచ్చిన జీవాన్ని పట్నంల ఉన్న దాబాలల్ల అమ్మతడు. వీలైతే కూలీపనికి పోతాడు జడ్చర్లకు.

"జంగల్‌కు పోయినవా .... ఎంతకమ్ముతవేంది కుందేల్ను. కోడి కంటే మందమంట కద పెయ్యికి కుందేలు మాంసం?" ఎంకటేశ్ అడుగుతుండు "ఆ......... ఎంతస్తదిరా నూరు మాటయాభై. అవురా ..... ఎంకటేశ్ .... సైకిలు మీన నన్ను గూడంగ తీస్కపోరా జడ్చర్ల .... ఆటోల పోదమంటే పైసల్లేవు...... దీన్ని అమ్ముకుని వస్త. నాలుగు దినాలైందిరా పిలగాండ్లకు ఒట్టి గంజితాపుతాన్న. గట్లనే గుడ్సె పైకి పిలాస్టిక్కు కవరు కొనుక్కోవాలె..... ఎండలకాలం ఎండతో సస్తాన్నం ..... ఒక వందుంటె ఇయ్యర....... గట్లనే సర్కారు కిలో రెండురూపాలబియ్యం ఇస్తాందంట కద....... రేప్పో మాపో ఆడ్నేవుండి గవ్విగూడ తెస్త .... కుందేలమ్మిన పైసలు నీకిస్త మా వోల్లకియ్యి" జంగయ్య బత్మలాడినట్లే అంటున్నడు.

మొగులమ్మ ఉర్కుత వచ్చింది. "చెప్పకుండ వచ్చిన వేందిర" అని తిట్టి "ఒరే ఎంకటేశ్ .... గీ సంచిల ఇన్ని ఒడ్లు పోయ్యిరా" అంది చిన్న చేతి సంచి సాపుత. "ఎందుకే .... ఏం చేస్కుంటవు" ఎంకటేశ్ అడిగిండు తాజూబుతోని !

మొఖమంత ఎర్రబారింది మొగులమ్మకు. మరోక్షణంల మొగుల్లేసినట్లే ఆమె కండ్లపొంటి జలజల నీల్లు కారినయ్. "గట్లంటవేందిరా.......... గవ్వి మీ నాయన నిశానీరా .... అయినగని ఇత్నాలకు కావద్దుర మల్ల చెల్కల నాటనీకి, ఉండనీ "అంట తనే బస్త దింపి సంచీలోకి వడ్లగింజల్ని దబ్బ దబ్బ నింపుకున్నింది, నల్లపోచవ్వ పూనినట్లె.

"నీ పిసగానీ భూమి యాడుందని ఇత్నాలు తీస్కపోతున్నవు మొగులమ్మొదినే ? ఉన్న అరెకురం కూడా నువ్వుమల్ల రాకుంట కాలపెట్టిర్రు కాదూ సర్కారోల్లు ?" జంగయ్య జాలినిండిన కండ్లతోని చేతిల కుందేలు పిల్లను దువ్వుత అన్నడు.

మొగులమ్మ కోపంతోని జంగయ్య దిక్కు చూసింది "భూమెందుగు వుండది ? ఉంటది - వస్తది " పిసదాని తీర ఒక భ్రమల మాట్లాడుతుస్నట్లే అంటా....... వడ్ల గింజలు నింపిన చేతి సంచీని బద్రంగ గుండెల కద్మకొని ఊరి దిక్కు బయలెల్లింది ! *

కథ

❖ ప్రశాంత్

తూర్పు బండి

చీకటిని చీల్చుకుంటూ ఈస్ట్‌కోస్ట్ పరుగులు తీస్తున్నది. బోరున కురిసే వర్షంలో రాక్షసిలా అరుస్తూ తాచులా వంకరలు పోతున్నది. వర్షపు చినుకులు కిటికీ ఊచలపై పడి చిట్లి కనురెప్పలను తాకుతున్నాయి. పరిగెత్తే రైలు వెనకాల నేల రయ్యిమని వెనక్కి వెనక్కి వెళ్లిపోతున్నది. లయబద్ధమైన శబ్దాలు చేస్తూ చెట్టు చేమలనూ వాగు వంకలనూ దాటుకుంటూ దాని మానాన అది వెళ్లిపోతున్నది.

అంధ యాచకుడెవరో "ఢగాళ లాగిళి కళా పాని ధిమ్ ధిమ్ గళా" చేయిచాపి పాడుకుంటూ వెళ్లిపోయాడు. "ఏ భాషా" అన్నాను పక్కాయనతో.

"గుజరాతీ అనుకుంటాను. పాపులర్ ఫోక్" అన్నడు. ఓఎన్‌జిసిలో పనిచేస్తున్నట్లు చెప్పాడు. ఏదో స్టేషనులో బండి ఆగితే ఇద్దరికీ చాయి పట్టుకొచ్చాడు. బండి బయల్దేరిన కాసేపటికి మళ్లీ మాట్లాడ్డం మొదలుపెట్టాడు. ఓఎన్‌జిసిలో రిలయన్స్ వచ్చేసిందని, ఉద్యోగం పోయే ప్రమాదం ఉందని చెప్పాడు. హిందీ, ఒడియా ఇంగ్లీష్ మూడు భాషలూ కలిపి చెప్పాడు. చెప్పడం ఆయనకూ, వినడం నాకూ యాతనైంది. ఆయన ఏం చెప్పినా ఎక్కడం లేదు. నాకెందుకో ఈ రైల్లో కూర్చోవాలని లేదు. రయ్యిమని వెనక్కి వెనక్కి వెళ్లే నేలను చూస్తుంటే మనసు కాలినట్లవుతున్నది. ఒక వైపు వర్షం; ఇంకోవైపు ఉరుములూ మెరుపుల్లో కనిపించి మాయమవుతున్న గుడిశెలూ, గుట్టలూ, రైలు వంతెనపై వెళ్లినపుడు వచ్చే వింత వింత శబ్దాలూ, శిధిలావస్తలో ఉన్న స్టేషన్లూ ప్రతిదీ నన్ను ఇబ్బంది పెడుతున్నది.

ఇపుడెందుకో తోచడం లేదు. అట్లాగని దూకనూలేను. ఈ ప్రయాణమే కంటకంగా ఉన్నది.

ఎవరో ముసలమ్మ, గొంతుకు పెద్ద గడ్డ ఉన్నది. మాట్లాడటానికి యాతన పడుతున్నది.

"కిఛీ దేబాబూ" (ఏదైనా ఇవ్వు బాబూ) అన్నది హీనస్వరంతో. ఆ మాటెందుకో మృత్యు ముఖంలో ఉండి మాట్లాడుతున్నట్లనిపించింది.

రైలు వేగం హెచ్చింది. క్షణక్షణానికీ అది చేసే శబ్దాలు మారుతున్నాయి. ఒక్కోసారి లయబద్ధంగా అనిపించింది. ఇంకోసారి భీతి గొలుపుతున్నది. ఏమీ పట్టనట్లు ఉరుకులు పెడుతున్నది.

ఈ చీకటిలో, రైలు వేగంలో కళ్లు పొడుచుకున్నా ఏమీ కనిపించడం లేదు; మూసిన కిటికీ అవతల వర్షపు నీటి శబ్దం తప్ప.

వర్షం తెరిపిచ్చినట్టనిపించి, కిటికీ తలుపు తెరిచాను. పైన భర్రుమని పంకాలు తిరుగుతున్నాయి. బయట చల్లని గాలి మొహాన కొడుతున్నది. అయినా లోపలి ఉక్క పోవడం లేదు. బోగిలో లైట్లు గుడ్డి దీపాల్లా వెలుగుతున్నాయి. రైలువేగం తగ్గినపుడు మరీ గుడ్డిగా తయారవుతున్నాయి. వేగం హెచ్చితే కళ్లు ఒక మోస్తరు పెద్దగా తెరుస్తున్నాయి.

"ఉత్కళమణి గోపబంధుదాస్‌జీకా కబితా సునాతాహు బాబూ" అంటూ కాళ్లు పట్టుకోవడాని కొచ్చాడు ఓ కుర్రవాడు. ఇరవై మించని వయసు. కొంత ఇష్టంగానూ మరికొంత అయిష్టంగాను జేబు తడిమాను. చిల్లరలేదు. ఆ మాటే చెప్పాను. "ఏటి బాబుగోరూ మీరేటి సెపుతారో నాకు - తెల్దేటి! ఈ బండున్నాది; దీన్ని తయారు సేసీ తోలే బాబులున్నారు. ఎక్కి తొంగోడానికి మీరున్నారు. బాబో మేమాత్తరం దీంచక్రాల కింద పడిపోవాలేటి" అంటూ పైపైకి వచ్చేస్తున్నాడు. ఎంత వారించినా వినడం లేదు. "ఏ ఊరూ" అన్నాను. "ఇచ్ఛాపురనండీ" అన్నాడు. గోపిబంధుదాస్ ఎట్లా తెలుసన్నాను. "మనకేటి సెప్పండి. బతుకంతా బండిలో అలగా ఎలిపోతాది. ఔరా ఎక్కేసి కలకటా. బువనేశ్వర్ ఎలిపోత్ను. వొడియా ఏటండీ బంగాళం వచ్చును. కుర్దా ఉన్నాది కదండి అక్కడో డొక్లికేగోడితో ఉండిపోత్ను. ఆడూ మా ఇచ్ఛాపురమోడే! ఆడు శాలా ఇషియాలు సెపుతాడు. బాసలూ చాలా వచ్చును" అని ఏదో గునుగుతూ, పాడుతూ వెళ్లిపోయాడు. ఆ తర్వాత చాలాసేపటికి వర్షం వెలిసింది. మళ్లీ కిటికీ తెరుచుకున్నాను. ఇందాకట అద్దంలో చూసిందానికి ఇప్పటికీ చాలా తేడా కనిపించింది.

ముద్దలాంటి చీకటి, చల్లటి గాలి. పరిగెత్తుకుపోయే నల్లటి ఆకారాలు. కూర్చోలేక నడుం వాలుద్దామని జారగిలపడ్డాను. మనస్కరించలేదు. ఇబ్బందిగా ఉండి లేచిపోయాను. మళ్లీ కిటికీ ముందు కూర్చున్నాను. కొద్ది సేపటికి బోగీలు మారుతూ బరువులు మోసుకుని రొప్పుతూ ఓ జంట వచ్చింది. సరిపోని సీటు మీద ఆయనా పెద్ద సూట్‌కేస్ కిందపెట్టి దాని మీద ఆమె ఎదురుబొదురుగా కూర్చున్నారు. ఆమె ఏదో చెబుతున్నది. ఆయన వినీ విననట్లు కొంతసేపు ఆమె మొహంలోకి ఇంకొంచెం సేపు కిటికీ వైపూ చూస్తున్నాడు.

జీర ధ్వనిలో ఒడియాలో మాట్లాడుతున్నాదామె. కిటికీలో తలపెట్టి కిళ్లీ ఊంచి, నోరు కడుక్కుని యధాస్థానంలో కూర్చున్నాడాయన. ఆమె అట్లా చెబుతూనే ఉన్నది.

ఎంత కాదనుకున్నా వాళ్లే కనిపించడంతో లేచి బోగీ తలుపు దగ్గిర నిలుచున్నాను. ఇళ్లూ గుడిశెలూ వేగంగా వెళ్లిపోతున్నాయి. ఆ దృశ్యాన్ని చూస్తుంటే నేలని ఎవరో ఆబగా మింగేస్తున్నట్లున్నది. అక్కడా నిల్చోలేక జాగా దగ్గిరికి వస్తుంటే ఎర్రటి ఛాయతో చర్మం ఉడిగిన ముసలాయన వచ్చి "రబ్బా కా దువా హై కిచ్ఛిదే బాబూ. మై లలన్ ఫకీర్‌కా గానా గాతాహు..." చేయిచాపి దయనీయంగా అన్నాడు. చిల్లరేదో చేతిలో పెట్టాను. కిటికీలోంచి చల్లని గాలి దూసుకువస్తున్నది. ముసలాయన మళ్లీ దగ్గ[illegible]. "ఇచ్చాను కదా" అన్నాను. జవాబేమీ చెప్పకుండ[illegible] ముస-

ముసిగా నవ్వుతూ నిలబడ్డాడు. క్షణాలు గడిచిన తర్వాత "ఈ లలన్ ఫకీర్ ఎవరూ"? అన్నాను. "బంగాల్‌కే కవీ, కలాకార్ హై. ఛుక్కేపేట్ కి ఆగ్ సుర్‌మే మిలాదియా బాబూ బహుత్ షాందార్ కలాకార్ హై, షాయిరీ లిఖ్‌నేమే మాహిర్ హై" అన్నాడు.

"మీదే ఊరూ" అన్నాను.

"బీహార్‌కా రహనేవాలాహు" అని కొంత సేపాగి "కయీ కల్‌కటా మే, కయీ ఒడిస్సామే, జార్ఖండ్‌మే. కటీ పతంగ్‌కి జిందగీహై బాబూ" అంటూ వెళ్ళిపోయాడు. ఏదో ఆలోచిస్తూ నా ప్రపంచంలోకెళ్లిపోయాను. నాలుగైదు సీట్ల అవతల జాగా కోసం అరుపులూ గొడవలూ వినిపిస్తున్నాయి.

అంతసేపు మాట్లాడుకున్న జంట అలసిపోయి కునికిపాట్లు పడుతున్నది. ఎక్కడి నుంచి వచ్చారో, ఏమాలోచిస్తున్నారో అనుకున్నాను. మధ్యరాత్రి దాటిన తర్వాత బోగీలో సుద్దుమణిగి రైలు శబ్దాలు మాత్రమే వినిపిస్తున్నాయి. ఎన్నటికీ కలవని బద్దీలు బతుకును ఎంతదూరం తీసుకెళతాయి కదా అనుకున్నాను. భరించలేని నిశ్శబ్దం ఆవహించింది. నా ఊహలూ ఆలోచనలూ కోసేస్తున్నాయి.

ఏవో చిన్నా చితకా స్టేషన్లు వెళ్లిపోతున్నాయి. జనమంతా దిగిపోయి రద్దీ తగ్గిపోయింది. మధ్యరాత్రి అటు ఇటుగా రెండింటపుడు చిన్నపాటి స్టేషను వచ్చింది. పాడుబడిన స్టేషను గోడలపై ఒడియాలో ఏవో రాతలూ, వంకరటింకరల సుత్తీ కొడవలి బొమ్మా కనిపిస్తున్నాయి. ఒకరో ఇద్దరో ప్రయాణికులు కాళ్లీడ్చుకుంటూ స్టేషను దాటుతున్నారు. స్టేషను మాస్టరు గదిలో గుడ్డిలైటు వెలుగుతున్నది.

బండి మెల్లిగా బయలుదేరింది. స్టేషను మెల్లిగా వెళ్లిపోయింది. మొగులుపోయి చీకటి కొంచెం పల్చబడ్డది. దూరంగా కొండల వెనకాతల, గుబురు చెట్ల మాటున ఏవో మెరిసి మెరిసి మాయమవుతున్నాయి. ఎవరో అన్నారు. "ఈ లైట్లేట్రో" అని. మరొకాయన అన్నాడు. "కాదహే నచ్చెత్రాలు" అని. అయిష్టంగా అడుగులు వేస్తూ ఇందాకటి అడుక్కునే పిల్లాడొచ్చాడు. "ఈయాలేటో గిట్టుబాటు కాలేదండీ... ఇంక మరేటీ లేదు" అంటూ కూలబడ్డాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. అట్లా మౌనం ఇష్టం లేక నేనే అన్నాను. "నువ్వెక్కడుంటావూ..." అని.

"ఇందాకటే సెప్పేశాను కదండి. కుర్దా టేషిన్లో ఉండిపోత్ను. ఇంక మరేటీ లేదు. బండ్లో తిరిగిడం, టేషన్లో తొంగోడం, కుర్దాలో మనోడున్నాడని సెప్పాను కదండీ, ఆడెప్పుడో మన సిక్కోలొదిలీసి కలకటా, బువనేస్వర్, మల్కన్‌గిరి, కొరాపూట్ అలగా తిరిగేస్తుంటాడు. అన్ని సూస్తే సిక్కోలోడిలా అవుపించడు. ఆడెక్కువ వొడియా, బంగాలం మాట్లాడతాడు. నేనాడితోనే తొంగుండి పోత్ను. ఏడ్డాడీ ఇలగెందుకైపోనవ్ అంటే ఆడేటీ అన్డు. నవ్వేసి పాట్లు పాడతాడంతే. ఆటి అర్థమేటో మనకేటీ తెల్దు" అన్నాడు. కాసేపటికి నిదురలోకి జారుకున్నాడు. సీట్ల సందులో సోయి లేకుండా పడున్నాడు. మగతగా అనిపించి కళ్లు మూసుకున్నాను. గాఢనిద్రలోకి వెళ్లిపోయి తెల తెలవారుతుండగా మెలుకువ వచ్చింది. వేకువ రేకులు విచ్చుకుని, కిటికీ అవతల అనంత మైదానాలూ, పొలాలూ, చెరువులు, పిల్లలూ, పూవులూ అద్భుతంగా కనిపిస్తున్నాయి. మనసు ఒకింత అహ్లాదంగా ఉంది. ఉదయపు శబ్దాల మధ్య రైలు శబ్దాలు కలిసిపోయాయి. తిరిగి బోగీలో అలికిడి మొదలయినది. దారెంబట చిన్న చిన్న గూడేలూ, వాటి మధ్యలోని కొలనుల్లో, నీటి గుంటల్లో పిల్లలూ పెద్దలూ, ఆడామగా నడుములోతు నీళ్లలో నిలబడి సూర్య నమస్కారం చేస్తున్నారు. పొలాలకు పోయేవాళ్లు, దున్నిన పొలం మధ్యలో నిలబడి నాలుకచాచి రైలువైపే చూస్తున్న కుక్కా, శిథిలమైన చిన్నబడిముందు నెహ్రూటోపీలు పెట్టుకొని వ్యాయామం చేస్తున్న పిల్లలూ రకరకాల దృశ్యాలు శరవరంపరగా కనిపించి మాయమవుతున్నాయి.

హాకర్ టీ తెస్తే తాగాను. మనసు కొంచెం తృప్తిగా ఉంది. స్టేషనులో బండాగితే కాళ్లకు పారాణి పెట్టుకున్న ఆరేడుగురు మహిళలు బోగీలోకొచ్చారు. వాళ్లేదో భాషలో మాట్లాడుకుంటున్నారు. అందరి ముఖకవళికలు ఒకేలా ఉన్నాయి. పక్కనున్న వయసు మళ్లిన ప్రయాణికుణ్ణిడిగాను. "ఏం భాషా"అని. "కుయి అనుకుంటానండి" అన్నాడు కొంచెం అనుమానంగా. స్టేషను దాటి రైలు వేగం పుంజుకుంది. శబ్దాల మారుతుంటే తలుపు దగ్గరికెళ్లాను. వంతెన వస్తున్నది. వంతెన కింద నది దర్శనమిచ్చింది. వలల గజిబిజిలో చిక్కుకుపోయి ఉంది. కొన్ని పడవలు ఏటి మధ్యలో ప్రయాసపడుతున్నాయి. ఇంకొన్ని ఒడ్డుకు చేరుతున్నాయి. తీరంలో ఉన్న శిధిలమైన పడవల మీద పిల్లలు ఆడుకుంటున్నారు. చిన్న చిన్న గుడిశెల్లో ఆడవాళ్లు అంట్లు తోముతున్నారు. శిథిలమైన పడవలను చూస్తుంటే రాబిన్సన్ క్రూసో గుర్తొచ్చాడు. సముద్రపు ఒడ్డున ఏళ్లకేళ్లు మనుషులకోసం, పడవల శిథిలాల్లో గంధకం, ఆహార పదార్థాలూ చివరకు చెక్కముక్కల కోసం ఎంత యాతన అనుభవించాడో కదా అనిపించింది.

రైలు ఒకేస్థాయి వేగంతో పోతున్నది. రైతులు అరక కట్టి దున్నుతున్న దృశ్యం వెళ్లిపోయింది. కొండల మాటున సూర్యుడు ఎర్రగా బయటకు వస్తున్నాడు. దూరంలో దకనీ ఉర్దూ షాయిరీ వినిపించినట్లయి చెవులు రిక్కించాను. ఆ స్వరం నావైపే వస్తున్నదని అర్థమైంది. అవిటి యాచకుడు పాడుతూ వస్తున్నాడు. మాసిపోయిన లాల్చీ, తలకు టోపీ, పొడవాటి గెడ్డం ఉన్నది.

"దీప్ జలాహై జలాహీ రహేగా... తుమ్హారే లియే..." పాడుతూ మా ముందు నుంచే వెళ్లిపోయాడు. ఆయనపాట కల్లోలాన్ని రేపింది. ఎవరి కళ్లలో నీళ్ల గురించి పాడుతున్నాడో కదా అనిపించింది. ఆయన కవిత క్రమంగా దూరమై, బోగీ మారిపోయింది.

కిటికీవైపు చూస్తే ఎండ పొలాలపై, గుడిశెలపై, సెలయేళ్లపై తెరలా పరుచుకుంటున్నది. పెద్ద వంతెన కింది నుంచి రైలు మెల్లిగా పోతున్నది. వంతెన కింద చీకిపోయిన గుడిశెల్లో పడుకున్న వాళ్లూ, వండివార్చుతున్న ఆడవాళ్లూ, రైలును అదేపనిగా చూస్తున్న పిల్లలూ కనిపించారు. రైలు వేగం విపరీతంగా పెరిగింది. పెద్ద పెద్ద మైదానాల గుండా ఉరుకుతున్నది. బీడు పొలాల్లో రంగులతో రాసిన పెద్ద బోర్డు కనిపించింది. అది అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. పరీక్షగా చూస్తే "వెస్ట్ ఎండ్ కెమికల్ హబ్" అన్న అక్షరాలు కనిపించాయి. మళ్లీ చూశాను. మళ్లీ అదే బోర్డు, అవే అక్షరాలు. పక్కన కూర్చున్న బీహార్ ఆయన నా వైపు చూస్తూ అన్నాడు "ఘబ్‌రావో మత్ బాబూ పశ్చిమ్‌కి అంత్ హై, వుయ్ హ్యావ్ టు వేజ్ ఏ బాటిల్" అని. నాకేమీ అర్థం కాలేదు.

పరుగులు తీస్తున్న రైలు సూర్యుడికి అభిముఖంగానే వెళుతున్నది. కిటికీలోకి వంగి మళ్లీ బోర్డు వైపు చూసే ప్రయత్నం చేస్తుంటే శ్రీకాకుళమాయన అన్నాడు. "ఇది పెడితే వొణ్ణం పుట్టదండి మందునీళ్లు తాగేసి సచ్చిపోవాల" అని.

కొద్ది దూరంలో నది అవుపిస్తున్నది. రెప్పపాటు కాలం గడిచి, నది కళ్ల ముందు మెరిసిపోతున్నది. కిరణాలు పడి అద్దంలా మిరిమిట్లుగొలుపుతున్నది. వలల గజిబిజి లేదు. మంద్రపు అలలు తీరాన్ని సుతారంగా కొడుతున్నాయి. కొండల మధ్య తిలకం బొట్టులా ఉన్నాడు సూర్యుడు. పక్కనున్న ముసలాయన అన్నాడు సూర్యుడివైపు చూస్తూ "ఏటండీ కల్లమద్దిని దీపం ఎట్టేసినట్టుందండీ...." అని. అన్నింటిని దాటుకుంటూ నిర్లక్ష్యంగా, ధైర్యంగా ముందుకే వెళ్లిపోతున్నది బండి. క్షణక్షణం దృశ్యం మారిపోతున్నది. సూర్యుడు మాత్రం వెంటే వస్తున్నాడు.*

కథనం

❖ ఉజ్వల్

కఫన్

రాళ్ళు తేలిన మట్టి రోడ్డుపై దుమ్మురేపుకుంటూ మా ఆటో దూసుకుపోతూవుంది. ప్యాక్ చేయబడ్డట్లు ఇరుకుగా కూర్చున్న మేం గుంతలు, మిట్టలు, మలుపులూ వచ్చినపుడు ఎగురుతున్న ఆటోలో కుదుపులు తింటూ "శీనూ...... నిదానంగా పోనీ" అంటున్నాం.

"భయం ఏం లేదు సార్ .... మట్టిరోడ్డు ...... టైర్లకు మంచి గ్రిప్పు దొర్కుతది. అదే డాంబర్ రోడ్డో ఆ హైవే అయితే గిట్ల ఊకనే స్లిప్పైతది. అందుకనే బండి ఉర్కుతుంది గుర్రంలాగ భయపడాకండి" మాలో ఎవరో అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పిండు డ్రైవర్ శీను.

శీనుది ఆ ఊరే. సొంత ఆటోనే. పొలం డబ్బులు ముందుగా లొచ్చినవి పెట్టి ఇంగింత ఫైనాన్స్ తీస్కోని తెచ్చుకున్నడు. ఇదే బతుకు దెరువు. డిగ్రీ సదువు నడుమ వొదిలేసిండు శీను.

ఇండ్లూ, పొలాలూ పోగొట్టుకొని శవాలుగా, బిచ్చగాల్లుగా, అనాధలుగా మారుతున్న ఈ పల్లెల్లోని ప్రజల్ని కలిసి వాస్తవాలు..... కారణాలు తెల్సుకుందామని మేం కొంత మందిమి రచయితలం, కవులం కల్సి ఆటోలో వెళ్తున్నాం.

మిట్ట మధ్యాహ్నం. సూర్యుడు నడినెత్తిన గ్రీష్మతాండవం చేస్తున్నాడు. కింద భూమి సెగలు కక్కుతూ కోరస్ ఇస్తున్నట్లుంది.

ఊరంతా నిశ్శబ్దం. స్కైలాబ్ పడే నాటి స్థితిని తలపిస్తున్నది.

మేమొచ్చిన ఈ దారే ప్రధాన రహదారి ఆ ఊరికి. దీనికిరువైపులా అయిదారు వాడల నుంచి వచ్చే చిన్న ఇరుకిరుకుదారులు.

ఏడవ నెంబర్ జాతీయ రహదారి మీంచి దిగి రెండు మూడేళ్ళుగా సాగుకు నోచుకోని బీడుబడ్డ చదునైన పొలాల మధ్య నుంచి వస్తుంటే దారి పొడవునా కళ తప్పిన ముఖాలతో మోదుగ చెట్లూ, తుమ్మచెట్లూ, ఈతచెట్లూ, తంగెడు పొదలు, మంగ కంపపొదలు, కానుగ, తవిసి చెట్లూ ...... తుగ్గిలి, చింత... వేప మానులూ, అడుగడుగునా ఫారన్ కంపచెట్లూ ......

మమ్మల్నే పల్కరించినయ్ "కడ సూపుకొస్తి రా" అని ! పెదవి విప్పి పలకరిద్దామనేంతలోనే కుదుపుతో మరో మలుపు. అది దారి ఎడమ పక్కన ఆ ఊరి ఖబ్రస్తాన్ !

ఓ యాభై అర్వై దాకా ఉంటాయేమో పాతవీ కొత్తవీ సాయిబుల సమాధులు. ఆనవాళ్ళుగా మాత్రమే మిగిలిన శిధిల గోరీలు ఊరి చరిత్రను గుర్తుచేస్తున్నట్లున్నాయి.

ఇటీవలే ఎవరో కాలం చేసినట్లు ఓ సమాధిపై చెదరని పూల మాలలు చెబుతున్నాయి. విచిత్రంగా వీటి పక్కనే ఆనుకొని హిందువుల స్మశానం ! తవ్విన మన్ను కూడా రంగు మారలేదు. ఈ మధ్యనే పొదిగినట్లున్నాయి ఉన్న అయిదారు బొందలూ !

మనసులో ఏదో అలజడి రేగుతుంటే అప్పుడే ఊరొచ్చేసింది. నడి ఊర్లో ఆటో దిగినం.

"ఎవర్నన్న పలకరిద్దం" అనుకుంటుంటే ...... సగం కాలి పొగసూరిన కట్టె లాగున్న దేహంతో .... పిడికిలంత కూడా లేని కుడిచేతి పిడికిట్లో ఇంకో కట్టెను ఊతంగా నేలకాన్చుతూ...... అడుగంత దూరం కూడా అడుగేయలేని నడకతో ఒక మానవాకారం రోడ్డు మీదుగా సాగివొస్తున్నది మావైపే !

అనిగిన నెత్తి మీద పీచులేసిన కాసింత జుట్టు.... నారతేలిన బెత్తెడు గడ్డపు 'చెహరా....' తేలిన పక్కటెముకల గూడుకు అడ్డంగా ఆనించి పట్టిన ఎడమచేతి మీద ఉతికి పిండిన కుట్టిన సైను బనీనూ....., అంగవస్త్రాన్ని పోలిన పలుచని 'మహెరుమా....'

మోకాలి కింది దాకా నడుముకు బిగగట్టిన 'తైబన్'..... వాడిన బొప్పాయి కాడల్లాంటి కాళ్ళకు రంగువెలసి గూడలు తెగిన రబ్బరు చెప్పులూ ......

ఇది ఒక డెబ్బైఏళ్ళుదాటిన బూఢా ఆద్మీ శకల్ ... ! ఆయన వస్తున్న దారి గమనిస్తూ వెనక్కి చూస్తే గ్రామపంచాయతీ భవనం తర్వాత మేం దాటొచ్చిన రోడ్డుకు అటు ఎడమ వైపు "జామె మసీదు పోలేపల్లి" అనే బోర్డు కన్పించింది.

మసీదు కాంపౌండ్‌లోంచి ఎత్తైన మీనార్లను దాటేసి ఎదిగిన ఒక బాదం చెట్టూ ... వేపచెట్టూ... పోటీపడి ఊగుతున్నాయి. అప్పుడే వీచిన గాలికి ఏదో చెప్పడానికి పలుపుతెంపుల గింజాటనలో ... !

కొమ్మ కొమ్మకూ నాలుగైదు చొప్పున రెండు చెట్లనిండా బిగుతుగా కట్టిన ముప్పై నలభై కుమ్మరి కుండలు వేలాడుతున్నయ్ పక్షుల కోసమేమో ... కన్నుల పండుగగా !!

ఆ మసీదులోంచి మెల్లగా వొస్తున్న అతనికి నాలుగడుగులు ఎదురెళ్ళి "అస్సలామలైకుమ్" - పల్కరించినం. నేనూ కుమార్.

"వాలేకుమ్ అస్సలామ్"

లో గొంతుతో సలాంకు జవాబు వచ్చింది

"ఆప్ కా నామ్ క్యాహై హజ్రత్ ?"

"కహాఁసే ఆరహాహైఁ" మేమడిగాం

"మైఁ అన్వర్ సాబ్. మస్జిద్‌సే ఆరహా హూఁగుసూల్ కర్కే"

"గాఁవ్ మేఁ పానీకీ జిల్లత్ హై ..... జాన్వర్ క్యా ? ఇన్సాన్ క్యా ?.....

హర్యేక్ తరస్ రహేహైఁ క్యాకరేఁగే ఐసీ నౌబత్ ఆగయీ"

హైదరాబాదీ నైజాం జబాన్‌తో మాటకలిపాడు.

"ఆప్ ... కౌన్ హై ? జాన్‌సక్తాహూఁ !" పాలిపోయిన కళ్ళ చూపు ఓ మోస్తరుగా ఉన్నట్లుంది. నా కళ్ళలోకి చూస్తూ ప్రశ్నించాడు.

మైఁ ... ఇఖ్బాల్ హూఁ ... ఏ ... మెరే సాథీహై" అన్న.

క్యా... ! ఎలక్షన్‌కే బారేమే హీ హోగానా. జో ఆప్‌లోగ్ ఆయే?!"

అనుమానంగా ప్రశ్నించాడు

"నైఁ నైఁ.. హంలోగ్ ఆప్‌సబ్ గాఁవ్ వాలోఁసే మిల్కే బాత్ కర్నేకేలియే ఆయేహైఁ' సెజ్‌కే బారేమేఁ"

మా మాటకు అడ్డుతగిలి "మాఫ్ కర్నా మైఁ ఎలక్షన్‌కే హరామ్ జాదే సమ్జా ! హర్‌దిన్ రాత్ ఆతే సతాతే హైఁ"

'ఉస్సే ఐసా క్యోఁ బోలా' - ఏక్ బోల్తా

'వైసాక్యోఁ బతాయా ... ' దూస్రా బోల్తా

నమాజ్ మేఁ ఆతే ...., జమ్మి కట్టాపే చడ్తే

'ఒట్టు' .... 'ఖసమ్' ఖిలాతే !

'ఐసీ హుజ్జత్ లగాకే జాతే'

'తంగ్ తంగ్ హోగయే సారే ఖామ్ కే లోగ్'

కొంపలు గాలి ఒకడేడిస్తే పొగకు కండ్లు నొచ్చినయని ఒగడేడ్సినట్లు ఉప ఎన్నికల లొల్లొకటి ఊరికి సుట్టుకున్నది.

ఓట్ల కొరకొచ్చి ఊర్ల అందరికీ లేపిపోతున్న తలనొప్పిని గుర్తుచేసుకున్నడు అన్వర్ తాత.

"హం ఆప్కే ఘర్ ఆనా చాహ్‌తే లే చలోనాఁ !?"

గీత, అరుణక్కలడిగిన మాటకు జవాబుగా "క్యోఁ నహీఁ.... జరూర్..."

"రాంఁడ్రి - అమ్మ రాంఁడ్రి"

బాట సూపుతూ ముందు నడిచాడు.

"అరే ఓ రవూఫ్ బేటా ఏదేఖో ఇధర్ !....

'సెహజ్' కే జమీనోఁకే బారేమేఁ కోయి ఆయెహైఁ..."

దారిలో ఉన్న రవూఫ్ భాయ్ ని పిలిచి మాతోకలిపిండు. నాలుగంకనాల మట్టి మిద్దె రవూఫ్ భాయ్‌ది. ఒక చిన్న బయటి రూంలో తఖత్ మంచంపై పడుకున్న వాడల్లా దిగాలునలేచి

"ఆయియే..... ఆయియే యహాఁ బైఠియే" అంటూ

"ఫరీదా .... పానీ పిలావ్ బేటా ఠండా" కేకేసిండు.

పలక మంచంపై పట్టక కొందరం కింద బండలమీదే కూర్చొని చెంబుల్లో తెప్పించిన నీళ్ళను ఒక్కొక్కరమే తాగాం......

"అదోరకమైన రుచి ..... వాసన"

కొత్తకుండ చల్లదనం వీట్ని దాచలేకపోయింది.

నీళ్ళు తాగుతున్నప్పుడు మా ఫీలింగ్స్‌ను గమనించినట్లున్నాడు.

"ఇవి ఎంతనో మేలు సార్ ! ఊర్ల ఉన్న ఏరేబోర్లవైతే నోటికాడ గూడ పెట్టలేర్ ... కంపు !!

రవూఫ్ భాయ్ నిత్యావసరమైన నీళ్ళ కంపును కళ్ళకు కట్టించాడు. నాలుగేండ్లాయె ఊరిసుట్టూ గాలీ నీల్లూ అంతా గత్తువాసన సుట్టుకున్నది. నీల్లు ఆగిన జాగలల్లా ఎన్నటికీ ఉప్పుతీసినట్లు భూమ్మీద తెల్లగ అట్టు గడ్తున్నది" రౌఫ్ భాయ్ భార్య ఇంట్లకెల్లి చెపుతున్నది.

"కొంచం మిట్టమీద ఉంది గన్క అందరం మసీదు బోరు బాయి నీల్లే తెచ్చుకుంటం తాగనీకె గిరిగిరి ... అవే ఈ నీల్లు శాన మేలు అనుకోండి".

అప్పుడే వొచ్చిన బలిజె అంజయ్య జెప్పిండు అందర్ని కల జూస్కుంట.

"ఎందుకిట్ల నీల్లల వాసన ... ఎప్పటినుండి .... ?" యాదన్న అడ్గిండు. అదే భాయ్ ఆ పెద్దమ్మ ఫ్యాక్టరీ పడ్డకాన్నుంచి తలాపున, ఐసా హోగయా" తెలుగూ ఉర్దూ అలాయ్ బలాయ్ తీస్కున్నయ్ రవూఫ్ భాయ్.

"పసులెట్ల తాగుత యబ్బా ఇట్లుంటే .... " నా నోటిల మాట పూర్తి కాకముందే దళిత దుబ్బన్న రయ్‌న లేసిండు.

"ఇంగ్యా పసులు సారు అన్ని ఆ వాసన ముర్కసూసెటాలకే ఓటోటి సుట్టుక పడవట్టె.... మొన్న మా సూగూరి గాన్వి రెండెద్దులు మూడు బర్లు సచ్చె! గామొన్న బోయరంగని దూడ, కట్టిన మ్యాక సచ్చె ! నాల్దినాల కింద మంగలోల్లది పొటేలుపిల్ల బాగుండె జాంగీరు పీర్ల కిడ్సిండిరి ... కాల్జేతులు కొట్టుకుంట గుడ్లెల్ల దీసె ! నెలల 20, 30 జీవాలన్న సుట్కపడ్తుండయ్ !

రాళ్ళల గుట్టల కాడ యాడంటె ఆడ అడ్డం బడ్తున్నయ్ ..... ! 'మా పొటేలు కండ్ల వడ్తలేదు'...., 'మా యాపు జాడలేదని' ఎత్కనీకె బోతె కడ్పులింతోటి ఉబ్బి నాల్కెలెల్ల వెట్టి సచ్చి వాసన వట్టినయ్ కండ్ల వడ్తున్నయ్.....!!"

ఏం జెప్పాలె మా బత్కగాల కడ్పుల అగ్గివోసినట్లయితుంది. అప్పుడప్పుడే సచ్చిన మ్యాకను కోసిసూస్తే కడ్పుల పేగులన్ని సిన్గి సిన్గి పడ్తుండయ్. ఏమయ్యిందేమొ. గత్తరొచ్చినాడన్నా. ఇట్ల సావకపాయె. ఇట్లనే మంద మట్టగబాయె... మొక్కొర్తిల ఈదమ్మవి, కాట్ర మశమ్మవి బోనాలు దీస్తుంటిమి. మా బొందల్లాగనే ఊరి ద్యావర్లు పోశమ్మ మైశమ్మల గుళ్ళుగూడ సద్రం జేసి పెట్టిరి న్యాలకు. బోనాలు వాయె జీవాలు వాయె" తలపోసిండు కుర్వ బొజ్జి.

"ఇంగ పిట్టలుకాకులు.... సెప్పనీకె రాదు.

యాసెట్టు మీద జూసిన ఒక్క పిట్ట కండ్ల వడ్తలేదు. సుట్టపు కబురు దెచ్చే కాకుల సప్పిడైతే సెవులవడక ఎన్నేండ్లాయెనో !"

కోమటి శివయ్యశెట్టి సిలక కోయిలల కాలం యాదిజేస్కుంట పాయిండు ఎవరో పిలిస్తే 'వొస్తి వొస్తి' అన్కుంట.

నీళ్ళ ప్రస్తావనతో కడుపులోంచి యిన్ని మాటలు తన్నుకోనొచ్చినయ్. అది విన్నాక "రవూఫ్ భాయ్ మొత్తం ఎంతభూమి ప్రభుత్వం తీస్కున్నది. మీ భూమి ఏమన్నా సెజ్ కింద పోయిందా ? చెప్పండి" అన్నాడు రవి.

"సార్ మా పోలెపల్లిది. గుడ్లగుండ తాండది ముదిరెడ్డి పల్లెది గల్పి తేరా సౌ ఎక్కర్ (పదమ్మూడు వందల ఎకరాల) మీద బొయ్యింది. మాదీ, తాండది వెయ్యి ఎకరాలు. ఇంక నాది మా తమ్మునిది ఇద్దరిది కల్పి 15 ఎకరాలు పోయింది. నేను భూఁవిఁ ఇయ్యనని జెప్పిన. పాస్ బుక్కులు గూడ ఆల్లకియ్యలె ! పైసలు భీ తీస్కోలే వొద్దన్న" అని పట్టకాయిదాలు తీసిసూపుతున్న రవూఫ్ భాయ్ తోని

"భాయ్‌సాబ్ ఎందుకు తీస్కోలేదు మీరు ? అందరు తీస్కున్నరంట గద ?" చారి అడిగితే భూములు దీస్కున్న తరీఖ ఇప్పిండు రవూఫ్‌భాయ్.

"ఏం దీస్కునుడు సార్ అది ?! ఎవ్వరు ఇష్టంతోని ఇద్వలే భూమి...! భయపెట్టింర్రు !!"

"వొచ్చిన కాడ్కి సప్పిడి జెయ్యకుంట తీస్కోండి... నాల్గు దినాలైతే అవిగూడ రావు" అని ఎమ్మార్వో గిర్దావర్ ఆర్డివో అందరు బలవంత పెట్టి మజ్బూర్ జేసిరి. ఎస్సైతోని బెదిరిచ్చిరి..."

"మేమియ్యం మా భూములు" "ఏమన్నా రేటా మీరిచ్చేది ?" 'దొంగతనం జేస్కొచ్చిన సొమ్ముగ్గుడ ఇంత అద్వాన్నం రేటు కియ్యరు" అని జిల్లాకు పాయినం కలెక్టర్నడ్గనీకె !

"గేటుగేటు కాడ కావలిపెట్టి లోన్కిరాకుండ జేసె !"

అట్టిట్ల పడి లోనికోతె కండ్లింత జేస్కోని 'నా సేతుల ఏంలేదు, గౌర్మెంట్ పని, ఇయ్యకుంటే నడ్వదు, సప్పిడి జెయ్యకుండ నడువుంర్రి" అని లాఠీలతోని కొట్టిచ్చి ఎంటవెట్టె... ఇంగ్యాడజెప్పుకోవాలె!?

ఎమ్మెల్లె ఉండ డంటె ఉండడు. అరిస్తె కొట్లాడ్తె కాదిది. మన తెలంగాణ రాని ఫ్యాక్టరిల నౌకర్లిప్పిస్తగద నేనుండ" అంటడు...... కట్టె ఇర్గకుండ పాముసావకుండ! "నాకిన కాడ నాల్కె ఉంటదా!"

ఆడ పైన ఫ్యాక్టరోడు ఆఫీసర్ల కాన్నుంచి ఈల్లందరినోర్లల్ల లచ్చలు లచ్చలు కుక్కుతడంట గదా!

"ఆని మాట గాక పోతే మా మాటింటరా బద్మాష్ కొడ్కులు" తన బాధంతా ఎల్లగక్కుకున్నడు రవూఫ్ భాయ్!

"జర మెహర్బానీ కర్కే మేరే సాత్ ఆవో"

"యహీఁ దోఘర్‌కే పైల్వర్" అంటూ ఎండను లెక్కజేయకుండ నడుస్తున్న అన్వర్ భాయ్ వెంట మేమూ కదిలాం.

పొక్కిలి పొక్కిలి లేసి పడావు పడ్డట్లున్న ఒక ఇంటిముందు ఆగిండు "ఫాతిమ చమేలి ల్యాకుండె" నిన్నగాక మొన్ననే సనిపోయింది. ఈల్లు ఆల్లు అనకుండ అందర్ని నోటినిండ పల్కరిచ్చుకుంట ఇదంత తిర్గులాడుతుండె" అన్వర్ మాటలు విని నజీర్ భార్య షరీఫా బయటికొచ్చింది మొఖానికి పల్లో అడ్డం బెట్టుకొని ఏడ్సుకుంట!

ఉన్న ఆరెకరాల పొలం సర్కారు కంపెనోల్లకు ఇగ్గుకోని ఇచ్చినంక లంచాలు ఇయ్యనీకె తెచ్చిన వడ్డీ అసలు, బ్యాంకు అప్పులు, పర్సెంటేజీలు, అందర్వి అన్నీ బోయి అబ్బా సేతులవడ్డ పంద్రా హజార్ తన షాదీ "దహెజ్" "జోడేకేరఖం" కు గూడా సాలవని కుమిలిపోతున్న అమ్మీ అబ్బాల దుఃఖాన్ని చూసి తట్టుకోలేక ఈ లోకాన్నే విడిసి జీవితం సాలించిపోయిన 'ఫాతిమా' -నజీర్, షరీఫాల ముద్దు బిడ్డ.

"తీన్ దిన్‌కీ జ్యారత్ గూడా ఇంగాకాలె. కుటిమ్మం. కుటిమ్మం అంత అల్లాడుతుండరు. ఉస్కో జర మదత్ కరో హిమ్మత్ చెప్పండి సాబ్" చూపు మందగించిన కళ్ళలో కన్నీరు పెట్టి నాభుజం మీద వాలిండు అన్వర్ భాయ్!

నజీర్‌ను పల్కరించినం. ఓదార్చి హిమ్మత్ జెప్పివొచ్చినం అందరం.

నిండు 'కట్టదెగిన చెరువులా' రోధిస్తూ .....నజీర్ మన ధ్యాసల లేడు!

ఎట్లా తెల్సిందో అరగంటలో మేమొచ్చిన విషయం తెల్సి రవూఫ్ భాయ్ ఇంటి ముందర యాప చెట్టు నీడన జనం వొచ్చి చేరింర్రు మేం బొయ్యేటాలకు.

వాల్లల్ల వాల్లు మాట్లాడుకుంటుండరు. తకరారుజేసుకుంటుండరు.

"సాఁవిఁ.... మావి గూడ గుంజుకున్నరు భూఁవుఁలు. ఎనిమిదెకరాలుండె... బాగపండుతుండె....జొన్నలేస్తుంటిమి. ఇంటి పూర్తి యాడాది బత్తెమై ఇంగా ఇన్ని మిల్గుతే అమ్ముకుంటుందిమి. 'ఆందాలు' గూడ పండుతుండె. రొండు బోర్లు ఏసింటిమి. ఇంత తోట బెట్టింటిమి. అగో గెడిపిన ఆ పోశమ్మ గుడికట్ట కండ్లవడ్తుంది సూడు....దాని పక్కన్నే ఆ కంపని గేటు ఉన్న కాడ మా సేనుండె. సూసినప్పుడల్లా కండ్లల్ల నీల్లు దిరిగి కడ్పుల మసిబోసినట్లైతది..... ఆ మా గెట్టుదాటే మేము కంపనిలకు పనికి పొయ్యేది. మా సేన్ల మేమే గాసగాల్లమైనం..... మా సంసారాలు నాశనమాయె.... ఆ కంపనోడేమో కోటీశరుడాయె...!

గీ సర్కారు మమ్ముల నమ్మిచ్చి గొంతుగోసె...!

ఆన్నేమో పైకి దెచ్చె...!!

మా ఎంటుండి మా కోసం కొట్లాడ్తుండె దేవుడు మా ఉపేంద్రెడ్డి! ఆయన్ను పొట్టల వెట్టుకునిరి.

మే మెట్ల సత్తుము...? ఎన్ని ముందల మాకెవ్వరులేకుండైరి..."

పసిపిల్లై గుండెలోని బాధతో విలపించింది వడ్ల సరోజమ్మ డైరీలోనోట్ చేసుకుంటున్న కుమార్ సేతులు పట్టకొని. "మీరందరు ఇష్టపూర్తిగనే సంతకాలు పెటింద్రంట గదమ్మా పేపర్ల కలెక్టరు ప్రకటన వచ్చింది. కొనమని ఎంటవడి అమ్ముకున్నరని గౌర్నమెంటు గూడ అంటుంది గదమ్మా" అని వివరణ అడ్గిండు.

కండ్లనీల్లు దుడ్చుకోని జీరవోయిన గొంతుతో..... " అన్నా....అన్నా....అన్నాయమన్నా.... యా ఇష్టమన్నా.... మేమొక్కరం గాదు గదన్నా.... యా ఊర్లనన్న అడ్గండి. ఎవరన్నా ఇష్టంతో సంతకాన్ని బెట్టింద్రా" ఆఫీసర్లా ఆట్లా ఈట్లా ఎవారెవరో తెల్లారెటాలకు మా వాకిట్లల్ల గండు పిల్లుల్లాగ వొచ్చి నిలవడ్తుండిరి. ఆల్లెంట మా ఊరి పటేలోడు తోడేల్లెక్క తిర్గుకుంట... ఏమేమో జెప్పుతుండిరి. గీన్ పార్కు ఐతద్రని.... పూలతోటలు పెడ్తరు, సిన్మాల్ దీస్తరు, దేశదేశపోల్లు కార్లల్ల ఇమానాలల్ల వొచ్చి పోతుంటరు. మీ ఊర్లు సొర్గాలైపోతయ్రని.... ఏమేమో కూసిరి... మాయజేసిరి....

మాం గూడంగ ఆల్లకూతలు నమ్మలె...వొల్లమంటె వొల్లమన్నం! భూఁ వుఁలైతె వొదలమన్నం!!

"జిల్ల కలెట్టర్ వొచ్చి సేతుల సెయ్యేసి బరోసిచ్చిపాయె..." "మీకర్మ ఎంత జెప్పిన ఎక్కదుగద. నెత్తిల పెండ ఉంది" అని ఒగడంటే! ఇవి గూడ ఇయ్యకుండ ఊకనే రేపు అన్ని గుంజుకుంటే అప్పుడు దెలుస్తది" అని ఒగడు.

ఇట్ల ఎచ్చిర్కలు జేసి... బుగులు బుట్టిచ్చి భయపడిచ్చి బొట్టెలు వొత్తిచ్చుకునిరి. పాసుబుక్కులు ఇగ్గి పెట్టుకునిరి వొల్లమని వొత్త నోల్లవి ఆల్లే వొత్తుకోని ఏసుకునిరంట బొట్టెలు ... సెక్కులు! ఇప్పుడేమొ ఇష్టంతోనిచ్చిరంటరా ఎవడాడు ఆని పీనిగెల్ల మాగోస ఆన్కి దిర్గ" శపిస్తూ ఆక్రోశించింది ఆ తల్లి.

"ఇప్పుడని అప్పుడని పన్లు జేస్కోకుండ ఆపీసుల పొంటి సెక్కులిస్తమని తిప్పుకోని తిప్పుకోని సంపిరి.... రెండేండ్లు. మా ఊరు ఊరు కన్నెగ వోతదంట యాడేసుకోవాలె? ఇప్పుడు పొలాలు వాయె తలాలు వాయె ఎట్ల బత్కాలె!?..."

మా రుక్కాలి సచ్చినప్పుడు లొల్లిజేసినం ఎవడో ఆడుపెద్దొచ్చిండె సచ్చిన మావోల్లందర్ని వొర్సవెట్టి మీ ఆపీసులముంగట మీకొంపల ముంగట బొందలు దీసి పెడ్తం. మా పీన్గెల మీంచి ఎట్ల బోతవోపో" అని గొడవ జేస్తె బొక్కలగడ్డకు జాగ శాంక్షన్‌జేసి పోయిండు. ఇంగ వొచ్చినోన్ని వొచ్చినట్టు ఇండ్లనే బెడ్తం" గుడ్లగండతాండ సోమిలి నేలను గుద్దుకుంట మాట్లాడుతుంది. సెమట కక్కేమొఖంతో ఎండల అడ్డంబడి నడిసొచ్చిన ఆయాసంతో!

సెక్కెన్ని సేతులు మారితే అన్ని సేతులు తడిపినం! మెట్టు మెట్టుకాడ కడ్పుగాల్సుకోని దచ్చిన వెట్టింటే పైసలు సేతుల వడ్డె !!

"పదైదెకరాలు" భూఁవంత వాయె....ఎట్ల బతికేదని వొచ్చిన పైసల్తోని భూఁవిఁ గొందవంటే పావెకరకు సాలక పాయె"

"మా భూఁవుఁలు గుంజుకునేటాలకే భూఁవుఁలకు ధరలకు రెక్క లొచ్చె!" "సేతులున్న సిల్లిగవ్వలు ఎక్కిరిచ్చె....!" గీ బుగులుతోనే నామొగుడు గుండెపల్గి సచ్చిండు.

పెండ్లీడుకొచ్చిన ఇద్దరు ఆడిపిల్లలున్నరు.

కంపెన్ల కూలికి వోతే ఆడోల్లను అనరాని మాటలనవట్టిరి నా వట్టలు!

"ఉచ్చులు పోయనీకె పాయినవో ఏంజేసొచ్చినవో సూపి జాగయాడ బోసినవో" అని ఇజ్జత్తీయవట్టిరి. మా సాపెన దాకి పోతరు వాల్ల నాల్కలు పీక" సాపిచ్చింది ఈడిగి సివమ్మ.

" రొండెకరాల పొలం కట్నం కిందికిస్తం. అంతో ఇంతో తెల్లదోపచ్చదో పై మీదేస్తం అనింటే కాయమయ్యిండె బిజ్జపల్లి ఎంకటయ్య నడ్పికొడ్కు బాలయ్యతోని మాపెద్దదాని పెండ్లి. గీ 'సెజ్జు' సుడిగాల్లాగ ఎట్లకెల్లి సుట్టుకుంట వొచ్చిపడెనో సత్తెనాశనమాయె సంసారాలు...!

"పొలంలేంది పిల్లనోల్లమన్రి. కుదిరిన మనుఁవుఁఇడుదల జేస్కున్రి..."

ఏనుగసుంటి బారి మనిషి... ఇర్వై మందిని ఎదిరిచ్చే దొమ్ముంది సెంద్రిగానికి అంటుండ్రి ఊర్లె అందరు. అస్సుంటోడు నా మొగుడయ్యా... పండుకున్నోడు పండుకున్నట్టే నిద్రల్నే గుడ్లెల్లదీసి సావు గుర్కవెట్టె...! పానం బోక శానసేపు తండ్లాడె గుర్కల్నే...!

సూడబుద్దిగాక మా బావ మాపొలంల కెల్లి ఇంత మన్నుదెచ్చి నీల్లల్ల గల్పి సెంసెతోని ‹ ఇగో సెంద్రీ నీ పొలం, అని నోట్లె పోసెటాలకు పానం బాయె...!!

పానమంత పొలంలనే బెట్టు కునిండనో ఏమో.... ?!

జలజలా రాలే కన్నీళ్ళను కొంగులో మూటగట్టుకున్నది. ఆ ఊర్లో ఇట్లా అల్లాడి కనుమూసిన నలభైమందిలో ఒకడు బోయ గుంటి చెంద్రయ్య. ఆయన భార్యదే ఈ ఘోష. !

అందరి కండ్లూ చెమర్చినై

కాలం తెలిసే వొస్తలేదు. నాలుగ్గంటలు దాటింది. చుట్టూ జనం కండ్లల్లో నీళ్ళు. గుండెల నిండా ఎంత ఏడ్చినా తీరని బాధ !

ఒక్కొక్కరిదే ఒక ఘోష. ప్రతి ఇంటా విషాదమే ! లెక్కపెట్టలేనన్ని చావులు. కాదు కాదు చావులు కాదివి హత్యలు !!

చావుకూ బతుక్కూ తేడా ఎప్పుడో మూసిపోయిందిక్కడ.

ఇండ్లన్నీ పోయి ఊరు ఊరే మాయమయ్యే గుడ్లగండ తాండాదైనా, పొలాలన్నీ పోయి ఆకులు లేని మొండి మోళ్ళలాగా పిల్లా పాపలతో కలకలలాడిన ఇండ్లన్నీ సమాధులుగా మిగిలిన పోలెపల్లిదైనా, ముదిరెడ్డిపల్లెదైనా ఇదే దీనగాథ!

వినేవాడు లేడు.., ఓదార్చే దిక్కులేదు, ధైర్యం జెప్పే మనిషిలేడు.. తోడునిల్చే నీడలేదు..

పండే భూములకు పరిహారం సరిపోదని అడిగినందుకు కేసులు. మా భూములు ఇగ్గుకుంటే మేమెట్లా బతకాలె అన్నందుకు జైలు. బువ్వ పెట్టే భూములు గుంజుకున్నారని బుగులు బుట్టి ఇంటి పెద్ద దిక్కులు గుడ్లెల్లవెట్టి సస్తున్నరంటే ఈ పులిరగొట్టి పానాలు దీసి పంపిరి.

మా ఎదలమీద నీవుదింపిన కంపెనోడు వేట కుక్కలవెట్టి తరిమిచ్చి కరిపిచ్చి సంపుతున్నడంటే వాని నిద్రకు భంగం జేస్తరాని టేషన్లేసిరి.

భూఁవుఁలు పోయినంక మా బతుకేం బతుకాని, భూఁవుఁలు ఇడ్సేదే లేదాని అందరం గూడి పొలాల్లనే వొంటలు జేస్కోని తిని చింత చెట్టు కింద ఒక్క తాన ఒక్కమాట మీదున్నమని నీడనిచ్చే సెట్టు గూల్సిరి.

"ఎవనికి బుట్టిండు గీ అరవిందోడు - మా పొలాలు గుంజుకోనీకె...?!"
"ఎవనికి బుట్టిండు గీపెట్రోడ్రగ్గోడు - మాతాండలు మాగ్గాకుండ జెయ్యనీకె"!
"ఎవనికి బుట్టిండు గీ పెద్దమ్మ ఫ్యాట్రోడు, లెదరు ఫ్యాట్రోడు, మా భూ వుల్ల

ఇసంనింపి మాగొడ్డూ గోదా మాకు దక్కకుండా, మా సెట్టుపిట్టా మాకు లేకుండా జెయ్యనీకె ... ?"

పచ్చని పొలాలు.. నీడనిచ్చి సేదతీర్చే గూళ్ళూ చేజారిపోయాక... పండంటి సంసారాలు... అనుబంధాలూ విచ్ఛిన్నమయ్యాక గూడు చెదిరిన పక్షులైపోయారు.

రంగుతేలిన మువ్వన్నెల నూతన ఆర్థిక విధానాల ఆశీస్సులతో ఊపిరి పోసుకుంటున్న అసంఖ్యాక కంపెనీల్లో ఒకటొకటిగా ఇప్పటికి బయటపడ్డంతవరకు 75 ఎకరాల్లో వెలసిన అరవిందో, 30 ఎకరాల్లో విరబూసిన 'పెద్దమ్మ' పావని సెల్యులోజ్, 25 ఎకరాల్లో కార్తికేయ, మరో 20 ఎకరాల్లో నీతో, మమతో, 75 ఎకరాల్లో విరాజిల్లే హెట్రో, చైనా లెదరో.. సింగపూరి పెదరో.. ఏవైతే నేం?! ఇవన్నీ రాజ్యానికి దత్త పుత్రికలే... !!

వీటి ప్రసన్నత కొరకే.. అభివృద్ధి పేరిట పంటపొలాలు దోసి రైతుబిడ్డల రక్తమాంసాలు పీల్చి పచ్చని పల్లె బతుకుల్లో సర్కారు రేపుతున్న సెజ్ సెగల జ్వాలలివి.

వీట్ని ఆర్పుకోవడానికి ఈ దిక్కులేని జనం కారుస్తున్న కన్నీళ్ళు సాలడంలేదు.

మనం ఉప్పెనలమై ఓదార్చుదామా?!

తుపానులమై తోడుందామా !?

"సాబ్ మజీద్‌ల ఇన్నూరు మున్నూరుండె కబూతర్ పావురాల్. ఇప్పుడు అయిదారు మిగ్లినయ్. మా బాదంసెట్టు బోసిబోయింది! ఊరంతా కల్సి మేం బాదాం సెట్టుకు కట్టిన కుమ్మరి కుండలల్ల అవి పిల్లాపాపలతోని ఆడుకుంటుంటే మా బాదల్ మర్సొస్తుండె...! యాడన్నా గన్పిస్తే జర మా ఊరికి పంపుండ్రి.. మెహర్బానీ చెయ్యండి"

లొట్టలు పడ్డ బోసి చెంపలతో "ఫిర్ మిలేగే-మళ్ళీ కలుద్దాం".. అని సెలవు తీసుకొని లేస్తున్న మా అందరి దిక్కూ దీనంగా సూస్కుంట అమాయకంగా మాట్లాడుతున్న అన్వర్‌సాబ్ మేం మళ్ళీ వొచ్చేదాకా ఉంటాడో లేదో..!?

ఈ సోమిలినీ, సరోజమ్మనీ, లింగమ్మనీ, దేవమ్మనీ, రంగన్ననీ, ఫరీదాను, షరీఫాను, నజీర్‌ను, రవూఫ్ భాయ్‌ని మల్లసూస్తమో లేదో...!!

సీనయ్యా, ఉసేని సత్యమ్మ, తప్పెట మొగులమ్మ, సున్నపు జంగయ్య, కాట్రావత్ రుద్రా, దేపల్లె సందెయ్యా, మూఢావత్ చాందీ, నానావత్, సివిలీ, ఈడిగె హైమవతీ, వెంకటస్వామి, శ్రీనూ, కనుమరుగైన ఫాతిమా, కాట్రావత్ రుక్కాలీల్లాగా, ఉంటారో లేదో.. ?!

సందేహమే! ఔను సందేహమే..!! ఎందుకంటే.. ఇక్కడ ఏలినవారు ప్రత్యేక ఆర్థిక మండలాల పరదేశీ పాలనకు సరిహద్దులు గీశారు.!

ఇక్కడ స్వతంత్ర భారత పాలకులు నేలతల్లి బిడ్డలకు సస్తే పెట్టడానికి ఆరడుగుల నేలసైతం నిషిద్ధం చేశారు..!

ఇక్కడ ఆరుదశాబ్దాల సర్వసత్తాక గణతంత్ర రాజ్యం ఈ పల్లెల మీదా.., ఇక్కడ గాలీ..నీరు..నీడా..నేలా బతుకులన్నిటి మీద 'సెజ్'ల 'కఫన్' కప్పింది!!

అందుకే... అందుకే.

ఎవరున్నా లేకున్నా ఎటుచూస్తే అటునేనని

మువ్వన్నెల పతాక రెపల్లోంచి ముక్కోటి పడగల నాల్కలతో.. గ్లోబల్ మృగం ఎదురేలేదని ఎంతగా కోరలు నూరినా.. చెమరుస్తున్న కళ్ళల్లో నిప్పుల సెగళ్ళు రాజేసుకొని.. మండుతున్న గుండెలనుపిడికెళ్ళ కెత్తుకుని.. రాలిపోతున్నా.. రాజీపడని ఈ ఊర్లూ... ఊపిరులూ.. ఉద్యమిస్తున్నాయి. బతుకు పోరులో తోడుకై ఎదురు చూస్తున్నాయి !

"గూడు వొదిలిపోయిన పావురాల జంటలకోసం..!

జతకట్టి వచ్చే చిలకా గోరింకల కరచాలనం కోసం...!!"

*

స్వీకారం

1. ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్ (కథలు)
రచన : జొన్నవిత్తుల శ్రీరామ చంద్రమూర్తి
ప్రచురణ : ఉర్వి మీడియా వెల : రూ. 90/0
ప్రతులకు : ఉర్వి మీడియా పబ్లికేషన్స్,
ఫ్లాట్ నెం. 14, రోడ్ నెం.1,
టెలిఫోన్ కాలనీ, శ్రీరామక్రిష్ణాపురం,
హైదరాబాద్ - 35.

2. భూమి తడవని వర్షం (కవిత్వం)
రచన : డా. బీరం సుందర రావు
ప్రచురణ : జాషువా సాంస్కృతిక సమితి
ఇంకొల్లు, వెల : రూ.50/-
ప్రతులకు : డా.బీరం సుందరరావు
తెలుగులెక్చరర్,
డి.ఎస్.ఎమ్.జూనియర్‌కాలేజి,
ఇంకొల్లు, ప్రకాశం జిల్లా.

3. న్యాయం (కథలు)
రచన : యం.వి.తిరుపతయ్య
ప్రచురణ : యం.వి. పబ్లికేషన్స్ వెల : రూ. 70/-
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్
3-3-865, ఆర్యసమాజ్ మందిర్ ఎదుట,
కాచిగూడ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్.

4. నిర్వాసితత్వం - స్త్రీలపై రాజ్యహింస
రచన : యం.రత్నమాల
వెల : రూ. 10/-
ప్రతులకు : యం.రత్నమాల
మేఘ అపార్ట్‌మెంట్స్,
ఫ్లాట్‌నెం. 302, నల్లకుంట,
హైదరాబాద్ - 44.

5. పోయేదేమిలేనోళ్ళం (కవిత్వం)
రచన : శంబుక వెల : రూ. 25/-
ప్రచురణ : శంబుక స్మారక కమిటి
ప్రతులకు : పి.నవజీవన్
నిడమర్రు పోస్ట్,
మంగళ గిరి - 522 503.

పాటా - మాటా

సెజ్

- భూపాల్

పచ్చని భూముల చిత్రకారుడా !
కర్షకుడా ! ఓ కార్మికుడా !
నీవే గద ఆధారము అంతట
నాగరికతకూ సంపదకూ !
సకల లోకము మనుగడ మన్నన
శ్రామికుడా ! నీ శక్తినున్నదీ !
నీవే గదా ఆధారము అన్నిట
కర్షకుడా ! ఓ... కార్మికుడా !

ఇలాంటి కర్షకుల బతుకు కడుపుకోతగా మిగిలింది ఈనాడు ! 'ప్రత్యేక ఆర్థిక మండళ్ళు' అనే ఈ 'సెజ్'ల భాగోతం 2005 'మే' నెలలో భారత ప్రభుత్వం పార్లమెంటులో ఒకే ఒక్కరోజున ఆమోదం పొందింది..

నాయనలారా ! ఒక్క నెలలోనే అంటే 'జూన్' నెల నుంచే అమలులోకి వచ్చింది. ఈ పార్లమెంట్‌లో క్రితం చేసిన చట్టాలు ఎన్నో బుట్టదాఖలై, నీటిమూటలైపోయినా సెజ్ చట్టం మాత్రం వెంటనే అమలుకొచ్చిన వైనం చూస్తే.... దీనివెనకాల ఎంత మోసం దాగివుందో అర్థమైపోతుంది. సుమారు ఆరువందలయాభై సెజ్‌లు ఈ భారత భూభాగంలో స్థాపించాలనే కుట్ర జరుగుతుంది.. ఆ వచ్చిన చట్టం ఎలాంటిదంటే ....

పాట : విదేశీమారక ద్రవ్యం కోసం
స్వదేశీయులను చంపే చట్టం
దానికోసమై సరుకు ఎగుమతికి
చక్కటి దారులు వేసిన చట్టం !
సరుకుల తయారీ వంక పెట్టుకొని
మండలాలుగా చుట్టిన చట్టం ...
మండలాలకై మంచి భూములను
ప్రభుత్వం అండతో పొందెడి చట్టం
అభివృద్ధనె ఒక రంగు పూసుకొని
అన్ని వనరులు పొందిన చట్టం
ఉక్కుపాదమున మనవ హక్కులు
తొక్కివేయగా పుట్టిన చట్టం ....

మాట : అమ్మో ! ఈ చట్టం ద్వారా రైతుల భూములు బలవంతంగా సేకరించి ఇక చేసేది ఆహార ఉత్పత్తులు పెంచడం కాదు ! విదేశాలతో, విదేశీయుల పెట్టుబడులతో కంపెనీలు తెరవడం ! మండలాలు ఏర్పర్చడం ! అవి ఎలాంటి కంపెనీలనుకొన్నారు. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఎలక్ట్రానిక్ లెదర్, టెక్స్‌టైల్స్, కార్ల విడి భాగాలు, కార్లు తయారుచేసే కంపెనీలు, టైర్ల కంపెనీలు, చెప్పుల కంపెనీలు! బంగారు ఆభరణాలు, వజ్రవైఢూర్యాలు, మందుల కంపెనీలు, బొమ్మలు తయారు చేసేవి !

ఇది ప్రపంచీకరణలో ఒకానొక ప్రధానమైన కుట్ర ..... దీనిక సామ్రాజ్యవాదులైన అగ్రరాజ్యాల ఆకలి వ్యవహారం అంతర్లీనంగా ఉంది.

ఒక బ్రాహ్మణుడు తద్దినానికి వెళ్ళాడట. వెళ్ళి పుష్టిగా భోంచేసి తిరిగి వస్తున్నాడు. భుక్తాయాసంతో బాధపడుతూ దారిన నడుస్తున్నాడు. వాన్ని చూసిన ఒక బాటసారి "ఏమండీ ! ఎందుకో చాలా ఆయాసపడుతున్నారు ! ఏమిటి బాధ?" అన్నాడట.

"అవునయ్యా ! ఆచార్యుల వారింటికి భోజనానికి వెళ్ళాను ! తిన్నది కాస్త ఎక్కువైంది కాబోలు ! ఆయాసంగా ఉంది" అన్నాడు.

"అయ్యో ! పావం కాస్త సోంపులాంటిదేదైనా వేసుకోలేకపోయారా! జీర్ణమైపోతుంది గదా !" అన్నాడట బాటసారి !
" భలే చెప్పొచ్చావు పోవయ్యా! సోంపు వేసుకునేంత చోటే ఉంటే మరో సగం అరిసెలు తినకుందునా!" అన్నాడట బ్రాహ్మణుడు.

అదిగో అలా ఉంటుంది సామ్రాజ్యవాదం వ్యవహారం మనిషన్నవాడు ప్రతి ఒక్కడు దాని చెప్పుచేతల్లో ఉండాలనుకుంటుంది. ప్రపంచంలోని సకల సంపదలు తనకే కావాలనుకుంటుంది. మూడవ ప్రపంచ దేశాలను పిండి పిప్పి చేయడానికి ప్రస్తుతం సమాయుత్తమైంది. దానికి ప్రవంచీకరణ.... ఆయుధంగా ఉపయోగిస్తుంది. ఆ ప్రపంచీకరణంలోని ప్రధాన అంశమే ఈ 'సెజ్‌ల' నేవి.

పాట : దేశమంటే దేశం
బంగారు భారత దేశం
సకల సంపదలున్న దేశం
పెక్కు గనుల నివాసము
రత్నగర్భగ పేరుగాంచిన
రాశి వాసిలో గొప్ప దేశం
కొండలూనదులున్న దేశం
దండిగా అడివున్న దేశం
పల్లెపట్టుల ముళ్ళపాళ్ళూ
ప్రజలు బతికెడు దేశం
సహజమైన వనరులున్న
చక్కనీ మాగాణము ॥దేశ॥

మాట :- ఇలాంటి భారత దేశాన్ని పూర్తిగా కొల్లగొట్టాలని ఈ సెజ్‌లను ప్రవేశపెట్టారు. దేశాన్ని పీల్చిపిప్పి జేసి మొదటి ప్రపంచ యుద్ధం పూర్వస్థితికి తేవాలని తలపెట్టింది ఈ గ్లోబలైజేషన్. అది ఏమంటుందంటే ......

పాట : ఖండాలు ఖండాలు మింగుతానూ
కనిపించనంతగా ఎదుగుతాను ॥ఖండాలు॥
ఆసియా, ఆఫ్రికా ఏ ఖండమైతేమి ?
వెనుకబడి ఉన్నట్టి ఏ దేశమైతేమి ? ॥ఖండాలు॥
ఇండియా తిండి ఇంతంత కాదు
ఎంతుంటే అంతుంది ఎగరేసుకెళతాను ... ॥ఖండాలు॥
ప్రకృతీవనరులు సంపదలు కొల్లలు
మానవుని శ్రమవుంది, మానవీయత ఉంది ... ॥ఖండాలు॥
సత్యాన్ని కుమ్మేసి, ధర్మాన్ని దున్నేసి
సాంప్రదాయాన్నింక చంపిమింగేస్తాను ... ॥ఖండాలు॥

మాట : భారతదేశంలోని దళారీభూస్వాముల, దళారీ బడావ్యాపారుల, దళారీ పాలకుల అండదండలతో ఈ సెజ్ చట్టం తెచ్చింది ప్రభుత్వం.

ఈ దళారీలు ఎటువంటి వాళ్ళంటే ... వీళ్ళకు సిగ్గూ - ఎగ్గులుండవు. తాము పట్టిన కుందేలికి 'మూడే కాళ్ళంటారు. మానవత్వం నశించి, రాక్షస స్వార్థాన్ని భోంచేస్తుంటారు. సైన్సు విజ్ఞానం ఎంత పెరుగుతున్నా కర్మ సిద్ధాంతాన్ని కాచివడబోస్తూ సన్యాసులతో మూఢత్వాన్ని గుప్పిస్తుంటారు.

ఈ దళారీ..... భారత ప్రజలను దోచుకోను వాళ్ళ ఆస్తులంతా పెంచుకోను ఈ సెజ్‌లను ప్రవేశపెట్టారు.

నూటికి 75% ఉన్న భూమి, గ్రామీణ రైతాంగం గూర్చిన ఏ ఆర్థిక విధానం ఇప్పటివరకూ భారత ప్రభుత్వం చేసేపనులన్నీ సామ్రాజ్యవాదుల చెప్పుచేతుల్లోనే ఉన్నాయి.

పాట : ఎదురుండొద్దూ బెదురుండొద్దూ
ఎవ్వరి ఐక్యత పొసుగొద్దూ !
సెజ్‌లంటూమేంపెట్టిన చోట
ఎవ్వరి హక్కులు చెల్లొద్దూ !
ఈ ఎస్టేటులు మాకేవుంటవి
ఏ ప్రభుత్వమూ కదుపొద్దూ ! ·
ప్రభుత్వ చట్టం చెల్ల దిక్కడా
ప్రజలెవ్వరు ప్రశ్నించొద్దూ !

మాట : అంటూ గ్రామీణప్రాంతాలను ఎంచుకొని చక్కటి సారవంతమైన భూములన్నీ తక్కువ ధరకే కొనేస్తున్నారు. సెజ్‌లతో జీవితాలు మారిపోతాయని అబద్ధాలు చెపుతూ, బలవంతంగా, ప్రజలను బెదిరించి ప్రభుత్వమే లక్షలాది ఎకరాలు కొని బడా వ్యాపారులు, దళారీలకు పొరుగు దేశాల దోపిడీదారులకు ఇచ్చేస్తుంది.

భూమి ఇవ్వమంటే హింసించి తీసుకుంటుంది. అంతేగాదు, ఇక సామ్రాజ్యవాద దేశం ఏమంటుందంటే "మీరు కష్టపడి వ్యవసాయం చేసి పండిస్తే ఏం లాభముందీ? మేము మా దేశాలనుండి అతి చవకగా ధాన్యం, తిండిగింజలు మీకు పంపిస్తాం! మీరు కొనుక్కొని తినండి" అనీ, ఇది "సస్య విప్లవం" అనీ ఇది "అభివృద్ధి" అనీ బుకాయిస్తూ... "మీ అందరికీ ఉద్యోగాలు దొరుకుతాయి. ఇక నిరుద్యోగమంటూ వుండదని" మాయ మాటలు చెపుతూ ఈ దేశాన్ని దగా చేస్తున్నారు. ఇదెట్లావుందంటే చిన్నపిల్లవాడొకడు....

పాట : మత్తగజము తెచ్చి - చిన్న
తిత్తిలోనపెట్టి - అదినా
నెత్తిమీదపెట్టి - నన్ను
ఎత్తుకోవె అమ్మా!

మాట : అన్నట్టుగావుంది.ఇన్నేండ్ల పాలనతో ఈ దేశపాలకులే ఇక్కడున్నవాళ్లకు ఉద్యోగాలు కల్పించలేదు. ఆ పని అమెరికావాడు చేస్తాడంటే ఎందుకు అంటున్నాడో అర్థంచేసుకోవాలి.

ఈసెజ్ వలయంలో చిక్కి రైతులు తమ భూములు, ఇల్లువాకిలీ, గొడ్డుగోదా కోల్పోయి, పిల్లా జెల్లలతో గ్రామాలు ఖాళీచేసి బికారులుగా పట్నాలకు చేరుతున్నారు. నిరుద్యోగులుగా రోడ్ల మీద ఆకలితో తిరుగుతున్నారు.

లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్న ఈ సెజ్‌లు గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ రాజ్యాలుగా మారుతున్నాయి. వందలాది ఎకరాలు చుట్టుముట్టి ఒక్కొక్క కంపెనీ తన సైన్యాన్ని తయారు చేసుకుంటుంది. రక్షణ పేరున ఇప్పటి వరకు నాలుగు వందలకుపైగా కంపెనీలు సెజ్‌లనే పేరున రంగంలోకి దిగి ఉన్నాయి.

పాట : ఎస్.ఈ.జెడ్.చట్టం / వలలో / చేసే పని ఏమీ / వలలొ /
కష్ట జీవి భూమి / వలలొ / కాజేసుట కొరకే / వలలొ /
నిరుద్యోగమింకా ॥ పెరిగిపోవు కొరకే ॥
దళారి పెట్టుబడీ ॥ దారులు వెదికిందీ ॥
సెజ్ చట్టంతోనూ ॥ రైతును కొట్టిందీ ॥
ప్రభుత్వ పాలసీతో ॥ ప్రజలకు విషమిచ్చే ॥
సెజ్ చట్టం వచ్చీ ॥ మంటలొ నెట్టిందీ ॥
కూడూగుడ్డ కింకా ॥ కుమిలి పోదుమండీ॥
మన పిల్లలు ఇంకా ॥ మాడి చస్తరండీ ॥
మనిషికి మనిషంటూ ॥ మంచి మిగలదండీ ॥
మన సంస్కృతి అంటూ ॥ మచ్చుకుండదండీ ॥
ప్రజలు కోట్లకొద్దీ ॥ పట్టెడు మెతుకులకూ ॥
కొట్టుకుచావంగా ॥ పెట్టిన సెజ్ లిప్పీ ॥

మాట : ఇలాంటి సెజ్‌ల పేరుతో సేకరించిన భూములవల్ల రైతులేకాదు! ప్రజలంతా బాధలకు గురికావలసివస్తుంది.... ఎలాగంటే .... సేకరించడమే తప్పు ... సేకరించారే అనుకుందాం - బలవంతంగా, దాన్ని పారిశ్రామికుల కివ్వకుండా డెవలప్ చేసే వాళ్ళకిస్తున్నారు. ఆ డెవలపర్స్ అనేవాళ్ళు రియల్ ఎస్టేటు వ్యాపారులతో కలసి లాభాలు పొందుతున్నారు. వాళ్ళనుండి ప్రభుత్వ అధికారులు, మంత్రులు మామూళ్ళు అందుకుంటున్నారు. ఈ బరువంతా పెరిగి పెరిగి .... ప్రజల నెత్తినే కూలుతుంది.రకరకాల పద్ధతుల్లో ....

ఇలాంటి సెజ్‌లను మనమంతా వ్యతిరేకించాలి....

పాట : సెజ్‌ల చట్టమును కూకటివేళ్ళతో - పెకిలించాలండీ !
బహుళ జాతులకు మరుభూమైనా - ఇవ్వకూడదండీ !
ఫ్యాక్టరీలకని పొందిన భూములు - ప్లాట్లకు కాదండీ !
ఫ్యాక్టరీ పెడితే పర్యావరణం - చెడిపోవద్దండీ !
రైతును అమ్మేడి దళారి ప్రభుతను - నమ్మకూడదండీ !
సెజ్‌ల పేరిటా మెక్కిన భూములు - వెనక్కి లాగాలీ !
ఎసైన్డ్ భూములు భూమిలేని - ప్రజలందరికివ్వాలి !
మనిషి మనుగడకు ఉరితాళ్ళు-ఈ సెజ్‌లని తెలియాలీ !
ప్రజలు ఐక్యమై ఒక్క గొంతుతో - ప్రతిఘటించండీ !
తప్పక సెజ్‌లను తరిమికొట్టుటే - తగిన పద్ధతండీ !
వినక ప్రభుత్వం అణచజూస్తే ఇక - విప్లవముందండీ !
ప్రజలు తెలివితో ఎన్నుకునేది - పోరుబాటే నండీ !

*

మాతృత్వంలో కూడా గన్ వీడని
ఆఫ్రికన్ విప్లవ మాతృమూర్తి (బ్లాక్ పాంథర్ ఆర్ట్)

KLVA101M143

అరుణతార

ARUNATARA

RNI REGISTERED No. 21152/72 March -2008

Printed Published Edited and owned by CHALASANI PRASAD 33-13-3, Seetharamapuram, Vijayawada-520 002.
Printed at Nagendra Printing Press, Govinda Rajulu Naidu Street, Vijayawada-2. Editor: Chalasani Prasad

50

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M143
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	53
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	nazma
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Bhanu
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good